# కథాంజలి

(రెండవ భాగం)



## Offerings

## II

ఆంగ్లమూలం :

**గట్టు నారాయణ**

తెలుగు అనువాదం :

**గజానన్ తామన్**

ప్రచురణ :

**శ్రీ సీతారామ సేవాసదన్**

**మంథని-505 184**

# కథాంజలి

(రెండవ భాగం)

ఆంగ్ల మూలం : **OFFERINGS-II**

**గట్టు నారాయణ**

తెలుగు అనువాదం :

**గజానన్ తామన్**

ప్రచురణ :

**శ్రీ సీతారామ సేవాసదన్**

తమ్మిచెరువుకట్ట,

మంథని-505 184

జిల్లా కరీంనగర్ ఆం.ప్ర.

**OFFERINGS-II**
(A Collection of Twenty One Stories)
by: **GATTU NARAYANA**

**KATHANJALI-II** (Telugu Translation)
by: **GAJANAN TAMAN**

Visuals :
**RAKESH SRIVATSAVA**
**SHISHIR SUVARNA**

Graphics :
**B. VENKATA RAMANA**

Year of Publication : **2003**

Copies : **1,000**

For free circulation

Printed by :
**M/s. SATYANARAYANA OFFSET PRINTERS**
4-6-143, Tilak Road, KARIMNAGAR. (A.P.)
Tel: 0878-2243026

Publishers :
**SRI SEETHA RAMA SEVA SADAN**
Tammacherukatta,
MANTHANI-505 184,
Karimnagar. (A.P.)

# అనుక్రమణిక


- ప్రకాశకీయం . . . . . . . . . . . . . . . . . . . . . . . . i
- మనోగతం . . . . . . . . . . . . . . . . . . . . . . . . iii
- పరితోషం . . . . . . . . . . . . . . . . . . . . . . . . iv
- ప్రాక్కథనం . . . . . . . . . . . . . . . . . . . . . . . . ix

కథాక్రమం

1. చివరిమజిలి . . . . . . . . . . . . . . . . . . . . . . 1
2. అంతామనమంచికే . . . . . . . . . . . . . . . . . . 9
3. అత్తగారికి మేలుకొల్పు . . . . . . . . . . . . . . . . 16
4. ముందుచూపు . . . . . . . . . . . . . . . . . . . . . 21
5. అందినద్రాక్షలు . . . . . . . . . . . . . . . . . . . . 30
6. సంవాదసౌఖ్యం . . . . . . . . . . . . . . . . . . . . 34
7. తుంబురనారదీయం . . . . . . . . . . . . . . . . . . 39
8. మొగ్గ . . . . . . . . . . . . . . . . . . . . . . . . . 47
9. బ్రతికితేబలుసాకు . . . . . . . . . . . . . . . . . . 50
10. శక్తిచాలకున్న . . . . . . . . . . . . . . . . . . . . 58
11. ప్రశ్న ఒకటి : జవాబులు సవాలక్ష . . . . . . . . . . 66
12. శుక్లపక్షంలో జాబిలి . . . . . . . . . . . . . . . . 74
13. తారతమ్యత . . . . . . . . . . . . . . . . . . . . . 84
14. నిరుడు వీచిన గాలి . . . . . . . . . . . . . . . . . 94
15. నేడు వీచే గాలి . . . . . . . . . . . . . . . . . . . 100
16. రేపటి గాలి ఏదిశలో . . . . . . . . . . . . . . . . 105
17. జాగృతి . . . . . . . . . . . . . . . . . . . . . . . 111
18. నీటిలో నీడలు . . . . . . . . . . . . . . . . . . . 122
19. ప్రస్థానం - దైవత్వంవైపు . . . . . . . . . . . . . . 135
20. రావే ఈశ్వర! . . . . . . . . . . . . . . . . . . . . 146
21. ముక్తిపథం : భగవద్గీత . . . . . . . . . . . . . . . 152

# ప్రకాశకీయం

కథ అనేది మనోవినోదం కల్గించడంతో పాటు, మనను ఆలోచింప చేస్తుంది. కథలో నీతి అంతర్లీనంగా ఉంటుంది. కథలు మనకు మార్గదర్శకాలై జీవితంలో విజయం చేకూరుస్తవి. చిన్నతనాన పెద్దల నుండి విన్న కథలు గుర్తుకు తెచ్చుకొని ఆనందించని వ్యక్తి ఉండడు. తలిదండ్రులూ, ఇరుపక్షాల తాతమ్మ తాతయ్యలూ చిన్నపిల్లలకు అనేక ఆధ్యాత్మిక, చారిత్రక విజ్ఞానవిషయాలను వారి వయః ప్రమాణమును పట్టి కథలద్వారా బోధిస్తారు. విద్యాబోధనలో కూడా కథాకథన పద్ధతికి ఎంతో ప్రాధాన్యత ఉంది. పంచతంత్రంలోని కథలు, అరేబియన్‌నైట్స్, అక్బరు-బీర్బల్ కథలు, తెనాలి రామకృష్ణుని కథలు వినేవారికి నిత్యనూతనములు.

శ్రీ గట్టు నారాయణ గారు మంథిని వాస్తవ్యులైన కీ॥శే॥ సీతమ్మ, రామన్న గార్ల ద్వితీయ సంతానము. ఆయన సాక్షాత్ సరస్వతీ పుత్రులు. బహుగ్రంథకర్తయైన ధన్యజీవి. ఆయన ఉత్తుంగభావతరంగాలకు ఆకరమే ఆయన "ఆంగ్లకథాసరిత్సాగరము'. ఆయన ఆంగ్లంలో రచించిన Offerings I & II లను, కథాంజలి మొదటి రెండు. భాగాలుగా తేనెలూరు తెలుగు భాషలోకి అనువదించిన శ్రీ గజానన్ తామన్ అభినందనీయులు.

కథాంజలి మొదటి భాగంలోని కథల వలెనే ఈ రెండవ భాగములోని కథలు అనేక హితబోధలను కలిగియున్నవి. సంప్రదాయపరమైన తెలుగు నానుడులతో, సామెతలతో, వ్యవహారభాషలో సాగిన అనువాదం ముచ్చట గొలిపే విధంగా వుంది.

ఈ సంపుటిలోని మొదటి కథ యైన 'చివరి మజిలి'లో ఆధ్యాత్మిక సమితి సభ్యులు జగత్తును ఉద్ధరించగల వైతాళికునికి ఏ గుణగణాలుండాలో నిర్ణయిస్తారని సెన్‌ఫ్రాన్సిస్ చెప్పడం బాగుంది. అత్తగారికి కలిగిన మేలుకొల్పు, స్పర్థను మాని కుందేలు తాబేలు ఆప్తమిత్రులు కావడం, 'అందిన ద్రాక్షలు'లో మధ్యమ వర్గీయ జీవన పరిస్థితి, ప్రదీప్ కనబరచిన తెలివితేటలు, 'అంతా మనమంచికే'లో రాజు గారి కయిన జ్ఞానోదయం, 'నీటిలో నీడలు' లో సహజవైరాన్ని వీడి పులుల మేకల సహజీవనం, పరుగుపందెంలో శల్యావశిష్టమైన శునకం సాధించిన విజయం. మనోరజంకమైన కథలుగా నారాయణగారి లేఖని నుండి నిర్గమించినవి.

భావితరాల వారికి సౌరభభరితమైన సుమాలు గల కథాంజలిని ఆంగ్లభాషలో రచించిన శ్రీ గుట్టు నారాయణ గారికి, అనువాదకులైన గజానన్ తామన్ గారికి మా సంస్థ కృతజ్ఞతలు చెప్పుకొంటున్నది.

ఈ 'కథాంజలి' (రెండవ భాగం), 'ఉదాత్తనేత' తరువాత మేము సమర్పించు తృతీయ పుష్పము. ఇది సామాన్యులతో పాటు మాన్యుల ప్రశంసార్హము కాగలదన్న విశ్వాసము మాకున్నది.

"సర్వేజనాః సుఖినోభవంతు"

అధ్యక్షులు
శ్రీ సీతారామ సేవాసదన్
మంథిని

భవదీయులు
**సువర్ణ లక్ష్మణ్‌రావు**

# మనోగతం

- నా తల్లిదండ్రులైన కీ॥శే॥ శ్రీ గట్టు రామన్న, కీ॥శే॥ శ్రీమతి గట్టు సీతమ్మ గార్లకు.
- పితామహి శ్రీమతి వడవత అన్నమ్మ, మాతామహి ముద్దు అమ్మాయి గార్లకు.
- మా గురువర్యులు, ప్రాతఃకాలస్మరణీయులు వై॥వా॥ శ్రీ విద్యానంద ప్రకాశనందస్వామి వారికి.
- మహాభారతంలోని కథలను చెప్పిన పితామహాతుల్యులు కీ॥శే॥ శ్రీ ఎలిశెట్టి లింగన్న గారికి.
- వైదుష్య పూర్ణమైన 'పరితోషం' కథాంజలి రెండవ భాగానికి వ్రాసి ఇచ్చిన ఆచార్య సార్వభౌమ బిరుదాంకితులూ - పరమమిత్రులూ అయిన డా॥ సుబ్రహ్మణ్యశర్మ గారికి.
- ప్రతికథకు దృశ్యపార్శ్వాన్ని కల్పించిన శ్రీ రాకేష్ శ్రీవాత్సవకు, చి॥ సువర్ణశిశిర్‌కు.
- కథారచనకు ప్రేరణగా నిలిచిన జీవనభాగస్వామిని సౌ॥ సుజనాదేవికి, కథలను విని ఆనందించి నన్ను ప్రోత్సహించిన మా చిరంజీవులు ప్రదీప్, శైలజ, సుప్రియలకు.
- ముద్రణప్రక్రియను పర్యవేక్షించిన మిత్రులు అడ్వకేట్ శ్రీ పులి అశోక్‌కుమార్, మంథని గారికి.
- ప్రచురణ భారాన్ని స్వీకరించిన శ్రీ సీతారామసేవాసదన్ నిర్వాహకులు, ఆప్తులు, డా॥ సువర్ణ లక్ష్మణ్‌రావు, శ్రీ సువర్ణ చంద్రశేఖర్, అడ్వకేటు గారు, డా॥ దుద్దిళ్ళ ఆనంద్‌రావు, శ్రీ అవధానుల మురళీధరశర్మ గార్లకు.
- సంరచన చేసిన శ్రీ బి. వెంకటరమణ, కరీంనగర్ కు.
- అందముగా ముద్రించి ఇచ్చిన సత్యనారాయణ ఆఫ్‌సెట్ ప్రింటర్, తిలక్‌రోడ్, కరీంనగర్ అధినేతలైన శ్రీ జక్కని కిషన్, శ్రీ జక్కని ప్రభాకర్ (M.Com., LL.B.) గార్లకు.
- నేను ఆంగ్లములో వ్రాసిన కథలను తెలుగు లోనికి ప్రణీతమును చేయుటను ఒక తపస్సుగా, వ్రతముగానెంచి, కథలకు తెలుగు వన్నెలను కల్పించి, ఆనందాన్ని కలిగించిన గజానన్ తామన్ గారికి.

ప్రేమానుభూతితో...

**గట్టు నారాయణ**

# పరితోషం

**ఆచార్య వేదుల సబ్రహ్మణ్య శాస్త్రి**
ఎం.ఏ. పి.హెచ్.డి.(తెలుగు), ఎం.ఏ. పి.హెచ్.డి.(సంస్కృతం)
**తెలుగు శాఖ (రిటైర్డ్)**
**ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం-3.**

"కథ వాక్యప్రబంధే" అనే ధాతువునుండి కథా అనే పదం నిష్పన్నమయింది. చెప్పబడేది అని దాని వ్యుత్పత్తి. "కథ్యతే ఇతి కథా".

ఏ భాషలో అయినా సాహిత్యం మొట్టమొదట కథారూపంలో మౌఖికంగా ఆవిర్భవిస్తుంది. అనంతరం అది వివిధవర్ణనలతో బహువిధ శబ్దార్థచమత్కృతులతో పరిపుష్టమై సర్వాంగసుందరమైన రచనగా రూపొందించబడతుంది. శ్రీమద్రామాయణంలో, నారదమహర్షి వాల్మీకిమహర్షికి వినిపించిన బాలరామాయణంగా ప్రసిద్ధిపొందిన బాలకాండంలోని తొలిసర్గ మౌఖికరూపంలోని కథగా పరిగణింపదగ్గది. దాని వ్యాఖ్యారూపమే అనంతరం వాల్మీకి రచించిన రామాయణ సర్వస్వమూ.

శ్రీమద్రామాయణభాగవతాదులలో అడుగడుగున కనవచ్చు ఉపాఖ్యానాలు ఒకప్పుడు కథారూపంలో బహుళప్రచారంలో ఉన్నవే. కాబట్టి "శ్రుతస్యార్థస్య కథనముపాఖ్యానం ప్రచక్షతే" అని నిర్వచనం ఏర్పడింది.

కథాసాహిత్యానికి భారతదేశం ఒక మహాఖనివంటిది. చిత్రవిచిత్రములైన సన్నివేశములతో, పశుపక్షులు పాత్రలుగా, విష్ణుశర్మ రచించిన పంచతంత్రమూ అలాగే నారాయణ పండితుడు రచించిన హితోపదేశమూ ప్రపంచప్రఖ్యాతినందుకొన్నాయి. బృహత్కథ, బేతాళపంచవింశతి, సింహాసనద్వాత్రింశిక కథలు, శుకసప్తతి మొదవైనవి భారతీయుల కథాసాహిత్యంలో ఎంతో ప్రశస్తిని పొందేయి.

పాశ్చాత్యసాహిత్యాధ్యయనఫలంగా తెలుగులో ఆధునికయుగంలో ఎన్నో క్రొత్త ప్రక్రియలు అవతరించేయి. వాటిలో కథానిక అనేది ఎంతో ముఖ్యమైనది. ఆంగ్లంలో దీనిని Short Story అంటారు. Eadger Allen Poe అనే సాహిత్యవిమర్శకుడు కథానికాస్వరూపాన్ని, "A short story is a prose narrative requiring from half an hour to one or two hours in its perusal" అని సూత్రప్రాయంగా పేర్కొన్నాడు. సంక్షిప్తత, ఏకాగ్రత, సమగ్రత, నిర్భరత-అనే నాల్గు ధర్మాలు నేటి కథానికలో ప్రస్ఫుటంగా గోచరిస్తాయి.

అగ్నిపురాణంలో కథానికా లక్షణాలు ఇలా పేర్కోబడ్డాయి.

భయానకం సుఖతరం గర్భే చ కరుణోరసః।
అద్భుతోఽన్తే సుక్లుప్తార్థా నోదత్తా సా కథానికా॥

భయానకరసంతో కూడుకొని మధ్యలో కరుణరసనిర్భరంగా ఉంటూ, అంతంలో ఏదో ఆశ్చర్యాన్ని కల్పిస్తూ, కథాంశాలని మిక్కిలి క్లుప్తంగా కూరుస్తూ ఎక్కువ ఉదాత్తం కానిది కథానిక అని తాత్పర్యం.

అంతస్తత్వాన్ని సమీక్షిస్తే, అగ్నిపూరాణోక్తలక్షణాలు ఆంగ్లంలోని Short Story యొక్క లక్షణాలు ఇంచుమించు సరిగ్గానే సమన్వయింపదగ్గవని చెప్పవచ్చు. కరుణరసాత్మకంగా, క్లుప్తంగా చెప్పబడ్డ కథాంశాలతో ఎక్కువ ఉదాత్తతను పొందకుండా రచించడం రెండింట సమానమే. ప్రాచీన కథానికలకంటె ఆధునిక కథానికలు పూర్తిగా సాంఘికేతివృత్తంతో మాత్రమే రచింపంబడడం విశేషం.

మాన్యశ్రీ గట్టు నారాయణగారు అత్యంత విశిష్టులు. ఇంజనీరింగ్ కోర్సుచదివి, మేనేజిమెంటులో డిగ్రీని తెచ్చుకొని, వృత్తిరీత్యా గుజరాత్‌లో పేరుమోసిన ఎన్నో కంపెనీలకు పెద్దదిక్కుగా ఉంటు "గురుజీ"గా ప్రసిద్ధిపొందిన మహాత్ములు. ప్రవృత్తిరీత్యా గుడులు బడులూ కట్టిస్తూ, లోకకల్యాణంకోసం అనేకవిధాలుగా పాటుపడుతున్న నిష్కామకర్మయోగులు. తపస్సాధ్యమైన ఆధ్యాత్మికజ్ఞానాన్ని అనుభవిస్తూ వివిధ రచనలద్వారా, ప్రసంగాలద్వారా స్వదేశంలోను, విదేశాలలోను ఆధ్యాత్మిక చైతన్యాన్ని పంచిపెడ్తున్న జ్ఞానయోగులు. వారు యువతరానికి ఉన్నతాదర్శాలని ఉపదేశించాలన్న సత్సంకల్పంతో ఆంగ్లభాషలో "Offerings" అనేపేర రెండుసంపుటులలో ఎన్నో కథలను రచించి లోకానికి అందించడం విశేషం. ఆ కథలు పాఠకులకు ఆంగ్లభాషా ప్రయోగదక్షతని కల్గిస్తూ ఉత్తమసంస్కారాన్ని అందజేస్తున్నాయి.

సాహిత్యపరమార్థం సమాజాన్ని సంస్కారసంపన్నం చేయడమే. జన్మతః ప్రాప్తించిన పాశవికప్రవృత్తిని పారద్రోలి మానవతావైభవాన్ని అందించడమే ప్రాచీన సాహిత్యంయొక్క పరమప్రయోజనం. రెండు మూడు పాత్రలతో, పరమాద్భుతమైన రమణీయమైన సన్నివేశాలతో, పరిపూర్ణమానవత్వ పరిపోషకంగా కథను తీర్చిదిద్దడంలో మాన్యశ్రీ గట్టునారాయణ గారి ప్రతిభ అనుపమమైనది. ప్రతివ్యక్తిలోను నిద్రాణంగా ఉండే సర్వశక్తులను జాగృతంచేస్తూ, వ్యక్తివికాసానికి ఆవశ్యకమైన మార్గాలను ఉపదేశిస్తూ, కథను రచించడం శ్రీ గట్టు నారాయణ గారి ప్రత్యేకత. పాలగుమ్మి పద్మరాజు రాచకొండ విశ్వనాథశాస్త్రి వంటివారు కథానికారచనలో విశిష్టులుగా లబ్ధప్రతిష్ఠులు. శ్రీ గట్టు నారాయణ గారు కథానికారచనలో వారి కంటె విలక్షణము, అత్యంత విశిష్ఠమూ అయిన మార్గాన్ని అనుసరించి తమ వ్యక్తిత్వాన్ని సూక్ష్మేక్షికతో పరిశీలించేవారికి నిరూపించుకొంటున్న ఉత్తమకథారచయితలు. వారి ప్రతికథ ఆంగ్లభాషాప్రయోగపాటవాన్ని పొందాలనుకొనే వారికి పారాయణచేయదగ్గది. ఉత్తమసంస్కారసంపన్నంగా జీవితాన్ని దిద్దుకోవాలనుకొన్న వారికి పరమారాధ్యమైనది. వివిధకథలతో వ్యక్తివికాసానికి దోహదంచేసే సూక్తులు ఎలా ప్రయోగింపబడ్డాయో తెలుసుకోవడానికి కొన్ని ఉదాహరణలు :

i) Offer and be joyful. Receive and be thankful.

ii) Creativity is the mine of jewels. The more you dig, the more you find.

iii) Present and future are not same as past. Evolve new. Innovate new. Attain new.

iv) Hurting is devility. Helping is divinity.

రచయిత సుదీర్ఘజీవితానుభవనిరూపకాలైన ఈ సూక్తులు అక్షరలక్షల విలువగలవి. సంసారమహాసాగరమధ్యలో చిక్కుకొన్న నావకి చుక్కాని వంటివి.

శ్రీ గజానన తామన్ స్నాతకోత్తర ఆంగ్ల విభాగ ప్రముఖులుగా, ప్రాచార్యులుగా సేవానివృత్తులయినాక, అవిశ్రాంతంగా సాహిత్యవ్యాసంగంచేస్తున్న సాహిత్యతపస్వి. ఆంగ్లాంధ్రభాషలలో సవ్యసాచిత్వాన్ని నెరపుతున్న మహనీయులు. శ్రీ గట్టు నారాయణ గారి Offerings అనే రెండు సంపుటులలోని కొన్ని కథలను కథాంజలి అనుపేర అనువదించి, నేడు రెండవసంపుటిలోని కథలను రెండవభాగంగా తెనిగించడం అస్మదీయులకు హర్షదాయకం. ఈ రెండవభాగంలో ఇరవై ఒక్క కథలు అనువదింపబడ్డాయి.

ఒకభాషలోని సాహిత్యగ్రంథాన్ని, మరొకభాషలో అనువదింపబూనిన వ్యక్తి తనరచన ఒక అనువాదం అనే భావన పాఠకునికి లేశమాత్రంకూడా కల్గకుండా చూసుకొంటూ అది ఒక స్వతంత్రమైన రచనగా భాసించేటట్లు అనువదింపగల్గితే అది సజీవమైన రచనగా చిరకాలం నిలుస్తుంది. పదప్రయోగంలో భావోన్మీలనంలో కథాపరమార్థాన్ని చక్కగా ఆవిష్కరించినప్పుడు ఆ అనువాదం విద్వత్ప్రశంసార్హం అవుతుంది. పాఠకజనానికి ఆకర్షకంగా నిలుస్తుంది. శ్రీ గజానన తామన్ గారు భాషాతత్త్వాన్ని బాగా ఆపోశనపట్టిన వారు కాబట్టి, అనువాదాన్ని పరమరమణీయంగా నిర్వహించినారు.

కథలకు శీర్షికలు పెట్టడంలోకూడా ఎంతో స్వాతంత్ర్యాన్ని అవలంబించినారనడానికి ఉదాహరణలు :

Trial & Triamph - Francis, Francis & Francis - చివరి మజిలీ

Being Positive - King and Minister - అంతా మనమంచికే

కథయొక్క అంతరార్థాన్ని ప్రధానంగా గుర్తించి శ్రీ గజానన తామన్ కథల నామకరణలో ప్రదర్శించిన ప్రతిభ నాన్యతో దర్శనీయమైనది.

ఆంగ్ల కథల చివర శ్రీ గట్టు నారాయణ గారు ఒసంగిన సూక్తులు సార్వకాలికాలు సార్వత్రికాలు సార్వజనీనాలు. అవి అనువాదంలో అంత సులభంగా గ్రహింపబడవు. కాని ఆంగ్లసూక్తులకు ఏమాత్రమూ తీసిపోని విధంగా శ్రీ గజానన తామన్ ఇలా అనువదించారు. కొన్ని ఉదాహరణలు :

i) మంచిని చూడు. మంచినే చేయాలనే ఆలోచించు.
మంచివాడవవుతూ మంచిని పెంచు.

ii) సమర్పించి సంతోషించు. స్వీకరించి దాతను నిత్యం స్మరించు.

iii) కాలం కలిసిరానివేళ ఊహలకి కళ్లెం వెయ్యాలి.

iv) స్పర్థనువీడి పరస్పరం సహకరించుకోవాలి. ముందుకుసాగాలి.

ఆంగ్లంలోని శ్రీ గట్టు నారాయణ గారి కథలకి చక్కని తెనుగు నుడికారంతో పాఠకునికి ఉత్సుకతనికల్పిస్తూ చదివింపజేసే విధంగా శ్రీ గజానన తామన్ గారు గావించిన అనువాదం బంగారానికి తావియబ్బినట్లుందనడం అతిశయోక్తికానేరదు. పాఠకులు చదివి సంస్కారసంపన్నులై తరింతురుగాక!

శుభం భూయాత్

**వేదుల సుబ్రహ్మణ్య శాస్త్రి**

"శారదాపీఠం"
36-15-35, మండారివారి వీధి,
**విశాఖపట్నం - 530016.**
**✆ 2541003**

# ప్రాక్కథనం

**కథాంజలి** (రెండవ భాగం) శ్రీ గట్టునారాయణ గారి Offerings II (ఇరువది ఒక్క కథల సంపుటి)కు నా తెలుగు అనువాదం. ఇదివరలో నాచే అనూదితమైన **కథాంజలి** (మొదటి భాగం)కి ఆచార్య డా॥ సుబ్రహ్మణ్యశర్మ గారి ఆముఖం చేర్చి శ్రీ సీతారామ సేవాసదన్‌వారు మార్చి 2003లో ప్రచురించారు.

గట్టు నారాయణ గారి కథలు మూలరూపం లోనూ, అనువాదరూపం లోనూ, ఎనలేని లోకప్రియతను ఆర్జించడానికి వెనుక గల కారణం ఏమిటి? బస్ లోనో, ట్రెయిన్ లోనో ప్రయాణం చేస్తున్నప్పుడో, పనిపాటా లేనప్పుడో, కాలక్షేపం కోసం కథలు చదువ దలచే వారు వీటి జోలికి వెళ్ళక పోవడమే మంచిది. అలాంటి కోవకు చెందిన పఠితలకు 'పేదరాసిపెద్దమ్మకథలు', 'కాశీమజిలీ కథలు...' వగైరా ఉండనే ఉన్నాయి. నీతిని బోధించే లేదా, ఓ చిన్న సందేశంతో ముగిసే పంచతంత్రం లోని కథల్లాంటి కథలు ఇవికావు. ఇవి కంటికి నీరు తెప్పించేవీ, గిలిగింత పెట్టేవీ అసలే కావు. మీ లోని అలసతను పారద్రోలేవి. మిమ్మల్ని ఆలోచింపచేసేవి. మీ వ్యక్తివికాసానికి తోడ్పడేవి.

నేతృత్వస్వరూపలక్షణం ఎలాంటిదై యుండాలి? దాన్ని నిర్వచించే ప్రయత్నం శ్రీ నారాయణ తన కథల్లో చేశారు. అలాంటి నేతృత్వం ఈ దేశానికి అవసరమని పరోక్షంగా, కొన్ని సందర్భాల్లో ప్రత్యక్షంగా సూచించారు. నేతలంటే ఎవరు? ఒక ప్రత్యేక కోవకు (Select few) చెందినవారా? నారాయణ దృష్టిలో కాదు. మీరూ మేమూ అందరం నేతలమే. సమర్పణస్వీకారభావంతో అహోరాత్రాలు కృషి చేస్తే, నదీనదసంపన్నమైన ఈ దేశం, కృషియోగ్య మైన భూమిగల ఈదేశం, సహజవాయువూ, ఇతర వనరులుగల ఈదేశం, బుద్ధిజీవులుగల ఈదేశం, అన్నిటినిమించి, అత్యంతప్రాచీనసంస్కృతీసభ్యతలు గల ఈదేశం ఇతర దేశాలకు ఆదర్శప్రాయమై నిలువగలదు. వ్యక్తివికాసం దేశభవిష్యత్తుతో ముడిపడి ఉంది.

కథాంజలి రెండవ భాగంలో ఇంతకుపూర్వం సూచించినట్లు ఇరువది ఒక్క కథలున్నవి. ఇందులోని ఒక్కొక్కకథ ఓ వైచారికగుళిక. పఠిత చదివి, ఆస్వాదించి, ఆలోచించగల సుగమశైలిలో ఉన్నవి. ప్రాక్కథనాలూ, ముందు మాటలూ కేవలం ఔపచారికత మాత్రమే.

మానవుడు తన వర్తమానజీవనశైలిని మార్చుకొనని పక్షంలో, అర్థవాదానికి (Economism) దాసుడై ప్రకృతిమాత ప్రసాదించే సంసాధనాలను కొల్లగొడుతూ, జలవాయుపర్యావరణప్రదూషణకు పాలుపడే పక్షంలో 'దినోసార్' లాగా నామరూపాలు లేకుండా పోతాడు. మానవుడు మహామానవుడయ్యే దిశలో ప్రస్థావించాలని రసెల్, బర్నార్డ్ షా వంటి మేధావులు కలలుగన్నారు. ఈ సంపుటిలోని మొదటి కథ 'చివరి మజిలీ' నారాయణ కనే మరో మహాస్వప్నం. అలాగే, దానగుణం మనిషి ఎత్తును పెంచుతుంది. 'తేన త్యక్తేన భుంజీథా, మాగృధః కస్యసి ధ్దనం' అని ఈశావాస్యోపనిషత్తు చెప్పేది మనకు సర్వదా ఆచరణీయమని ఎన్నో కథలలో సూచించారు.

సమస్యా పరిష్కారానికి సంవాదమే మార్గం. కురుక్షేత్రం పునరావృతం కాకూడదనుకుంటే సంవాదమాధ్యమాన్నే ఆశ్రయించాలి. సంవాదసామర్థ్యం సమర్థవంతమైన నేతృత్వలక్షణం. ఇది చెప్పడానికి 'సంవాదసౌఖ్యంలో' రచయిత సఫలప్రయత్నం చేశారు.

నేటి మన జీవనశైలి ఎలుకల పరుగుపందెం. ఎదుటివాణ్ణి మించి పోవాలన్న ఏకైకలక్ష్యంతో అహోరాత్రాలు పాటుపడుతున్నాం. కాదు - పోటీపడుతున్నాం.

పోటీపడే తత్వాన్ని వీడి సాటివాడికి సహాయసహకారాలు అందించిననాడు హింస వుండదు. విధ్వంసం వుండదు. పేదరికం పేరుకైనా మిగులదు. ప్రతివాడి జీవితం సుఖమయమవుతుంది. దేశాల సంపత్తి గణనీయంగా పెరుగుతుంది. యావత్ప్రపంచం నందనవనంగా, చైత్రరథంగా మారుతుంది.

'స్పర్థ'తో పాటు 'ప్రధావనం' నారాయణ రచించిన అనేక కథల ఇతివృత్తం. ఇవి ఆధిక్యతను సాధించే లక్ష్యం కలవై యుండకూడదు. ఉత్కృష్టతను సాధించే లక్ష్యం కలవిగా వుండాలి. అయితే ఉత్కృష్టతకు చరమరేఖ అనేది ఏదీ లేదు. 'The sky is the limit' అనే మాటను రచయిత ఒప్పుకోరు. దాన్నీ అధిగమించాలంటారు. 'తుంబురు నారదీయం'లో. మరెన్నో కథల్లో ఈ విషయమే చెప్పారు.

'బ్రతికితే బలుసాకు' లో దిల్మన్, సర్దార్ అవతార్‌సింగ్‌లు భారతంలోని విదురుని లా మనకు సాక్షాత్కరిస్తారు. వాళ్ళు చీకటిలో వెలుగురేఖలు, ఉపేక్షితవర్గపక్షపాతులు. "ఓయ్ పాపే! అగే బఢో; హమ్ తుమ్హారే సాథ్ హైం" సర్దాజీ అన్న ఈ మాటలు మనకెంతో ఊరట కల్గిస్తాయి. ఉపేక్షితులు ఉపేక్షితులుగా ఉండిపోతే మహాకవి గురుజాడ అన్నట్లు 'దేశమేగతి' బాగుపడుతుంది. పరాయిపాలనకు మళ్ళీమళ్ళీ ఆహ్వానం పలుకుతుంది. వెనుకబడినవాణ్ణి ముగింపురేఖను అధిగమింప చేయగల సామర్థ్యం నేతృత్వానికి ఉండాలి.

'కుందేలు, తాబేలు కథ' మనల్ని మళ్ళీమళ్ళీ చదివింప చేసే కథ. ఇది మనము విననిదేమీ కాదు. అయితే దీన్ని 'Retold Series' లో కథ లాగా చూడకూడదు. ప్రస్తుత రచయిత సంప్రదాయపరంగా వచ్చిన కథల్ని పూర్వభాగంగా మార్చి, ఉదాత్త ఆశయంగల ఉత్తరభాగాన్ని చేర్చడంలో మహాఘటికుడు 'కుందేలు తాబేలు' కథల్లో ఇదే చేశారు. ఈ కథలో, పోటీపడేతత్త్వాన్ని మానుకొని పరస్పరం సహకరించుకునే తత్త్వాన్ని అలవరచుకోవాలని హితవుచెప్పారు. ఉద్యోగజగత్తులో ఘనవిజయాన్ని సాధించిన ప్రముఖుల్ని ఈ కథ ఎంతో ఆకట్టుకుంది. కుందేలు తాబేలు కాజాలదు. తాబేలు కుందేలు కాజాలదు. కుందేలు తాబేలుతో పోటీపడే కన్న, మంచి కుందేలయ్యేందుకు తనతో తానే పోటీపడాలి.

నారాయణ గారు చెబుతున్నది కథా? అని ఎవరైనా నన్ను అడిగే పక్షంలో 'అవును-కాదు' అనే నా సమాధానం వుంటుంది. సాహిత్యప్రక్రియగా చూస్తే అవి కథలే! తాత్త్వికదృష్టితో చూసినప్పుడు అవి కథలుకావు. తన ఆశయాన్ని అభివ్యక్తీకరించేందుకు రచయిత ఎన్నుకొన్న మాధ్యమం మాత్రమే!

'కుందేలు మంచి కుందేలవడానికి ప్రయత్నించాలని చెబుతూనే, నారాయణ'గురూజీ' తన్ను తాను కథాంజలి రెండవ భాగంలో మించిపోయారని' శ్రీ కె.కె. ఝున్‌ఝున్వాలా గారు తన ★ముందుమాటలో చెప్పింది అక్షరాలా నిజం.

గట్టు నారాయణ రాచకొండ విశ్వనాథశాస్త్రితో గాని, పాలగుమ్మి పద్మరాజుతో గాని, 'చాసో'తో గాని, మరే తెలుగు కథకుడితో గాని పోటీపడడం లేదు. ఆయన కథ చేవ్రాలు లాంటిది. ఆయనకు ఓ ప్రత్యేకమైన వ్యక్తిత్వం ఉంది. అలాగే ఆయన కథలకు కూడా, ఓ విశిష్టత వుంది.

అందరిని ప్రేమిస్తూ, ఎదుటివాడి ప్రతిభను గుర్తిస్తూ, అభాగ్యుణ్ణి అకుతోభయుణ్ణి కావిస్తూ తన్నుతాను మించాలన్న ధ్యేయంగల మహామనీషి గట్టు నారాయణ. పటాటోపానికి, ఆడంబరానికి దూరంగా వుంటూ, తాను చెప్పదలచింది సూటిగా చెబుతారు. భావదారిద్ర్యాన్ని శబ్దవైభవం మాటున దాచే స్వభావం ఆయనది కాదు. 'అధ్యాపనానికి అవధులున్నాయి, అధ్యయనం అవధులెరుగదు' ఇది విద్యావేత్త యైన వాడే అనగలుగుతాడన్న శ్రీ ఝున్‌ఝున్వాలా గారి మాటలో అత్యుక్తిలేదు. ద్రోణాచార్య - ఏకలవ్యుల కథ చదివాక, ఆయన చెప్పింది అంగీకరించకుండా ఏ పాఠకుడు వుండడు.

★.... He has excelled himself by giving beautiful twists to many age - old stories.

బర్నార్డ్ షా లాగానే నారాయణునిది కవిహృదయం. 'ఇంత చిరుగీతి ఎద వేగిరించునేని; పాడుకొనును తాండవ నృత్యమాడుకొనును' అనే మాట ఇరువురి యెడ వర్తిస్తుంది. 'సెన్‌జోన్' చదివిన మీరేమంటారు? గణేశకార్తికేయుని కథలో, తుంబురనారదీయంలో, ప్రకృతిసౌందర్యాన్ని నారాయణ వర్ణించిన తీరు గమనించండి.

నేను ఈ ప్రాక్కథనం వ్రాసేకంటే, శ్రీ సురేశ్‌పండిత్ ఆంగ్లములో వ్రాసిన పూర్వసమీక్షను తెలుగులోకి అనువదించి, కథలతో జతపరచి వుంటే నా హేతువు సాధ్యమై వుండేది. నారాయణ గురూజీ కథలపై ఆయన వ్రాసింది మల్లినాథీయమే అని చెప్పదగినంత గొప్పగా వుంది. 'నేపథ్యచిత్రణలో, పాత్రనిర్మితిలో మెరుగుదనాన్ని కనబర్చడమే కాకుండా, కథలకు అనూహ్యమైన మలుపునిచ్చి గురూజీ ఆలోచింప చేశారంటూ' తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. అయితే, ఆయన చెప్పింది సూత్రరూపంలో వుండటంచేత ఈ నా భాష్యం అవసరమైనది.

★[1]'ఏకలవ్యుని సందర్భంలో ద్రోణుడు ప్రవర్తించిన తీరు, ఆచార్యుడైన వానికి లాంఛనాస్పదమనీ, ఆకళంకాన్ని గురూజీ పరిమార్జనం చేసి 'ఏ యుగాని కైనా ఆదర్శప్రాయుడు కాగల ఆచార్యుని మనముందు నిలపాడనీ, ఇది ప్రతిభాసంపన్నుడైన వ్యాసమహర్షికి సాధ్యపడలేదని శ్రీ సురేశ్ పండిత్ తన ఆశ్చర్యాన్ని, వేదననూ వెలిబుచ్చారు.

శ్రీ సురేశ్ పండిత్ గారి పూర్వసమీక్ష నన్నెంతో ఆలోచింప చేసింది. దాన్ని నేను అంగీకరించడం గాని, అనంగీకరించడం గాని చేయడంలేదు. ఆయన విమర్శనాసామర్థ్యాన్ని ప్రశ్నించడమూ లేదు. దాన్ని ఆదరిస్తూనే, నేను ఇన్నాళ్ళుగా అనుకుంటున్నది స్పష్టం చేయదలచాను. నేను ఆయనతో పోటి పడడంలేదు. నాతో నేను పోటీ పడుతున్నాను.

ధనుర్వేదవిద్యాపారగుడై యుండి కూడా, కుటుంబభరణము నందు అసమర్థుడై, పసివాడైన అశ్వత్థామ పాలకేడ్వ గా, ద్రుపదుని ఆశ్రయించి, అవమానితుడై, రాజకుమారుల ప్రతిపాదన మీద భీష్మునిచే ఆచార్యుని గా ద్రోణుడు నియుక్తుడైనాడు. ★[2]రాజుల చిత్తవృత్తిని ఎరిగినవాడు. రాచరికపు కొలువులో వుంటూ యజమానులకు అప్రియమైనది చేసే స్థితిలో లేడు. అందుకే ఏకలవ్యుని శిష్యునిగా చేకొనలేదు. అర్జునిని అలుక తీర్చేందుకు, ఏకలవ్యుని కుడిచేతి బొటనవ్రేలిని గురుదక్షిణగా కోరాడు. కరుకు రాచరికపు నీడల్లో వుండి కూడా కారుణ్యభావంతో ఓతఃప్రోతమైన తన వ్యక్తిత్వాన్ని ద్రోణుడు ఇసుమంతైనా కోలుపోలేదు. ఏకలవ్యుడు గురుదక్షిణ సమర్పించుకున్నాక, తర్జనీ మధ్యమలను సంయోగించి, బాణవిమోచనం ఎలా చెయ్యాలో అల్పాక్షరాలలో సూచించాడు.

---

★[1]Dronacharya's reputation in the 'Ekalavya Episode' has been cleverly resurrected. One starts wondering how the great sage Vyasa missed it in Mahabharata.

★[2]Once bitten twice shy.

" స సత్యసంధం నైషాదిం దృష్ట్వా, ప్రీతో ఽ బ్రవీదిదమ్
ఏవం కర్తవ్య మితివా ఏకలవ్య మభాషత. "

ద్రోణుణ్ణి, ద్రోణుని అసహాయతను అర్థం చేసుకున్న వ్యాసుడు బీజరూపంలో వదలిన ఏకలవ్యద్రోణుల ఆఖ్యాయికను ప్రరోహణ పరివర్ధనపల్లవనం చేసి నారాయణుడు మరుపురాని లఘుకావ్యంగా మలచినాడు. తన స్రష్టయైన వ్యాసమహర్షి వోలెనే ద్రోణుడు మనసా, కర్మణా ఉపేక్షితవర్గపక్షపాతి. ఇది నిరూపించడానికి అవసరమైన మార్పులు కూర్పులు చేయడం నారాయణకు తప్ప మరెవరికి సాధ్యంకాని పని. వ్యాసుణ్ణి అర్థం చేసుకోవడం వ్యాసునకు సరితూగ గల మేధావికే సాధ్యం. గట్టు నారాయణ బాదరాయణ వ్యాసుణ్ణి అర్థం చేసుకున్నాడని నిస్సందేహంగా చెప్పగలను.

వ్యాసభారతం మనోవినోదార్థం సృష్టింపబడిన సాహిత్యం కాదు. అలాంటి సాహిత్యం సధననిష్ఠసాహిత్యం. మానవుని మనుగడకు ప్రశ్నార్థకంగా నిల్చిన సమస్యల్ని గురించి అంతర్ముఖుల్ని చేసే మహాకావ్యం వ్యాసభారతం.

మహాభారతకర్తయైన వ్యాసులవారు గాఢాంధతిమరగ్రస్తసమాజాన్ని యథాతథంగా చిత్రీకరించాడు. అయినా, ఆయన అప్రతిహతుడైన ఆశావాది. అందుకే భారతంలో విదురుడు, అధిరథుడు, రాధ, ఏకలవ్యుడు ఆ కారుచీకటిలో వెలిగే చిరుదివ్వెలు.

'నీటిలో నీడలు' (మేక - పులిపిల్ల కథ) సహజవైరాలు వీడి సహజీవనం సాగించాలన్న భావాన్ని లలిత లలితంగా వ్యంజితం చేసే కథ. 'ప్రస్థానం - దైవత్యం వైపు' (ఎలుగుబంటి మనిషి కథ) పఠిత మనస్సుపై చెరగని ముద్ర వేస్తుంది. డి.హెచ్. లారెన్స్ లాగానే మానవుని స్వభావంలో ఉన్న క్షుద్రత్వాన్ని రచయిత ఎత్తిచూపారు. 'జీవమున్న మనిషికన్న శిలలే నయమనిపించును' అని డా॥ సి. నారాయణరెడ్డి గారంటే, శ్రీ జి. నారాయణ గారు 'తెలివియున్న మనిషికన్న ఎలుగే నయమనిపించును' అని వాపోతారు.

కథ తరువాత కథను ఇలా వివేచిస్తూ, అనువాదకుని పరిమితినీ, పరిధినీ మీరుతున్నానని తెలుసు. గట్టు నారాయణ గారి కథలను చదువుతూ, అనువదిస్తూ, ఉప్పొంగివచ్చిన భావాలను శబ్దరూపంలో పెట్టకుండ ఉండ లేక పోయాను.

ఇంతటి ఉన్నతస్థాయి కథలను అనువదించటానికి నాకున్న తెలుగుభాష చాలదు. అయినా ఇంత బరువైన బాధ్యతను శ్రీ గట్టు నారాయణ గారు నాకు అప్పగించారు. ఆయన ఉపేక్షితవర్గపక్షపాతి కావడమే అందుకు కారణమని అనుకుంటాను.

సెలవు, ఉంటాను.

భవదీయుడు

**గజానన్ తామన్**

(సేవానివృత్త)
స్నాతకోత్తర ఆంగ్లవిభాగప్రముఖుడు,
ప్రాచార్యుడు
4-35, తమ్మిచెరువుకట్ట,
మంథని, జి॥ కరీంనగర్, ఆం.ప్ర.
✆ 08729-259600

# 1. చివరి మజిలి

( ఫ్రాన్సిస్-ఫ్రాన్సిస్-ఫ్రాన్సిస్ ల కథ )

ఫ్రాన్సిస్ బోర్జెస్ కారులో ఎన్జిస్ నుండి బయలుదేరి, బెల్జియంలోని ఆంట్‌వర్ప్‌కు వెడుతున్నాడు. ఆయన బాబాయి అయిన జార్జ్‌న్యూమన్ వ్యాపార సంబంధమైన పనిమీద భారత్ నుండి ఆంట్‌వర్ప్‌కు వచ్చారు.

బాబాయి జార్జ్‌న్యూమన్ ఫ్రాన్సిస్‌కు గురుస్థానీయుడు. ఫ్రాన్సిస్ కు, ఆయన సతీమణి క్రిస్పినా కు ఆయనంటే వల్లమాలిన అభిమానం. వ్యవస్థాపనలోని మెలకువలను చెప్పడమే కాకుండా, బోర్జెస్ దంపతులకు ఆధ్యాత్మిక దృష్టి అలవడేట్టు చేశాడు. భారతీయ పిండివంటకాల తయారీలో ఆయనది అందెవేసిన చేయి. వారికి చేసిపెట్టడమే కాకుండా క్రిస్పినాను భారతీయపాకవిద్యలో మంచి ప్రవీణను చేశాడు. 'టోమేటో దాల్' తినడానికి ఫ్రాన్సిస్, క్రిస్పినా, కూతురు కరేన్ ఎంతో ఇష్టపడేవారు. వారాంతాలైన శని ఆదివారాలు బాబాయితో హాయిగా గడపాలనే ఫ్రాన్సిస్ ఆయనను తీసుకొని రావడానికి ఆంట్‌వర్ప్ వెళ్ళాడు.

భోజనాలయ్యాక, ఫ్రాన్సిస్ బోర్జెస్ జార్జ్‌న్యూమన్ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఫ్రాన్సిస్ అన్నాడు. "బాబాయి! ఒకోసారి అనుకోకుండా వృత్తివ్యాపారాల్లో ఘనవిజయాల్ని సాధిస్తూపోతాం. కొన్నిసార్లు చుక్కెదురై నష్టాలపరంపరను చవిచూస్తాం వాణిజ్యపరంగా లాభసాటి అయిన ప్రస్తావన గ్రాహకుల పరిగణనలోనికిరాదు. దేనిపై పెద్దగా ఆశలు పెట్టుకోమో, అది వారి ఆమోదయోగ్యం అవుతుంది. మనల్ని ఆశ్చర్యంలో పడేస్తుంది. ఈ రహస్యాన్ని ఛేదించలేక తికమకపడుతుంటాను."

జార్జ్ చిరునవ్వుతో ఫ్రాన్సిస్ వీపుతట్టి ఇలా అన్నాడు. "అబ్బాయి! మన తర్కానికీ, గణితానికీ అందనివి ఈ ప్రపంచంలో ఎన్నో ఉన్నాయి. ఓ కథ చెబుతా విను."

ఫ్రాన్సిస్‌క్రిక్ అనే గొప్ప వైజ్ఞానికుడు జేమ్స్ వాట్సన్ అనే మరో వైజ్ఞానికుడి సహకారంతో జన్యు విజ్ఞానానికి అత్యంత కీలకమైన ద్వి సర్పిలిని (Double Helix) కనుగొని కాలం చేశాడు - లేదా కాలం చేశాడని ఊహించుకుందాం. ఇహలోక జీవనంలో ఇంతో అంతో పుణ్యం చేసుకున్న ఫ్రాన్సిస్, స్మృతివచనానుసారం, స్వర్గానికి వెళ్ళాడు. ముఖద్వారం వద్ద నిలిచిన ఫ్రాన్సిస్‌ను ఆపాదమస్తకం పరీక్షించి, ద్వార రక్షకుడు లోనికి తీసుకొని వెళ్ళి ఓ వయోవృద్ధుని ఆధీనం చేశాడు. కొత్తగా వచ్చిన ఏ అభ్యర్థియైనా నేరుగా స్వర్గవాసార్హుడుగా ఘోషింపబడడు. దీర్ఘానుభవంగల స్వర్గీయుని నుండి పదిహేను రోజులపాటు ప్రశిక్షణ పొందాల్సి వుంటుంది.

ద్వార రక్షకుడు అభ్యర్థిని వయోవృద్ధునికి ఇలా పరిచయం చేశాడు. "సర్! కొత్తగా వచ్చిన ఈయన ఫ్రాన్సిస్ - ఈయన కూడా ఫ్రాన్సిసే!"

ఫ్రాన్సిస్‌క్రిక్ కు ఆశ్చర్యంవేసి లోలోపల అనుకున్నాడు. 'ఈ రెండవ ఫ్రాన్సిస్ ఎవరై వుంటారు?'

క్రిక్ ఆశ్చర్యాన్ని ఇనుమడిస్తూ వయోవృద్ధుడిలా అన్నాడు. "నీవూహిస్తున్నట్లు రెండవఫ్రాన్సిస్‌ను కాను. మొదటి ఫ్రాన్సిస్‌ను - నీవే రెండవ ఫ్రాన్సిస్‌వి".

"బలేవారండి మీరు! మనుష్యుల ఆంతర్యాన్ని ఇట్టే పసిగట్టేస్తారు. సర్! మీరు ఏ ఫ్రాన్సిస్‌లో దయచేసి చెప్పండి".

అందుకా వృద్ధుడిలా తన్నుతాను పరిచయం చేసుకొన్నాడు. "నేను సెన్ ఫ్రాన్సిస్‌ని - బహుశా నా గురించి నీవు వినియే ఉంటావు".

"ఓ! మీరా! ధన్యుణ్ణి".

వృద్ధుడిలా అన్నాడు "ఫ్రాన్సిస్‌క్రిక్! నేను నీకోసం చేయాల్సింది ఏమైనావుందా? ఏమి చేయాలనుకున్నా, చూడాలనుకున్నా అరమరిక లేకుండా అడుగు. తగు ఏర్పాట్లు చేస్తాను".

క్రిక్ అన్నాడు "మీకు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను నాకు ఆ ముసలాయనను చూడాలని ఎంతో వుంది".

"దేవుణ్ణా!" ఇంత తొందరపాటు దేనికి?

ఫ్రాన్సిస్‌క్రిక్ వృద్ధునికి ఇలా జవాబు చెప్పాడు. "ఎన్నాళ్ళుగానో ఓప్రశ్న నన్ను వేధిస్తూవుంది. ఆయన్నే అడిగి తెలుసుకోవాలనుకుంటున్నా".

'సరే' అని తల ఊపాడు సెన్‌ఫ్రాన్సిస్.

ఫ్రాన్సిస్‌క్రిక్‌ను వెంటేసుకొని, సెన్‌ఫ్రాన్సిస్ మెల్లిగా నడువనారంభించాడు. స్వర్గంలో ఎక్కడచూచినా పచ్చదనమే. అంతటా కళ్ళకు ఆహ్లాదం కలిగించే వెలుగులు. మణులా అన్నట్లు బాట కిరువంకల రంగురంగుల పూవులు. సూర్యచంద్రులూ, నక్షత్రాలూ ఒకేసారి వెలుగు సోనల్ని కురుస్తున్నాయి. పగలూ రాత్రి అనేది లేదు. ఎల్లవేళలూ ఉదయసంధ్యారుణిమలే! అందరూ నిత్యసంతోషులే!

అమృతమే వారికి ఏకైక పేయం - ఇదిగాక వేరే ఆహారమనేది వారికి తెలియదు. సాంద్రంగా వుండి టొమేటో సూప్ చేర్చిన 'మాంగో మిల్క్‌శేక్'లా లోకప్రియమైన పేయం అవడంతోపాటు, అందరిని నిత్యనూతనులుగా ఉత్సాహవంతులుగా ఉంచగల దివ్యగుణం కలది.

స్వర్గంలో ఎవరూ పెద్దగా కేకలు వేయరు. నవ్వుమొహంతో ఎదురై, నవ్వుమొహంతోనే పలుకరిస్తారు. జలవాయువులు నిర్మలంగా వుండి, కాలుష్యాన్ని ఎరుగవు. శాంతిసామరస్యాలకు తిరమైన నెలవు అది. సెన్‌ఫ్రాన్సిస్ క్రిక్‌ను ముఖ్య వీధులగుండా విహారార్థం తోడుగొని వెడుతున్నాడు. జంత్రగాత్రోద్భవ విమలగాంధర్వం మందరస్థాయిలో వీనులకు విందుగొల్పుతున్నది. ఒకచోట బృందనృత్యం, ఒకచోట కవి సమ్మేళనం, మరోచోట సాహిత్యగోష్ఠి. రామాయణ, మహాభారత, బైబిల్ ధారావాహికలు దూరదర్శన్‌పై. 'స్వర్గవాణి' ప్రసారాల్లో ఉపనిషత్, ఖురాన్, జెన్దావేస్తా భగవద్గీతలపై మహాత్ముల ప్రవచనాలు.

పారిజాతతరుమూలస్థితచంద్రకాంతవిశాలవితర్దిపై ఓ వలయాకారంలో ఉన్న మేజాబల్లవుతుంది. దాన్ని చుట్టూ వున్న ఆసనాల్ని అలంకరించి కొందరు మహనీయులు ఏదో చర్చించుకుంటున్నారు. వారివైపు అంగుళీనిర్దేశం చేస్తూ క్రిక్ అడిగాడు "ఈ మహానుభావులు ఎవరై వుంటారు?"

సెన్‌ఫ్రాన్సిస్ నింపాదిగా జవాబిచ్చాడు. "వీరా! ఆధ్యాత్మికసమితి శాశ్వత సభ్యులు. వేదవ్యాసుడు, జరతృష్టుడు, బుద్ధుడు, మహావీరుడు, అరిస్టాటిల్, ఏసు, లావొట్సే, కన్ఫ్యూషస్, శంకరాచార్య భగవత్పాదులు. ఈశ్వరుని ఆదేశానుసారం, కారుచీకటులావరించిన మానవజగత్తును ఉద్ధరించే నిమిత్తం ఓ వైతాళికుణ్ణి నిర్ణయించే దిశలో కొన్నాళ్ళుగా చర్చలు జరుపుతున్నారు. అతడెక్కడ అవతరించాలో ఏ గుణాలను కలిగివుండాలో వీళ్ళు నిర్ధారిస్తారు. 'మానవవిజ్ఞానం మానవజీవనవిధానాన్ని మంటగలుపుతున్నదని' ఓ కవి నోట విన్నాను.

"సర్! 'చేతన-విజ్ఞానం' అనే పుస్తకం నేను ఇహలోకయాత్ర చాలించడానికి పూర్వం వ్రాశాను" - అన్నాడు క్రిక్.

"అలాంటి మంచిపని చేశావు కనుకనే ఇక్కడి రాగలిగావు. ద్విసర్పిలిని కనిపెట్టాక, మరేమీ చేయకుండా ఉంటే నాకానికి గాక నరకానికి వెళ్ళేవాడివి. జన్యుశాస్త్రం, జీవసాంకేతికశాస్త్రం జీవకోటి మనుగడకే ముప్పు తెచ్చేలా నానాటికి వృద్ధింగతమౌతున్నాయి. దేవుని సృష్టి స్వరూపాన్నే మర్చేస్తానన్న అహమ్మన్యతతో మానవుడు కుప్పిగంతులేస్తున్నాడు. రోజుకో విశ్వామిత్రుడు పుట్టుకొస్తున్నాడు".

"ఎవడా విషస్‌మీటర్"? ప్రశ్నించాడు క్రిక్.

"విషస్‌మీటరు కాదు. విశ్వామిత్రుడు. ఆయన గారిని గురించి తరువాత చెబుతాను. ముందుకుపదండి..." అన్నాడు సెన్‌ఫ్రాన్సిస్.

అక్కడ ఓ విశాల ప్రాంగణం. కల్పాదిషడ్ద్రుమ ఖండం మధ్య భవ్యకుటీరాలు. లోపలి లేవెలుగులు గవాక్షాలగుండా నిర్గమిస్తున్నవి.


ప్రాంగణంలో ఎటుచూసినా గాజుశకలాలు. రసాయనపూరిత పింగాణీ జాడీలు. అస్థులూ, ఈకలూ, ఏవేవో ఉపకరణాలు - అన్నీ చక్కగా పేర్చబడివున్నాయి. అక్కడ ఎవరూలేరు. సెన్‌ఫ్రాన్సిస్ ఓ భవ్యకుటీరం ఎదుట నిలిచి 'పరాత్పరా!' అంటూ బిగ్గరగా పిలిచాడు. కొంతసేపటికి, సృష్టినిర్మాణనిర్వహణభారం వల్ల నతదేహుడైన పురాణపురుషుడు వెలుపలికి వచ్చాడు.

---

*కీ॥శే॥ వానమామలై వరదాచార్యులు గారు

ఆయన ముఖబింబం, నయనయుగళం, హస్తద్వయం, దేహయష్టి మూర్తీభవించిన తేజఃపుంజాలు. అమరతరుశాఖికలా అన్నట్లు చేతులు - నెలవంకలల్లె కనుబొమ్మలు. ఆయన కృపావిలోకనాల్ని ఇరువురిపై ప్రసరింపజేశాడు. వైజ్ఞానికుడు పులికితగాత్రుడైనాడు. పుణ్యపురుషుడైన సెన్‌ఫ్రాన్సిస్ తాను మరోమారు ఈశ్వరకృపాభాజనుడైనందుకు సంబరపడిపోతూ ఇలా అన్నాడు.

"దేవా! ఈయన భవదనుగ్రహార్థియైన ఫ్రాన్సిస్‌క్రిక్. విజ్ఞానవేత్త. ఫ్రాన్సిస్! ఈయన సకల చరాచర సృష్టికర్త."



పరిచయాధ్యాయం ముగిసింది. ఫ్రాన్సిస్‌క్రిక్ ఎలా స్పందించాలో తెలియక తికమకపడుతున్నాడు.

సృష్టికర్త ఇలా అన్నాడు, "నీవు రావడం మాకు ఆనందంగా వుంది. నీకప్పగించిన పనిని చక్కగా చేసినా, సగమే చేశావు. ద్విసర్పిలిని కనిపెట్టే నిమిత్తం నిన్ను భూలోకానికి పంపాను. D.N.A. లోని రెండు జన్యువుల రహస్యం నీకు అభేద్యంగానే వుండిపోయింది. అది నీవల్ల సాధితమైవుంటే, అధిచేతనాపథంలో మానవుడు ముందడుగు వేసేవాడు. అతని ప్రవృత్తి, అభిజ్ఞానం, ధిషణ చరమజాగృతి స్థాయిని అందుకొని వుండేవి. ఇన్నాళ్ళుగా వ్యష్టినే అంటిపెట్టుకొని వున్న మానవప్రాణి సమిష్టిదిశలో పయనించగలిగేవాడు".

క్షణం ఆగి ఆయన ఇలా సెలవిచ్చేవారు.

"సెన్‌ఫ్రాన్సిస్ ఈ పనికి శుభారంభం చేశాడు. విజ్ఞానవేత్త ఫ్రాన్సిస్ గట్టి పునాదిని ఏర్పర్చాడు. నవసదస్యసమితి తృతీయ ఫ్రాన్సిస్‌ను త్వరలో నిర్ణయిస్తుందని ఆశిస్తున్నాము. ఇది సరే - ఫ్రాన్సిస్! ఏ అభీష్టసిద్ధినాశించి మా సందర్శనార్థం వచ్చావు? ఏమి అడుగదల చావు? ఏ సత్పురుషుడో సమితిసభ్యుడో తప్ప మావద్దకు ఎవరు రా సాహసించరు".

చెప్పడానికి ఇబ్బందిపడుతున్న ఫ్రాన్సిస్, సందేహిస్తూ మందస్మితం కావిస్తూ ఇలా నివేదించుకున్నాడు.

"ప్రభో! భూలోకవాసిగా వైజ్ఞానికునిగా నా విధ్యుక్తధర్మాన్ని ఆచరిస్తున్నవేళ, ఓ చిన్న సందేహం నాకు కలిగింది - నివృత్తికై ఎన్నోళ్ళో ప్రయత్నించాను - అదే ఇక్కడ కూడా నన్ను వేధిస్తున్నది. సీతాకోకచిలుక రెక్కను ఎలాటి రూపకల్పనచేసి నిర్మించారు? పక్షవిస్తృతి దేహభారం మధ్యగల *నిష్పత్తి ఉడ్డయనానికి దోహదకారిగా కన్పట్టదు. తార్కికవిశ్లేషణకు అందదు. పక్షమూలాంతర్గత పేశికి ఏమి చేర్చారో, మానవసాధ్యంకాని ఉడ్డయన వ్యవస్థను సీతాకోకచిలుకగా రూపొందించారు.

"నాయనా! ఇది అనేక కల్పాల కిందటిమాట". సృష్టికర్త మోములోని వెలుగు రంగవల్లుల సంరచన క్షణక్షణం మార్పుకు లోనవుతున్నది.

---

*Ratio

ఈశానుని విరాడ్దేహాన్ని పరివేష్ఠించి వున్న ప్రకాశవలయమే వైశ్విక స్మృతివ్యవస్థకు ప్రధాన ప్రేరకమని ఫ్రాన్సిస్ తెలుసుకొన్నాడు.

"వత్సా! నీవు అన్నికోణాల నుండి విశ్లేషించి ఓ క్రియాశీలాత్మక వ్యవస్థకు రూపకల్పన చేయవచ్చు. కళేవర నిర్మాణం కావించి రెక్కలతికించి ఉడ్డీనమానం చేయటానికి సవ్వాలక్ష ప్రయత్నాలు చేయవచ్చు. అయినా, నీ వ్యవస్థ యావత్తు కుప్పగూలుతుంది. అప్రమత్తుడవై, ప్రవృత్తినీ, అభిజ్ఞానాన్నీ, దిషణనూ, ప్రేరణనూ మేళవించు. గణితాన్ని, తర్కాన్ని, విధానాన్ని ఆలోచనుండి తొలగించు. రెక్కల్ని కళేవరాన్ని చేతిమీదికి తీసుకో. అధిచేతనాప్రేరితుడవై ఈకల్ని బొందిలోనికి చొనుపి గాలిలోకి విసిరివేయి. సీతాకోకచిలుక గాలిలో ఎగురక ఏం చేస్తుంది?"

"ఫ్రాన్సిస్‌క్రిక్! నీవు వాట్సన్ ద్వినర్పిలిని కనుగొనడంలో అధిచేతన అంశమాత్రమైన ప్రేరణాస్రోతస్సుగా మీకు తోడ్పడింది. ప్రవృత్తిని అభిజ్ఞానాన్ని బుద్ధిని సంయోజించనప్పుడే ప్రేరణనూ, అంతర్దృష్టిని, అంతర్జ్యోతిని నావీన్యతను పొందగలుగుతావు. ఇదేలీల - ఇదేపరమాద్భుతం. ఈ అధిచేతనచే అంశప్రేరితుడైన సెన్‌ఫ్రాన్సిస్ వేలాదిమందిని వెలుగుబాటలో నడిపింపగలిగాడు. ఈ మహాశక్తి జన్యుసంకేతంలో నిక్షిప్తమైయుండి అనాకలనీయంగావుంది. ఈ రహస్యాన్ని ఛేదించిననాడు, నాకూ తనకూ మధ్యవున్న అంతరాన్ని అధిగమించి మానవుడు సమీపవర్తి అవుతాడు. కేవలం బుద్ధి జీవియైన నేటి మానవుడు రేపటి క్రాంతదర్శి అవుతాడు. జన్యుసంకేతాన్ని నీవు పూర్తిగా ఆకలనం చేసుకొనలేదు. అందుకే నీకృతికి పూర్ణత్వం సిద్ధించలేదు."

"ప్రభో! మీరు సంకల్పించుకొన్నదేమిటి?"

ఇరువురు ఒకేమారన్నారు.

"ఏతన్నిమిత్తం మూడవ ఫ్రాన్సిస్‌ని భూలోకానికి పంపుతున్నాను. ఏకవింశఃశతాబ్ది ప్రథమ చరణంలోనే మానవుడు అభూతపూర్వ విజయాన్ని సాధించనున్నాడు." జవాబిచ్చాడు సృష్టికర్త.

ఈ దివ్య సందేశం ముగిసిన వేళ, వ్యాసాది తొమ్మండుగురు సభాసదులు అక్కడికి వచ్చారు. వ్యాసుడూ లావోట్సే కించిత్ ముందుకు వచ్చి నిలుచుని ఈశ్వరునిపై తమ దృష్టి నిలిపారు. వారి నుండి ఇతర సభాసదుల నుండి ఉత్సర్గమించిన కాంతిరేఖలు పరంజ్యోతితో సంగమించినవి. ఈశ్వరుడు 'తథాస్తు' అన్నాడు.

'సువ్యస్థితమై, 'జనహితాయ' ధ్యేయ ప్రేరితమై కార్యరతమైన సమిష్టియే పరమేష్ఠి అంటూ' జార్జ్‌న్యూమన్ కథను ముగించాడు.

ఫ్రాన్సిస్ ఆనందాతిశయితలో తనను తాను క్షణంపాటు మరచిపోయి ఇలా అడిగాడు "బాబాయి! ఇంతకూ పరిషత్తు ఏమి నిర్ణయించింది? మూవవ ఫ్రాన్సిస్ ఎవరైవుంటారు? అతడేమి చేయాల్సి వుంటుంది".

జార్జ్‌న్యూమన్ మందస్మితం చేస్తూ ఇలా అన్నాడు. "పరిషత్తు మూడవ ఫ్రాన్సిస్ ఎవరైవుండాలో నిర్ణయించింది. మానవుడు మహామానవుడుగా ఎదుగడానికి జీవసాంకేతిక శాస్త్ర పరిధిని విస్తృతం చేయడం అతని ఏకైక లక్ష్యమై వుండాలని నిర్దేశించింది".

"బాబాయి! మూడవ ఫ్రాన్సిస్ ఎవరైవుంటారో చెప్పారుకాదు!" అన్నాడు ఫ్రాన్సిస్.

జార్జ్‌న్యూమన్ చిరునవ్వుచిందిస్తూ ఇలా బదులుచెప్పాడు. "తత్త్వం భవిష్యసి".

ఇది విన్న ఫ్రాన్సిస్‌కు ఒక దివ్యానుభూతి కలిగింది. బాబాయికేసి చూశాడు. ఫ్రాన్సిస్ బోర్జెస్ జార్జ్‌న్యూమన్‌లు ప్రకాశాన్ని ఆదానప్రదానం కావించుకొని వైచారిక జ్యోత్స్నలో సారూప్యస్థితికి చేరుకున్నారు. ఫ్రాన్సిస్ న్యూమన్ అయ్యాడు.

ప్రవృత్తి అనేది కాయిక జాగృతి - కార్యాచరణలో పరిపూర్ణుణ్ణి చేస్తుంది.
అభిజ్ఞానం అనేది మానసిక జాగృతి - ఇది సద్భావప్రేరితుణ్ణి చేస్తుంది.
బుద్ధి అనేది వైచారిక జాగృతి - ఆలోచనలకు పూర్ణత్వాన్ని ప్రసాదిస్తుంది.
ప్రేరణ అనేది ఆధ్యాత్మిక జాగృతి - చైతన్య స్వరూపుణ్ణి చేస్తుంది.

# 2. అంతా మనమంచికే

( రాజూ మంత్రీ కథ )

అనగా అనగా, అవదేశవర్మ అనే రాజు. రాజేశ్వరశర్మ ఆ రాజుకు ప్రధానామాత్యులు. 'మంచి'గాని 'చెడు'గాని సంభవించినప్పుడు 'అంతా మనమంచికే' అంటూ స్పందించేవాడు - హర్షవిషాదసందర్భాలలో ఆయన నోటినుండి దొరలే ఈ ఊతపదం రాజు సమీపవర్తులూ, సామాన్యులూ అనేకమార్లు విన్నవారే! అమాత్యుడు స్పందించేతీరు మహారాజుకు రుచించేదికాదు. లోలోన బాధపడేవారు. అన్నిఘటనలు సుఖాంత మెలా అవుతాయి? ప్రాణులు నిత్యం లోనయ్యే తాపత్రయం మాటేమిటి?

ప్రభువులవారి ఆలోచనకు ప్రధానామాత్యుల ఆలోచన పూర్తిగా విభిన్నం. ఘటనాస్వరూపమేదైనా సకారాత్మకంగా స్పందించేవాడే ఘనవిజయాలు సాధిస్తాడని రాజేశ్వరశర్మ గట్టిగా విశ్వసించేవాడు.

అవదేశవర్మ మహారాజు బహుశాస్త్రవినీతులు. ధృడకాయులవడంతోపాటు స్ఫురద్రూపి. ★సాముద్రికంలో చెప్పిన లక్షణాలన్ని కలవాడు. అహోరాత్రాలు జనకళ్యాణానికి పరిశ్రమిం చేవాడు.

ప్రధానమాత్యులైన రాజేశ్వరశర్మ మధ్యమదేహయష్టికలవాడు. కుశాగ్రబుద్ధి. అందగాడు. చిన్నలనయినా పెద్దలనయినా చిరునవ్వుతో పలుకరించేవాడు. ఎదురయ్యే ప్రతి సమస్యకు సర్వానుమోదమయ్యే పరిష్కారం కనుగొనుటలో దిట్ట.

రాజేశ్వరశర్మవంటి ప్రజ్ఞాదురంధరుని ప్రధానామాత్యునిగా కలిగియున్నందున మహారాజు ప్రజలకు ప్రీతిపాత్రుడైనాడు.

ఒకనాడు శస్త్రాగారంలో వివిధాయుధాల్ని పరిశీలిస్తూవున్న మహారాజుగారి కుడిచేయి చూపుడువేలు పైగెనె అనవధానతలో తెగి చేయినుండి వేరైంది. ఎంతో రక్తస్రావమైంది. ఔషధోపాచారాలు కావించి, వైద్యులు గుడ్డపేలికను వేలికి చుట్టారు. నెత్తురు మరక పేలికపై స్పష్టంగా కనపడుతూనేవుంది. మహారాజావారు ఉపశమనార్థం వేలిని నిటారుగా నిల్పి, ఇటూ అటూ పచార్లు చేస్తున్నారు.

---

★కక్షః కుక్షిశ్చ వక్షశ్చ ఘ్రాణస్కంధౌ లలాటికా
సర్వ భూతేషు నిర్దిష్టా ఉన్నతాంగాః శుభప్రదాః

ఇంతలో ప్రధానమాత్యులు ప్రభువులవారి సందర్శనార్థం వచ్చి పరిస్థితిని గమనించి ఇలా అన్నాడు. "ప్రభూ! చేతికేమి చేసుకున్నారు?"

మహారాజావారు తెగిన వేలిని ముందుకుసాచి బాధపడుతూ అన్నారు. "వేలి పైభాగం తెగింది".

"అంతా మనమంచికే మహారాజా!" ఎప్పటిలా మహామాత్యుడు స్పందించాడు.

ఇది విన్నాక, మహారాజావారు ఇన్నాళ్ళుగా పాటించిన సంయమనం చెలియలి కట్టతెంచుకుంది - కోపోద్రిక్తులై కఠినోక్తులు పలికారు. "వేలు తెగి మేము తీవ్రవేదన అనుభవిస్తున్న వేళ నీవు వేళాకోళానికి దిగావు. స్వామియెడ నీవు ద్రోహబుద్ధి కలవాడవని దీనితో నిరూపితమైంది. మేము సహించేదిలేదు. ఈక్షణమే నీవు పదవీచ్యుతుడవు."



క్రోధవశుడైన మహారాజు ఇంతటితో ఆగక, ప్రధానసేనాపతిని ఇలా ఆదేశించారు. “ఈ రాజద్రోహిని ఈ క్షణమే కారాగారబద్ధుణ్ణి చేయండి. ఈయన ముఖం చూడదలచుకోలేదు”.

ప్రధానామాత్యులైన రాజేశ్వరశర్మ ఏ నిరసనను వ్యక్తం చేయకుండా, తన నిండుదనానికి భంగం రానీయకుండా ఇలా అన్నాడు. “ఇదంతా మనమంచికే”.

ఈమాట మహారాజావారి కోపాగ్నిని ఆజ్యంలా మరీ ప్రజ్వలింపచేసింది - కాఠిన్యంతో వెటకారాన్ని మేళవించి ఇలా అన్నారు. “అంతా మనమంచికా! ఇది నీకెంత మంచిని ఒకగూర్చుతుందో, కాలమే తేలుస్తుంది. చూస్తున్నారేం ఈయనని బంధించి ఇప్పుడే తీసుకొనివెళ్ళండి”.

పదవీచ్యుతుడై రాజేశ్వరశర్మ కఠినకారాగాశిక్షను అనుభవిస్తున్నాడు. రాజులు స్వభావతః క్షణచిత్తులు కనుక అవదేశవర్మ మహారాజు ఈ ఘటనను పూర్తిగా విస్మరించారు. రాజవైద్యుల ఉపచారంవల్ల గాయం ఏనాడో మానింది. 'గెనెను' కోల్పోయిన తర్జనీ, మిగతా నాలుగు వేళ్ళు పూర్వం లాసక్రియమైనవి. కొత్త పరిస్థితికి రాజు అలవాటుపడినారు. నిత్యప్రవాహధర్మియైన జీవనదిలా రాజు జీవనం గతిమానమయ్యింది.

ఒకనాటి ప్రభాతవేళ, మృగయావినోదులైన మహారాజావారు వేటాడాలని మనసుపడ్డారు. వేటలో అనుభవమున్న దళపతులతో, రెండువేలు అశ్వికులుగల రక్షణ సిబ్బందితో, జాగిలాలతో, అవసరమైన సరంజామాతో మహారాజావారు గహనారణ్యంలో ప్రవేశించారు. అశ్వారూఢులై వేటాడుతున్న మహారాజుకు మాయామృగాన్ని తలపించే అద్భుతదర్శనమైన స్వర్ణహరిణం అల్లంతదూరాన గరికమేస్తూ దృగ్గోచరమైంది. వెంటనే వాయుజవంతో ముందుకు దూసుకొని వెళ్ళేలా అశ్వాన్ని మృగమున్న దిశలో ప్రేరేపించాడు. ఇది గమనించని అనుయాయులు అనుధావనంలో చాలా వెనుకబడిపోయారు. బంగరులేడి హఠాత్తుగా బాటనుమార్చి, సూర్యకిరణాలు నేలకు సోకని సాంద్రభాగంలో ప్రవేశించి, మటుమాయ మైంది. ఇది గమనించని రాజు సైన్యం అదే మార్గాన్ని అనుసరించింది. విపణవీథిలోని పరివర్తనను గణనలోకి తీసుకోకుండా, పూర్వపంథానే అనుసరిస్తూ నష్టాల ఊబిలో కూరుకొని పోయే వ్యాపారసంస్థలా సైన్యం రాజును కోలుపోయింది.

స్వర్ణమృగాన్ని వెంబడించే మహారాజు మార్గచ్యుతుడైనాడు - స్వర్ణమృగం వేటగాని ఊహకందని సీమను చేరుకుంది.

రాజ్యానికి తిరుగు ప్రయాణంచేసే మార్గాన్ని, అనుచర సైన్యాన్ని అన్వేషించడంలో రాజు విఫలుడయ్యాడు.

ఒంటెలబారువలె కాలం ముందుకుసాగిపోతూవుంది. సూరీడు విశ్రాంతి నిమిత్తం కొండ వెనక్కి వెళ్ళాడు. చీకటి కారుచీకటిగా మారుతున్నది. రాజు క్షుత్పిపాసాగ్రస్తుడైనాడు. మేతనీరు లేక గుర్రం బాగా నీరసించిపోయింది. చేసేదేమీలేక ఓ చెట్టుక్రింద గుర్రాన్ని నిల్పి, ఓ శిలాఖండంమీద కూర్చుని అలసిన మేనికి ఊరటకల్గిస్తున్నాడు.

అది గురువారం. ఆనాడే శుక్లపక్షప్రతిపద. ఆదిమవాసులు నివసించే ప్రాంతం. అడవిదేవర కలలో కనిపించి నరబలిని కోరినదని, ప్రతిపదనాటి రాత్రి అందుకు అనువైనదని పెరుమడైన జాగిలి తెగవారికి ఆ పొద్దుటే చెప్పారు. నరబలి ఇస్తే కోరినది కొంగుబంగారమౌతుందని చెప్పిన మాటను కులపెద్దయైన బొర్రడు శిరసావహించి, జట్టునేతలను అడవిని గాలించటానికి ఆదేశించాడు. మహామాంత్రికుడు సూచించిన లక్షణాలుగల వ్యక్తికోసం వారు చెట్టూ పుట్టా వెదుకసాగారు. పెరుమడు దేవరపూనినాక, పలికిన మాటలు చెవిలో గింగురుమంటున్నవి.

'కుర్రడు కంటికి ఇంపైనవాడు కావాలెరా బొర్రోడా! చురుకైనోడు ఒంటిలో ఏలోపం లేనివాడై యుండవలెరా. బక్కచిక్కినోణ్ణి, బాగా బలసినోణ్ణి, నేలకు జిట్టెడున్నోణ్ణి నిచ్చెనలాటివాణ్ణి అమ్మ ఒల్లదురో బొర్రోడా! ఎత్తు, నాలుగుమూరల జానెడు ఉండాల్రో.... మూడు మణుగుల బరువున్నోణ్ణి అమ్మకావాలంటుందిరో. నల్లటి ఎంటుకలున్నోడు, దోరరంగోడు, ముప్ఫయిరెండు పళ్ళున్న దొరబాబు నిమ్మంటుందిరో బొర్రోడా!'

'ఇవన్నీ ఉన్నవాణ్ణి తెచ్చినా, తాను స్వయంగా పరీక్షించి నచ్చితేనే అనుమతి ఇస్తానని' జాగిలి పెరుమని మాటను దృష్టిలో పెట్టుకొని 'లంబూ', 'జంబూ', 'తంబూ', 'డంబూ'ల నేతృత్వంలో ఆటవికులు నాల్గుజట్లుగా చీలి బలిపశువుకై నలుమూలలా గాలించ సాగించసాగారు.

తంబూ జట్టుకు చెట్టుక్రింద రాయిపై కూర్చున్న రాజు కన్పించాడు. చక్కదనాల రాచపట్టిని దూరం నుంచి చూసి గంతులేశారు. ఈయనను తీసికెడితే జాగిలితోపాటు బొర్రన్న దొర సంతోషిస్తారన్న నమ్మిక వారికి కలిగింది - తంబూ ఆజ్ఞాపించిన మరుక్షణమే కుర్రాళ్ళు రాజుని చుట్టుముట్టి, పట్టుకుని, తాళ్ళతో కట్టివేశారు. తంబూ విజయగర్వంతో జాగిలి నివసిస్తున్న గుహకు వెళ్ళాడు. మిగతా ముగ్గురు నేతలు ఏడుపుమొహాలతో తిరిగివచ్చి 'క్షమించండని' దొర కాళ్ళావేళ్ళాపడి కన్నీరు గార్చారు. జాగిలి దృష్టిలో, దొరదృష్టిలో, ఆటవికుల దృష్టిలో, తంబూ మొనగాడనిపించుకున్నాడు.

మహామాంత్రికుడు జాగిలి మురిపానికి మేరలు లేవు - అయినా చల్లారిన గెంజినైనా ఊదుకొనితాగే మనిషి. పొట్టిగరేస్తూ తంబూను చేరబలిచి ఇలా అన్నాడు. "అద్దిరబన్నా! పులికూనా! శాన మెంచి మడిసిని తెచ్చినవురా! ఈని లచ్చనాల్ని సూడాలి. కట్లిప్పండిరా".

ఆటవికులు మహారాజావారిని బంధవిముక్తిణ్ణి చేశారు. జాగిలి మంత్రగాడు రాజును నఖశిఖాపర్యంతం పరీక్షించటానికి పూనుకున్నాడు. వారు మాట్లాడే పైశాచిక భాషను ఎరిగిన రాజు, వారు చేయబోతున్నదానిని గ్రహించాడు. దేవికి ఆరాత్రే 'బలిపశువును' కానున్నానని తెలుసుకొన్న మహారాజు కదిలికలేని రాతిబొమ్మయిపోయాడు.

జాగిలి మొదట రాజుగారి ఎత్తును కొలిచాడు. కాళ్ళూ చేతులూ సూక్ష్మంగా పరీక్షిస్తున్నవేళ మొదటిగెన లేని చూపుడువేలుపై వాడి దృష్టిపడింది. పెద్దపులిలా పెడబొబ్బలు పెట్టసాగాడు. "తంబిగా! తిండిపోతు యదవల్లారా! ఎంతపని చేసినారురా! కంటికి నచ్చని సరుకును దేవర ఒల్లదురా! గెన లేని వేలుకలోడు. కొంచవొయ్యి బయటపడెయ్యండిరా..."

తంబూకూ, వాడి జట్టు వారికి జాగిలి మాటలు ఈటెలయినవి. రాజును చూసి తిక్కరేగింది. గుహవెలుపలికి నెట్టుకుంటూ తెచ్చి ఇలా అన్నాడు. "అమ్మోరికి పనికిరానోడివి. నీతో మాకేం పని. పనికిమాలిన సరుకా! పో ఇక్కడి నుంచి...

రాజును వారు తరిమి వేసినంత పని చేశారు.

ఆటవికుల తండాను వీడి మహారాజు తిరిగి అడవిని చేరుకున్నారు. వేలు తెగిన కారణంగానే అపమృత్యువును తాను తప్పించుకోగలిగానని గ్రహించేందుకు ఎంతో సమయం పట్టలేదు. 'వేలు తెగింది నామంచికే....' చీకటి కొట్టులో దినాలు వెళ్ళబుచ్చుతున్న మహామంత్రి అదే క్షణం గుర్తుకు వచ్చాడు. ఆయనకు మౌనకృతజ్ఞతను తెలుపుకున్నాడు. దైవానుకూలంవల్ల, ఎంతో వెదకవలసిన అవసరం కలుగలేదు. - స్వారీ అశ్వం చెట్టు క్రిందే నిలిచివుంది. మరికొన్ని క్షణాల్లో సైన్యం రాజున్న చోటికి చేరుకుంది. బాగా రాత్రి అయ్యాక, అనుయాయులతో రాజు రాజప్రాసాదాన్ని చేరుకున్నాడు.

'మరునాటి ఉదయం 9-00 గంటలకు, మహామాత్యులను కారాగారవిముక్తుణ్ణి చేసి, సకల రాచమర్యాదలతో దర్బారుకు తోడ్కొని రావలసిన'దిగా ఉపమహామాత్యుని రాజావారు ఆదేశించారు.

రాజేశ్వరశర్మ కారాగారంలో మూడునెలలున్నాడు. మిగతా ఖైదీలవలెనే ఒళ్ళువంచి పనిచేశాడు. పరిస్థితి కనుగుణంగా తనను మార్చుకొన్నాడే తప్ప ఎవరినీ పల్లెత్తుమాట అనలేదు. ఉభయసంధ్యలలో, గీతాప్రవచనంతోపాటు, విపశ్చనను ఖైదీలకోసం నిర్వహించాడు. క్రూరకర్ము లైన వారిలో సైతం పెనుమార్పు తెచ్చాడు. మూడునెలల్లో కటకటాల చీకటికొట్టును కర్మయోగులకు అనువైన ఆశ్రమంగా మార్చివేశాడు. బందీల మనస్సులలో శిక్షను అనుభవిస్తున్నామన్న భావన పోయి, పాప ప్రక్షాళనార్థం తపస్సుకు పూనుకున్నామన్న భావన పాదుకున్నది. పరిశ్రమించి, నిత్యోపయుక్తమైన వస్తువులతో పాటు, కళాకృతుల్ని ఉత్పత్తిచేసి ఖైదీలు కారాగారాన్ని కర్మాగారంగా మార్చారు. ఆర్థిక స్వాయత్తతను సముపార్జించుకున్నారు.

ప్రధానసచివుడు శ్రీ రాజేశ్వరశర్మను రాచమర్యాదలతో తోడ్కొని పోయి, రాజు సన్నిధిలో నిలిపాడు. భూతపూర్వ ప్రధానామాత్యులైన రాజేశ్వరశర్మను ప్రభువులవారు సాదరంగా ఆహ్వానించి తనకు కలిగిన సంతోషాన్ని వ్యక్తంచేశాక, ఇలా అన్నారు. "రాజేశ్వరశర్మగారు! మిమ్మల్ని ఈనాటినుంచి విశేషాధికారాలు గల ప్రధానామాత్యునిగా నియమించుచున్నాము. మీ వేతనాన్ని రెండంతలు కావించడంతోపాటు, ఇతోధికసౌకర్యాలు మీకు ఒనగూరేలా చేయుచున్నాము. మా ఈ ఆదేశ స్వరూపము తత్క్షణమే అనువర్తనీయమైనదిగా అన్వయించుకుని కార్యాన్వితం అయ్యేలా చూడాలని ప్రధానసచివుణ్ణి ఆదేశించుచున్నాము."

"మహామాత్యా! "అంతా మనమంచికే" అని మీరు తరుచుగా అనేమాట మాయెడ అక్షరాలా సార్థకమైనది. తర్జని పైభాగము మేము కోలుపోయినందువల్లె అపమృత్యువును తప్పించుకొనగలిగినాము".

తాను ఎదురుకున్న విపత్తును ఆద్యంతం మహారాజావారు సభికులకు తెల్పారు.

ప్రధానామాత్యులు ఇది విన్నాక, లేచి అన్నాడు "ప్రభూ! జరిగినదంతా మనమంచికే"

"మహామాత్యా! ఆమాటే మళ్ళీ అంటున్నారు! జరిగినది మా మంచికే జరిగినదని సభకు తెలిపినాము - మీ విషయంలో ఏమి మంచి జరిగినది? నిష్కారణముగ ఆరునెలల కారాగారవాసము మీకు సంప్రాప్తించినది కదా!" సెలవిచ్చారు ప్రభువులు.

రాజేశ్వరశర్మ లేచి ప్రభువులవారికి ఇలా విన్నవించుకున్నారు. "ప్రభూ! నిస్సందేహంగా, నాకునూ మంచియే జరిగినది. ఎటులందురా? కారాగార నివాసయోగం నాకు కలుగకుంటే మృగయార్థం మీతో వచ్చిన సిబ్బందిలో నేనూ చేరి యుండేవాణ్ణి. ఆటవికులు బలికి పనికిరాని మిమ్మల్ని వదలి, నన్ను దేవికి బలి ఇచ్చియుండేవారు".

వస్తు మూల్యాంకనం వ్యక్తి నిష్ఠితమై యుంటుందన్న పరమసత్యాన్ని ప్రభువుల వారు దర్శించుకున్నారు. అలాగే వాక్యార్థం కూడా!

రాజేశ్వరశర్మ చెప్పడానికి ఉపక్రమించాడు. "ప్రభువులవారు అవధరించవలె! ఆరు నెలల కారాగారావాసం నా జీవితంలోని బహుమూల్యమైన అధ్యాయం. కరుడుగట్టిన నేరస్తులను పాపభీరువులుగా ధర్మవర్తనులుగా చేయగలిగాను. ప్రతీకారాత్మక దృష్టికి బదులుగా పరివర్తనాత్మక దృష్టితో నేరస్తులను చూడాల్సిన అవసరముంది. శిక్షాసంహితను ఈ మేరకు మార్చి కారాగార వ్యవస్థాపనలో విప్లవాత్మక మార్పులు తెచ్చి నేరాన్ని సమూలంగా నిర్మూలించటానికి పాటుపడతాను. ఇందుకు ప్రభువులవారి అండదండలూ నాకుంటాయనే భావిస్తాను".

మంచిని చూడు. మంచిని చేయాలనే ఆలోచించు.
మంచివాడవుతూ మంచినిపెంచు.

# 3. అత్తగారికి మేలుకొలుపు

( అత్తాకోడళ్ళ కథ )

ఒకానొక మధ్యతరగతికి చెందిన ఓ విప్రకుటుంబ ముండేది. ఇంటి పెత్తనమంతా అత్తగారిదే. కోడలు అత్తగారి ఇచ్ఛానువర్తిని. కిమ్మనకుండా కోడికూసింది మొదలు దివ్వెలు కునుకేంత వరకు అన్ని పనులు చేసేది. మిట్టమధ్యాహ్నాం వాళ్ళ పెంకుటింటి ముందు ఓ యాచకుడు నిలిచి 'అమ్మా! దానం చేయండి' అని బిగ్గరగా అరుస్తుండేవాడు ఇది విన్న వెంటనే, అత్తగారు వెలుపలికి హుందాగా వేంచేసి 'వాటంకాదు వెళ్ళిరా' అని గద్దించి లోపలికి వెళ్ళి తలుపులను విసుగ్గా మూసివేసేది - ఇది నిత్య ప్రహసనం. అర్థి అలుపుసొలుపెరుగడు; అత్తగారు పట్టువదలరు; ఏ ఒకరు మెట్టుదిగరు. ఇలా నెలలు గడిచినా, పరిస్థితిలో అణుమాత్రం మార్పులేదు.

ఎప్పటిలాగే ఒకరోజు భిక్షుకుడు ద్వారం ముందు నిలిచి 'అమ్మా! ధర్మం చేయండి' అని అరచాడు. అత్తగారు ఇంట్లో లేరు. ముఖ్యమైన పనిమీద పొరుగింటికి వెళ్ళియుంటారేమో? బిచ్చగాడి పిలుపు విన్న కోడలుకు ఏమిచేయాలో తోచలేదు. దయతలచి వాడికేమైనా పెడితే, అత్తగారు రాచిరంపాన పెట్టకుండా వుంటారా? బుద్ధిమంతురాలైన కోడలు అత్తగారికి ఆగ్రహం తెప్పించే ఏ పనీ చేయకూడదని నిర్ణయించుకుంది. పై అధికారిని నొప్పించకుండా సహాయుని యుక్తిని ఆమె అవలంబించింది.

తలుపులు తెరుచుకున్నాయి. అత్తగారికి బదులు కోడలు కనిపించేసరికి యాచకుడి మనస్సులో ఆశ మొలకెత్తింది. 'అత్తగారిని పోలదీమె; అన్నపూర్ణ' అని అర్థి ఆలోచిస్తున్నావేళ, కోడలు సొన్నాయి స్వరమార్దవంతో ఇలా అంది "ఏమీ ఈయలేను. వెళ్ళిరా నాయనా!"

ఇది విన్న యాచకునికి ఎంతో బాధవేసింది - అయినా సూక్ష్మగ్రాహి కనుక 'పసుపుకుంకుమలతో కలకాలం వర్ధిల్లు తల్లీ!' అని దీవించి నాలుగు అడుగులు వేశాడో లేదో ఇంటికి తిరిగి వస్తున్న అత్తగారు ఎదురయ్యారు.

"దండాలమ్మా!"

"ఎక్కడి నుండి రాక?"

"మన ఇంటినుండే నండి".

"ఏవయింది?"

"అమ్మాయిగారు ఉన్నారండి".

"ఉండకుండా ఎక్కడికిపోతుంది. కాస్తోకూస్తో జోలెలో పడిందా?"

"వెళ్ళిరా అందండి".

"ఏమిటీ! అలా అందా? ఆమె ఎవరు అలా అనడానికి! రా నాతోరా".

"సరే నండి".

అత్తగారు వడివడిగా నడుస్తూ ఇల్లు చేరుకున్నారు. యాచకుడు ఆశతో ఆమెననుసరించాడు. పదినిముషాలైంది. లోనికి వెళ్ళిన అత్తగారు ప్రత్యక్షం కాలేదు. ఏదో ధ్యాసలో మరచి వుంటారని అనుకొని 'అమ్మా!' అని మొరపెట్టుకున్నాడు. జోలెను సాచి బొమ్మలా నిలబడిపోయాడు. ఇంతలో, తలుపులు తెరుచుకున్నాయి. అత్తగారు వెలుపలికి వచ్చి ముఖంలో విసుగును కనబరుస్తూ అన్నారు. "ఎందుకలా అఘోరిస్తున్నావ్"

"ధర్మం చేయండి తల్లీ!" దీనంగా గొణిగాడు.


అత్తగారు, తిరుగులేని తన పెత్తనాన్ని మరోమారు కోడలితో సహా వీధికంతటికి చాటుతూ, దృఢంగా, ముక్తసరిగా, తుదిమాటగా 'వెళ్ళిరా' అంది. ఆవిడను అనునయించే ధోరణిలో అకించనుడు ఇలా అన్నాడు. "ఆవిడెవరు నేనుండగా అని మీరే అన్నారండి"

"ఆమాటే ఇప్పుడూ అంటున్నా. వెళ్ళిరా."

బిచ్చగాడు బిక్కమొహం వేశాడు.

కథ అయిపోయిందనుకొనేరు - ఇది పూర్వభాగం మాత్రమే.

అతడు భిక్షుకుడుకాదు. భిక్షువైన స్వామీ అవధూతానంద మహారాజులు. ఎందరినో వెలుగుబాటలో నడిపించిన పుణ్యశ్లోకుడు. మోడువారిన జీవితాల చిగురింపజేసిన కారణజన్ముడు. ఆకొన్నవారిని ఆదుకొనని, అతిథులను సమాదృతులను చేయనేరని, సదాచార బాహ్యయైన గేహినిని సన్మార్గగామినిగా చేసే నిమిత్తం, భిక్షాపాత్రంతో ఆభాసమాత్రమైన ఆ గృహం ముందు మిట్టమధ్యాహ్నం ఇదివరలో ఎన్నోమారులు నిలిచారు.



'ఆదానం హి విసర్గాయ సతాం వారి ముచామివ'.
రఘువంశం - కాళీదాసు.

అదేరోజు మరోసారి సూర్యభగవానుడస్తంగతడు అవుతున్న వేళ ఆ ఇంటి ముంగిలిని స్వీయపాదయుగళరజః స్పర్శ చే పునీతం కావించారు. దైనందిన కార్యకలాపాలు ముగించుకొని, గృహోన్ముఖులైన పితాపుత్రులకు వీధిలోనే దర్శనమిచ్చారు. తమ రోజటి అనుభవాన్ని ధారాళమైన ఆంగ్లంలో వివరించి ఇద్దరిని ఆశ్చర్యపరచారు.

"దానమెరుగని హస్తం దర్వివంటిది. ఇచ్చేవాడికే ఇంద్రవైభవ ప్రాప్తి. ఎళ్ళవేళలూ 'ఇమ్మని' అర్రుల సాచేవాడు ఆక్రామకుడు. పరిగ్రహించి ప్రదానంచేసేది ప్రభుత. ఇచ్చిపుచ్చుకోవడం వాణిజ్యం. సమర్పణ స్వీకారాలు దైవగుణోపేతుల ఆచరణ. సమర్పించినా, స్వీకరించినా శ్రద్ధాభావంతోనే. ఏది నీవిస్తావో అది పరిగణనీయం కాదు. ఎలా ఇస్తావో అదే లెక్కలోనికి తీసికొనదగినది స్వీకారసమర్పణలకు ఈనాటి నుండి మీ ఆవాసం దైవాయతనం కావాలి."

ఇంట్లో ఏమి జరుగుతున్నది, పితాపుత్రులు ఇట్టే పసికట్టారు. దానిని సరిదిద్దాలని నిర్ణయించుకొని, మరుసటి రోజు తమ తమ కార్యాలయాలకు సెలవుచీటి పంపించారు. పెందలకడే లేచి నిత్యకృత్యాలు ముగించుకొని విపణవీధికి వెళ్ళి బత్తాయి పండ్లను తెచ్చారు.

రోజటి సమయానికి భిక్షుకుని రూపంలో స్వామీజీ నిలిచి యథాప్రకారం 'ఏదైనా పెట్టి పంపండమ్మా' అని అరచారు. గృహస్వామిని యైన అత్తగారు, ఎప్పటిలా 'వాటం కాదు; వెళ్ళిరా' అన్న మరుక్షణం, ఇంటి యజమాని తన గదినుండి వెలుపలికి వచ్చి వెళ్ళిపోతున్నవాణ్ణి 'రమ్మని' పిలిచాడు. "మన ముంగిలి నుండి రిక్తహస్తాలతో ఎవరూ పోవీలులేదు".

ఇలా భార్యకు వినపడేలా అని బుట్టనుండి ఓ బత్తాయిని తీసి స్వామీజి చేతిలో పెట్టాడు. ఆ మహనీయుడు దాన్ని స్వీకరిస్తూ 'విజయీభవ' అని దీవించాడు. దీనితో దానయజ్ఞం మొదలైంది. తండ్రి అడుగుజాడలలో కొడుకు రెండు బత్తాయిలను స్వామీజీకి సమర్పించి ఆశీస్సులనొంది భార్యకేసి సాశయంగా చూచాడు. కోడలు కొండంతంధైర్యం కూడగట్టుకొని నాల్గు బత్తాయిలను స్వామి హస్తాల్లో పెట్టింది. 'సుఖీభవ' అని ఆమెను దీవించారు.

---

యః స్వయమన్నవానపి దారిద్ర్యేణ హింసితాయ, గృహం ప్రత్యాగతాయ ఆత్మీయం అన్తఃకరణం అదానే స్థిరం కురుతే, తస్య పురస్తాదేవ భోగాన్ సేవతే, సోపి ఆత్మానః సుఖయితారం నలభతే.

సాయనాచార్యులు : ఋ.వే. 10. 10. 117

ఇది గమనిస్తూ వున్న అత్తగారు తన పెత్తనానికి పెను ముప్పు వాటిల్లనున్నదని గ్రహించి, అప్రమత్తయై మిగిలిన బత్తాయిలన్నింటినీ స్వామీజీ పరచిన ఉత్తరీయంలో ఉంచింది.

"నేటినుండి ఈ గృహం దేవాయతనమై భాసిల్లుగాక" అని అందరికి మరోమారు దీవెనలిడి, అక్కడ చేరిన వాళ్ళకు పళ్ళను ప్రసాదంగా పంచిపెట్టి ముందుకు నడచారు.

అత్తగారు కనులు తెరిచారు. అతిథులకు, అభ్యాగతులకు గృహద్వారాలు తెరచుకొన్నాయి. అస్తమానం అధికారం చలాయించే 'అత్తగారు' అనురాగం వర్షించే 'అత్త'గా మారి ఈశ్వరాత్త విభూతితో బంధుమిత్రపరివార పరిజనహృదయాధినేత్రి అయ్యింది.

సమర్పించి సంతోషించు.
స్వీకరించి దాతను నిత్యం స్మరించు.

# 4. ముందుచూపు

( పద్మసింహ - రామశర్మల కథ )

శ్రీ గోపీనాథవర్మ నవనాథపురాధీశుడు. ఆయన గొప్ప మేధావి - నిరంతర క్రియాశీలి. లక్ష్యం సిద్ధించేవరకు నిద్రాహారాలు మానేవాడు. ఆయన కార్యశైలి ఇతరులకు ఆదర్శప్రాయంగా వుండేది. రాజ్యోద్యోగుల కర్తవ్యాచరణలో ఏ చిన్నలోపం కనిపించినా, సహనాన్ని కోలుపోయేవాడు.

పద్మసింహుడు మహారాజావారి అంగరక్షకుడు. నర్మసచివుడుకూడా! యజమాని అవసరాలను గుర్తెరిగి, సంపూర్ణనిష్ఠతో సేవలందించేవాడు. ప్రత్యూషవేళకు పూర్వమే నిదురలేచి, నిత్యకృత్యములను ముగించుకొని, సూర్యోదయాత్పూర్వమే రాజప్రాసాదం చేరుకొనేవాడు. స్నానగృహంలో తగు ఏర్పాట్లు గావించి, ద్వార ఘంటికను నొక్కి, రాజును మేల్కొల్పి ముఖమార్జనంలో తోడ్పడి, వేడి తేనీరు అందించేవాడు. తేనీరు సేవించి రాజుగారు సుఖాసీనులైన వెంటనే ప్రభాత కార్య ప్రణాలిని నివేదించి, సాంసదీయవ్యవహారసచివుడు సమర్పించిన తాలికను ఆయన ముందుంచేవాడు. ఆ తరువాత యజమానిని స్నాతుని గావించి, వస్త్రధారణలో తోడ్పడి స్వాదిష్ఠమైన అల్పాహారాన్ని ఆరగింపజేసేవాడు. అది ముగిసిన వెంటనే, ప్రభులవారిని తోరణద్వారానికి తోడ్కొనివెళ్ళి ఈనాటి 'మర్సిడెస్ బెన్జ్'కు ఏమాత్రం తీసిపోని రథాన్ని అధిరోహింప జేసేవాడు. అనిలజవాశ్వములు పూన్చిన రథానికి తానే సారథిగా వ్యవహరించేవాడు. రాజ్యవిధాన పరిషత్తు దిశలో తేరువును పోనిస్తూ మధ్యేమార్గంలో ప్రజానేతల, ప్రధానాధికారుల గుణదోషాలను పేరుపేరున వివరించేవాడు.

ఆనాడు, ప్రత్యేకంగా సర్వసేనాధిపతియైన ప్రేమనయనుని హ్రస్వదృష్టిని ప్రభువుల దృష్టికి తేవడమే కాకుండా, మరో సర్వసేనాధిపతి యల్లమనాయుడు సమర్థుడైనా విశ్వసనీయుడు కాడన్న సంగతి గుర్తుచేశాడు. జయనాథుడు వేతనోన్నతికి అన్ని విధాలా అర్హుడని సిఫారసు చేశాడు.

పరిషత్తు సమావేశమయ్యే అవధిలో రాజభవన ప్రాంగణంలో రథాన్ని నిల్పి క్రిందకు దిగి, తలుపులు తెరచి, అవరోహణంలో కైదండనిచ్చి పరిషద్భవనాన్ని చేరుకొనే వరకు అనుగమించేవాడు. ప్రాసాదంలోని ప్రత్యేక కక్ష్యలో ప్రభువులు అసీనులైన వెంటనే ఆసనం వెనుక అప్రమత్తుడై నిలిచి వచ్చిపోయేవాళ్ళ కదలికల్ని సూక్ష్మంగా గమనించేవాడు.

ప్రప్రథమం ప్రధానామాత్యులు ప్రభువులను సందర్శించి రాజ్యవ్యవహారాలను వివరించేవాడు. ఆ తరువాత అన్యమంత్రులూ, సేనాపతులూ, ఉపసేనాపతులూ, రాజదూతలూ, మాండలికులూ, గుప్తచరులూ యథోచితంగా స్థానాపన్నులైన మీదట వివిధ శాఖలనుంచి వచ్చే ప్రతిపాదనలను ప్రభువులవారు వినేవారు.

అవసరమనిపించిన వేళ చర్చించడంగాని, సలహాలు తీసుకొనడంగాని చేసేవాడు. ఇందులో ప్రధానామాత్యులకు ప్రముఖ్యపాత్ర వున్నా, ముఖ్యమైన నిర్ణయాలు తీసికొనేవేళ ప్రభువులు పద్మసింహుని వైపు చూసేవారు. కర్తవ్యాకర్తవ్యాన్ని స్వామిభక్తుడు చూపులతో సూచించేవాడు. ప్రభువులవారు చాలా సందర్భాలలో మౌనసూచనలను స్వీకరించేవాడు. తర్కవిసంగత మనిపించిన వేళ ఖాతరు చేసేవాడుకాదు.

ప్రభాతసమావేశం ఇలా ముగిసేది. రథారూఢుడై గృహోన్ముఖుడౌతూ, మార్గమధ్యంలో రాజు పద్మసింహునితో ప్రశాసకీయనిర్ణయాలను, (నేటి కంపెని అధ్యక్షులు కారుడ్రైవరుతో సమీక్షించే శైలిలో) సమీక్షించేవాడు.

పద్మసింహుడు మధ్యాహ్న భోజనం అయ్యాక, రాజుగారిని శయన కక్ష్యలోకి ప్రవేశపెట్టి, తాను ఇంటికి వెళ్ళి, నిమిషాల్లో భోజనం ముగించుకొని, విధులకు తిరిగి హాజరయ్యేవాడు. స్వల్పవిశ్రాంతి నిమిత్తం నిదురోతున్న ప్రభువులను లేపి సాయం సమావేశానికి సన్నద్ధుల్ని చేసేవాడు.

సాయంకార్యక్రమాలకు యజమానితో వెళ్ళేవాడు లేదా రాణీగారు విహారార్థం వెళ్ళిన వేళ, ఆమెకు అంగరక్షకునిగా తన విధ్యుక్తధర్మాన్ని నెరవేర్చేవాడు.

ప్రభులవారు రాత్రి భోజనం ముగించుకున్నాక, మరుసటి రోజు కార్యక్రమ నిర్ణయంలో అన్నివిధాలా తోడ్పడి, రాత్రి బాగా పొద్దుపోయాక ఇంటికి చేరుకునేవాడు అన్ని ఋతువుల్లో, ఉభయసంధ్యల్లో యజమానిని నీడలా అనుసరిస్తూ అన్ని పనులు శ్రద్ధాభక్తులతో చేసేవాడు.

మరి ప్రధానామాత్యులైన రామశర్మ పరిషత్తు సమావేశమయ్యే రోజుల్లో తప్ప, ప్రభువులవారిని తరుచుగా సందర్శించేవారు కాదు. ప్రతి సమావేశం నిమిషాల్లో ముగిసేది. అమాత్యులవారు ఇతరత్రా వ్యగ్రులై వుండేవారు - ఆయనంటే రాజుకు ఎనలేని గౌరవం.

రాజుగారు పద్మసింహుణ్ణి తన బహిఃప్రాణంగా ఎంచేవాడు.

కొంతకాలం, ఇదంతా సాఫీగానే జరిగిపోయింది. ఇంతగా ప్రభువుల్ని సేవించినా, పద్మసింహునికి తగిన ప్రతిఫలం తనకు అందడంలేదనే భావన మనస్సులో నాటి క్రమంగా వృద్ధిచెందసాగింది. తాను అందిస్తున్న సేవలతో పోల్చినప్పుడు ఈ ఉన్నతాధికారులు, తుదకు ప్రధానామాత్యులవారి సేవ లేపాటివని లోలోన వాపోతుండేవాడు.

ఏదో ఒకరోజు ఉదయం ప్రభువులు టీ ఆస్వాదిస్తున్న వేళ తన వ్యథను వెళ్ళబోస్తూ ఇలా అన్నాడు. "మహారాజుల వారికి సేవకుడొనర్చు విన్నపము. ప్రభువుల సేవలో దినమునకు పదహారు గంటలుంటున్నాను. ప్రధానామాత్యుల వారు స్వీయ హర్మ్యంలో భర్మడోలికలలో నూగుతూ సంగీతం వింటూనో, కథాపురాణకావ్య శ్రవణంలోనో, మృగయా వినోదంలోనో ఉంటారు. ఎప్పుడోగాని ప్రభువుల దర్శనానికిరారు. ఎల్లవేళలూ మిమ్మల్ని నీడలా అనుసరిస్తూ క్షణం విశ్రాంతినెరుగను. ప్రధానామాత్యులవారి మాసవేతనం ఇరువదిరెండువేల నిష్కములు. సేవకునకు ముట్టే ప్రతిఫలం మూడువేల ఐదువందల రూప్యములు మాత్రమే. ఇది న్యాయమా? ఏలినవారు విచారించవలె!"

ఇలా అని పద్మసింహుడు తూష్ణీంభావమును వహించాడు. అతని విన్నపము రాజుకు వినోదంతోపాటు అమితాశ్చర్యాన్ని కలిగించినవి. ఓదార్చే ధోరణిలో ప్రభువులవారు ఇలా అన్నారు. "పద్మసింహా! నీవు ముఖ్యమూ అత్యంత జటిలమూ అయిన ప్రశ్నను లేవనెత్తావు. ఆలోచించుటకు మాకు సమయమీయవలె".

పద్మసింహుడు 'సరే' అని తలను పంకించాడు.

రాజుగారు దీర్ఘాలోచనలో పడిపోయారు. తన పరిదేవన ఫలవంతమౌతుందనే పద్మసింహుడు ఊహించాడు. వారంరోజులు గడిచాయి. ఎక్కడ వేసిన గొంగలి వేసిన చోటనే వుంది. రాజుగారు తన గోడును విస్మరించారనే నిర్ణయానికి వచ్చాడు - అయితే రాజావారు ఏనుగలాగా దేనిని విస్మరించరు. తనదైన ప్రత్యేకశైలిలో సమస్యలను పరిష్కరించేవారు.

---

ఓ కథ వుంది : An elephant never forgets.

అనువాదకుడు

ఒకనాడు గోపీనాథవర్మమహారాజులు ప్రాసాదం చివరిమజిలీలోని గవాక్షం దగ్గర నిలిచివున్నారు. రాజభవనానికి అరకిలోమీటరు దూరంలో విశాలమైన మైదానం వుంది. వార్షికసైనికవిన్యాసం, ఇతర ధార్మికసాంస్కృతికకార్యక్రమాలైనా అక్కడే జరిగేవి. ఆ మైదానంలో ఇటీవలె వేయబడిన వంద గుడారాలు ఆయన దృష్టిని ఆకర్షించాయి. జరుగుతున్నదేదో అర్థంకాక పద్మసింహుణ్ణి పిలిచి ఇలా అన్నాడు.

"అది ఏమిటో వెళ్ళి కనుక్కో!"

"చిత్తం".

పద్మసింహుడు పరుగెత్తుకుంటూ వెళ్ళి అక్కడ జరుగుతున్నదేమిటో చూచి తిరిగివచ్చి ఇలా విన్నవించుకున్నాడు.

"అవి విదేశీయులవి ప్రభూ".

"విదేశీయులంటే ఎవరు?" వెళ్ళి కనుక్కో.

"చిత్తం".

పద్మసింహుడు తిరిగివచ్చి "పారసీక దేశీయులు ప్రభూ!"

"అలాగా! ఎంతమంది వున్నారో, వెళ్ళిచూచిరా!"

"చిత్తం".

పద్మసింహుడు తిరిగివచ్చి "ఆరువందల దబ్బయిమంది ప్రభూ!"

"స్త్రీ లెందరో?"

"చిత్తం".

"రెండువందల పైచిలుకు స్త్రీలు మహారాజా!"

ప్రభువులు ప్రశ్నించటం పద్మసింహుడు పరుగులుదీయటం ఇంతటితో ముగియలేదు.

"పిల్లలెంతమంది?"

"చిత్తం".

"వాళ్ళెందుకని వచ్చినట్లు?"

"చిత్తం".

"ఎక్కడి నుండి ఎక్కడికి వెడుతున్నారు?"

"చిత్తం".

"వాళ్ళ ప్రముఖుడెవరు"?

"చిత్తం. కనుక్కుంటాను".

అక్షయతూణీరం నుండి వెడలే శరపరంపరలా ప్రశ్నలు. కొండంత దూరంలో సమాధానాల గాలింతలు – ఇదీ వరుస. పద్మసింహుడు బడలిక చెందాడు. 'ఇలా ఒకటి తరువాత మరోప్రశ్న వేసేకన్న ఒకేమారు ప్రశ్నలు గుప్పిస్తే? ఇలా ఆలోచించడం ప్రభువులవారి యెడ అన్యాయమౌతుంది ఏళ్ళుపడేకొద్దీ ఎంతటి కూశాగ్రబుద్ధియైనా దీర్ఘసూత్రుడౌతాడు!'

ఇలా ఆలోచిస్తున్నవేళ రాజావారి సందర్శనార్థం రామశర్మ ప్రధానామాత్యులవారు వేంచేశారు. మహారాజు చిరునవ్వుతో ఆహ్వానిస్తూ ఇలా అన్నారు. "మహామాత్యా! సైనిక విన్యాసం జరిగే మైదానంలో ఏమి జరుగుతున్నదో కనుకుంటారా? పాపం మా పద్మసింహుడు ఉరుకులు పరుగులతో బహు ఆయాసపడుతున్నాడు."

"చిత్తం! అలాగే చేస్తాను. నేనో ముఖ్య విషయాన్ని నివేదించటానికి ప్రభువుల దర్శనం అభిలషించాను. మన పొరుగు రాజు పోయే వింతపోకడల్ని వివరించాక, మీ ఆజ్ఞానుసారం సమాచారాన్ని సేకరించి నివేదించుకుంటాను."

ఓ పది నిమిషాల్లో మంతనం ముగిసింది.

ఈ దర్మిలా పద్మసింహుడు పసిడి ఊహల్లో పడిపోయాడు.

'రామశర్మగారి నత్తనడక ఇక మొదలవుతుంది. రాజుగారు కోరిన సమాచారం అందించడానికి ఇతగాడికి మాసమైనా పడుతుంది. నిమిషాల్లో ఏదీ తెమలదు. కర్ర విరుగుతుంది; పాము నడ్డి విరుగదు. కూర్మానికీ, కురంగానికీ మధ్యగల తేడా ఇక ప్రభువులు గమనించగల్గుతారు.'

ప్రధానామాత్యులు రామశర్మ ప్రభువులనుండి సెలవు తీసికొని ప్రాసాదం నుండి నిష్క్రమించారు. వెళ్ళి, ఎంతో సేపయ్యింది. ఆయన గారి జాడేలేదు. ఆలస్యం అవుతున్నకొలది, పద్మసింహుడు తెగ మురిసిపోతున్నాడు. పద్మసింహుని అంచనాలను తారుమారు గావిస్తూ ఎంతో పొద్దుపోయాక, అమాత్యమహోదయులు రానేవచ్చారు.

ప్రభువుల వారికి ఇలా విన్నవించుకొన్నాడు.

"మహారాజా! మీరు గమనించినవి పారసీక దేశీయుల గుడారాలు. ఆ దేశపు ప్రభువులైన అల్-అవ్వల్ ద్వితీయుల తరుపున ఇక్కడి రాజకీయ పరిస్థితిని, ఆర్థిక అవకాశాల్ని అంచనావేయటానికి ప్రతినిధి బృందం వచ్చింది. ఇందులో మొత్తం ఆరువందల డబ్బయిమంది వున్నారు. స్త్రీలు రెండువందల పైచిలుకయితే పిల్లలు డబ్బయి. ఆరుగురు మహిళలు అంతర్వత్నులు. - అందులో ఇద్దరు ప్రసవవేదనలో ఉన్నారు. మన రాజ వైద్యుని మంత్రసానుల్ని పంపవల్సిందిగా ఆదేశించాను."

"ఈ ప్రతినిధి బృందంలో వణిక్పుంగవులతోపాటు సేనాధికారులున్నారు. సర్వేక్షణ సిబ్బంది వుంది! గాంధార దేశం నుండి పర్యటన నారంభించి కాంభోజ, పురుషపుర, పంచనద, కురు, పాంచాల, రాజస్థాన, ఘూర్జర, మహారాష్ట్ర దేశాల సందర్శించి ఇక్కడకు వచ్చింది. ఈ పర్యటనలో ప్రతి దేశానికి సంబంధించిన భౌగోళిక, రాజకీయ, అర్థవ్యవస్థీయ సర్వేక్షణ జరిపి దస్తావేజు సిద్ధం చేసుకొన్నారు."

"మహారాజా! ఆ దస్తావేజు ప్రతిని ప్రభువుల వారికి సమర్పించుకొని మన రాజ్యంతో ఎగుమతి దిగుమతి విషయంలో ఒప్పందం కుదుర్చుకొనడానికి మనీషను వెలిబుచ్చారు. విక్రయార్థం సుమారు ఏబదిటన్నుల శుష్కఫలాల్ని ఒంటెల మూపులకు కట్టి తీసుకొనివచ్చారు - ఇరువది శాతం తగ్గింపు ధరకు ఆ మొత్తాన్ని కొనుగోలు చేశాను. అంతేగాదు - రెండువేల జవనాశ్వాలను ఏబది నిష్కములకొకటి చొప్పున విక్రయించుటకు ప్రతిబృందం తన సంసిద్ధతను తెలిపింది. ఇంకోముఖ్యమైన విషయం ప్రభూ!

---

★[1]కంధార్ ★[2]పెశావర్ ★[3]పంజాబ్ ★[4]గుజరాత్ ★[5]Enonomic Survey

రాజు సునీలవర్మ, వీటిని కొనగోలు చేసి, మనను జయించగలనన్న ధీమాతో మన రాజ్యంపై దండెత్తనున్నాడని చారులు సమాచారం అందించారు. ఈ అశ్వాలతోపాటు ముగ్గురు అశ్వశిక్షకులను పారసీకులు ఉచితంగా పంపడానికి అంగీకరించినట్లు తాజావార్త.''

''అశ్వవర్తక ప్రముఖుడైన జనాబ్ అల్ హాశ్మీతో చర్యలు జరిపి మూడువందల నిష్కాల మినహాయింపుపై సునీలవర్మకు అమ్మజూపిన ఈ రెండువేల అశ్వాల్ని మహారాజావారు ఆమోదించినమీద కొనగోలు చేసి, అశ్వదళానికి బలం చేకూర్చి శ్రీ సునీలవర్మను మనతో సంధి చేసికొనేలా చేయాలని నా యోచన.''

''ఆంధ్రావని నుండి, కాంచీపురం నుండి, స్వర్ణాభరణాల్ని, రత్నాల్ని, మంచి ముత్యాల్ని ఖరీదు చేయనున్నామని వర్తకులు తెలిపినపుడు మన నవనాథపురంలో, శీతకాలీన ఉపరాజధానియైన రత్నపురంలో అందంలో, మన్నికలో వాటిని మించినవి కలవని నచ్చజెప్పి మన నైగమనేత యైన ధనశ్రేష్ఠితో వారు సమావేశమయ్యేందకు తగు ఏర్పాట్లు గావించాను. మహారాజావారు సమ్మతించిన పక్షంలో మన తరపున ఓ ప్రతినిధి బృందాన్ని అమూల్యధాతుయుక్తసార్థంతో, ఒకవేయిపదిహేనువందల ధేనువులతో పంపాలని యోచిస్తున్నాను. వాయవ్యదేశాలతో దౌత్యసంబంధాలు ఏర్పర్చుకొనవలసిన అవసరం ఎంతైనా వుంది. దేవః ప్రమాణమ్!''


''మహారాజా! పారసీక ప్రతినిధి బృందం నజరానాలనుగొని దేవరవారిని దర్శించటానికి వేచియుంది. రేపు ఉదయంగాని, ఎల్లుండి సాయంత్రంగాని మీ వీలునుపట్టి సమయం కేటాయించవచ్చు. తగిన భద్రతావ్యవస్థ కావించవలసినదిగా సేనాపతి బినయమానుణ్ణి ఆదేశించడమైనది. అతిథుల మనోరంజనార్థం ఈనాటి రాత్రి సాంస్కృతిక కార్యక్రమం.''

''ప్రభూ! మరిచాను. ఆ ప్రతినిధి బృందంలో ఓ మహాకవి కూడా ఉన్నాడు. ఋగ్వేదాన్ని భగవద్గీతను మన ఆస్థాన విద్వాంసులైన అజీత్‌నాథుని సహాయంతో, ఇక్కడ కొన్ని రోజులుండి పారసీక భాషలోనికి అనువదించాలని కోరగా అతడు సంతోషంతో అంగీకరించాడు. ఆయన అతిథి కక్ష్యలో ఆస్థాన విద్వాంసునితోపాటు తమ సందర్శనార్థం వేచియున్నారు.

''కోదోషః. ప్రవేశ్యతామ్''. అంటూ రాజావారు ప్రతిహారుణ్ణి ఆదేశించారు.

మహారాజు పద్మసింహునివైపు చూసి ఇలా అన్నాడు. "పద్మసింహా! గ్రహించావా?"

'చిత్తం' అంటూ ప్రభువులకు ప్రధానామాత్యులకు పద్మసింహుడు నతదేహుడై అభివాదం చేశాడు. క్షణమాగి ఇలా విన్నవించుకున్నాడు. "మహారాజా! మీరు నాకు తగిన గుణపాఠం చెప్పారు. చెప్పిన మేరకే చేయడంకాక తదనుషంగికమైన కర్తవ్యాన్ని ఆచరించి సంభావ్య పరిణామాన్ని ఊహించగలగడం కార్యకుశలుని లక్షణం".



పద్మసింహునకు జ్ఞానోదయమైనందుకు రాజావారు సంతోషిస్తూ ఇలా అన్నారు. "భేష్ - బాగా చెప్పావు. అంచనా వేయండి. శ్రేష్ఠతా శిఖరాల్ని అధిరోహించండి. మహామాత్యా! మేము మీకెంతో ఋణపడి వున్నాము".

ప్రభువుల సెలవు కోరుతూ, రామశర్మ మహామాత్యులవారు ఇలా అన్నారు. "మహారాజా! మన పద్మసింహుని కర్తవ్యపరాయణత్వాన్ని పరిగణనలోనికి తీసికొని, సిఫారసు చేయటానికి అనుమతి వేడుతున్నాను. భద్రతాదళాధిపతిగా ఉన్నతిని ప్రసాదించి సంచాలకునికి నిర్దేశింపబడిన వేతన శ్రేణిని అనుగ్రహించుటకై ప్రభువులు అంగీకరింపవలె".

ఈ ప్రతిపాదనకు తన ఆమోదాన్ని తెలుపుతూ రాజావారు పద్మసింహుని చేరబిలిచారు.

పద్మసింహుడు పరుగెత్తి వెళ్ళకుండా, ఠీవిగా నడచి రాజావారిముందర నిలిచాడు. రాజుగారు ఇలా అన్నారు; "మహామాత్యుల సలహా మేరకు నిన్ను భద్రతాదళాధిపతిగా నియమించుచున్నాము".

ఇది రెండవ గుణపాఠమని ఆలోచిస్తున్న పద్మసింహుని మహామాత్యులు అభినందించారు.

మహామాత్యునికి పద్మసింహుని సాశ్రునయనాలే కృతజ్ఞతను తెలుపుకొన్నవి.

**అంచనా సామర్థ్యం దూరదర్శియైననేత లక్షణం.**

---

కార్యేకర్మణి నిర్దిష్టే, యో బహూన్యపి సాధయేత్
పూర్వకార్యాఽ విరోధేన స కార్యంకర్తు మర్హతి.
(రామాయణం - సుందరకాండం)

# 5. అందినద్రాక్షలు

( రామశాస్త్రి : ముగ్గురు అబ్బాయిల కథ )

రామశాస్త్రి మధ్యమవర్గీయకుటుంబీకుడు. పితృపైతమహంగా ఆయనకు సంక్రమించిన ఆస్తి మూడు ఎకరాల మాగాణి. పది ఎకరాల మెట్టభూమి. వీటితోపాటు ఓ పెంకుటిల్లు. ఆయనకు ముగ్గురు కొడుకులు. వచ్చే ఆదాయం కుటుంబ భరణ పోషణకు సరిపోయేది కాదు. పెద్దబ్బాయి రాధాకృష్ణను ఇంజనీరింగ్ చదవడానికి పట్నం పంపించారు. రామశాస్త్రి బహుపొదుపరి. దమ్మిడీ అయినా వృథాగా ఖర్చుచేసేవాడుకాదు. ఆయన సహధర్మచారిణి సీతమ్మ. భర్తకు అన్ని విధాలా అనుకూలవతి. పిల్లల అవసరాల్ని తీర్చటంలో స్వసుఖం గురించి ఆ దంపతులు ఏనాడూ ఆలోచించలేదు. రామశాస్త్రి అనేవాడు: అవసరాలు విత్తనాలవంటివి. విలాసాలు కలపటాలు. కలపటాల్ని ఏరివేసి, విత్తనాల్ని కాపాడుకోవాలి.

తండ్రిగారి పరిస్థితి, ఆలోచనా విధానం, పిల్లలకు అర్థమయ్యేదికాదు. వారి ముద్దూముచ్చట్లూ ఏవీ తీరకపోయేసరికి, కొంచెం అసంతృప్తితో కనబడేవారు. పల్లెకో, పట్నానికో పోవటం, అటుంచి, దీపావళినాడు టపాకాయలు కాల్చటానికి దొరికేవికావు. తీపి పదార్థాలా? తీయని ఊహలై లేత హృదయాలను అస్తమానం వేధించేవి. అప్పుడప్పుడు తల్లితో తమ్మునితో మధ్యముడైన నారాయణుడు తన అసంతృప్తిని మాటల్లో వెల్లడించేవాడు.

వాళ్ళ ముద్దుముచ్చట్లు తీర్చలేకున్నా, పిల్లలయెడ దంపతులు అతిస్నేహం కనబరిచేవారు. రామశాస్త్రికి మృదుస్వభావుడైన జ్యేష్ఠుని మీద ఎక్కువ అభిమానం. అందుచేత, మిగతా ఇద్దరు తమను ఎవరూ పట్టించుకొనడం లేదని లోలోన వాపోయేవారు. ఒకనాడు బుద్ధిలో అపర బృహస్పతియైన నారాయణ హాస్యవ్యంగాల్ని మేళవిస్తూ తండ్రితో ఇలా అన్నాడు. "అన్నా! పొదుపరులలో నిన్ను మించిన ఘనుడు లేడు".

వరుసగా మూడు సంవత్సరాలు మంథిని, దానితోపాటు ఉత్తర తెలంగాణాప్రాంతం కరువు కోరల్లో చిక్కుకున్నవి. మనుగడ నానాటికి ప్రశ్నార్థకమైపోయింది. 'పిల్లల్ని వెంటేసుకుని మహారాష్ట్రకు సంచారార్థ వెళ్ళడమే మేలని' సీతమ్మ భర్తకు హితవుపలికింది. - ఆమె సలహా ఎంతగానో నచ్చి రామశాస్త్రి నారాయణ, అమర్‌నాథ్‌లతో ఓ మంచిముహూర్తాన స్వగ్రామం వదిలాడు.

---

మంథిని వైదిక కుటుంబాల్లో తండ్రిని 'అన్న' అనే పిలుస్తారు. ఏకవచన ప్రయోగం మామూలే. ఆజీవికకు మహారాష్ట్రను ఆశ్రయించేవారు కనుక భాషలో మరాఠీ పదాలు దొరలుతాయి.

ఒకరాత్రీ, ఒక పగలూ ప్రయాణం చేసి, శాస్త్రిగారు ఇద్దరు పిల్లలతో నాసిక్ చేరుకున్నారు. బస్‌స్టాండ్‌లో 'అంగూర్ ఘ్యా' అంటూ పళ్ళమ్మేవారు అరుస్తున్నారు. ద్రాక్షల మాట చెవిని పడగానే కడగొట్టువాడైన అమర్‌నాథ్‌కు నోరూరింది. నారాయణకు తన కోరికను ఎరిగించాడు. 'లాభంలేదని' తమ్ముణ్ణి సముదాయిస్తూనే తండ్రితో ఇలా అన్నాడు. "అన్నా! వీడు అంగూర్లు కావాలంటున్నాడు".



రామశాస్త్రి అన్నాడు "నారాయణా! ఏధరకిస్తారో తెలుసుకో"

నారాయణ బస్సు దిగి వెలను తెలుసుకొని కొంచెం ఉత్సాహం కనబరుస్తూ ఇలా అన్నాడు. "అన్నా! చాల అగ్గువ. ఎనిమిది వీసాలకు సేరట".

"అగ్గువనా?.... ఏంవద్దు" అన్నాడు రామశాస్త్రి.

'నామాట విన్నావుకాదు' అనే భావం వ్యక్తమయ్యేలా నారాయణ తమ్మునికేసి చురచుర చూశాడు. బస్సు ఎక్కేముందు ఇలా అన్నాడు. "తమ్మీ! అంగూర్లు పుల్లన".

చూస్తూచూస్తూ, ఓ సంవత్సరం గడిచిపోయింది. ముగ్గురు కష్టపడి పనిచేశారు. రామశాస్త్రి పిల్లలను కంటిరెప్పలా చూసుకున్నాడు. వాళ్ళకు రెండుపూటలు తిండిపెట్టి, తాను రాత్రి మంచినీళ్ళతోనే సరిపెట్టుకొనేవాడు. అదృష్టదేవత అనుగ్రహించిన కారణాన నాల్గుడబ్బులు సంపాదించుకొనగలిగారు. సంచారం ముగించుకొన్నారు.

తిరుగుప్రయాణంలో అదే నాసిక్ బస్‌స్టాండ్... 'అంగూర్ ఘ్యా' అంటూ అవే అరుపులు. చెవినిపడినా పిల్లలు పెద్దగా పట్టించుకొనలేదు. 'అంగూర్లుకావాల్రా?' అడిగాడు రామశాస్త్రి. తండ్రి స్వభావం అర్థమైన అమర్‌నాథ్ అన్నాడు "ఊహూఁ.... అంత ధర పెట్టలేం". రామశాస్త్రి నవ్వుతూ అన్నాడు. "నారాయణా! బస్సు దిగి ఎంత కిస్తారో కనుక్కో!" నారాయణ తిరిగివచ్చి ఎంతో ప్రియంగా అమ్ముతున్నారని తండ్రికి చెప్పాడు. రామశాస్త్రి ప్రకరణాన్ని అంతటితో ముగించకుండా 'ఏ వెలకు అమ్ముతున్నారో' అడిగాడు. "నాలుగు రూపాయలకు సేరు" నారాయణ తడుముకోకుండా జవాబిచ్చాడు.

రామశాస్త్రి ఈసారి ఏమాత్రం సంకోచించలేదు. 'ఎక్కువ ఏమీకాదు. సస్తా' అంటూ బస్సుదిగి, రెండు సేర్లు కొనడమే కాకుండా, శాస్త్రి గారు పదిపది తులాల రెండు పొట్లాలను తెచ్చి, పిల్లలకు చవిచూడడానికి మాసరగా ఇచ్చాడు.

అందని ద్రాక్షపండ్లు అందిన సంతోషంతో అమర్‌నాథ్ తండ్రితో ఇలా అన్నాడు. "అన్నా! ఎనిమిది వీసాలంటే ప్రియం. - నాలుగు రూపాయలంటే సస్తానా?"

---

నిజాం కాలంనాటి తెలంగాణా మాండలిక పదాలు.
వీసాలు = అణాలు సస్తా = చౌక సేరు = కిలోకన్న కొంచెం తక్కువ
ఘ్యా = తీసుకొండి.

నర్మగర్భంగా పలికిన అమర్‌నాథ్ మాటకు లోలోన మురిసిపోతూ, రామశాస్త్రి ఇలా అన్నాడు. "పిల్లలూ! ఏది ప్రియమో, ఏది సస్తానో ధరను పట్టి ఉండదు. కొనగలిగే చేవనుపట్టి ఉంటుంది. మనం కొనలేనిది ప్రియం; కొనగలిగేది సస్తా. చేతిలో పైసా వుంటే ఇంద్రుని ఏనుగునైనా కొనగలుగుతాం - అవసరాలకు సరిపోయేంత లేనివాడు పిడికిలి మూయడమే మంచిది. మన దగ్గర పైసా వున్నది. పట్టినన్ని అంగూర్లు తినండి"

అమర్‌నాథ్ అన్నాడు "అన్నా! అంగూర్లు తియ్యగావున్నాయి.

అందని ద్రాక్షలు పుల్లన; అందితే అమృతోపమం
మనసుయుంటే వస్తుసిద్ధి; కాలం కలిసిరానివేళ ఊహలకు కళ్లెం వేయాలి.

★[1]పైసా=డబ్బు హిందీ, మరాఠీపదం ★[2]అంగూర్=ద్రాక్షలు హిందీ, మరాఠీ పదం

# 6. సంవాదసౌఖ్యం

( మత్తేభం - మానవుడి కథ )

'రాముూ' అనే పేరుగల ఓ గజపోతాన్ని కర్నాటకలోని 'మలయమాలేశ్వర బెట్టం' అడవిలో పట్టుకొని లండన్‌లోని కేంద్రప్రాణిసంగ్రహాలయానికి, భారతీయ బాలల తరఫున ఆంగ్ల బాలలకు బహుమతిగా పంపించారు. ప్రాణిసంగ్రహాలయంలో కాలూనినవేళ, రాముూ అందంగా బొద్దుగావుండి 'జూ' అధికారుల్ని ఎంతగానో అలరించింది. వారాంతాలు పార్కుకు వచ్చే పిల్లలకు 'గొప్ప ఆకర్షణ' అవుతుందని వాళ్ళు ఊహించారు.

రామూను మచ్చిక చేసుకొనటానికి సిబ్బంది ఎంతో ఇబ్బంది పడింది. బ్రిటిష్‌వాళ్ళు ఇంగ్లీషు మాట్లాడేతీరు దాన్ని అయోమయంలో పడేసింది. పిచ్చెక్కినంత పని అయి, మేతా నీళ్ళూ మానేసి బాగా చిక్కిపోయింది. ఓ వారం తరువాత, అది చేసే మారాము భరించరానిదయ్యింది. ఇటూ అటూ పరుగులు తీయడం, గీపెట్టడం చేసింది. పళ్ళూ, బీటుదుంపలూ ఇచ్చి చూశారు - ఫలితం శూన్యం.

ఏమీ పాలుపోని అధికారులు చివరకు పశువైద్యుణ్ణి పిలిపించుకున్నారు. ఆయన ఏనుగు పిల్లను నిదానించి 'లాభంలేదని' పెదవి విరిచారు. 'పిచ్చెక్కిందని, కాల్చేయడం తప్ప పర్యాయం లేద'ని దీర్ఘానుభవంగల ఆ బుద్ధిమంతుడు సలహా ఇచ్చాడు.

సంచాలకులైన జేకబ్‌జార్జ్, ప్రముఖ పశువైద్యుడైన డా॥ క్రూడ్‌మన్ సలహాను పాటించి సిబ్బందికి తగు ఆదేశాన్ని ఇవ్వాలనుకొంటున్నవేళ, సంగ్రహాలయ మాజీ సంచాలకులైన శ్రీ నార్మన్‌గుడ్‌మన్, తను పనిచేసిన స్థలాన్ని సందర్శించి, తనతో పనిచేసిన వాళ్ళని పలుకరించాలన్న సద్భావనతో అక్కడికి వచ్చారు. ముప్ఫయి ఏళ్ళ పూర్వం ఆయన భారత్‌లో రెండేళ్ళపాటు వున్నాడు.

జేకబ్‌జార్జ్ నార్మన్‌గుడ్‌మన్‌ను సాదరంగా ఆహ్వానించి తను ప్రస్తుతం ఎదురుకుంటున్న సమస్యను విడమరచి చెప్పాడు. నార్మన్, శ్రీ జేకబ్‌కు తొందరపాటు పనికిరాదని సలహా ఇస్తూ ఇలా అన్నాడు. "నిదానంలోనూ నిదానమే ప్రధానం - క్షణపరీక్షతో ఓ నిండుప్రాణిని ఇహలోకజీవనానికి అర్హతలేనిదానిగా ప్రకటించడం ఏమంత సబబయిన పనికాదు. ఆ ఏనుగుపిల్లను నన్నోమారు చూడనివ్వండి".

రాముూ ఉన్నచోటికి వెళ్ళి, దాన్ని "హెలో హీరో! హ వార్వ్యయి" అని పలుకరించాడు. రాముూ మొదట ఏమాత్రం ప్రతిస్పందించలేదు. చెవిలో జొర్రీగ దూరాక గంగ వెర్రులెత్తినదానివలె, ఒక్కపెట్టున గీపెట్టి, ఆలాన బంధవిమోచనానికి పరిప్లవిస్తూ, ఆక్రామక వృత్తిని కనబరుస్తూ తొండాన్ని సాచింది.

'అచ్ఛా అచ్ఛా' అంటూ నార్మన్ వెనక్కి రెండడుగులేసి జేకబ్‌తో ఏవో కబుర్లకు దిగాడు - చిందులేస్తున్న ఏనుగుకూన కాస్త శాంతించింది. నార్మన్ కేసి క్షణంపాటు చూసి, తొండాన్ని వాల్చి మౌనంగా నిలిచింది. ఏమి సోకినదో, మళ్ళీ హంగామాకు దిగింది.

ఇదంతా గమనిస్తున్న నార్మన్‌గుడ్‌మన్ మస్తిష్కంలో ఓ మెరుపు మెరిసింది. ఏండ్ల అనుభవం ఊరికే పోతుందా!

"ఈ 'జూ' కు దీన్ని ఎప్పుడు తెచ్చారు" అడిగాడు నార్మన్.

"పదిరోజుల క్రితం" - జేకబ్ బదులు చెప్పాడు.

"భారత్‌లోని ఏ ప్రాంతంనుంచి?" నార్మన్ అనుబంధ ప్రశ్నవేసాడు.

"దక్షిణభారత్‌లోని కర్ణాటకకు చెందిన అడవి నుంచి".

నార్మన్‌గుడ్‌మన్‌కు పరిస్థితి అర్థమై జేకబ్‌తో ఇలా అన్నాడు. "చెప్పరేం! ఓ పని చేయండి.... ఇన్ఫోటెక్ కంపనీలలో కన్నడిగులను చాలా మందిని చూశాను. ఒకాయన్ని ఇక్కడికి వచ్చేట్టు చేయండి".

జేకబ్ తత్కాలం ఓ ఇద్దరు సిపాయిలను 'శ్రీసాఫ్ట్ ఇన్ఫోటెక్'కు పంపించాడు. దాని సంచాలకుడు శ్రీ అచ్యుత - మైసూరు మహారాజావారి దివానుగారి సుపుత్రుడు.

శ్రీ అచ్యుత ఉత్సాహవంతుడైన యువకుడు. కలుపుగోలు స్వభావం గల మనిషి. వన్యప్రాణి పరిరక్షణలో చాలా ఆసక్తిగల వ్యక్తి. పిలుపునందుకున్న మరుక్షణమే బయలుదేరి జూకు చేరుకున్నాడు. నార్మన్, జేకబ్‌లతో కరచాలనం గావించి, వారి నుండి అన్నీ అడిగి తెలుసుకున్నాడు.

రాముా ఉన్నచోటికి వెళ్ళి, ఎంతో ఆప్యాయతను కనబరుస్తూ "చెన్నగిద్దరా?" అంటూ పలకరించాడు. ఈ మాట చెవిని బడ్డ గజపోతం, చేస్తున్న అకారణతాండవాన్ని ఆపేసి, అచ్యుతకేసి చూస్తూ, చిత్తరువులా నిలిచి, ఘీంకారం మాని, కర్ణపేయమైన ధ్వనులు చేయడం మొదలెట్టింది. అచ్యుత కన్నడకస్తూరిలో "హెదరబేడ - నాను ఇద్దనే" అంటూ బుజ్జగించాడు. నిర్భయంగా దగ్గరకు వెళ్ళి దాని వీపు నిమిరాడు. రాముా అచ్యుత నడుమును పరమస్నేహంతో వాటేసింది. - పైకెత్తి నేలమీద పదిలంగా నిలిపింది. రాముా కళ్ళు చెమర్చినవి మరోమారు వీపుతట్టి అచ్యుత నార్మన్‌తో అన్నాడు. "దీనికి దాహం వేసినట్టుంది. కాసిన్ని నీళ్ళు తెప్పించండి".

సిపాయి నీటితొట్టెను రాముా ముందు వుంచాడు. క్షణంలో తాగేసి అచ్యుత, సర్ నార్మన్‌లతో జలక్రీడకు దిగింది.

అచ్యుత రాముాకు తినడానికి పళ్ళు ఇచ్చాడు. చెవులాడిస్తూ తినేసింది. ఇరువురు కాసేపు ఊసులు చెప్పుకున్నారు. జేకబ్ ఆశ్చర్యంతో నార్మన్‌తో ఇలా అన్నాడు. "సర్ నార్మన్! నమ్మలేకుండా వున్నాను. ఏవిటీ ఈ ఇంద్రజాలం"?

సర్‌నార్మన్ పెద్దగా నవ్వి ఇలా అన్నాడు. "ఇందులో ఏ ఇంద్రజాలం లేదు. రాముాకు ఇంగ్లీషురాదు. బ్రిటీష్‌వాళ్ళు ఇంగ్లీషు మాట్లాడేతీరు అన్యదేశీయులను బెంబేలెత్తేట్టు చేస్తుంది. రాముాకు అర్థమయ్యే భాష కన్నడ".

"చోటు మారినపుడు, మాట మారినపుడు మీరైనా నేనయినా ఇలా ప్రవర్తించడం మామూలే. మాటాడేవాడు లేనపుడు మౌనంగా ఎంతకాలం ఎవడైనా జీవించగలుగుతాడు? పిచ్చెక్కి తైతక్కలాడుతాడు! ఎదుటివాడి భాష మీకర్థంకానప్పుడు మీ పరిస్థితి ఏమౌతుంది?"

సర్‌నార్మన్ మనోవిజ్ఞాన పాండితికి అబ్బురపోతూ "నిజమే" అన్నాడు జేకబ్.

సర్‌నార్మన్ హుందుతనాన్ని కనబరుస్తూ ఇలా అన్నాడు.


"సమిష్టిజీవనానికి సంవాదమే మూలాధారం. మనిషీమనిషికి మధ్య ప్రేమానుబంధాన్ని పాదుకొల్పేది సంవాదమే. సంవాదానికి మాధ్యమం బాషయే!"

---

★[1]క్షేమమా? ★[2]బెదరకు ★[3]నేనున్నాను.

ఇంతవరకూ పెదవి విప్పని అచ్యుత సర్‌నార్మన్‌తో ఏకీభవిస్తూ ఇలా అన్నాడు. "బాగా చెప్పారు. అమ్మ ఒడిలో నేర్చిన భాష అమృతం వంటిది. మాతృదేవతనూ, మాతృదేశాన్ని, మాతృభాషను మించినది మరొకటి లేదు.

ఈ మాట అచ్యుత ఇంగ్లీషులో అని, రాముకై కన్నడలో తర్జుమా చేశాడు.







మాతృభాషయే మాతృదైవత్వం ।।

రాముా హర్షామోదాలతో తల పంకించింది.

సర్‌నార్మన్ రాముా అంగీకారాన్ని అందరి దృష్టికి తెస్తూ, అచ్యుతకు ధన్యవాదాలు తెలుపుకున్న మీదట ఇలా అన్నాడు. "మిస్టర్ అచ్యుత! ఈ జూకు మీరు ప్రతిరోజు సాయంత్రం దయచేసి ఓగంట రాముతో గడపాలి. రాముాకు ఇంగ్లీషు నేర్పించి, ఆదర్శ బ్రిటీష్‌పౌరునిగా దిద్దితీర్చటం మీ బాధ్యత."

భాషయే మనిషీమనిషీకి మధ్య వారధి
మాతృభాషయే మాతృదైవతం

# 7. తుంబురనారదీయం

నారదతుంబురులు బ్రహ్మమానసపుత్రులు. జంత్రగాత్రోద్భవ విమలగాంధర్వ విద్యలో పారమరసినవారు. నారదులు మహతీపాణియైతే, తుంబురుడు కళావతీహస్తుడు. నాదబ్రహ్మోపాసనకు ఈ వీణియలే వారికి నిత్యోపకరణములు; ఆరవ ప్రాణములు కూడా! వీణియలతో విడని నెయ్యాన్ని ఏర్పర్చుకొన్న ధన్యజీవనులు.

★'సరిగమపద'ల ప్రతినియత శ్రుతిక్రమములనెరిగినవారు. లయతాళశుద్ధి కలిగినవారు. తమ నైపుణ్యంతో ముల్లోకాల సమ్మోహింపచేయగల గానపాండితి వారిది.

నారదతుంబురులు నిరంతరవైష్ణవధ్యానతత్పరులు. వైకుంఠవాసునకు వారి ఆగమనము నిత్యహృదయంగమము. ఏవేళ నైనా, ఏఋతువు నైనా, ఎక్కడికి వెళ్ళినా నారదుడు మహతీవాదనంతో పాటు నారాయణ స్మరణం కావించేవాడు. 'నారాయణ' 'నారాయణ'లు ఆయన ఆగమన నిర్గమన సూచకములై లోకాలనలరించేవి.

ఒకనాడు ఇంద్రుని సుధర్మలో, నారదతుంబురులు ఒకరి పిదప నొకరు తమ గానవిద్యాప్రౌఢిమను ప్రదర్శించి శ్రోతల నుతలతోపాటు శచీపతి నుండి విలువైన బహుమతుల నందుకొనినారు. సభాస్థలి వీడి వెలుపలికి వచ్చినవేళ, నారదమహర్షి తుంబురినితో ఇలా అన్నాడు.

"మనను మించిన గానకోవిదులు ముజ్జగాలలో లేరన్న వాస్తవత ఈనాటి శతమఖుని సభలో నిరూపితమైనది. మన ఇద్దరిలో ఎవరధికులో వారు శ్రేష్ఠులనుమాట నిర్వివాదము. జ్యేష్ఠతా దీర్ఘానుభవముల దృష్ట్యా నేను నిన్నుమించిన గాయకుడను ఏమందువు?

అందుకు తుంబురుడు నొచ్చుకున్నవాడై ఇలా బదులు చెప్పాడు. "మునివర్యా! శ్రేష్ఠతను నిర్ధారించుటకు జ్యేష్ఠత నికషోపలము కాజాలదు. ప్రస్తుతీనావీన్యతలు రసికజనమాన్యమానకములు. సంప్రదాయబద్ధమైన శైలిమీయది. సంప్రదాయపరిధిలోనే నవ్యరీతుల సాధించుట నా విశేషత. వయోవృద్ధులైన వీరు నా అనన్యతను గుర్తించవలె".

---

★కళాపూర్ణోదయము.

నారదులు 'తథాహి' అన్నంత, తుంబురులు 'అపిచ' అని స్పందించాడు. 'కాదు' 'ఎందుకు కాదు' చే నిషేధితమైంది. వాదం జల్పానికి దారి తీసింది. జల్పం వితండంగా పరిణమించి, వెర్రితలలు వేసింది. ప్రచ్ఛన్నయుద్ధం ప్రకటిత యుద్ధంగా మారి, సంగీతాభిమానుల హృదయాలలో సంక్షోభం రేపింది.

ఈ కలహప్రరోహణపరివర్ధనపల్లవనాలు ముల్లోకాల్ని సంభ్రమాశ్చర్యాలలో ముంచినవేళ, అసితమహర్షి ఈ వివాదమునకు తెరవేయు నిమిత్తం ఇరువురిని ఒకచోట సమావేశపరిచి 'మీకిది కీర్తికరమా?' అని ముద్దుముద్దుగా మందలించారు. అయినా, ఫలితం లేకపోయింది.

"మా ఇద్దరిలో ఎవరు మేటి యనునది తేలకున్నది." ఇద్దరూ అదేమాట అన్నారు.

అసితమహర్షి ఇంచుకమందహాసాన్ని అధరాల వెలయిస్తూ ఇలా అన్నారు. "ఎన్ని యుగాలు పెనుగులాడినను తేల్చుకొనలేరు. శ్రేష్ఠతానిర్ధారణలో వస్తునిహితబుద్ధి ఆశ్రయణీయం. స్వహితార్థులైన మీకది అసంభవం. వివాద పరిష్కారార్థం ఇంద్రుని అర్థించుటే మేలు."

దీనికి ఉభయులు అంగీకరించి, స్వర్గాధిపతియైన ఇంద్రుని వద్దకు వెళ్ళి ఇలా అన్నారు. "దేవేంద్రా! త్రిభువనాలలో గానపాండితిలో ప్రథమస్థానీయతకు మా ఇరువురిలో ఎవండు యోగ్యుడో మీరే నిర్ణయించవలె".

మహర్షి ద్వయం కావించిన అభ్యర్థనను మహద్భాగ్యంగా ఎంచి, ఇంద్రుడు స్వేతర సప్తదిక్పాలకులను రావించి, వారు యథాయోగ్యమైన ఆసనాలను అలంకరించిన మీదట 'యుగళస్పర్థ' నారంభించవలసినదని కోరినాడు. నారదతుంబురుల అఖండ గానయజ్ఞం పదునొకండు గంటలపాటు సాగినది. ఇంద్రాది దిక్పాలకులు ఏ నిర్ణయానికి రాలేకపోయారు.

తమ అసహాయతను ప్రకటిస్తూ ఏకకంఠంతో ఇలా అన్నారు. "మహర్షులారా! మేము అసమర్థులము. వాగీశుడైన బ్రహ్మను నిర్ణేతగా జేసికొనుడు".

వారి సూచన మేరకే, నలుమోముల విరించిని నారదతుంబురులు వేడుకున్నారు. ఆయన ఇలా అన్నారు. "అస్మత్తనయులైన మీ ఇరువురి యందు నాకు సమదృష్టియే. మాకు మీరిరువునూ ప్రీతిపాత్రులే. నిర్ణేతగా వ్యవహరించవలెననిన నిరీహదృష్టి అవసరము. మార్దంగలయసర్జనలో అసమానుడైన పరమశివుని ప్రార్థించుట యుక్తము".

ఇరువురి విన్నపం అవధరించిన పిమ్మట కరుణాలవాలుడైన శశాంకమౌళి ఇలా అన్నాడు. "మీరిరువురూ ప్రజ్ఞానిధులే. మూల్యాంకనం అపరిహార్యమైన, మీ ఇరువరకు సమానగుణాంక ప్రదానము చేయుటకేమాత్రం సందేహించను. అయినా, జగదధిష్ఠాత్రియైన మీ జనని శారదాంబను వేడుకొనుడు. వాక్కునకూ నాదమునకూ ఆమెయే ఏకమేవ ప్రేరణాస్రోతస్సు కదా!"

వ్యాసవాల్మీకాదికవిబృందసంసేవిత, త్రిలోకపావని యైన వాణి ఇలా అన్నది. "తనయులారా! ఏకోదరులైన మీమధ్య ఏవిధమైన స్పర్థ నా కంగీకారయోగ్యమనిపించదు. సకళకళారాధకులు నా సంతానమే. శ్రీ మహావిష్ణువే నిర్ణేతగా వ్యవహరింప నర్హుడు".

అల వైకుంఠపురంబులో అమృతసరః ప్రాంతేందుకాంతోపలవేదిపై రమాసమేతుడై ఆసీనులై యున్న నారాయణుని ముందునిలిచి, పదభావములు సమముగా మేళవించిన రెండు కీర్తనల ఆలపించారు.

అందుకు సంతసించి నీలనీరదశ్యాముడిలా అన్నాడు. "మీ ఆగమనం మాకు సర్వదా హర్షదాయకం. మీ కోర్కె నెరింగిపుడు".

తుంబురుడన్నాడు. "దేవా! గాన విద్యలో నాకన్న తనే మిన్నయని నారదులవారి అభిప్రాయము. గాంధర్వకళాధిపత్యమున కిరువురము పోటీపడుచున్నాము ఇంద్రాదిదిక్పాలకులు, వాణీవాగీశ్వరులూ, చివరకు తాండవ నృత్యలోలుడైన శివుడు నిర్ణేతలుగా వ్యవహరించుటకు విముఖత చూపినారు మీరలే మాకు అంతిమశరణ్యము".

శ్రీ మహావిష్ణువు ధ్యానమగ్నులైనారు.

కొన్ని క్షణాలకు రమాప్రేరితుడై ఇలా అన్నాడు. "మహతిని మీటుచు గానము చేయునపుడు నారదుడే శ్రేష్ఠతరుడుగా తోచును. కళావతిని మీటుచు పాడునపుడు తుంబురుడు నారదుని మించువాడనిపించును. సంయుక్తవిజేతలుగా ప్రకటింపబడుచో, మీకగల అభ్యంతరమేమి?"

నారదతుంబురులు అనంగీకారద్యోతకమైన తూష్ణీంభావమును వహించినారు. ఉభయులకు హర్షదాయకమైన గెలుపు గెలుపు స్థితికి సంసిద్ధులు కాలేదనునది స్పష్టమైనది. గెలుపు స్వీయార్థం కాంక్షిస్తూ, ఓటమి స్థితిని ప్రత్యర్థికి కోరుకుంటూ, నిర్ణేతగా వ్యవహరించిన విష్ణువు నిర్ణయాన్ని ప్రతీక్షిస్తున్నారు.

అయినా వెన్నుడు ఈ వివాదంలో తటస్థునిగా ఉండదలచి ఇలా అన్నాడు. "బ్రహ్మమానసపుత్రులారా! మీలో ఎవరు శ్రేష్ఠులో నిర్ణయించుటకు అన్నివిధాలా యోగ్యుడైన మహాపురుషుడొకడున్నాడు. మీవలె నా భక్తకోటిలో చేరినవాడు. హిమాలయాలలో ధ్యానసమాధిస్థితుడైన హనుమానుడే ప్రార్థనీయుడు".

నారదతుంబురులు మహర్షులైకూడా సహనాన్ని కోలుపోయారు. 'గానమాధుర్యం వానర మెరంగునా? సురలనూ, నరులనూ, కాదని దేవర్షులమైన మా వివాద పరిష్కారమునకు ఇతడా యోగ్యుడు? శ్రీహరీ!' అంటూ లోలోన వాపోయారు.

ఇరువురు పెదవి విప్పలేదు. వృద్ధవానరుడైన హనుమాడే మహర్షులకు అంతిమ శరణ్యుడైనాడు.

పవనాత్మజుడైన హనుమానుడు ధ్యాన నిమగ్నుడై వున్నాడు. హిమాలయంలోని అన్నపూర్ణ శిఖరంపైని సువిశాల హిమఖండంపై పద్మాసనస్థుడై నిమిలీతనేత్రుడైనాడు. ఎక్కడ చూచినా పచ్చదనం మచ్చుకైనా లేదు. అంతా హిమమయం. రామనామోచ్చారణలో అధరాలు సంవృత వివృతాలవుతున్నాయి. నారదతుంబురులు అనాగసశిశువుల్లా ఆయన ముందు కూర్చుని సమయానికై ప్రతీక్షిస్తున్నారు. మహతీకళావతులను మంచుపై ఉంచినారు.

కొంతవడికి కనులు తెరిచి, ఆంజనేయుడు ఎదుటనున్న మహర్షులను చూచినాడు. పరమానందభరితుడై అంజలి ఘటించి ఇలా అన్నాడు. "నేడు నాకెంతో సుదినము. నిరంతర హరిధ్యాన తత్పరులైన మునులేమి? నాకడకు వచ్చుటేమి? ఏమి చేయవలెనో సెలవీయుడు ఈ హిమశైత్యమును భరించవలసిన ఆగత్యమేమి కల్గినది?"

సమయస్ఫూర్తిగల నారదులవారు ఇలా అన్నారు. "పవనతనయా! ఎన్ని నాళ్ళ నుండియో ఓ చిన్న సమస్య అపరిష్కృతముగా ఉండిపోయినది. గానవిద్యలో, మా ఇరువురిలో ఎవరు శ్రేష్ఠులో తేల్చు విషయంలో మహామహులు నిర్ణేతలుగా వ్యవహరించుట కియ్యకొనలేదు. మిమ్మల్ని అర్థించవలసినదిగా శ్రీహరి మమ్ములను ఆదేశించినాడు".

ఇది విని హనుమానుడు *క్షణార్ధం ఉన్మీలిత నేత్రుడైనాడు. చిరునవ్వును పెదవులపై వెలయిస్తూ కనులు తెరిచారు. మెల్లని స్వరంతో ఇలా అన్నాడు “వైష్ణవ ధ్యానామృత పానలోలులైన మహర్షులారా! స్పర్ధారంభమునకు పూర్వము దేవదేవుని స్మరించుకొందము. మొదట నేను భక్తి గీతమును పాడెదను.”



*క్షణార్ధమన్యుర్భగవాన్ - శ్రీమద్ భాగవతం నవమస్కంధము.
‘క్షణార్ధం’ అనే ప్రయోగం సరైనదే.

నారతుంబురులకు నచ్చకున్నా అంగీకరించారు. 'శాఖాచంక్రమణం వానన్యాయం. శ్రీ మహావిష్ణువునకు అనాకలనీయమైన సూక్ష్మమేమీ కాదు'. ఇలా ఆలోచిస్తూ వాపోయారు.

హనుమానుడు 'రామరామజయ సీతారామా' అంటూ పాడనారంభించాడు. అతని యావద్దేహం, ఇంద్రియగ్రామం, మనోబుద్ధులు పూర్తిగా ఉత్ప్రేరితమైనవి. ఆశయాభివ్యక్తులమధుర సమ్మేళణ నుంచి సచ్చిదానందస్వరూపం రెక్కలు విప్పుకొన్నది. మందరమందరంగా మొదలై, క్రమంగా సాంద్రమౌతూ తారస్థాయి నందుకొంది. సకల చరాచరసృష్టి హనుమానుని రాగనిర్మితికి శ్రుతిలయల నందించినది.

హిమశైత్యాన్ని ఇంచుక విదుల్చుకొని, పరిసరాలు సుఖావహకవోష్ణానుభూతిని పొందినవి. చలిగుబుళ్ళు ప్రిదిలినవి. మేఘయవనికను విదళనం కావిస్తూ, సూర్యుడు ప్రకృతికి స్వర్ణిమల ప్రసాదించసాగాడు. హిమాలయ ప్రాంతంలోని శిశిరాన్ని దూరాలకు పారద్రోలి వసంతుడు తన ఆధిక్యతను చాటుకున్నాడు. గాత్రమే గానంగా పరిణమించింది. మంచు కరిగింది. నీరు సెలయేరై పారి ఓ ఎత్తైన కొండనుంది దొరలుతూ జలపాతమైంది. నింగినుండి హరివిల్లు తొంగిచూచింది. హనుమానుని గానవాహినిలో ప్రకృతి ఆర్ద్రీభూతమైంది. పక్షులు రెక్కలల్లార్చినవి. కీరాలు కలరవాలు గావించినవి. వనమయూరమువోలె పరవశించి, సృష్టి నర్తించ నారంభించినది. తమ ఉనికిని మరచి నారదతుంబురులు హనుమానుని గళంతో, తమ గళాలను మేళవించిన మరుక్షణం వ్యష్టిగానం సమిష్టిగానంగా పరిణతి చెందింది. ఆంశికస్థాయి నుండి ఎదిగి నారదతుంబురులు సంపూర్ణప్రార్థనాస్వరూపాన్ని సంతరించుకొన్నారు. హనుమాన నారదతుంబురులు వేదత్రయానికి ప్రతీకయైన ఓంకార మైనారు. గానం ముందుకు సాగిపోతుంటే, కాలం అలా నిలిచిపోయింది.

మధ్యలోనే, హనుమానుడు హఠాత్తుగా పాట నాపినాడు. జగత్తు గతిశీలతను కోలుపోయింది. ఈ విరామం భరింపరానిదైంది. పక్షులు మటుమాయమైనవి. వసంతుడు మరో మజిలీకి పయనమైనాడు. సూర్యుడు మేఘాల మాటు దాగినాడు. పారే సెలయేరులు, జలపాతాలు హిమీభవించినవి. శిశిరదైత్యుని గుడారాలు యథాపూర్వం అన్ని చోట్ల ప్రత్యక్షమైనవి. హిమం పచ్చదనాన్ని మట్టుపెట్టింది. హిమాలయ సీమ మౌనమరుభూమి యైనది. నారదతుంబురులు కనులు తెరచి మారుతికేసి చూశారు.

తుంబురుడన్నాడు: "పాట నాపితిరేల స్వామీ! పాట నాపి, మమ్ము దివ్యానుభూతికి వివంచితులను చేసినారు".

తుంబురునివలెనే నారదుడు వాపోయాడు.

హనుమాను డన్నాడు: "నాకడకు అరుదెంచిన హేతువునే మహర్షులు మరిచినట్లున్నది. కాలయాపన చేయకుండ స్పర్ధను ఆరంభింతము".

నారదతుంబురులు తిరిగి త్రిగుణాత్మకమైన మాయకు ఆధీనులైనారు. పుణ్యాంతాన స్వర్గచ్యుతులగు మానవమాత్రుల వలె, 'నీవు' 'నేను' అను స్థితికి దిగజారినారు. స్పర్ధాగ్రస్తమానసులైనారు. పాడుటకు ఉద్యుక్తులై, మహతీకళావతుల కోసం కలయ చూశారు. అవి మంచులో పూర్తిగా కూరుకొని పోయినవి.

దైన్యభావంతో నారదుడు ఇలా అన్నాడు. "స్వామీ! మావీణెలు హిమగర్భితమైనవి. ఇక శ్రుతిబద్ధంగా పాడుటెట్లు?

చిరునవ్వుతో హనుమ ఇలా అన్నాడు. "పాటతో మంచును కరిగించి మీ వీణెలను తిరిగి పొందండి. మహర్షులైన మీకిది అసాధ్యమా?"

నారదతుంబురులు ఒకరి ముఖమును ఒకరు చూసుకొన్నారు. మొదట విడివిడిగా పాడి, పిదప కలిసి పాడ నారంభించారు. రాగాలాపనలోనే వేయిదోషాలు దొరలినవి. గళాలు జీరనోయినవి. లయ తప్పినది. శ్రుతి తప్పినది.

మహతీకళావతీ వినా గాంధర్వం శిథిలమైపోయినది. అపూర్ణత అవబోధమై, కరుడుగట్టిన అహమ్మన్యత నీరు నీరై పోయినది.

హనుమానునికి ప్రణమిల్లి ఇలా అన్నారు. ఆంజనేయా! అజ్ఞానవశతః మమ్మేమేము అసమాన గానకళాకోవిదులమని భావించుకొంటిమి. మమ్ములను మించిన మహానుభావులున్నారన్న మాటను విస్మరించితిమి. ఏ జంత్రాన్ని తోడుగొనకుండా, కేవలము గాత్రంతోనే రాలు కరిగించగల గాంధర్వవిద్యావిశారదులు మీరు. మీ గాన మొక ఇంద్రజాలము.

మారుతికి మహర్షులపై జాలి వేసినది.

ధీరగంభీర స్వరంతో ఇలా అన్నాడు.

"బ్రహ్మమానస పుత్రులారా! మీరు సెలవిచ్చినట్లు నేను గానకళావిశారదుడను గాను. "విపులాచ పృథివీ".... నన్ను మించిన మహానుభావులు ఎందరో ఉన్నారు. వారిని మించేవారు భావిలో ముల్లోకాలను పునీతం చేయనున్నారు. నేడు ఏర్పర్చిన సీమలు రేపు చెరిపివేయబడుతవి. పరిణతి నిరంతరం కొనసాగే ప్రక్రియ. శ్రేష్ఠతకు చరమరేఖ లేదు. ఈనాటి రేఖను అధిగమించి ఆకాశపుటంచుల్ని అందుకోవాలి. ఆపై అంతరిక్షానికి అర్రులు సాచాలి".

"ఇది ధ్యేయమైనపుడు స్పర్ధ తలయెత్తదు. ఈ సంకల్పిత మహాయజ్ఞంలో అందరికి భాగస్వామ్యం ఉంది. సహకార భావనాప్రేరితమూ, ఆదానప్రదానాధిష్ఠితమూ అయిన సామూహిక కృషికి కటిబద్ధులం కావాలి. ఇదే విశ్వమొక మహాసమూహమై రేపు ఆలపించనున్న కమనీయనవరాగం."

దేవతులు నింగి నుండి దిగి వచ్చారు. విష్ణువు మందస్మితం కావించారు.

హనుమానుడు సర్వాంతయామిని ఈ విధంగా స్తుతించాడు. నారదతుంబురులూ, దేవతలూ, చివరకు శ్రీ మహావిష్ణువు సైతం తమతమ గళాల్ని మేళవించారు.

సహస్రశీర్షం దేవం, విశ్వాక్షం విశ్వశంభువమ్
విశ్వం నారాయణం దేవమక్షరం పరమం పదమ్
విశ్వతః పరమాన్నిత్యం విశ్వం నారాయణం హరిమ్
విశ్వ మే వేదం పురుషస్త ద్విశ్వ ముపజీవతి.

వ్యక్తిస్తవనంగా ప్రాదుర్భవించి, సమిష్టిగానంగా ఎదిగి, విశ్వసమ్మోహన గానంగా దశదిశలు వ్యాపించింది. భిన్నత్వం ఏకత్వంలో అంతర్లీనమైంది. జ్ఞానస్పర్శతో ఘనీభవించిన అహంకారం ఛిన్నాభిన్నమైంది.

మేఘవినిర్ముక్తుడైన రవికిరణాలు సోకగానే మంచు నీరు నీరై పోయింది. నారదతుంబురులు గానానికి ఉపకరణాలైన వీణెలను ఎత్తి, భుజానపెట్టుకొన్నారు. తాము కేవలం నిమిత్తమాత్రులమనే యథార్థాన్ని గ్రహించారు.

**శిఖరాల్ని కాదు. ఆకాశాన్ని ఆపై అంతరిక్షాన్ని అధిగమించాలి.**
**స్పర్థను వీడి పరస్పరం సహకరించుకోవాలి. ముందుకు సాగాలి.**

# 8. మొగ్గ

( అన్నపూర్ణ - అజీత్‌ల కథ )

పుణేలో, అన్నమ్మ, రాజారామ్ తేలంగ్ లనే దంపతులుండేవారు. రాజారామ్ గారు బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు చెందిన ఓ శాఖకు మ్యానేజరు. రూపంతో పాటు గుణం అన్నమ్మకు ఈశ్వరుడనుగ్రహించిన వరం. ఆ ఇల్లాలు అందరినీ ప్రేమతో చూచుకునేది. ఇరుగుపొరుగులకు ఆమె అంటే ఎనలేని అభిమానం. ఆ దంపతులకు ముగ్గురు పిల్లలు. రమేశ్, లత, మేధ.

అన్నమ్మ గారి జన్మ గ్రామం (అసలు పేరు అన్నపూర్ణ) ఆంధ్రప్రదేశ్‌లోని మంథిని. ఆమె పెద్దక్కగారు సీతమ్మ. సీతమ్మ భర్త రామన్నగారు. వారి అబ్బాయి అజీత్ బాగా చదివి, వ్యవస్థాపనాసలహాదారుని స్థాయికి ఎదిగి కీర్తిప్రతిష్ఠలు సంపాదించుకొన్నాడు.

కిశోరావస్థలో ఉన్న రోజుల్లో, అజీత్ పిన్నిగారైన అన్నమ్మను ఓమారు ఇలా అడిగాడు. "పిన్నీ! నీ ముగ్గురు పిల్లల్లో ఎవరిపై నీకభిమానం?"

"నా కందరూ సమానమే నాయనా" అంటూ పగులబడినవ్వి జవాబిచ్చింది అన్నమ్మ.

అజీత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న రోజులలో, కాలేజీలో విద్యార్థిగా ఉన్న రోజులలో, పోస్టు గ్యాడ్యుయేట్ అయ్యాక, ఆ తరువాత ఇంజనీరుగా ఉద్యోగంలో చేరి ముఖ్యసంచాలకుని స్థాయికి ఎదిగాక కూడా, ఆవిడను ఇలాగే చిలిపిగా ప్రశ్నించేవాడు.

చిరునవ్వుతో ఆమె ప్రతిసారి ఇచ్చిన సమాధానం. "నాకందరూ సమానమే! కన్నతల్లికి ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ ఎలా అవుతారు!"

హైదరాబాదులో మరో పిన్ని కమలమ్మ గారి ఇంట్లో అన్నమ్మ గారిని అజీత్ కలువడం తటస్థించింది. మళ్ళీ అదే ప్రశ్న వేశాడు. "పిన్నీ! నీ కెవరంటే ఇష్టం? రమేశా, లతానా లేక మేధానా? అన్నమ్మ తడుముకోకుండా అంది. "అందరూ సమానమే". ఎప్పటిలా ఆమె పెద్దగా నవ్వింది. ఆ నవ్వుతో, ఎన్నో నవ్వుల మతాబాలు పేలినవి. పండుగ వాతావరణం ఏర్పడింది.

అంతటితో అజీత్ ఆవిడను వదిలిపెట్టలేదు. "పిన్నీ! నా ప్రశ్నను ప్రతిసారి తేలికగా తీసుకొంటున్నావ్! దాపరికం ఎందుకు? నిజంచెప్పు. నీ పిల్లల్లో ఎవరంటే నీకు ప్రాణం. ఎంతో కాలానికి అందరం ఓ చోట కలుసుకున్నాము. ఇలాంటి సందర్భాలు మళ్ళీ మళ్ళీ రావు."

అజీత్ పిన్నిని ఇరకాటంలో పెట్టాడు.



చేసేదిలేక నవ్వుతూ ఇలా అంది. "నీ వడిగిన ప్రశ్నలో అర్థం వుందిరా అజీత్"!

ఆమె అందరికేసి ఓ మారు చూసింది. ఆమె ముఖకవలికల్లో దృఢత చోటుచేసుకుంది. మనసువిప్పి మాటాడాలన్న నిశ్చయం ఆమె చూపులు చెప్పక చెబుతున్నాయి. "కష్టాల్లో వున్న బిడ్డ కన్నతల్లికి కడుదగ్గర". అంది అన్నమ్మ.

అందరూ ఉత్సాహంతో చప్పట్లు చరిచారు.

ఇంత వరకు పెదవి విప్పని కమలమ్మ పిన్ని ఇలా అంది. "తెలివితేటల గల పిల్లాడు కన్న తండ్రికి దగ్గరివాడు. కష్టాల్లో వున్న కన్నకడుపు కోసమే తల్లి మనస్సు తల్లడిల్లుతుంది. ఇది లోకంలో మనం చూస్తున్నదే!"

క్షణం ఆగి మళ్ళీ ఇలా అంది.

"బలహీనుల్ని ఆదుకోవాలి. ఉన్నదాంట్లో వాళ్ళకు కొంచెం ఎక్కువ అందేట్టు చూడాలి. వాళ్ళ పెరుగుదల విషయంలో విశేషశ్రద్ధ వహించాలి. అప్పుడే వాళ్ళు బతుకుపందెం అవలీలగా నెగ్గగలుగుతారు".

కరతాళధ్వనుల మధ్య, మాతృవాత్సల్యానికి ప్రతిరూపమైన అన్నపూర్ణ, అజీత్‌ను కౌగిలించుకొని మనసారా దీవించింది.

**బలహీనుల్ని చేయి పట్టుకొని నడిపించడం, పడిపోకుండా కైదండను ఈయడం, ప్రేమ అనే పదానికి సరైన నిర్వచనం. అందరూ సమానమే అయినా, కష్టాల్లో ఉన్నవాడి వైపు మొగ్గు చూపడం పక్షపాత మనిపించుకోనదు.**

# 9. బ్రతికితే బలుసాకు

( ఢిల్లీ శునకం కథ )

ఢిల్లీ నివాసియైన సర్దార్ అవతార్‌సింగ్ వాణిజ్యపరమైన పనిమీద, లండన్ వెళ్ళాడు. ద్విసహస్రాబ్దికి ఉత్సాహంగా స్వాగతం పలుకుతూ ఆబాలవృద్ధులు వేడుకలు జరుపుకొంటున్న రోజులవి. హాయిడ్ పార్కు పరిసరాల్లో 'రేస్ అవ్ ద మిలెనియమ్' అనే అక్షరాలతో ఓ పెద్ద బలూన్ ఆకాశంలో దోలలూగుతూ, చూపరులకు కన్నుల పండువగా వుంది. అవతార్ ఓ చోట జనాల పోగవడం చూశాడు. ఏమి జరుగుతున్నదో తెలుసుకోవాలనే కుతూహలంతో, ఆ వైపు నడక సాగించి, చుట్టూ ఫెన్సింగ్ వున్న ఓ మైదానానికి చేరుకున్నాడు. లౌడుస్పీకర్లు ఉద్ఘోషిస్తున్నాయ్. "లేడీజ్ అండ్ జంటల్మెన్! కదలిరండి. ద్విసహస్రాబ్ది నిమిత్తం నియోజితమైన విశ్వస్తరీయశునకప్రధావన స్పర్థలో మీ కౌలేయాలకు స్వర్ణావకాశం. విజేత శునకానికి ముప్పయిలక్షల పౌండ్లు పురస్కారం".

ఇది విన్న అవతార్‌సింగ్‌కు ఆశ్చర్యం వేసింది. భాంగ్డా నర్తకుని ఆవేశం ఆయన్ని ఆవహించి ఉక్కిరిబిక్కిరి చేసింది. 'కుక్కల పరుగుపందెమా? ముప్ఫయి లక్షల పౌండ్లే! ఇంగ్లీషువాడి బుర్ర భూగోళం! వాహెగురూ!'

ఇలా ఆలోచిస్తూ, ప్రవేశద్వారం దగ్గరకు వెళ్ళి, తత్సంబంధమైన 'సమాచార పుస్తిక'ను తీసుకొన్నాడు. ప్రవేశరుసుం ఆరువందల పౌండ్లు. ఏడువందల మీటర్ల పరువుపందెం.

'బాణాల్లా దూసుకొనిపోగల నానాదేశ శునకాలు ఈ స్పర్ధలో పాలుగొన బోతున్నాయని' వివిధ టి.వి. చానల్జ్‌పై ప్రతి అరగంటకో ప్రకటన. ఈ రేసును చూపించే హక్కును కొనేసి, కోట్లు దండుకోవాలని ప్రపంచంలోని అన్ని టి.వి. సంస్థలు పోటీపడుతున్నాయి.

విశ్వస్తరీయ స్పర్థా? సరికొత్త ఆలోచన. ఒక్క యు.కే.లో ఏమిటి, యూరపియన్ యూనియన్, యు.ఎస్., లాటిన్ అమెరికా, గ్రీసు, సౌతాఫ్రికా, ఇండొనేషియా, పాకిస్తాన్ ఇలా ఛప్పన్న దేశాల నుంచి యజమానులు స్థానిక, ప్రాదేశిక, రాష్ట్రీయ స్థాయిలో విజయశ్రీని వరించిన తమతమ శునకాలను పరుగుపందెంలో దించేందుకు ఉవ్విళ్ళూరుతూ, అవసరమైన ఔపచారికతను (Formality) పూర్తి గావించుకొన్నారు. అప్పటికే వేరువేరు కక్ష్యల్లో ప్రదర్శన నిమిత్తం ఉంచబడిన శునకరాజాలను అవతార్ తిలకించాడు. సింహాల్ని పులులనూ బెంబేలెత్తించే జాగిలాలు! భారతీయులెవరైనా ఈ పందెంలో తమ కుక్కల్ని దింపుతున్నారా తెలుసుకొనేందుకు సమాచార కేంద్రానికి వెళ్ళాడు. 'లేదని' ముఖ్యాధికారిణియైన ఓ లావాటి ఆంగ్లమహిళ తెలిపింది. ఇది విని వాపోతూ ఇలా ఆలోచించాడు. 'ఇది దేశ ప్రతిష్ఠకు సంబంధించిన ప్రశ్న. పతకాలు గెలుచుకోకున్నా, నానా దేశాల క్రీడాస్పర్థల్లో పాల్గొనాలని ఉవ్విళ్ళూరే క్రీడాకారుల దేశమైన భారత్‌లోని శునకాభిమానులూ, పోషకులూ ఈ పోటీకి దూరంగా వుండడం చిత్రంగా వుంది'.

పంజీకరణ విభాగానికి వెళ్ళి ప్రవేశపత్రంలో చేర్చగలిగినన్ని వివరాలు చేర్చి ఆరవందలపౌండ్లతో సహా అధికారికి అందచేస్తూ అన్నాడు. "నేను భారతీయుణ్ణి - నా దేశం తరఫున ఓ జాగిలాన్ని పోటీలో నిలుపదలచాను".

విభాగాధికారి అన్నాడు "మీరు చెబుతున్న జాగిలం ఎక్కడ? వచ్చే ఆదివారమే రేస్. ఇవాళ గురువారం! ప్రవేశపత్రాన్ని స్వీకరించే చివరి రోజు".

సింగ్ అన్నాడు: "కుక్కను తప్పకుండా తెస్తాను. మొదట ప్రవేశ ఫీని ఫామ్‌తో సహా స్వీకరించండి. ఆఖరి రోజు ప్రవేశ ఫీకి సంబంధించినది. కుక్కకు సంబంధించినది కాదు గదా"!

విభాగాధికారి అడిగాడు. "మీ కుక్కపేరూ, అది ఏజాతికి చెందిందీ ఫామ్‌లో సూచించారా"!

అవతార్ బదులు చెప్పాడు. "ఆదివారం ఉదయం, అన్ని వివరాలతో హాజరుపరుస్తాను. ఇక పేరంటారా? టైగర్."

విభాగాధికారి నవ్వుతూ ఇలా అన్నాడు. "ఇంకేం! మీ శునకం రేస్ జయించి తీరుతుంది. మీరు తప్పనిసరిగా దాన్ని వైద్యకీయ పరీక్ష నిమిత్తం ఆదివారం ఉదయం 9-30 కి - పేరేవిటన్నారు? - టైగరు కదూ! - హాజరుపరచాల్సి వుంటుంది. అదేరోజు సాయంత్రం 4-00 గం॥లకు రేస్ మొదలవుతుంది". సర్దార్ అవతార్‌సింగ్ అన్ని ఔపచారికతలను పూర్తిచేసి, అధికారికి ధన్యవాదాలు తెలుపుకొని, అక్కడినుండి వెంటనే ఎయిర్‌పోర్టుకు చేరుకొని, శుక్రవారం ఉదయం బయలుదేరే విమానంలో ప్రయాణించటానికి టికెట్టు కొనుక్కొన్నాడు. మరుసటి దినం అంటే శనివారం భారత్ నుండి మార్నింగ్ ఫ్లాయిట్‌లో తిరిగి రావాల్సి వుంటుంది కనుక తనకోసం టైగరుకోసం తిరుగు టికెట్లు కొనుక్కున్నాడు.



కాలాన్ని ధనాన్ని వ్యయించి పై అధికారులకు కోపం తెప్పించేకన్న వారికి ముందే నచ్చజెప్పి, వారి అనుమతి పొందాలని నిశ్చయించుకొని ముంబాయిలోని డైరెక్టరు సలీల్‌భాటియాతో ఫోనులో మాట్లాడాడు. సలీల్‌భాటియా పక్కా దేశాభిమాని అవడంవల్ల అంగీకారాన్ని తెలుపుతూ, ఓ షర్తు విధించాడు. టైగర్ విజేత అయ్యే పక్షంలో పురస్కార ధనం నుండి సగభాగం కంపనీకి ఈయాల్సి వుంటుంది. వేల పెట్టుబడితో కోట్లు సంపాదించే అవకాశం ఉన్నప్పుడు ఈ కొలది సాహసం వ్యవస్థాపనలో అనివార్యమని భాటియా భావించాడు.

ఎయిరిండియా విమానంలో శుక్రవారం ఉదయం బయలుదేరి రాత్రి 11-00 లకు ఢిల్లీ చేరుకున్నాడు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చి 'టాక్సీ స్టాండ్' వద్ద పోట్లాడుతున్న మూడు కుక్కల్ని చూశాడు. అన్నీ దాదాపు శుష్కించి పోయే వున్నాయి. దోర రంగులో వుండి నల్లమచ్చలుగల శునకం మిగతా రెంటికన్న మెరుగనిపించింది. అవతార్ మురిసిపోతూ, లోలోన అనుకున్నాడు 'టైగరంటే ఇదే'!

వెంటనే లండన్ నుంచి తెచ్చిన పట్టాను మెడకు తగిలించి, దగ్గరే వున్న పుష్కరిణి దగ్గరకు తీసికొని వెళ్లాడు. సబ్బు రుద్ది స్నానం చేయించి టావెల్‌తో తుడుస్తూ ఇలా అన్నాడు. "నీవు నిస్సందేహంగా టైగరువే!"

"నాకు ఆకలేస్తుంది" అని ఆ దోరరంగు శునకం మనుష్యభాషలో సమాధానం చెప్పి సర్దార్జీని ఆశ్చర్యంలో నిలువెల్లా ముంచేసింది. వెంటనే సంభ్రమం నుండి తేరుకొని టైగరును సమీపంలో వున్న టాక్సీవాలా క్యాంటిన్‌కు తీసుకొనివెళ్ళి జన్మలో రుచి చూడని కోడిబిర్యానీని, మటన్‌కర్రీని కడుపునిండా తిని గర్రున తేన్చేవరకు తినిపించాడు. టైగరును తీసికొని తిరుగు ప్రయాణార్థం ఎంట్రీ వద్దకు తీసికొని పోతున్నాడు.

ఇదేమీ అర్థం కాని టైగరంది. "నన్ను ఎక్కడికి తీసుకొని వెడుతున్నారు?"

"లండన్ కు" బదులు చెప్పాడు సర్దార్జీ.

"వీల్లేదు".

"ఎందుకని?"

"నా 'రాణి' ఏమైపోవాలి!"

"ఓ.... రాణిని గురించా నీ బెంగ. వచ్చే గురువారం తిరిగి వచ్చేస్తున్నాం గదా! నిన్నూ, నీ రాణీని నాతోపాటే ఉంచుకొంటాను. మీకు కలిగే పాపల బాధ్యత నేనే వహిస్తాను.

టైగరు సంతోషంగా తోక ఊపుతూ 'సరే! పద' అంది.

సర్దార్జీ టైగరుతో సహా ప్లేన్‌లో వెళ్ళి కూర్చున్నాడు. అవతార్ రేస్ గురించి ఆలోచిస్తుంటే, టైగరు తన రాణిని తల్చుకొని దిగులుపడుతున్నది. శనివారం లండన్ చేరుకున్నారు. ఆ సాయంత్రమే స్పర్ధానిర్వాహకులకు అవతార్‌సింగ్ టైగరును అప్పగించాడు. 'కేవలం ఎముకులగూడుగా మిగిలి, జీవనశేషచరణంలో వున్న ఈ శునకం పందెం గెలుస్తుందా' అని నివ్వెరపోతూ, పోటీ నుంచి విరమించుకొమ్మని ప్రవేశ రుసుం ఏమీ మినహాయించకుండా తిరిగి ఇస్తామని' సలహా ఇచ్చారు. ప్రాణం పోయినా మాట తప్పని మానధనుడు సర్దార్జీ అందుకు అంగీకరిస్తాడా? "నో" అనే పదాన్ని అందరు వినేట్టుగా నొక్కి పలికాడు. వైద్యపరీక్షలయ్యాయి. ఓకే అన్నమీదట, ప్రదర్శన కక్ష్యలో ప్రవేశపెట్టారు.

శల్యావశిష్టమైన శునకం పోటీలో పాలుగొననుందన్న వార్త హైడ్‌పార్క్ పరిసరాల్లో దావానలంలా వ్యాపించింది. టైగరును చూడాలని జనాలు ఎగబడ్డారు. మిగతా శునకాలు ఇదంతా చూస్తూ తమలోతాము నవ్వుకొన్నాయి. దెయ్యాల్లో కనపడుతున్న ప్రత్యర్థులను చూస్తుంటే టైగరుకు ముచ్చెమటలు పోశాయి. నోరు పొడి వోసాగింది.

నిర్ణేతలు సమావేశమై జాబితాలోని ఏ జాగిలానికి ఏ అంకె ఇవ్వాలో, ఏ క్రమంలో పెట్టాలో చర్చించుకొంటున్నారు. చివరిలో టైగరు పేరు చర్చకువచ్చింది.

"శునకాభాసమైన దీనికి ఏ అంకెను ఇద్దాం?"

"దాని స్థానం ఎక్కడ అని నిర్ణయిద్దాం"?

"దానికి శూన్యం అంకెను ఇద్దాం".

"అసలు దాన్ని పట్టించుకోవడమే అనవసరం"!

ఇలా నిర్ణేతలయిన పెద్దమనుష్యులు తర్జనభర్జనపడుతున్న వేళ, దిల్మన్ తాను 'ఉపాధ్యక్షుణ్ణి' అన్న సంగతి గుర్తుకు వచ్చి 'వీల్లేదు' అని గట్టిగా అన్నాడు. "టైగరును పందెం నుండి ప్రక్కకు పెట్టడానికి వీల్లేదు. అది ప్రధావనరేఖ నుండి వందఫీట్ల దూరంలో నిలబెట్టబడాలి. టైగరు లోకప్రియ మౌతోంది. కంపెనీలు టి.వి. సంస్థలకు 'ఆడ్స్' పెద్ద సంఖ్యలో పంపుకొంటున్నవి. దిల్మన్ మాటను కాదనేధైర్యం ఏ సదస్యునకు వుంది? అందరూ అంగీకరించారు. ఆయన దయవల్ల టైగరుకు వందఫీట్ల మినహాయింపు దొరికింది.

టైగరు లోలోన కుమిలిపోతున్నది. సర్దార్జీని చూస్తుంటే దానికి జాలివేస్తున్నది. జన్మభూమి - ముఖ్యంగా రాణి గుర్తుకొస్తున్నాయి. 'నేనిక్కడ వెలగపెట్టింది విని ఆవిడ ఎంత క్రుంగిపోతుంది? దేశవాసులు తలెత్తుకొని తిరుగగల్గుతారా?'

బిగ్‌బెన్ సాయంకాలం 'నాల్గు' అవడాన్ని సూచించింది. లండన్‌వాసులు టైమును సరిచేసుకున్నారు. జాగీలాలన్ని ఒకరేఖపై నిల్పబడ్డాయి. ముంగాళ్ళు ముందుకుసాచి, మానవక్రీడాకారుల్లా అప్రమత్తమయ్యాయి. ప్రధావనరేఖ నుండి వందఫీట్లు ముందువున్న వర్తులాకారంలో బిక్కమొహంవేసి టైగరు నిల్చుంది. మూగజీవాలంటే జాలిగల సర్‌దిల్మన్ టైగరు వద్దకు వెళ్ళి, వీపుతట్టి ధైర్యం చెబుతూ ఇలా అన్నాడు అబ్బాయ్! "ప్రతి శునకానికి ఓ శుభదినం వుంటుంది. ఈ దినం నీది. వీళ్ళ అంచనాల్ని తారుమారుచేసి విజయశ్రీని వరించు. అద్భుతాల్ని ఎన్నిటినో భారత్‌లో చూశాను."

టైగరు మనస్సులో అనుకుంది. 'ఇదంతా ఈయన భ్రాంతి'.

"పాపే! ఆగే బఢో. హం తుమ్హారే సాథ్ హైఁ" ప్రేక్షకుల మధ్యనిల్చి అవతార్‌సింగ్ అరుస్తున్నాడు.

'పిచ్చిసన్నాసి'.... అంటూ అస్పష్టంగా టైగరు గొణిగింది.

కెప్టెన్ బ్లాక్ పిస్టల్ని పైకెత్తి ఒకటి - రెండు - మూడు - అని గాలిలో పేల్చాడు. ఇదివరకు ఎన్నో ఘనవిజయాలు సాధించిన జాగిలాలు ముఖాల్ని వికృతం చేసి, కోరలు బయటపెట్టి వన్యప్రాణిని వెంబడించే వాటిలా దౌడు ప్రారంభించాయి. కాళ్ళు భూమిలో కూరుకొని పోయాయా అన్నట్లు టైగరు కాలు కదల్పకుండా అలాగే నిలిచి వుంది.

అవతార్ అకాలపురుషుణ్ణి స్మరించుకున్నాడు. సర్‌దిల్మన్ టైగర్ కేసి తీక్షణంగా చూశాడు. సింహవ్యాఘ్రాలకు ఏమాత్రం తీసిపోని గ్రామసింహాలు యాభైపీట్ల నేలను వెనుకవేశాయి. రష్యన్ భషకం అన్నిటికంటే ముందువుంది. దాని వెనుకే జర్మన్, ఇస్రాయిల్, కెనడియన్ సారమేయాలున్నాయి. జర్మన్ మృగదంశకం తలను సాచి టైగరున్న వేపు దూసుకొని పోతున్నది. దాన్ని చూడగానే టైగర్ కార్పణ్యాన్ని వీడి, కాయికంగా మానసికంగా ఆయత్తమై దౌడుకు లంకించుకుంది. వేగాన్ని క్రమంగా గరిష్ఠస్థాయికి పెంచి, బాణంలా దుసుకొనిపోతూ, ప్రేక్షకుల దృష్టిలో సరళరేఖలా భాసిల్ల సాగింది. మిగతా కుర్కురాలు కదలుతున్న బిందువుల్లా కన్పట్టినవి. అవతార్‌సింగ్ గురువును స్మరించుకొన్నాడు. సర్‌దిల్మన్ 'బకప్' అంటు టైగరును పురికొలుపుతున్నాడు.

టైగర్ వేగాన్ని పెంచి ఆధిక్యతను సాధించింది. ఇక ప్రేక్షకుల దృష్టి కేవలం టైగరుపై కేంద్రీకృతమైంది. పెద్దపెట్టున ప్రేక్షకులు ఈలలు వేస్తున్నారు. టైగరు ముగింపుగీత, హర్షధ్వానాలమధ్య, అధిగమించి కొంచెం ముందుకు ఉరికి, ఒక్కసారిగా కుప్పగూలింది. ముగింపురేఖ దాని పాలిటి మృత్యురేఖ అయ్యింది. ప్రేక్షకులు సముద్రపు అలలా లేచి కరతాళధ్వనులు గావించారు. టైగర్ గెల్పును జీర్ణించుకోలేని రాక్షసరూపాలు దానిపై బడడానికి ఒక్క టవుతుండడాన్ని గమనించిన దిల్మన్, టైగరు దాని రిపువర్గం మధ్య, షాట్‌గన్ పైకెత్తి నిలుచున్నాడు. అవతార్‌సింగ్ నేలపై కదలిక లేకుండా పడియున్న టైగరును ఒళ్ళోకి తీసుకొన్నాడు.

టైగరును విజేతగా ప్రకటించి, సర్దార్ అవతార్‌సింగ్‌కు మప్ఫయి లక్షల పౌండ్ల చెక్కును, స్వర్ణపాత్రాన్ని పురస్కారంగా ఇచ్చారు. ఈ వార్త విన్న సలీల్ భాటియా కంపనీ సంచాలకులకు 'పార్టీ' ఇచ్చి, అధ్యక్షునికి ఫోనులో శుభవార్తనందిస్తూ ఇలా అన్నాడు. "సర్! మన కంపనీ బ్యాలెన్స్ షీట్ మెరుగుపడింది".

అవతార్‌సింగ్ టైగరుతో తన గదిలో విశ్రాంతి తీసుకొంటున్నాడు. తృప్తిగా భోజనం చేసినమీదట టైగరును ఒడిలోకి తీసికొని, ఫోనులో సర్‌దిల్మన్‌కు తన తరపున భారత్ తరపున ధన్యవాదాలు తెలుపుకొన్నాడు.

దిల్మన్ స్పందిస్తూ ఇలా అన్నాడు. "మిస్టర్ సింగ్! దట్స్ నథింగ్ - నాకు భారత్ అంటే అభిమానం. ప్రతివాడూ బలవంతుణ్ణే సమర్థిస్తాడు; బలవంతునికే వంతపాడుతాడు. దుర్బలునికి చేయూతనిచ్చే వాళ్ళు లోకంలో బహు అరుదు. సగటు మానవుణ్ణి ప్రోత్సహించి, సహాయం అందించాలి. సాధారణుడే అసాధారణ విజయాలు సాధిస్తాడు. టైగర్ గెలుపే తిరుగులేని దృష్టాంతం. బై...."

టైగరు అలసిపోయి నిదురోతుంది. మధ్యమధ్య ఉలికి ఉలికి పడుతూంటే, అవతార్ దాని ఒంటిని నిమిరాడు. అది కళ్ళు తెరచి ఇలా అడిగింది. "ఇప్పుడేమిటి?" అవతార్ అన్నాడు: "టైగర్! నీవు పందెం ఎలా గెలువగలిగావు?"

ఇది విన్న టైగరుకు చికాకు వేసింది. రుసరుసలాడుతూ లేచి వెనుగాళ్ళమీద నిటారుగా కూర్చుని ఇలా అంది. "పందెమేమిటి? నేను గెలవడమేమిటి? ఆ దెయ్యాలు వెంటపడ్డాయని భావించి, ప్రాణాలు దక్కించుకునేందుకు పరుగెత్తాను. అవి 'కప్పు'కోసం, మెప్పుకోసం పరుగులు తీస్తే, నేను ప్రాణాలకోసం పరుగెత్తాను. వేగమూ శక్తీ నాలో లోపించాయనుకున్నాను. ఈ రెండూ నాలో ఉన్నాయి. ప్రాణానికి ముప్పు వాటిల్లే పక్షంలో, ఎవరైనా ఎంతటికయినా తెగిస్తారు."

మళ్ళీ టైగరు నిదుర ఒడిలో వాలిపోయింది. అవతార్‌సింగ్ వేకువయ్యే వరకు మేలుకొనే వున్నాడు.

**నిన్ను ఎవరైనా చుట్టుముట్టినవేళ, ప్రాణాల్ని దక్కించుకోవాల్సినవేళ, ధైర్యంగా పోరాడు. శక్తియుక్తుల్ని సమీకరించుకొని, సమరం సాగించు.**

# 10. శక్తి చాలకున్న...

( గణేశ కార్తికేయుల కథ )

వ్యవస్థాపనాజగత్తులో డా॥ నాగరాజ్ ఆత్రేయ గురుస్థానీయుడు. తన ఉదాత్త వైచారిక సరణితో పారిశ్రామికవేత్తలనూ, సంచాలకులనూ, వాణిజ్యరంగనేతలనూ ఎంతగానో ప్రభావితులను చేశాడు. 'శ్రేష్ఠతా సాధనకేంద్రం' అను పేర ఒక సంస్థను స్థాపించడమేగాక 'లీడర్‌షిప్ ఐడియాజ్' అనే ఆంగ్లనియతకాలికను ప్రవేశపెట్టి, ముఖ్య సంపాదకునిగా వ్యవహరించాడు.

ఒకనాడు ఆయన ఓ పాతికమంది నిర్వాహకుల ముందు 'జాగతీకరణం'పై తన ప్రసంగాన్ని ముగిస్తూ ఇలా ప్రశ్నించాడు. "మీరు చక్కని విధానాలను అవలంబించి, ఉన్నతస్థాయికి ఎదిగి మీ ఉత్తరదాయిత్వాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని నాకు తెలుసు. మీ యశస్సు వెనుకగల రహస్యం ఏమిటి?"

"కఠోరపరిశ్రమ"! లక్ష్మణ్ గోడ్బోలే అన్నాడు.

గోడ్‌బోలే ఇచ్చిన జవాబును ప్రశంసిస్తూ డా॥ ఆత్రేయ ఇలా అన్నాడు. "మీకో కథ చెబుతాను. వినండి!"

పురాణదంపతులూ, శక్తిశివస్వరూపులైన పార్వతీపరమేశ్వరులకు ఇద్దరు కుమారులు. ప్రథముడు గణేశుడు. ద్వితీయుడు అద్వితీయుడైన కార్తికేయుడు.

'మేమిద్దరం - ముచ్చటగా మాకిద్దరు' అని సాభిమానంగా చాటుకోగలిగిన కుటుంబం వారిది. ఎల్లవేళలూ సుఖదశీతలస్పర్శ నిచ్చే హిమాలయశ్రేణుల్లోని కైలాసశిఖరం వారి ఆవాసం. భవ్యపరిసరాలు. శ్రవణానందం కలిగించే షడ్జస్వర సదృశమైన కేకారవములు. నయనమనోహరమయూరనర్తనాలు. దీర్ఘవిరామాల మధ్య దిక్కులను కకావికలు చేసే సింహగర్జన. పుట్టను గోరాడుతూ నందీశ్వరుడు కావిస్తున్న అంభారావం. ఇటూ అటూ పరుగులు తీస్తూ మూషకం చేస్తున్న చిరుసవ్వడి.

శివశివానీ మిథునం చరాచర సృష్టికి హేతువైన పురాణద్వయం. వారి తనూజులు వేరువేరు ప్రజ్ఞాపాటవాలు గలవారు - గణేశుడు అగజానన పద్మార్కుడైతే, కార్తికేయుడు తండ్రి అభిమానాన్ని చూరగొన్న ధన్యజన్ముడు. ఇది ఇలా ఉన్నా, దంపతులు పిల్లల్ని ప్రాణసమానంగా చూసుకొనేవారు.

ఎంత కూడిమాడి యున్నా, పిల్లలు ఒకరితో ఒకరు పోటీ పడుతుండేవారు. వారి మధ్యగల స్పర్ధాత్మకత తలిదండ్రులను ప్రభావితం చేసింది. కలహాశనులైన నారదమహర్షులు కైలాసానికి వేంచేయడానికి పూర్వం ఎలాటి అప్రియఘటన చోటుచేసుకొనలేదు. అంతా సవ్యంగానే వుంది.

నారదులు నీరవతను భరించలేరు. అన్యోన్యత్వం చూస్తే ఆయనకు నిద్రాహారాలు రుచించవు.

ఓ వాక్కలహాన్నో, మల్లయుద్ధాన్నో, స్పర్ధనో, సంగ్రామాన్నో, ఏదో ఒకటి, సృష్టించడంలో, ఆయనకు ముల్లోకాలలో ఆయనేసాటి. సమరప్రసంగం లేని కావ్యం రక్తికట్టునా!

అలా అని, ఆయనను నిత్యవిఘ్నసంతోషి యనుటకు వీలులేదు. లోలోన రగులుతున్న వైరాలు సమాజస్వాస్థ్యానికి ప్రమాదహేతువులుగా పరిణమించకుండా, వాటిని బహిర్గతం కావించి ప్రభావహీనం చేసేవాడు. నిజానికి శాంతిప్రియుడూ, లోక కళ్యాణరతుడే అయినా కలహప్రియుడనే జనప్రవాదాన్ని తప్పించుకోలేకపోయాడు.

ఏ లోకానికి వెళ్ళినా, 'నారాయణ నారాయణ'తో తన రాకను ఎరిగించేవాడు. ఆ దివ్యనామస్మరణలో మొదటి 'నారాయణ' సమస్య; రెండవ 'నారాయణ' పరిష్కారం.

కైలాసశిఖరంపైని శివసదనప్రాంగణంలో అడుగిడుతూనే 'నారాయణ - నారాయణ' అన్నాడు. ఇది విన్న శివుడు క్షణంపాటు చలించిపోయాడు. 'ఊరక రారు మహానుభావుల'ని లోలోన అనుకుంటూ నవ్వుకొన్నాడు. బ్రహ్మమానసపుత్రుని స్వాగతార్థం సతీసమేతుడై ఎదురేగి లోనికి తోడ్కొని వచ్చి, అతిథి మర్యాదలను ఆచరించి సుఖాసీనుని గావించిన మీదట ఇలా అన్నాడు. "మహాత్మా! మీ ఆగమనం మాకెంతో హర్షదాయకం".

'నారాయణ' 'నారాయణ' అంటూనే, ఓ పసిడి వన్నెమామిడి పండును భుజాన వేలాడుతున్న జోలియ నుండి తీశాడు. - అది మేలుజాతి ఆమ్రఫలం. పిల్లలైన గణేశ కార్తికేయులు ఆ ఫలానికేసి ఆశతో చూశారు. నారదమహర్షి దాన్ని పార్వతీదేవి హస్తాల్లో పెడుతూ అన్నాడు "జననీ! ఈ ఫలాన్ని ఈ ఇరువురిలో అధిక యోగ్యుడైనవానికి ఈయవలె".

సంక్షోభానికి బీజావాపనమైంది. వాతావరణం ఏదో మార్పుకు లోనైంది. పార్వతి శివునివంక చూసింది. గణేశుడు తల్లికి చేరువయి, ఆమె చేయిని పట్టుకొన్నాడు. మొక్కవోని ఆత్మవిశ్వాసంతో కార్తికేయుడు శివునికేసి చూశాడు. 'నాకు ఈ తుందిలుడు సాటిగాడన్న విషయము జనకుడెరంగినదే; ఆరాటమేల కనబర్చవలె' అని లోలోన అనుకుంటూ మెదలకుండా వున్నాడు.

"నారదా! మా ఇద్దరు చిన్నారులు యోగ్యత కలవారలే. భేదభావమునకు లవలేశమైనా తావులేదు. పంచుకుని ఆరగింతురుగాక!" అన్నాడు మహాదేవుడు.

"మీరు నుడివనది నాకు సమ్మతమే! అయినా, పరిశ్రమించకుండా ఎవడైనా ఎలా ఫలభాజనుడౌతాడు? యోగ్యతాయోగ్యతలు నిరూపితం కావాలి. వెలకట్టని వస్తువునకు విలువేమిటి? ఉత్కృష్టత అనునది వ్యక్తి ఇష్టానిష్టాలతో ముడివడినది కాదు. జగన్మాన్యమైన స్థాయిది కావాలి. ఉత్కృష్టను ప్రోత్సహించే నిమిత్తమే త్రిలోకసంచారి నైనాను."

ఏకాంతమంతనార్థం, పార్వతి శివుని వంక చూసింది.

అది గ్రహించిన నారదుడు ఇలా అన్నాడు. "జననీజనకులారా! మీరుభయులు ఏకాంతమున చర్చించుకొను నిమిత్తము మీకు వీలు కల్పించి ఈ కిశోరనాయకులతో ముచ్చటించెదను".

శివపార్వతులు ఇంచుక దూరము చని పరస్పరం ఇలా సంభాషించుకున్నారు.

"నాథా! మీ ఆలోచన ఏమి?"

"దేవీ! పరీక్ష పెట్టవలె. నెగ్గినవాడే ఫలభాజనుడు".

"పరీక్షాస్వరూప మేమై యుండనోపు?"

'మనలోమాట' అంటూ శివుడు తన సహధర్మచారిణికి పరీక్షాప్రణాళిని వివరించాడు. ఆమె భయాందోళనకు లోనైంది. గణేశునికి అనుగుణంగా ఉండబోదని స్త్రీ సహజమైన చాకచక్యంతో ముందే పసిగట్టింది. శ్రీవారు కార్తికేయపక్షపాతి యని ఎరిగి కూడా, కుటుంబకలహాన్ని నివారించవలెనన్న ముందు చూపుతో ఇలా అంది. "నా గణేశుడు ఉత్తీర్ణుడు అయ్యేది సందేహమే అయినా మీ నిర్ణయమే నాకు శిరోధార్యము".

పురాణదంపతులు తిరిగి స్థానపన్నులైనారు.

"కుమారులారా! ఆలోచించుకొనియే ఈ పరీక్షను నిర్ణయించినాము. ముమ్మారు భూ ప్రదిక్షణము కావించి ఎవడీ స్థలిని చేరుకొనునో, వాడే ఫలావాప్తి కర్హుడు."

శివుని మాటకు నారదమహర్షి తన ఆమోదమును తెలిపినాడు.

కార్తికేయుడు నిరంతర క్రియాశీలి. ఆసనాన్ని మరుక్షణమే వీడి, వాహనమైన మయూరాన్ని చేరబిలుచుకొన్నాడు. తూర్పుదిశలో గమనానికి ఉద్యుక్తుడైనాడు. వాహనాన్ని అధిరోహించబోతూ, గణేశుణ్ణి మర్యాద కైనా పలుకరించలేదు.

బలమైన పక్షాల్ని విప్పుకొని, నిటారుగా పైకెగసి, పూర్వదిశలో గతిమానమైన నెమలిని (మనం హెలికాప్టర్ లేదా జెట్ విమానాన్ని చూస్తున్నట్లుగానే) గణేశుడు చూస్తూ అలా నిలబడిపోయాడు. నలుబది గంటల్లో పశ్చిమ దిశ నుండి కైలాసగిరిని చేరుకొని, స్వగేహప్రాంగణంలో దిగాడు. భూమి చుట్టూ ముమ్మారులు ప్రదిక్షణము విజయవంతంగా ముగించుకొని సంబరపడిపోతూ, మయూరాన్ని వీపుతట్టి, తలిదండ్రులను సమీపించి పాదాభివందనం కావించాడు. ఆ తరువాత నారదుల ముందు ప్రణమిల్లి ఆశీస్సులను పొందాడు. ఎవరూ ఏమీ అనలేదు. ఊహించిన రీతిలో అభినందన పరంపరతో ఎవరూ స్వాగతం పలుకలేదు. గణేశుని కోసం నలువైపుల కలయజూశాడు. ఓ మూల జేరి, గణేశుడు ఆమ్రఫలంపై ఛురికను ఆనించాడు.

"గణేశా! ఆగు. నీవు చేస్తున్నది భావ్యమా!" మందలించాడు కార్తికేయుడు.

తమ్మునియెడ గల ఆదరంతో తాను చేయబోతున్న దానిని విరమించుకొని, ఏమాత్రం తొణకకుండా, గణేశుడు ఇలా సమాధానం చెప్పాడు. "నారదుల వారి సమ్మతితోనే మన జననీజనకులు ఈ ఫలమును నాకు తినుట కొసంగినారు."

కార్తికేయుడు కఠినోక్తులకు దిగాడు. "బొజ్జ గణపయ్యా! ఈ ఆమ్రఫలం నీది ఎలా అవుతుంది? కాలుకదుపకుండా ఇక్కడే ఉండిపోయావు. నేను భూమిని ముమ్మారు చుట్టి వచ్చాను."

కార్తికేయుడు మాతాపితల వైపు చూశాడు. వారు పెదవి విప్పలేదు.



నారదుల వారిని సమీపించి ఇలా అన్నాడు. "మహర్షీ! ఈ లంబోదరుని వాలకం గమనిస్తున్నారు కదా! ఇతగాడు ఆమ్రఫలగ్రహణానికి ఎలా అర్హుడౌతాడో సెలవియ్యాలి!"

నారాయణ స్మరణ రెండుమార్లు కావించుకొని ఇలా అన్నాడు. "నాయనా కార్తికేయా! ఈ మామిడిపండు వెంకయ్యదే!"

"ఎలా స్వామి"?

"నీవు నీ మయూర వాహనాన్ని అధిరోహించి, వాయుజవంతో దూసుకొని వెడుతున్నవేళ, గణేశుడు మౌనంగా వున్నాడు. ఆ తరువాత జననీజనకుల చరణాల చెంత కూర్చొని క్షణంపాటు ధ్యానమగ్నుడైనాడు. దీప్తాననంతో నెమ్మదిగా లేచి కన్నవారి చుట్టు మూడు మార్లు ప్రదక్షిణలు సల్పి, నా యెదుట ముకుళితహస్తుడై నిలువబడినాడు. మీ తలిదండ్రులు నీ మాతులుడైన శ్రీ మహావిష్ణువును స్మరించుకొనినారు. స్మరణమాత్రముననే ఇక్కడికి వచ్చి పూర్వాపరాలను తెలుసుకొని నాతో మేలమాడి సప్తర్షులను రావించినాడు. వారు సుదీర్ఘచర్చలు సలిపి, ధర్మసూక్ష్మాన్ని ఎరంగించిన మీదట ఇలా తీర్పు చెప్పాడు. దీన్ని నీ జననీ జనకులు శిరసావహించినారు. నీ తల్లి పార్వతి ఫలాన్ని మహాదేవున కీయగా, ఆయన ఎలుకతత్తడిజోదు చేతిలో పెట్టాడు. కత్తితో కోయ బోవు నెడ నీవు నివారించినావు."

కార్తికేయుడు శివునికేసి చూస్తూ ఇలా అడిగాడు: "తండ్రీ! శ్రీ మహావిష్ణువు న్యాయనిర్ణయ మేమిటి? ఈ మోదకఖాది విజేత యగు టెట్లు?"

"కుమారా! నీకు నేను వివరించేకన్న కమలనాథున్ని ఇక్కడికి ఆహ్వానిస్తాను. ఈ వివాదంలో నాకు పరోక్ష సంబంధముండుటచే నేను తీర్పును ప్రకటించుట ధర్మసమ్మతం కాదు".

శివుడు నిమీలిత నేత్రుడై విష్ణువును ధ్యానించాడు. తత్కాలమే ప్రత్యక్షమై పరమశివుని ప్రాంగణాన్ని జ్యోతిష్మంతం కావించాడు. శివానీశివులు హార్దికస్వాగతం పలికారు. సోదరులిద్దరు ముకుళితహస్తులై నిలిచారు. నారదుడు అలవాటు ప్రకారం నారాయణనామం రెండుమార్లు ఉచ్చరించాడు.

శ్రీమన్నారాయణుని కార్తికేయునిపై కటాక్షవీక్షణాల్ని ప్రసరింపచేస్తూ ఇలా అన్నాడు.

"కార్తికేయా! దేవతల సేనానివై ఇంద్రునకే అజేయుడైన తారకాసురుని హతమార్చిన మహావీరుడవు. క్షాత్రార్థ్వవిద్యాపారంగామివి. వ్యూహరచనాదక్షుడవు. ఈ ప్రధావనస్పర్ధలో నీ అన్నగారే గెలిచినాడు. నీవు పరిక్రమత్రయాన్ని ముగించుటకు పూర్వమే, నీ అన్న తలిదండ్రుల చుట్టు ముమ్మారు ప్రదక్షిణలను సల్పినాడు. జననీజనకులకన్న పెద్దయైనది ఈ త్రిభువనాలలో లేదు."

"ద్యౌర్వః పృథివీమాతా'. ఇది వేదవాణి. మీకు తలిదండ్రులగుటతో పాటు పార్వతీపరమేశ్వరులు జగతఃపితరులు - వారే సృష్టి, స్థితి, లయములకు ప్రధానహేతువు నాకు పరమవందనీయులు - వత్సా! గణేశుడే విజేత."

కార్తికేయునకు జ్ఞానోదయమైంది. శ్రీ మహావిష్ణువునకు నారదమహర్షికి ప్రణమిల్లి జననీజనకుల చుట్టు ముమ్మారు ప్రదక్షిణలు సలిపాడు. జ్యేష్ఠుడైన గణేశునకు పాదాభివందనం కావించాడు.

గణేశుడు తమ్ముకుర్రను కౌగిలించుకొని ఇలా అన్నాడు. "కార్తికేయా! ఈ ఆమ్రఫలం నీదే. శారీరకంగా, మానసికంగా నీవే పరీక్షలో నెగ్గావు. నేను కేవలం మానసికంగా జయించాను".

దేవతలు వేంచేసి, అన్నాదమ్ములను వేనోళ్ళ కీర్తించినారు. కార్తికేయుడు ఆమ్రఫలాన్ని ముక్కలుగా తరిగి ప్రసాదంగా పంచిపెట్టాడు.

నారదులవారు ఓ ముక్కను నోటిలో వేసికొని ఇలా అన్నాడు. "ఎంత మధురం; అమృతోపమం".

"ఫలమా? కలహమా?" అడిగాడు శ్రీ మహావిష్ణువు.

"రెండూ". జవాబిచ్చాడు బ్రహ్మమానసపుత్రుడైన నారదుడు.

డా॥ నాగరాజ్ శ్రోతలవైపు చూస్తూ ప్రశ్నించాడు. "గణేశ కార్తికేయుల స్పర్ధ ప్రపంచస్థాయిది. కార్తికేయుడు పరిశ్రమించాడు మరి గణేశుడో?"

"గణేశుడు తెలివి నుపయోగించుకొన్నాడు" అన్నాడు గోడ్‌బోలె.

"మనం ఎలా పని చేయాలి" అడిగాడు డా॥ ఆత్రేయ.

"మనం తెలివిని ఉపయోగించుకోవాలి" అన్నాడు సురేశ్ పండిత్.

డాక్టరు ఆత్రేయ క్షణం ఆగి ఇలా అన్నాడు. "జాగతీకరణ ఊపందుకుంటున్న ఈవేళ కార్తికేయుడు మూడుమార్లు విశ్వవిపణవీధిని సర్వేక్షించాడు వాతానుకూలిత కక్ష్యలో కూర్చుని విపణవీధి మారిన స్వరూపాన్ని గణేశుడు అర్థం చేసుకొనలేదు."

"మనం శ్రమతో తెలివిని మేళవించాలి" అంది సుజాత.

డా॥ ఆత్రేయ సుజాత ఇచ్చిన సమాధానాన్ని మెచ్చుకొంటూ ఇలా అన్నాడు. "మార్పును గమనించండి. మార్పునకు అనుగుణంగా మీ విధానాలను మార్చుకొండి. క్రియాశీలురు కండి మీ ఆలోచనకు పదను పెట్టండి. ఉత్పాదన లక్ష్యాల్ని సాధించండి. గణేశ కార్తికేయుల్లా వ్యవహరించండి. సందర్భాలు మారిన దృష్ట్యా, జాగతీకరణ నేపథ్యంలో *కార్తేశుడే ఆదర్శ సంచాలకుడు.

అపర నారదమహర్షియైన డా॥ ఆత్రేయ ప్రవచనం ముగించగానే, బాకాలు చరుస్తూ అందరు హర్షం ప్రకటించారు. కార్తేశులవ్వై వ్యవహరించాలని నిర్ణయించుకొన్నారు.

**గణేశ కార్తికేయులై పోటుపడండి. - నాశీస్వతకు ఆహ్వానం పలకండి.**
**ప్రేరితులై పోటీ కారిని ఉత్ప్రేరితులను చేసి ఉత్కృష్టతను సాధించండి.**

---

*కార్తికేయుడు + గణేశుడు = కార్తేశుడు
Portmanteau word.

-అనువాదకుడు

# 11. ప్రశ్న ఒకటి : జవాబులు సవాలక్ష

ప్రదీప్ ఘూటే చాలా చురుకైన విద్యార్థి. ఎంతటి క్లిష్టసమస్య కైనా ఒకటికన్న ఎక్కువ పరిష్కారాలు సూచించేవాడు. ఆ పరిష్కారాలు సంప్రదాయసిద్ధమైనవి కాక, కొత్త ఒరవడిని సృష్టించునవియై పెద్ద వాళ్ళకు ఆశ్చర్యాన్ని కలిగించేవి. పిల్లవాడి వయసు పదిహేను సంవత్సరాలకు మించదు.

రాష్ట్రీయస్థాయిలో, 'విజ్ఞానంలో సృజనాత్మకత' అనే విషయంపై నిర్వహింపబడిన వ్రాతపరీక్షలో ప్రదీప్ పాల్గొన్నాడు. అహమదాబాద్ వెళ్ళి పరీక్ష రాశాడు. ప్రశ్నపత్రంలో గల పన్నెండింటి నుండి సమాధానాలు వ్రాయవలసినది, ఏవైనా తొమ్మిదింటికి మాత్రమే. ఈ గమనికను పాటించకుండా అన్నింటికీ సమాధానాలు వ్రాసి ఏవైనా 'తొమ్మిదింటిని చూడునది' అనే ప్రతిగమనికను ఆరంభంలో చేర్చాడు.

డా॥ దుర్వాస్ పరీక్షకుడు. దాన్ని చూడగానే ఆయనకు కోపం, చికాకూ రెండూ కలిగినవి. 'ఏమిటీ దురసుతనం? అవసరానికి మించిన ఆత్మవిశ్వాసం ఈ గడుగ్గాయికి! మా రోజుల్లో ఇలాటి సాహసానికి పూనుకునే వాళ్ళమా? ఈయాల్సిన వాటికి సమాధానాలు ఇస్తేనే తలప్రాణం తోకకొచ్చేది.'

డా॥ దుర్వాస్, డా॥ వసిష్ఠులూ కలిసి ప్రశ్న పత్రికను తయారుచేశారు. ప్రశ్నలు పదవ తరగతి విద్యార్థి తాహతుకు మించినవనీ, పన్నెండు మరీ ఎక్కువని వసిష్ఠ్ చేసిన సూచనను డా॥ దుర్వాస్ అంగీకరించక తనను ఇలా సమర్థించుకొంటూ ఇలా అన్నాడు. "ఇది రాష్ట్రీయస్థాయి పరీక్ష. తెలివైనవాళ్ళ కోసమే ఉద్దేశించబడింది."

"డా॥ దుర్వాస్ ఇష్ట ప్రకారమే కానివ్వండి. ఆయన ఆశించిన స్థాయిని అధిగమించే విద్యార్థి ఒకడైనా ఉండకపోతాడా?" సమితిలోని మూడవ సభ్యులైన డా॥ భరద్వాజ్ అన్నాడు.

డా॥ దుర్వాస్‌కు వసిష్ఠ్ మాట రుచించలేదు. "మీరు ఊహిస్తున్నంత తేలికకాదు. తొమ్మిదింటికి ఆలావుంచి, ఏ ఎనిమిదింటికి జవాబులు వ్రాసినా బృహస్పతిని మించినవాడవుతాడు."

డా॥ వసిష్ఠ్ తన హాస్య ధోరణిని కనబరుస్తూ ఇలా అన్నాడు. "డా॥ దుర్వాస్! ఎవడో ఒకడు మిమ్మల్ని నిరాశపరుస్తాడేమో వేచి చూడాలి."

ఈ తర్జన భర్జనల చివర, ప్రశ్నపత్రిక పన్నెండు కఠినప్రశ్నలతో రూపుదిద్దుకొంది.

ప్రదీప్ పేపరు దిద్దుతూ డా॥ దుర్వాస్ ఇలా ఆలోచించాడు. 'ఏవేని తొమ్మిందిటిని చూడునది' అని ప్రతి గమనికను చేర్చిన ప్రదీప్ పన్నెండు ప్రశ్నలకు సరైన సమాధానాలు ఈయగలిగాడా చూడాలి?

ప్రతి సమాధానాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ, తప్పు సమాధానాలేమైనా దొరికితే వాటిని లెక్కలోనికి తీసికొని, తొమ్మిదింటికి మించిన మూడిటిని సరైన సమాధానాలిచ్చినా ఉపేక్షించాలని నిర్ణయించుకొన్నాడు డా॥ దుర్వాస్.

ఆరవ ప్రశ్నను పరిశీలిస్తున్నవేళ, ఎదురుచూస్తున్న అవకాశం ఆయనకు చేజిక్కింది. ఎంతో ఆసక్తిని రేపే ఆ ప్రశ్న ఇలా ఉంది.

6. ప్రశ్న : ఏదైనా భవనపు ఎత్తును భారమితి ద్వారా తెలుసుకొనే విధానమును స్పష్టీకరించునది.

వాతావరణ పీడనాన్ని భారమితి అనే సాధనంతో కొలుస్తారు. భూమిపై గల ప్రదేశాలు సముద్రమట్టానికి ఒకే ఎత్తులో వుండవు. ఏదైన ప్రదేశంలో భారమితి ఎత్తు పెరిగినప్పుడు వాతావరణపీడనం Rise / Feet అనే రీతిలో తగ్గుతుంది. భారమితితో కనుగొన్న తగ్గుదలను 'R' అనే తెలిసిన స్థిరాంకంతో భాగిస్తే, బిల్డింగ్ ఎత్తును ఫీట్లలో లెక్కకట్టవచ్చు - ఇది శాస్త్రీయపరిధిలో ఈయవలసిన సమాధానం.

దీనికి బదులు ప్రదీప్ ఇచ్చిన సమాధానం ఇది :

'బారోమీటరునూ, ఓ పొడుగాటి తాడునూ తీసుకొని, భవనంపైకి వెళ్ళి, తాడు ఒక చివరను భారమితికి కట్టి, రెండవ చివరను చేతపట్టుకొని, అది నేలనంటే వరకు క్రిందికి బకెటులా జారవిడువాలి. నేలనంటగానే పైకిలాగుకొని, జారవిడిచిన త్రాడు భాగాన్ని స్కేలుతో కొలచినప్పుడు బిల్డింగ్ ఎత్తు స్పష్టమౌతుంది.'

శాస్త్రపరిధిలో లేని ఈ సమాధానాన్ని వదిలి, మిగతా వాటిని పరిశీలించాడు. అన్నీ సరిగ్గానే ఉన్నాయి. తిరిగి ఆరవదానికిచ్చిన సమాధానాన్ని తిరిగి పరిశీలించి, శాస్త్రీయ పద్ధతికి అనుగుణంగా లేనందున 'తప్పుగా' పరిగణించాడు. మిగతావి సరైనవే కనుక పదకొండు మార్కులను తగ్గించి, 88 మార్కులు వేశాడు. 89 మార్కులను ఆర్జించుకున్న మరో విద్యార్థి ప్రథమునిగా ప్రదీప్ ద్వితీయునిగా ఘోషింపబడ్డాడు.

ప్రదీప్ పునర్మూల్యాంకనం నిమిత్తం, విద్యాసంస్థ గవర్నింగ్ కౌన్సిల్‌కు దరఖాస్తు పెట్టకొన్నాడు. అది డా॥ వసిష్ఠ్, డా॥ భరద్వాజ్ మరియు డా॥ దుర్వాస్‌తో కూడిన త్రి సదస్యీయసమితిని డా॥ వసిష్ట్ అధ్యక్షునిగా పునః పరిశీలన నిమిత్తం నియమించింది. సమితి ఆరు గంటల పాటు చర్చించింది. డా॥ దుర్వాస్ తన పట్టుదలను వీడలేదు. డా॥ వసిష్ఠ్ మట్టుకు సమాధానం సరియైనదేనని చివరివరకూ వాదించాడు. డా॥ భరద్వాజ్ తటస్థంగా వున్నాడు. ఏకాభిప్రాయం కుదరకపోవటంతో డా॥ వసిష్ఠ్ సలహా మేరకు "ముఖాముఖి" నిమిత్తం అభ్యర్థికి ఆహ్వానం పంపారు.

ప్రదీప్ గురువారం ఉదయం 11-00 లకు కమిటీ ముందు హాజరయ్యాడు. డా॥ వసిష్ఠ్ 'ధరఖాస్తు పెట్టుకొనడానికి గల కారణమేమిటని' అభ్యర్థిని అడిగాడు.

అందుకు, ప్రదీప్ ఇలా బదులు చెప్పాడు. "సర్! నేనిచ్చినది కాంప్లేంట్ కాదు. పునరాలోచనకోసం సమర్పించుకున్న వినతిపత్రం. వంద మార్కులకు తక్కువ ఎందుకొచ్చాయో తెలుసుకోదలిచాను."

తొందరపాటు స్వభావం గల డా॥ దుర్వాస్ ఇలా అన్నారు. "ఆరవ ప్రశ్నకు నీవిచ్చిన సమాధానం సరైంది కాదు కనుక."

ప్రదీప్ అన్నాడు: "ప్రశ్నలో సూచించినట్లు భారమితిని సహాయంగా తీసుకొన్నాను. భవనం పై నుండి నేలనంటే వరకు జారవిడిచిన తాడు పొడవు బిల్డింగ్ ఎత్తుకు సమానమన్న నా జవాబు తప్పెలా అవుతుంది?"

డా॥ దుర్వాస్ మండిపడుతూ ఇలా అన్నాడు. "నీ సమాధానం శాస్త్రీయ పరిమితిలో లేదు. బకెటులా ఉపయోగించడానికా భారమితిని కనుగొన్నది! దానికి వేరే ఉపయోగముంది!"

సవినయంగా ప్రదీప్ జవాబిచ్చాడు: "భారమితిని ఎలా ఉపయోగించాలో, ప్రశ్నలో సూచింపబడలేదు. అలాంటప్పుడు ఎలా ఉపయోగించినా తప్పు ఎలా అవుతుంది?"

డా॥ దుర్వాస్‌కు కోపం రాకుండా ఎలా వుంటుంది! అయినా, ఆయన మౌనంగానే ఉండిపోయారు.

డా॥ భరద్వాజ్ కల్పించుకొని ఇలా మందలించాడు. "నీవిచ్చిన సమాధానం శాస్త్రసమ్మతం కాదు. నీవు సూచించిన పద్ధతి 'నాటు పద్ధతి'. అవునా?"

"సర్! నాటు పద్ధతులు సత్ఫలితాలనిచ్చిన ఉదాహరణలున్నాయి."

డా॥ వసిష్ఠ్ అబ్బాయిని బుజ్జగిస్తూ ఇలా అన్నాడు. "నాయనా ప్రదీప్! శాస్త్రీయపద్ధతులను ఉపేక్షించ కూడదు కదా! ఏదో కొత్తదనం పేరిట వాటిని ప్రక్కకు పెట్టడం విజ్ఞత అనిపించుకోదు."

ప్రదీప్ తడుముకోకుండా జవాబిచ్చాడు. "సులభసాధ్యమైనదాన్ని క్లిష్టం చేయడం దేనికి? సామాన్యమైన దానికి సౌందర్యం లేదా చెప్పండి సర్!"

డా॥ వసిష్ఠ్ అన్నాడు: "కాదనను. నీ సమాధానం మాకు నూటికి నూరు శాతం యోగ్యమనిపించదు. అయినా ఓ క్షణంపాటు ఓపికపట్టు."

సమితి సభ్యులు పక్కగదిలోకి వెళ్ళి ఏదో మాటాడుకున్నారు. డా॥ వసిష్ఠ్ సూచనను మిగితా ఇద్దరు అంగీకరించాక, తిరిగి స్థానాపన్నులైనారు.

డా॥ భరద్వాజ్ అన్నాడు: "మాస్టర్ ప్రదీప్! నీకు మరో అవకాశం ఇస్తున్నాం. నీవు సరైన సమాధానం ఇప్పటికైనా ఈయవచ్చు."

ప్రదీప్ సమితికి ధన్యవాదాలు తెలుపుకొన్నాక, ఇలా అన్నాడు. "ఏ సమాధానానికి గౌరవనీయులైన సభ్యులు తృప్తిపడుతారో, తెలియదు. దీనికి నావద్ద కొన్ని సమాధానాలున్నాయి. ఏ ఒకటయినా మీకు సమ్మతమయితే, సంతోషిస్తాను.

డా॥ వసిష్ఠ్ మందస్మితం చేయగా, భరద్వాజ్ తల ఊపాడు.

కోపం చల్లారని డా॥ దుర్వాస్ లోలోపల ఇలా అనుకొన్నాడు. 'ఈ పిల్లవాడు ఆచార్యులకే పర్యాయాలు సూచిస్తున్నాడు. ఈ వృద్ధ వసిష్ఠుడూ, పట్టువీడని భరద్వాజుడు కళ్ళు తెరుస్తారు.'

"సరే! కానివ్వండి" అన్నాడు డా॥ దుర్వాస్. సామంజస్యాన్ని ప్రదర్శిస్తూ.

"అబ్బాయి! నీవిచ్చే ఇంకో సమాధనమేమిటో చెప్పు" అడిగాడు డా॥ వసిష్ఠ్.

ప్రదీప్ సమాధానం చెప్పడాని కుపక్రమించాడు.

"భారమితినీ, స్టాప్ వాచీని తీసుకొని బిల్డింగ్ పైకి వెళ్ళాలి. అక్కడ నుండి భారమితని 'డ్రాప్' చేయాలి. అది నేలను తాకేందుకు వలయు కాలాన్ని అంటే 't' ని స్టాప్ వాచీతో కనుగొనాలి. ఈ సూత్రంతో విలువలను ప్రతిక్షేపించి, బిల్డింగ్ ఎత్తును కనుక్కోవచ్చు.

$S = Ut + ½ at^2$

ఇక్కడ 'S' అనగా దూరం అంటే బిల్డింగ్ ఎత్తు.

'U' అనగా ఆరంభ వేగం = O. A = త్వరణం = g = గురుత్వ త్వరణం 'g' విలువ మనకు తెలుసు కనుక బిల్డింగ్ ఎత్తు $O + ½ gt^2$ మనకు 't' విలువ 'g' విలువ తెలుసు కావున బిల్డింగ్ ఎత్తు కనుక్కోవడం కష్టం కాదు. ఈ ప్రక్రియలో భారమితి పనికిరాకుండా పోతుంది!"

ప్రదీప్ ఇచ్చిన సమాధానానికి డా॥ వసిష్ఠ్ నవ్వాడు. డా॥ భరద్వాజ్ 'భేష్' అన్నాడు. డా॥ దుర్వాస్‌కు ఆశ్చర్యం వేసింది.


ప్రదీప్ మూడవ పర్యాయాన్ని చెప్ప నారంభించాడు.

"భారమితిని కాపాడుకోవాలనుకుంటే మరో మార్గముంది. బాగా ఎండకాచిన రోజు, బిల్డింగ్ పైకి వెళ్ళి ఎక్కడేనా భారమితిని నిటారుగా పెట్టాలి. దాని నీడను కొలిచాక, కిందికి వచ్చి బిల్డింగ్ నీడను కొలవాలి. భారమితి పొడుగు ఒక ఫీటు. ఇపుడు బిల్డింగ్ నీడ పొడవును భారమితి నీడ పొడవుతో భాగించగా వచ్చిన విలువను భారమితి అసలు పొడుగుతో గుణిస్తే బిల్డింగ్ ఎత్తును అడగుల్లో లెక్కకట్టవచ్చు. బిల్డింగ్ పైకి వెళ్ళి మీ బారోమీటరును మీరు పొందవచ్చు. రెండుసార్లు పైకి వెళ్ళటం వల్ల కలిగిన శ్రమను ఎత్తును కనుగొనగాలిగామన్న ఆనందంలో మరిచిపోతారు".

డా॥ భరద్వాజ్, డా॥ వసిష్ఠ్ 'భేష్' అన్నారు.  డా॥ దుర్వాస్ మొదటిసారి చిరునవ్వు నవ్వారు.

మరో పర్యాయాన్ని ప్రదీప్ సూచించ మొదలెట్టాడు.

"లిఫ్టను వదిలేసి, భారమితిని నిటారుగా పట్టుకొని మెట్లమీదుగా బిల్డింగ్ పైకి వెళ్ళాలి.  అలా వెడుతూ ప్రతి మెట్టుమీద నిలిచి, గోడను భారమితితో కొలిచి గుర్తు పెట్టుకోవాలి.  గుర్తులను లెక్కపెట్టుకుంటూ పైకి చేరుకొనాలి.  బిల్డింగ్ ఎత్తు N x L అవుతుంది.  అందు 'N' అనగా మొత్తం గుర్తులు, L అనగా భారమితి పొడవు అంటే ఒక ఫీటు.  ఇదీ అలసట కలిగించేదే.  అయినా ఎత్తును కనుగొనడానికి సులువైన మార్గం."



డా॥ దుర్వాస్ లేచి ప్రదీప్‌తో కరచాలనం చేస్తూ ఇలా అన్నాడు" నాకిది తట్టలేదే!"

డా॥ వసిష్ట్ ఆనందరం ఆర్ణవమైతే డా॥ భరద్వాజుని ఆనందం అంబరమైంది. ఏక కంఠంతో 'శతమానం భవతు' అన్నారు.

డా॥ వసిష్ఠ్ అన్నాడు. "ప్రదీప్! నీకు నూటికి నూరు మార్కులు. నీవు ఆర్జించుకొన్నవి 99. నీవు జవాబిచ్చే నేర్పుకు ఒకటి అదనం. నీవిచ్చిన సమాధానాలతో పాటు, నీ సృజనాత్మకత మాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది".

సమితిసభ్యులు అంతా సవ్యంగా జరిగిందని అనుకొంటున్నవేళ ప్రదీప్ అన్నాడు.

"సర్! పర్యాయం ఇంకా ఒకటి వుంది. బిల్డింగ్ యజమానితో ఇలా అంటాను. ఇది పన్నెండొందలు విలువ చేసే బారోమీటరు. మీరు బిల్డింగ్ ఎత్తు చెబితే, దీన్ని కానుకగా ఇస్తాను. ఆయన చెప్పేస్తారు. శరీరానికి ఏ మాత్రం కష్టం కలిగించకుండా, కేవలం భారమితితో బిల్డింగ్ ఎత్తును ఇలా కనుగొనవచ్చు."

"నేను సూచించిన ఏ పర్యాయమూ శాస్త్ర సమ్మతం కాదు. అయినా మానవమస్తిష్కం నుండి, హృదయం నుండి కొన్ని విలువైన కల్పనలు స్ఫురిస్తాయి. ఈ కల్పనను అర్పణస్వీకారసూత్రంగా భావించవచ్చు.

ఇందు అర్పణ : బారోమీటరు. స్వీకారం : బిల్డింగ్ ఎత్తు. ఇది దైవప్రేరిత సూత్రం.

సమితిసభ్యులు విరగబడి నవ్వారు. ప్రదీప్‌ను గట్టిగా కౌగిలించుకొని అభినందనల వర్షం కురిపించారు.

ప్రదీప్ వారికి దన్యవాదాలు తెలుపుకొని, ఇలా అన్నాడు. "సర్! మరో పరిష్కారముంది."

సమితి సభ్యులు ఒకరిమొహం ఒకరు చూసుకున్నారు. డా॥ దుర్వాస్ నవ్వుతూ ప్రదీప్‌ను వారింప బోయాడు.

అయినా ప్రదీప్ అన్నాడు. "భారమితిని తీసుకొని పైకి వెళ్ళండి. భారమితితో పీడన తగ్గుదలను గుర్తించగా వచ్చిన విలువను 'K' తో భాగించండి. ఇందు 'K' ప్రతి యునిట్ ఎత్తువల్ల కలిగే పీడన తరుగుదలను సూచిస్తుంది. - ఇదే శాస్త్రీయ పద్ధతి ననుసరించి రాబట్టే సమాధానం."

మళ్ళీ అందరు నవ్వారు.

డా॥ భరద్వాజ్ ఇలా అన్నారు. "ఇవాళ నీ నుండి ఎంతో నేర్చుకున్నాము - సమస్య ఒకటయినా పరిష్కారాలు సవాలక్ష. అన్ని పరిష్కారాలకు ఏకైక స్రోతస్సు సృజనాత్మకతయే".

ప్రదీప్ అన్నాడు "ఇంకో పర్యాయముంది. ఆలోచించండి".

ఆశ్చర్య చకితులై మళ్ళీ ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు.

ఆ సమాధన మేమిటో పఠితలైన మీరు చెప్పాలి!

సృజనాత్మకత ఓ అమూల్యరత్నఖని
తవ్వేకొద్దీ రత్నాలు చేదికందుతాయి.

# 12. శుక్లపక్షంలో జాబిలి

( తాబేలు కుందేలు కథ )

కర్ణవతి అనే రాజ్యంలో వస్త్రపురం అనే గ్రామం పూర్వముండేది. ఆ గ్రామ శివారులో లంబకర్ణుడనే కుందేలు దీర్ఘసూత్రుడనే తాబేలు ఉండేవారు. వారు ఇరుగుపొరుగులే కాక ఆబాల్యమిత్రులు. మహా అందగాడినని, ప్రధావనంలో తనను మించినవారు లేరని లంబకర్ణుడు గర్వపడేవాడు. 'నాజూకు నత్త'వని 'సోమరిపోతువ'ని దీర్ఘసూత్రుణ్ణి ఎప్పుడూ ఎగతాళిచేసేవాడు. అయినా, నిమ్మకునీరెత్తినట్లు దీర్ఘసూత్రుడు ఉండేవాడు.

ఎంతటి సహనశీలియైనా, ఎంతకాలం మౌనంగా ఉండగలుగుతాడు? లంబకర్ణుని కవ్వింపులకు కోపపరీతమానసుడై ఒకనాడు దీర్ఘసూత్రుడు నోరు విప్పాడు.

"నేను వయ్యారి నడకల నత్తను; నీవు చెంగలిచే కురంగశాబకానివా? ఇది నీకు నీవే నిర్ణయించుకొన్నావా? ఎనడైనా పరుగుపందెంలో నాతో పాల్గొన్నావా? స్వర్ణం ఏ మేరకు స్వర్ణమనేది నికషోపలమే నిర్ణయిస్తుంది. ఏ మానదండాన్ని, ఏ పరీక్షను దృష్టిలో పెట్టుకొని మాటాడుతున్నావో, నా ఊహకు అందకుండా వుంది."

లంబకర్ణునికి ఆశ్చర్యం వేసింది. 'ఎన్నడూ నోరు మెదపని దీర్ఘసూత్రుడు ఇంతటి ధారాశుద్ధిని కనబరుస్తున్నాడేమిటి?' అయినా, ఏ భావాన్ని ముఖకవళికలో వెలార్చకుండా ఇలా అన్నాడు. "జటిల పదజాలాన్ని ప్రయోగించి నా నోరు మూయించాలని చూస్తున్నావు. ఖద్యోతం సూర్యుడు కాదని నిరూపించేందుకు ప్రత్యక్షాది ప్రమాణాలు కావాలా? నీవు అలసగమనుడవు; నేను మనోవాయుజవంతో పరుగెత్తు పటిమ కలాడను. ఇది జగమెరిగిన సత్యం."

దీర్ఘ సూత్రుడు లవలేశమైనా చలించకుండా ఇలా అన్నాడు. "తాడోపేడో తేల్చడానికి పరీక్ష అవసరం. నీవెంత వితండానికి దిగినా నా భూమిక మారదు".

---

శివారు = పొలిమేర

మాటల్లో వెటకారాన్ని చేరుస్తూ లంబకర్ణుడిలా అన్నాడు. "పరీక్ష పేరు చెబితే చెవులు వాలుస్తానా ఏం! ఏకాస్త అలికిడి అవగానే చేతులు కాళ్ళు ముడుచుకొనే కోవకు చెందినవాణ్ణి కాదు. రేపే మన ఇద్దరి మధ్య ప్రధావన స్పర్థ. వస్త్రపురం నుండి పాల్డీకి".

సమ్మతి సూచకంగా దీర్ఘసూత్రుడు తలను సాచాడు.

మరుసటి దినం సరిగ్గా ఉదయం 10-00 లకు పరుగుపందెం మొదలైంది. వారికి చిరపరిచితుడైన శుకుడు నిర్ణేతగా వ్యవహరించడానికి అంగీకరించాడు.

ఒకటి.... రెండు.... మూడు కీ....

లంబకర్ణుడు బాణంలా దూసుకొనిపోయి నడిమజిలీని చేరుకున్నాడు. వెనుదిరిగి చూశాడు. దీర్ఘసూత్రుని జాడేలేదు. గట్టుపై పచ్చని చెట్లతో కలకలలాడే ఓ చెరువును చూసి 'వాడు రావడానికి యుగాలు పడుతుంది'. అన్న ధీమాతో కాసేపు విశ్రమించాలని నిర్ణయించుకొన్నాడు. నీరు తాగి ఓ మర్రి చల్లని నీడలో మేనువాల్చాడు.

మధురజలాలు - మందమారుతం - మర్రి నీడ. మత్తెక్కించేవి ఇన్ని ఉన్నాక నిదురోకుండా, ఏ ప్రాణి ఉండగల్గుతాడు! మేను వాల్చిన మరుక్షణం లంబకర్ణుడు నిద్రాదేవికి వశుడయ్యాడు.

ఈలోగా, దీర్ఘసూత్రుడు మైలురాయి తరువాత మైలురాయిని దాటేస్తూ, దాహం వేసినా చెరువులోని నీరు తాగకుండా, పాల్డీ పొలిమేరలను చేరుకొని ప్రధావనాంత రేఖపై నిల్చున్నాడు.

ఎత్తైన నీలిగిరితరుశాఖిపై కూర్చున్న శుకుడు ఇది గమనించి ఇలా పలికాడు. "దీర్ఘసూత్రా! నీవు జయించావు. అభినందనల నందుకో! ఇంతకూ, లంబకర్ణుడెక్కడ?"

రొప్పుతూరోజుతూ పరుగెత్తుకుంటు వస్తూవున్న సవ్వడిని విని ఇరువురు అప్రమత్తులైనారు. కొన్ని క్షణాల తరువాత లక్ష్యాన్ని చేరుకొని, తత్పూర్వమే ప్రధావనాంత రేఖపై నిల్చున్న ధీర్ఘసూత్రుణ్ణి చూసి నిలువునా నీరయిపోయాడు.

ఇది ఇలా జరగడానికి కారణమేమిటంటే :

నీడలు సన్నగిల్లాక, సూరీడు మేనికి చురకలంటించడంతో, లంబకర్ణుడు నిదురలేచి, వస్త్రపురం వైపు దృష్టి సారించాడు. దీర్ఘకర్ణుడు కనుచూపుమేరలో లేకపోవడంతో, చాలా వెనబడిపోయినట్లు భావించుకొని, పాల్డీ వైపు పరుగు ప్రారంభించాడు. జన్మలో చవిచూడని చేదునిజం కట్టెదుట దీర్ఘసూత్రుని రూపంలో నిలిచివుంది.

దీర్ఘసూత్రుడు నవ్వుతూ అన్నాడు. "మిత్రమా! నిదానమే ప్రధానం".

శుకుడు దీర్ఘకర్ణుడన్నదాన్నే మళ్ళీ అన్నాడు.

లంబకర్ణుడు హతాశుడై తలను వాల్చాడు.

కథ కంచికి వెళ్ళలేదు....

ఇలా ఘోరపరాజయాన్ని చవిచూసి, లంబకర్ణుడు ఇంటిదారి పట్టాడు. ఇల్లు చేరాక వెక్కివెక్కి ఏడ్చాడు. మూడు రాత్రులు కంటికి కునుకు లేదు. అవమానాగ్నిలో దహ్యమానుడైనాడు. ఎంత ఆలోచించినా ఓటమికి కారణం వాడికి అంతుపట్టలేదు.


వచ్చే ఆలోచనల దొంతరులు వాణ్ణి ఉక్కిరి బిక్కిరి చేసినవి. 'నేనెందుకు ఓడిపోయాను? దీర్ఘసూత్రుడు అడుగు ముందు వేయడానికి నానా అగచాట్లు పడతాడు! వాడిలో 'ఉన్నది' నాలో లోపించిన దేమిటి?'


ఈ దీర్ఘవిశ్లేషణ వాడికి ప్రయోజకారిగా పరిణమించింది. ఎవరిలో ఏ శక్తిసామర్థ్యాలూ బలహీనతలూ ఉన్నాయో సరిగ్గా అంచనా వేయగలిగాడు. 'నాలో జవం ఉంది; వాడిలో విధానముంది. పరిమాణం నా సొత్తు అయితే నాణ్యత వాడి సర్వస్వం. పరిమాణం నాణ్యతో పోటీపడజాలదు. నాణ్యతను పెంచుకొనే దిశలో అహోరాత్రాలు పరిశ్రమిస్తాను. నా ప్రతి కదలికను లయాన్వితం చేసి క్రమబద్ధం చేస్తాను'.


మరునాడే అభ్యాసానికి పూనుకున్నాడు. అలసతనూ నిద్రను నియంత్రించడంలో కృతకృత్యుడైనాడు. కొంతమేరకు ప్రగతిని సాధించినాడు. 'అభ్యాసం కూర్చు విద్య' - పెద్దలు ఊరికే అన్నారా? అలుపెరుగని పరుగును అలవరుచుకోవడమే కాకుండా, పనివేళలో కునుకుతీసే బలహీనతను పూర్తిగా వదలించుకొన్నాడు. సమయం చేయిజారితే అవకాశం చేయిజారుతుందని గ్రహించాడు.

లంబకర్ణుని ఆలోచనాశైలి పలువన్నెలను సంతరించుకుంది. 'ఉద్యమశీలుని ప్రధానమైన సంసాధనం సమయమే. కోల్పోయిన క్షణం మళ్ళీ చేజిక్కదు. నిధిని కోల్పోయి పెన్నిధిని సాధించవచ్చు. సాధనాల్ని మళ్ళీ సమకూర్చుకొనవచ్చు. ఏనాడూ సమయం మనకోసమే వేచియుండదు. సమయం తిరోగమన మెరుగదు. అది బాణంవంటిది. స్వల్పాతిస్వల్పవ్యవధిలో పాల్డీని చేరే సుగమమార్గాన్ని ఏడాదిపాటు శ్రమించి కనుగొన్నాడు. గమనాన్ని క్రమబద్ధం చేయడంలో సఫలుడైనాడు.

దైనందినగగనవిహారంలో శుకుడు ఇదంతా కనిపెడుతూనేవున్నాడు. లంబకర్ణుడు సాధించిన ప్రగతికి సంతోషిస్తూ రెక్కలల్లార్చాడు.







ఏడాది చివర లంబకర్ణుడు దీర్ఘసూత్రునితో ఇలా అన్నాడు. ''నీవు విజేతగా గెలుచుకొన్న రజతపాత్ర వత్సర పరిమితమే - మరో సంవత్సరానికి దీనిని నీ దానిగా చేసుకోవాలనుకుంటే, నాతో మళ్ళీ స్పర్ధకు దిగాల్సి వుంటుంది.''

దీర్ఘసూత్ర కచ్ఛపునకు ఆశ్చర్యం వేసింది. లోలోపల ఇలా అనుకొన్నాడు. 'ఈ నిదురపోతు బుద్ధి మళ్ళీ పెడదారిపట్టిందేవిటి? పోయిన సంవత్సరం ఓటమి నుంచి వీడేమీ నేర్చుకొనలేదు. మళ్ళీ పోటీకి దిగుతానంటున్నాడు. ఈవెధవాయి పుట్టిని నిదుర నట్టేట ముంచేస్తుంది!'

అన్ని విధాల స్పర్ధకు సన్నద్ధులై, జిగీషువులై ప్రధావనారంభ రేఖపై నిలుచున్నారు.

నిర్ణేతయైన శుకుడు ఒకటి.... రెండు.... మూడు.... కీ అన్నాడు.

వెంటనే కుందేలు గాలిలో కుప్పిస్తూ, ముందుకు దూసుకొని పోయింది. తాబేలు తాపీగా నేలను అడుగులతో కొలుస్తూ లక్ష్యం వైపు నడక సాగించింది. చాలా సేపటికి, చెరువుగట్టును చేరుకొని, కుందేలు మఱ్రి కింద ఉందేమోనని కలయచూసింది. ప్రతిస్పర్ధి కనుపించకపోవడంతో ఖంగుతిన్నది. నానా తంటాలు పడి పొద్దువాలే వేళ ముగింపు గీతను చేరుకొని, తనకన్నముందే లక్ష్యాన్ని సాధించిన కుందేలును చూసి అవమానంతో మేనును కుదించుకొంది.

లంబకర్ణుడు హాస్యంతో పరిహాసాన్ని మేళవిస్తూ అన్నాడు ''శీఘ్రతా స్థైర్యాలే ప్రధానం.''

శుకుడు లంబకర్ణుడన్నదాన్నే మళ్ళీ అన్నాడు. దీర్ఘసూత్రుడు దేబెమొహం వేశాడు.

కథ కంచికి చాలా దూరంలో వుంది.

దీర్ఘసూత్రుడు సొంత గూటిని చేరుకున్నాడు. శీఘ్రగామి కానందుకు తన్నుతాను ఎంతో నిందించుకొన్నాడు. అంగసంహరణం కావించుకొని యోగిలా కొన్నిక్షణాలపాటు ధ్యానమగ్నుడైనాడు.

ఓటమిని దిగమింగి నింపాదిగా ఆలోచించ మొదలెట్టాడు. అతని ఆలోచనా సరణి విశ్లేషణతో మొదలై సృజనాత్మకంగా ముగిసింది. వాస్తవత సంపూర్ణంగా గ్రాహ్యమైంది.

లోలోపల దీర్ఘసూత్రుడు ఇలా అనుకొన్నాడు.

'లంబకర్ణుడు తన బలహీనతల్ని పూర్తిగా వదిలించుకొన్నాడు. అతనిలో ఏ బలహీనత లవలేశమైనాలేదు. మార్పుచేర్పులతో, నూత్న వ్యక్తిత్వాన్ని సంతరించుకొన్నాడు. నా విధానం దోషరహితమే అయినా, ఏ ప్రయోజనాన్ని సమకూర్చలేదు. సాంప్రతం కింకర్తవ్యం?'

ఆలోచిస్తూ పోతుంటే, ఓ సరికొత్త ఊహ మనః కవాటాన్ని తట్టింది. 'బలహీనతలకు సామర్థ్యానికి మన ఆలోచన పరిమితం కాకూడదు. కేంద్రకీయ క్షమత (Core Competence) మాటేమిటి? దాన్ని నిశితం చేస్తూ వికసింప చేసుకోవడం ఇక ముందు నా ప్రధానలక్ష్యమై యుండాలి.' ఓ ఏడాదిపాటు ఈ దిశలో అహోరాత్రాలు పరిశ్రమించాడు.

ఏడాది చివర, తెలతెలవారు లేచి నిత్యకృత్యాలు ముగించుకొని, దీర్ఘసూత్రుడు లంబకర్ణుని దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు. "మిత్రమా! గెలుచుకొన్న రజతపాత్ర వర్షపరిమితమని నీవన్నమాటను గుర్తుకు తెచ్చుకో. రేపు ఉగాది. మన మధ్య మరో పరుగుపందెం ఏర్పాటు చేసుకుందాము. ఏమంటావ్?

లంబకర్ణుడు ఇది విని నిర్ఘాంతపోయి ఇలా అన్నాడు: "మళ్ళీ పరుగుపందెమట్రా! నీకేమైనా మతిపోయిందా? ఎందుకురా ఇంత రణకండూతి? మళ్ళీ ఓడిపోవాలనుందా!"

దీర్ఘసూత్రుడు మేరునగధీరత్వంతో, అణుమాత్రం చలించకుండా ఇలా అన్నాడు: "జయాపజయాలు దైవాధీనాలు. సాహసేలక్ష్మీ. ఎవడి ప్రాప్తాన ఏముందో రేపు పరీక్షించుకొందాము."

గమనంలో లయనూ క్రమాన్నీ సాధించుకొన్న ఆత్మ విశ్వాసంతో, లంబకర్ణుడు తన అంగీకారాన్ని తెలిపాడు.

"ఎక్కడ ఆరంభించి, ఎక్కడ ముగించాలనుకుంటున్నావు? దీర్ఘసూత్రుడు అడిగాడు.

"వస్త్రపురం నుండి పాల్డీకి" జవాబిచ్చాడు లంబకర్ణుడు.

"పాడిన పాటే ఎప్పుడూ పాడడమా? శ్రోతలకు విసుగెత్తుతుంది. పోయిన బాటే మళ్ళీ మళ్ళీ పోతే మనవైపు ఎవడు చూస్తాడు? మనం కొత్తగా ఏం నేర్చుకుంటాం? అందుకే క్షేత్రపరివర్తనం అవసరం. నూత్నపథాన్ని ఎన్నుకొని నూతనత్వానికి స్వాగతం పలుకుదాం!" అన్నాడు దీర్ఘసూత్రుడు.

ఈసారి శుకుడు దీర్ఘసూత్రుడన్న చివరి మాటను మళ్ళీ అనకుండా, ఇలా స్పందించాడు. "ఇది ఆమూలాగ్ర పరివర్తన."

శుకుడన్నది పెద్దగా పట్టించుకోకుండా లంబకర్ణుడు అన్నాడు. "ఏ ప్రధావనపథం నీదృష్టిలో వుంది?"

"పాల్డీలో ప్రారంభించి, కాలూపూర్ పొలిమేరల్లో ముగిద్దాం." దీర్ఘసూత్రుడు సూచించాడు.

'చక్కని ఆలోచన' అంటూ తన సమ్మతిని తెలిపాడు లంబకర్ణుడు.

"చక్కని ఆలోచన" అన్నాడు శుకుడు.

మరుసటి రోజు ఉగాది. నేస్తాలిరువురు సరిగ్గా ఉదయం 10-00 గంIIలకు పాల్డీ పొలిమేరల్లోని ప్రధావనారంభ రేఖపై (పూర్వపు ముగింపు రేఖ) నిలుచున్నారు. లంబకర్ణుడు తన వేగవిధానాలపై నమ్మకం కలవాడు కాగా, దీర్ఘసూత్రుడు తనకు స్ఫురించిన నవ్యకల్పనపై ఆశలు పెట్టుకొన్నాడు. ఇద్దరూ అప్రమత్తులైనారు.

నిర్ణేత అయిన శుకుడు అన్నాడు.

"ఒకటి.... రెండు.... మూడు.... కీ".

ఓలంపిక్ క్రీడల్లో నాలుగువందల మీటర్ల పరుగుపందెంలో స్వర్ణపతకాన్ని గెలుచుకొన్న పి.టి. ఉషావలె, లంబకర్ణుడు పరుగు ప్రారంభించాడు. యథాపూర్వం దీర్ఘసూత్రుడు నడక సాగించాడు. శుకుడు గగనమార్గాన్ని పట్టినవాడై లంబకర్ణునితో బరాబరులు సలుపుతున్నాడు.

లంబకర్ణుడు ముందుకు దూసుకొనిపోతూ, హఠాత్తుగా ఆగిపోయాడు. ఎదుట సాబర్మతీ నది. అది పాల్డీ కాలూపూర్ మధ్యలో వుంది. స్థాణువులా నది ఒడ్డున నిలబడిపోయాడు. కాలం నిముషాలై, నిముషాలు గంటలై ముందుకు సాగిపోతున్నది. ఓ గున్నమావి కొమ్మను జేరి, శుకుడు లంబకర్ణుని కేసి జాలిగా చూస్తున్నాడు. క్షితిజంపై సూర్యునిలా దీర్ఘసూత్రుడు దృగ్గోచరుడై నది ఒడ్డును కాసేపటికి చేరుకున్నాడు. ఏమీ పాలుపోక నిశ్చేష్టుడై పడియున్న లంబకర్ణుని కడగంట చూసి, ఒడ్డు నుండి నదిలోకి దిగి, ప్రవాహంలోకి ప్రవేశించి, జెట్‌బోట్‌లా ఈదుకుంటూ వెళ్ళి, అవలి దరిని చేరుకొన్నాడు. మళ్ళీ ఒడ్డెక్కి కాలూపూర్ దిశలో నడక మొదలెట్టాడు. మధ్యమధ్య ఆగుతూ, ఆకాశమార్గంనుండే శుకుడు దీర్ఘసూత్రుని అనుసరించాడు. ఎట్టకేలకు కాలూపూర్ పొలిమేరల్లోని ముగింపు రేఖపై నాల్గు కాళ్ళు నిలిపి, శుకునిచే విజేతగా ప్రకటింపబడి, అభినందనల నందుకొని తిరుగు ప్రయాణం మొదలెట్టాడు. మళ్ళీ నదిని దాటి తటాన్ని అధిరోహించి చేష్టలుడిగి పడియున్న లంబకర్ణుని సమీపించాడు. శుకుడు గున్నమావి కొమ్మకు మళ్ళీ చేరుకొన్నాడు. దీర్ఘసూత్రుణ్ణి విజేతగా మరోమారు ప్రకటించాడు. దీర్ఘసూత్రుడు మందస్మితం కావిస్తూ ఇలా అన్నాడు. "నావీన్యతా స్థైర్యాలే ప్రధానం."

శుకుడు దీర్ఘసూత్రుడన్నదే మళ్ళీ అన్నాడు.

ఇద్దరు మిత్రులు తమతమ ఇండ్లను చేరుకున్నారు. లంబకర్ణుడు ఆలోచిస్తున్నాడు; దీర్ఘసూత్రుడు ఆలోచిస్తున్నాడు. ఇద్దరు దీర్ఘాలోచనలో మునిగిపోయారు.

'ఇద్దరం ఆలోచిస్తామన్న' సంగతి ఇద్దరికీ తెలుసు. మళ్ళీ సంవత్సరంపాటు కేంద్రకీయక్షమతనూ, విధానాన్ని, గమనవేగాన్ని గరిష్ఠస్థాయికి పెంచుకొనే మార్గంలో సాధనకు పూనుకున్నారు. ఏడాది చివర, ఒక చోట సమావేశమై ప్రధావనస్పర్థకు దిగాలని నిర్ణయించుకొన్నారు.

ఈ నిర్ణయానికి పూర్వం, దీర్ఘసూత్రుడు లంబకర్ణునితో అన్నాడు: "మిత్రమా! లంబకర్ణా! పరుగుపందెం మళ్ళీ అవసరమనుకుంటున్నావా?"

లంబకర్ణుడన్నాడు : "ఔను! అయితే ఈసారి ఒక నూత్న పంథాను అనుసరింతాము".

అందుకు దీర్ఘసూత్రుడు ఇలా అన్నాడు "గతంలోని స్పర్థలన్నీ సదోషమైనవి". ఏమంటావ్?

లంబకర్ణుడు అన్నాడు: "నిజమే! గెలుపు - ఓటమి ప్రాతిపదికగా ఇదివరలో పరుగుపందెంలో పాల్గొన్నాము. ఇలాంటి స్పర్థలు వ్యక్తి నుండి వ్యక్తిని విడదీస్తాయి. ఈర్ష్యనూ, వైరాన్నీ పెంచుతాయి. సహజీవన స్వాస్థ్యాన్ని భంగపరుస్తాయి. ఉభయులకూ శ్రేయస్కరమైన గెలుపు గెలుపు పందెంలో పాల్గొని ఇద్దరమూ విజేతలమవుదాము."

దీర్ఘసూత్రునకు ఈప్రతిపాదన ఎంతో నచ్చింది స్వభావంలో లేని ఉత్సాహంతో 'పాల్డీ నుండి కాలూపూర్‌కు' అన్నాడు. ఇద్దరు ఖుషీ ఖుషీగా ప్రధాన రేఖను చేరుకున్నారు.

శుకుడు అరచాడు 'ఒకటి.... రెండు.... మూడు.... కీ....'

దైవలీలలను తలపించేదీ, కొత్త ఒరవడిని సృష్టించేదీ, సర్వజన నేత్రపర్వమైనదీ అయిన ఓ సంఘటన జరిగింది. మొదట దీర్ఘసూత్రుణ్ణి వీపున నిడుకొని లంబకర్ణుడు సాబర్మతీ తీరం వరకు శరవేగంతో పరుగెత్తాడు. ఆ తరువాత, దీర్ఘసూత్రుడు లంబకర్ణునకు వాహనమై నదీప్రవాహాన్ని అవలీలగా దాటి ఆవలిదరిని చేరుకున్నాడు. లంబకర్ణుడు మిత్రుడైన దీర్ఘసూత్రుని పృష్ఠభాగమున చేర్చుకొని ఇతోధిక వేగంతో లక్ష్యాన్ని - అంటే కాలూపూర్ పొలిమేరల్ని చేరుకొన్నాడు; స్వల్పాతిస్వల్ప వ్యవధిలో స్పర్థను ముగించారు.

శుకుడు సంతోషంలో రెక్కలల్లార్చాడు.

మిత్రులిరువురు తాము వేరువేరుగా ఏర్పర్చుకొన్న ప్రమాణస్థాయి నధిగమించి చరిత్ర సృష్టించారు. ఒకరికొకరు కౌగిలించుకొని, అభినందన పరంపరతో ఉక్కిరిబిక్కిరి గావించుకొన్నాక, దీర్ఘసూత్రుడు ఇలా అన్నాడు. "అతీతంలోనివన్నీ తప్పుడు పందెములే! స్పర్థాత్మక క్రీడలన్నీ లోపాలతో కూడినవే! వేగంలో, నిర్వహణలో, విధానంలో స్వీయస్థాయిని మెరుగుపరుచుకోవాలి. మన రికార్డును మనమే అధిగమించాలి."

ఈసారి శుకుడు ఒకడన్నదాన్ని మళ్ళీ అనకుండా, తొలిసారి తన సొంత అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు: "కుందేలు తాబేలు కాజాలదు. అలాగే తాబేలు కుందేలు కాజాలదు. ఎవరి శైలి, వ్యక్తిత్వం వారిదే. కుందేలు తనను మించిన కుందేలు, తాబేలు తనను మించిన తాబేలు అయ్యేందుకు పరిశ్రమించాలి. పరిణతి అవిరామంగా సాగే ప్రక్రియ."

తాబేలూ కుందేలూ చేయీచేయీ కలిపి, పైకెత్తి ఏకకంఠంతో ఇలా ఉద్ఘోషించాయి.

"ఒకరికొకరు సహకరిస్తూ, కొత్త ఒరవడిని ఏర్పరుస్తూ, కార్యక్షమతను పెంచుకొంటూ, స్థైర్యంతో ధైర్యంతో ముందుకు సాగితే జయం మనదే."

శుకుడు ఉత్సాహంతో రెక్కలల్లారుస్తూ ఈల వేశాడు. జగత్తు వేనోళ్ళతో మిత్రద్వయాన్ని శ్లాఘించింది.

అయినా కథ కంచికి వెళ్ళలేదు.

స్పర్థకు దిగాల్సింది నీవు నీతోనే. ప్రగతిపంథాలో, గమనం సాగిస్తూ నిన్ను నీవు నిరూపించుకో. అనురాగభావనా ప్రేరితుడవై సాటివాడితో నడక సాగించు.

# 13. తారతమ్యత

( అర్జునుడు - ఏకలవ్యుడు, ద్రోణాచార్యుడు )

పాండవమధ్యముడైన అర్జునుడు ధనుర్విద్యాపారగుడు. సాటిలేని ధనుర్ధరుడన్న వాని కీర్తి దిగంతములకు వ్యాపించినది. ధార్తరాష్ట్రపాండవులకు గురుస్థానీయుడైన ద్రోణాచార్యునకు అనుగు శిష్యుడు. ఆచార్యునియెడ విధేయుడై అన్నివేళలు మెలిగేవాడు. సంవాదంలో, చర్చలో, విచారవినిమయంలో సంయమనం పాటించేవాడు. ఎదురుప్రశ్నలతో గురువును ఏనాడూ విసిగించలేదు.

అర్జునుని విద్యావివేకవినసంపన్నతకు కడు ముగ్ధుడై, ద్రోణుడు 'ధనుర్ధలన్యులు నీకంటె నధికులు గాకుండునట్లు గరుపుదు విలువిద్య' అని ఏకాంతమున నున్న వేళలోనే కాక బాహటంగా ప్రకటించినాడు.

గురుకులంలో ఉండి, రాజకుమారులు క్షాత్రోచిత సకలు విద్యలు నేర్చినారు. స్నాతకోత్సవము నుసంపన్నమైనది. ధృతరాష్ట్రుడు ఆదేశించగా విదురుడు స్థాపత్యవిద్యావిశారదులైన శిల్పులను, అసమాన కార్యక్షమతగల తక్షకులను, కడునేర్పరులైన కర్మారులను నియోగించి సందర్శనరంగమును సిద్ధము చేయించినాడు. రాజకుమారులు గదాకార్ముకప్రాసాదివివిధాయుధప్రయోగప్రావీణ్యాన్ని రాజన్యుల ముందు, సామాన్యుల ముందు ప్రదర్శించి ప్రశంసల నందుకొన్నారు. రాకుమారులందరిలో మేటిగా అర్జునుడు గుర్తింపును పొందినాడు.

వివిధక్రీడాస్పర్థలు ఊపునందుకున్న వేళ, అహీనప్రేక్షక సందోహాన్ని ప్రభూతాశ్చర్యులను కావిస్తూ, సహజకవచకుండలోద్భాసితుడైన కర్ణుడు రంగమధ్యమున నిలిచి, అర్జునుని పోటీకి ఆహ్వానించాడు. అస్త్రవిద్యాస్పర్ధ రాజవంశీయులకే పరిమితమని పలుకుతూ, కృపాచార్యుడు కర్ణుని అభ్యర్థనను త్రోసిపుచ్చినాడు.

క్రీడామహోత్సవం చరమదశకు చేరుకున్నవేళ, అర్జునుడు మహేష్వాసునిగా, రణపాండితిలో అసమానునిగా ప్రకటింపబడ్డాడు. ద్రోణాచార్యులు తన కుమారుడైన అశ్వత్థామకు నేర్పని విద్యలు తనకు నేర్పినందుకు అర్జునుడు కడుసంతసిల్లి, పాయని శ్రద్ధాభక్తులతో గురువులను సేవింపసాగినాడు. అయినా, తనంతవాడు లేడన్న అహంభావము మనస్సులో మొలకెత్తి, మొక్కయై రోజుకో మారాకువేయదొడగినది.

ద్రోణాచార్యులు వెంటరా, పాండుకుమారులు మృగాయార్థం ఓ ఘనార్ణ్యంలో ప్రవేశించారు. ఓ భయంకర వన్యశ్వానం మొరుగుతూ వారున్న కడకు పరుగెత్తుకుంటూ వచ్చింది.

అర్జునుడు కించిత్తైనా చలించినివాడై, సోదరులను ఆకుతోభయులను కావిస్తూ, ఓ తీక్షణనారాచాన్ని ధనువుతో సంధానించి, ప్రత్యాలీఢపాదుడై ఆకర్ణాంతం జ్యాకర్షణం చేస్తున్నవేళ, ఏ దిశ నుండియో నాల్గుబాణాలు దూసుకొని వచ్చి కుక్క నోటిని సంవృతం కావించినవి. కుర్కురం కరవడం అలావుంచి, మొరగలేని స్థితిలో విలవిలలాడుతూ ధూళిలో దొరలసాగింది.

యుధిష్ఠిరుడూ, భీముడూ, నకుల సహదేవులు వివర్ణవదనులై చూస్తూ నిలబడిపోయారు. అర్జునుడు విస్మయాధీనుడైనాడు. ద్రోణాచార్యులు ధనుర్విముక్త బాణసంరచనను నిశితంగా పరిశీలించి, విలుకాని శబ్దవేధిత్వాన్ని కొనియాడుతూ 'ఎవరా' అని నలువైపులు కలయజూశాడు. మలీమసకృష్ణదేహుడైన యువనిషాదుడు వారికి కొన్ని క్షణాలకు దృగ్గోచరుడైనాడు. నడకలో హుందాతనాన్ని కనబరుస్తూ వచ్చి ఆచార్యుల కట్టెదుట నిలిచాడు. నల్లవాడే అయినా అందగాడు. ఆనన నేత్రాలతీరు పెద్దింటివాడని చెప్పక చెబుతున్నాయి.

ద్రోణాచార్యులకేసి అర్జునుడు చూశాడు. ఆ చూపులో ఎన్నో మౌనప్రశ్నలు ఒదిగి వున్నాయి. '★నన్ను అసమానధనుర్ధరుని చేస్తానని ప్రతిజ్ఞ కావించియుంటిరే! వీడి శబ్దవేధిత్వం నాకు ఆవగింజత్తైనా అబ్బేట్టు చేశారా? ఇంతకు మీ ఈ ప్రచ్ఛన్న శిష్యుడెవడు? మిమ్మల్నీ నన్నూ ఈ అనామక పంచజనుడు విలువిద్యలో మించిపోవడమా?.... ?.... ?....'

శిష్యుని నిర్వేదాన్ని ఆచార్యుడు అర్థం చేసుకొన్నాడు.

యువనిషాదుడు ద్రోణాచార్యుల మ్రోల శిరసా ప్రణమిల్లాడు. ఆచార్యుడు అడిగాడు "నీవేనా నాల్గు అమ్ములేసి ఈ కుక్క నోరు మూయించినది?

ఆటవికయువకుడు నతశిరస్కుడై ఇలా అన్నాడు. "ఈ పని చేసినది నేనే. ఇది మీపైబడి కరచి గాయపరచి యుండేది. దీన్ని చంపకుండా మీకు కీడొనర్చని దానిగా చేశాను.

---

★ప్రయతిష్యే తథాకర్తుం యథా నాన్యో ధనుర్ధరః
ఆదిపర్వం - వ్యాసభారతం.

కర్ణుడు ఈర్ష్యాభావంతో రగిలిపోతున్నాడు. మిగతా సోదరులు న్యూనభావనాధీనులైనారు.

ద్రోణుడు చిరునగవుతో ఇలా అన్నాడు. "నాయనా! విలువిద్యలో నేర్పును చూపించావు. నీవెవరివాడవు? నీ నామధేయమేమి?"

అరణ్యవీరుడు ప్రశ్రయమూర్తియై ఇలా అన్నాడు "ఆచార్యా! నిషాదాధిపతియైన హిరణ్యధన్వుని కుమారుడను. నన్ను ఏకలవ్యుడంటారు".

ఆచార్యుడు మళ్ళీ ప్రశ్నించాడు. "ఎవరి నుండి నీకు విలువిద్య అబ్బినది?"

"మా గురుదేవుల నుండి".

"ఎవరాయన? నీవంటి వానిని ఛాత్రునిగా బడసిన అతడు నిస్సందేహంగా ధన్యచరితుడే. అతని దర్శనభాగ్యం నాకు కల్పింతువా?"

స్మితపూర్వవదనంతో ఏకలవ్యుడు అన్నాడు. "అంత మాట అనకండి, స్వామీ! నా గురుదేవులు పుణ్యశ్లోకులూ, జగన్మాన్యులూ అయిన ద్రోణాచార్యులవారు".

ఇది విన్నాక, పాండుకుమారులను నిశ్చేష్టులను గావించే సాంద్రమౌనం వారిని ఆవహించింది. 'అమిథ్యావచనులని నమ్ముకొన్న గురుదేవులు ఇలా వ్యవహరించారు! ప్రచ్ఛన్నాధ్యాపనానికి పాల్పడుదురని కలలోనైనా ఊహించలేదు'. ఇలా లోలోపల అర్జునుడు వ్యథితుడవుతుంటే, కవలలు తమ నిరసభావాన్ని చూపులలో ప్రస్ఫుటం చేశారు. యుధిష్ఠిరుడు తన సహనాన్ని ఇసుమంతైనా కోల్పోనీక, ఆచార్యుని సందేహనివృత్తికై మౌన నివేదన చేశాడు.

ఆచార్యులు మేరునగగంభీరుడై ఏకలవ్యుని వైపు చూస్తూ ఇలా అన్నాడు. "నీవు నీ ఆచార్యుని నుండి ఏ వేళ, ఎక్కడ ధనుర్విద్యాభ్యాసం చేశావు?"

ఏకలవ్యుడు పరమభక్తితో ఆచార్య ద్రోణుని చరణద్వయాన్ని ఉపసంగ్రహించి గురువులడిగిన దానికి ఇలా సమాధానం చెప్పాడు. "స్వామీ! మీరే నా గురువర్యులు. ఎళ్ళవేళలూ నాలోని దీపమై వెలిగేది మీరే."

ఏకలవ్యుని శ్రద్ధాప్రేరితవచనాన్ని పాండు కుమారులు ఆకర్ణించారు. 'గురూణాం గురుః' అయిన ద్రోణులు మరోమారు మందస్మితం కావించారు. ఎదలో విస్ఫులింగంగా ఎగసిన ఈసు దవానంలా వ్యాపించి అర్జునుని నిలువెల్లా దహించివేసింది.

ఏకలవ్యుడు ఎన్నాళ్ళుగానో మనోనిక్షిప్తమైన భావనను గురువునకు నివేదించ నెంచి శబ్దాల నాశ్రయించాడు. "ఆచార్యా! దేశంలోని నలుమూలల నుండి మీ గురుకులంలో చేరిన రాకుమారులకు క్షాత్రోచిత విద్యలను గరపుతున్న వేళ, ఒకనాడు మీ సందర్శనార్థం వచ్చాను. అక్కడ చేరిన ఛాత్రుల్ని, రమ్యపరిసరాలను జూచి ఎంతో ప్రభావితుణ్ణి అయినాను. అర్జునుని తీరు నన్నెంతో ఆకట్టుకొన్నది. అతడు ప్రదర్శించిన ఏకాగ్రత, శ్రద్ధ, నిర్దుష్టత, కదిలికలో పొదుపరితనాన్ని పట్టి విశ్వవిజేత స్థాయికి ఎదుగుతాడన్న నమ్మకం నాకు కలిగింది. అదే క్షణం నుండి అతనిని ఆదర్శంగా పెట్టుకొన్నాను. అతనికి ఈడుగాగల ధన్విగా ఎదిగేందుకు ఆనాటి సాయంవేళ మిమ్మల్ని శిష్యునిగా చేకొనుడని వేడుకున్నాను. మీరు నా పేరును, వంశాన్ని, ఇతర వివరాల్ని అడిగితెలుసుకున్నారు.

పరమదయాళువులైన మీరు నాతో అన్నమాటలివి: 'నాయనా ఏకలవ్యా! నిన్ను నిరాశపరుస్తున్నందుకు విచారిస్తున్నాను. రాజవంశీయులైన యువకులూ, ఆచార్య తనూజులూ గురుకులంలో ప్రవేశార్హత కలవారు.'

"ఇలా మీరు సెలవిచ్చారు. తీవ్ర నిరాశచెందాను. మీరు నాపై దయాదృష్టిని ప్రసరిస్తూ ఇలా అన్నారు." 'నేను నీకు నేర్పలేకున్నా, నేర్చుకొనడానికి అనేక మార్గాలున్నవి. అధ్యాపనమునకు అవధలులున్నవి. అధ్యయం అవధు లెరుగదు. అధ్యయనాభిలాషిని నివారించటం బ్రహ్మతరం కాదు. నీవు లబ్ధమనోరథుడవవుదువు గాక! నిన్ను మనసారా ఆశీర్వదిస్తున్నాను.'

"నన్ను మీరు శిష్యునిగా చేకొనక పోవడానికి కారణం నాకు సమగ్రంగా అవబోధమైంది. మీకు ప్రణమిల్లి సెలవు తీసుకొన్నాను. గహనారణ్యంలోని నా గేహానికి చేరుకున్నాక, దీర్ఘాలోచనలో పడిపోయాను. ఆవేళ మీ మాటలు నా చెవిలో గింగురుమన్నవి - నేడూ అంతే. 'అధ్యాపనానికి అవధులున్నవి, అధ్యయనం అవధులెరుగదు. నేర్వదలచినవాణ్ణి నివారించగలవాడెవ్వడు?' దయానిధానమైన మీ ఆననాన్ని, తేనియసోన లనిపించే మీ మాటల్ని, గుర్తుకు తెచ్చుకొన్నాను. మీరు నన్ను శిష్యునిగా స్వీకరించలేరు! మిమ్మల్ని గురువుగా ఎన్నుకొనే నా హక్కును ఎవరు కాదనగలరు? చివరకు మీకు కూడా!"

"ఆ క్షణమే మిమ్ము నాగురునిగా, పరమదైవంగా నిర్ధారించుకొని, నిజగేహ ప్రాంగణంలో మహీమయద్రోణాకృతిని రావినీడ సుప్రతిష్ఠితం చేశాను. సంగడి కాంద్రనుచేర బిలుచుకొని ఇలా చెప్పాను. 'ఈయన మన గురుదేవులు - ద్రోణాచార్యులు ఆయన కనుసన్నల్లో విలువిద్యను అభ్యసింతము''.

"గురుదేవా! ఇలా రేయింబళ్ళు ఒళ్ళు వంచి పరిశ్రమించే వాళ్ళం. మాలో మేమే ఎలా నేర్వాలో, ఎలా మెరుగుపరుచుకోవాలో, ప్రావీణ్యంలో చివరి ఎల్లను ఎలా చేరుకొనాలో చర్చించుకొనేవాళ్ళం. నాకు అంతుపట్టనివేళ, మీ ప్రతిమకేసి చూసేవాణ్ణి. 'తోవ చూపుడ'ని వేడుకొనేవాణ్ణి. అడిగే ప్రశ్నకు సమాధానం అంతరంగంలోనే దొరికేది''.



"భగవన్! నేర్పడమనేది ఒక చోట ముగుస్తుంది. నేర్వడానికి ఒక జీవితకాలం చాలదు. నేర్వడమంటే అగాధజలనిధిలోని ఆణిముత్యాన్ని చేజిక్కించుకోవడమే కదా!

"నన్ను అంతేవాసిగా స్వీకరించ నిరాకరింనందుకు మీకు ఎంతైనా ఋణపడి యున్నాను. నేర్చేందుకు సుగమమైన విధానం నేర్పినందుకు కూడా! ఆచార్యులగుటకు నిరాకరించిన మీరు నా పాలిట ఆచార్యదేవులే అయినారు. 'మాటలలో వీలుపడదు' అంటూనే నన్ను శిష్యునిగా చేసికొనినారు - ధనుర్విద్యలోని మెలకువలతోపాటు క్రొంగొత్త రీతులను అలవరుచుకొన్నాను. మీరు నన్ను ఆశీర్వదించాలని కోరుతున్నాను".

ఇది విన్న అర్జునుడు నిశ్చేష్టుడైనాడు. భీముడూ కవలలూ న్యూన భావనతో తలలు వాల్చారు. యుధిష్ఠిరునకు అంతా అవగతమైంది. అర్జునుడు అవమానంతో క్రుంగిపోతున్నాడు.

క్షణం పాటు ఆలోచించి, ఆచార్యు డిలా అన్నారు. "ఏకలవ్యా! నీవు నిస్సందేహంగా ధనుర్విద్యాపారంగతుడవైనావు. అవశ్యంభావియైన కర్తవ్యం నీచే అనాచరితంగానే ఉండిపోయింది. నేను నీకు గురువును! దీక్షాగ్రహణోపరాంతం ఆచార్యునకు శిష్యుడు దక్షిణను ఇచ్చుకోవాలి కదా! 'ఆచార్యాయ ప్రియధన మాహృత్య'.... అనునది ఆర్షవాక్యం. దాన్ని శిరసావహించి గురుదక్షిణ నొసగుటకు నీవు సిద్ధమేనా"?

"ఎంతమాట అన్నారాచార్యా! నేను అన్ని విధాలా సిద్ధమే. ఏదీ అదేయం కాదు. ఏమి అర్పించుకొనవలయునో ఆజ్ఞాపింతురుగాక!"

జలదగంభీర స్వరంతో ఆచార్య ద్రోణుడు ఇలా అన్నాడు. "ఏకలవ్యా! అటులైన నీ కుడిచేయి బొటనవేలిని నాకు గురుదక్షిణగా సమర్పించుకొనుము".

ఇది విని అర్జునుడు తలను పంకించాడు. యుధిష్ఠిరుడు 'అన్యాయం' అన్నాడు. ద్రోణుడు 'అవున'ంటూ తన మనోనిశ్చయాన్ని నొక్కి చెప్పాడు.

---

కిం ప్రయచ్ఛామి. భగవన్నాజ్ఞాపయతు మాం గురుః
న హి కించి దదేయం మే గురవే బ్రహ్మవిత్తమ.

ఏకలవ్యు డేమాత్రం సందేహించకుండా దక్షిణహస్తాన్ని ముందుకు సాచాడు. బొటనవ్రేలిని నిటారుగా నిలిపాడు ఎడమచేత ఛురికనుగొని అదీనమానసుడై ఒకే ఒక ప్రహరణతో అంగుష్ఠాన్ని దక్షిణహస్తం నుంచి వేరుపరచాడు. నేలపై పడినదానిని ఎడమచేతనెత్తి అశ్వత్థపత్రంలో పెట్టి గురువునకు సమర్పించాడు.

సంత్యసంధుడైన నిషాదయువకుణ్ణి అభినందిస్తూ ఆచార్యుడిలా అన్నాడు. "ఏకలవ్యా! నీవు నీ గురుభక్తిని, సత్యనిరతిని జగానికి చాటుకొన్నావు. నీవు మానవేతిహాసంలో అమరులైనవారి శ్రేణిలో చేరిపోయినావు. భావితరాలు నిన్ను స్మరించుకొంటవి".

ఏకలవ్యుడు కనులు మూసి ఆచార్యుని ముందు మోకరిల్లాడు.

అర్జునుడు విగతజ్వరుడైనాడు. భీముడూ కవలలూ పరమసంప్రీతులైనారు. యుధిష్ఠిరుని నయనాలు అశ్రుపూరితములైనవి. ద్రోణాచార్యులు దీర్ఘాలోచనలో మునిగిపోయారు.

ఏ కథకూ నిజంగా ముగింపనేది ఉండదు. ఇది పూర్వభాగం మాత్రమే!

ప్రవృత్తిధర్మాన్ని పట్టి కాలం ముందుకు సాగిపోయింది. ఇంద్రప్రస్థానికి పాండవులు ఏలికలైనారు. యుధిష్ఠిరుడు రాజసూయాన్ని ఆచరించాడు. పంచపాండవులు హస్తినాపురికి వచ్చారు. ద్రోణాచార్యుల అభీప్సితం మేరకు అదే గహనారణ్యంలో మృగయార్థం మళ్ళీ ప్రవేశించారు.

అరణ్యంలోని ఒక బాట మీదుగా ఆరుగురు నడచి వెడుతుండగా, ఆభీలాకృతి గల సారమేయం వారి వైపు దూసుకొని వస్తూ వుండడాన్ని గమనించి, తూణీరం నుండి నాల్గు తీక్షణబాణాలను గొని, ధనువుతో సంధానించి దాని దిశ నెక్కుపెట్టాడో లేదో అర్ధచంద్రాకారం వంటి అగ్రభాగం గల రెండు బాణాలు ఎక్కడ నుండో దూసుకొని వచ్చి సారమేయాన్ని అమాంతం పైకెత్తి, కొంతదూరం కొనివెళ్ళి ఓ వృక్షాగ్ర భాగాన నిలిపినవి.

అర్జునుడు మరోమారు సంభ్రమాధీనుడై 'ఎవరై యుంటారని' ఆచార్యుని అడిగాడు. ఇద్దరు బాణం దూసుకొని వచ్చిన వైపు కలయచూశారు. తేజిత బాణహస్తుడూ కృష్ణదేహుడూ అయిన ఏకలవ్యుడు హుందాగా వారిని సమీపించాడు. పంచపాండవులను మర్యాదగా పలుకరించి, గురుదేవుల మ్రోల శిరసా ప్రణమిల్లాడు. ఆచార్యుడు ఆశ్చర్యచకితుడైనట్లు అగుపించాడు. పాండుకుమారులు విమూఢచిత్తులైనారు.

ద్రోణుడు గంభీరస్వరంతో ఇలా ప్రశ్నించాడు. "ఈ పని యొనరించినది నీవేనా ఏకలవ్యా!"

"ఆచార్యా! నేనే" బదులు చెప్పాడు ఏకలవ్యుడు.

"నీ విది ఎలా చేయగలిగావు? నీవు కుడిచేతి బొటనవేలిని నాకు దక్షిణగా పూర్వమే సమర్పించుకొనినావు కదా!"

ఏకలవ్యుడన్నాడు. "నేను ఎడమచేతితో బాణద్వయాన్ని ధనుర్విముక్తం చేశాను".

పాండవుల ఆశ్చర్యానికి మేరలు లేవు. ద్రోణుడు ఇలా అన్నాడు. "ఎడమ చేతితో సాధన చేసి, ధనుర్విద్యలో ప్రభుత సాధించావన్నమాట".

ముకుళితహస్తుడై, మెరుపులీనే కళ్ళతో ఇలా విన్నవించుకొన్నాడు. "ఆచార్యా! నేను ఎడమ చేయితోనే ఎన్నడూ సాధన చేశాను. జన్మతః నేను సవ్యసాచిని".

పాండవులు మరోసారి ఖంగుతిన్నారు. ద్రోణాచార్యులు ఏకలవ్యుని వైపు సాశయంగా చూశాడు.

ఏకలవ్యుడు గురువునకు ఇలా నివేదించుకొన్నాడు: "ఆచార్యా! ఎడమ చేయి లాఘవం కలవానిగా నన్ను మీరు గమనించలేదు. మీరు కుడి చేతి బొటనవేలినే గురుదక్షణగా కోరినారు".

యుధిష్ఠిరుడు కలుగజేసికొని ఇలా అన్నాడు.

"ఇతనిని ఎడమ చేతి బొటనవేలిని దక్షిణగా ఇమ్మని అడిగే పక్షంలో న్యాయవిసంగతమౌతుంది. సత్కృతి పురస్కారానికి ఎన్నిమార్లైనా అర్హమే. దష్కృతికి దండన ఒకేమారు విధించబడుతుంది. ఏకలవ్యుడు దక్షిణాంగుష్ఠాన్ని ఏనాడో గురుదక్షిణగా సమర్పించుకొనినాడు. గురువు ఋణం నుండి ఏనాడో విముక్తుడైనాడు.

యుధిష్ఠిరుడు వచించినది తమ్ముకుర్రలకు నచ్చలేదు. ఏకలవ్యునకు యుధిష్ఠిరుని యెడగల గౌరవభావం ఇనుమడించింది.

---

Left-hander అనే ఆంగ్ల పదానికి 'సవ్యసాచి' సరైన పర్యాయపదమని మన్మిత్రులు 'శ్రీహరిశర్మ, వేములవాడ గారు సూచించారు. -అనువాదకుడు.

ద్రోణాచార్యులు యుధిష్ఠిరుని ధర్మనిరతిని కొనియాడుతూ మళ్ళీ గురుదక్షిణను కోరే ప్రశ్న ఉద్భవించదని వక్కాణిస్తూ ఇలా అన్నాడు. "ఏకలవ్యా! నేను సూక్ష్మగ్రాహిని కానని నీ భావనయా! నీవు నన్ను సందర్శించిన తొలిరోజే, నీవు కుడిచేతితో కాక ఎడమ చేతితో బాణవిమోచనం చేస్తావన్న సంగతి గ్రహించారు. ధనువు నీ దక్షిణ హస్తంలో వుంది. అమ్ములపొది నీ ఎడమ భుజాన వేలాడుతున్నది. ఇది నా అన్తశ్చేతన మీద చెరగని ముద్రగా నిలిచిపోయింది. కిందటిసారి సారమేయముఖాన్ని శరపూరితం చేసి మావైపు నడచివస్తున్న వేళ కూడా ఇది గమనించారు.

ఏకలవ్యునితో పాటు, పాండవులందరికీ ఆశ్చర్యం వేసింది, ఆచార్యుని యెడ గల గౌరవం యుధిష్ఠిరుని కన్నులే చెప్పక చెప్పినవి.

క్షణం సేపు ఆగి, ద్రోణాచార్యులు ఇలా అన్నారు. "నీవు నన్ను రెండవ మారు కలిసికోవడం నాకెంతో ఆనందాన్ని కల్గించింది. నావు నాచే ప్రశిక్షితుడవు కాకుండానే, నీయంతట నీవు సాధించినదే నన్ను ఎంతగానో ప్రభావితుణ్ణి చేసింది. నీ ధనుర్విద్యానైపుణ్యం అర్జునుని ఎంతో నిరుత్సాపరచినది. పరీక్షాసమయం ముందువుంది. అర్జునుడు నాయందు నమ్మకను కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. నాయందు నమ్మికను కోల్పోయిన అర్జునుడు తనయందు తనకున్న నమ్మికను పూర్తిగా కోలుపోయేవాడు. కావాలనే నీ ఎడమచేతి బొటనవేలిని కోరకుండా, కుడిచేతి బొటనవేలిని దక్షిణగా కోరినాను. అర్జునుడు సంతృప్తి చెందాడు. నీవు నీ బొటనవేలిని కోలుపోయావు. సవ్యసాచి వైనందున నీ ధనుర్విద్యాపాటవానికి క్షతి ఏమాత్రం సంభవించలేదు. పాండవమధ్యముడైన ఈ అర్జునునితో పాటు మిగతా నలుగురి భవిష్యత్తుకోసం, నీవూ నేనూ ఇంతటి మూల్యాన్ని చెల్లించవలసి వచ్చింది".

"భావిలో ఇతిహాసకారులు నన్ను అర్జున పక్షపాతిగా, నీకు అన్యాయం చేసిన నిర్దయునిగా చిత్రిస్తారు".

ఇది విని అర్జునుని కళ్ళలో, ఏకలవ్యుని కళ్ళలో నీళ్ళు తిరిగినవి. ఏకలవ్యుడు ఆచార్యునకు తన కృతజ్ఞతను తెలియజేశాడు. వీతరాగమత్సరుడై, పులుకడిగిన ముత్తెము వంటి మనసు కలవాడై అర్జునుడు గురువునకూ ఏకలవ్యునకు క్షమాపణలు చెప్పుకొన్నాడు.

యుధిష్ఠిరుడు అన్నాడు "ఆచార్యుడు-ఏకలవ్యుడు-అర్జునుడు ఈ ముగ్గురు మహనీయులే."

అర్జునుడు ఏకలవ్యుని గాఢంగా కౌగిలించుకొన్నాడు.

ఇంత వరకు పెదవి విప్పని సహదేవుడు ముచ్చురిని ఇలా పొగడాడు. "అర్జునుడు ఘనుడు. అతనిని మించిన ఘనుడు ఏకలవ్యుడు. అందరిని మించిన ఘనుడు ద్రోణాచార్యులే!"

భీముడు 'బావుంది' అనే మాటను రెండుసార్లు ఉచ్చరించాడు.

ద్రోణాచార్యులవారు శిష్యులిద్దరిని ప్రేమాలింగనబద్ధులను చేసి భరతవాక్యం పలికాడు.

"సర్వశ్రేష్ఠుడు అనదగినవాడు ఎవడూ లేడు. మమ్ములను మించే శ్రేష్ఠునిగా అభిమన్యుడు, అభిమన్యుని మించే శ్రేష్ఠునిగా శ్రీకృష్ణుడు చరిత్రకెక్కుతారు.

ఇది ఇలా పునరావృత్తం అవుతుందని చెప్పేదే ఇతిహాసం.

అభ్యాసమున కుపధులున్నవి.
అధ్యయనం అవధు లెరుగదు.
సర్వశ్రేష్ఠత సాపేక్షికమైన యథార్థత.
ఔన్నత్యానికి శిఖరమంటూ ఏదీ లేదు.

# 14. నిరుడు వీచిన గాలి

( భావనగర్ కోతుల కథ )

అంతర్రాష్ట్రీయ వ్యవస్థాపనా సంస్థలో, ఆచార్య ప్రీతమ్‌సేర్ చివరి సంవత్సరపు విద్యార్థుల కక్ష్యలో అధ్యాపనకార్యం నిర్వర్తిస్తున్నారు. ఆయనది ప్రజ్ఞాసంపన్నమైన వ్యక్తిత్వం. అఖ్యాయికలతో, యశోగాధలతో, భగవద్గీతలోని శ్లోకాలతో కూడిన ఆయన ప్రతి వ్యాఖ్యానం ప్రశిక్షణార్థులకు స్ఫూర్తిని కల్గించేదిగా ఉండేది. ప్రాచీన విజ్ఞానంతో అర్వాచీన విజ్ఞానాన్ని మేళవించి వ్యవస్థాపనాశాస్త్రానికి (Science of Management) ఓ నవీన దిశను కల్పించారాయన.

అరబింద్, భల్లా, విశ్వనాధన్ సహాధ్యాయు లవడంతో పాటు మంచి స్నేహితులు కూడా.

వ్యాఖ్యానం ముగిసిన వెంటనే అరబింద్ ప్రశ్న వేశాడు. "నేటి తరం సంచాలకులకు మీ సలహా ఏమిటి?"

వేదికమీద ఉన్న సేర్ కాస్త ముందుకు కదిలి ఇలా అన్నాడు. "ఇవాళ మీకు మూడు మంత్రాల్ని ఉపదేశిస్తున్నాను. సంచాలకులు మూడు రకాల తప్పులు చేయకుండా వుండేందుకు ఇవి తోడుపడతాయి."

"సర్! సంచాలకులు చేసే మూడు రకాల పొరపాట్లు ఏమిటి?" భల్లా అడిగాడు.

డా॥ సింగ్ భల్లా అడిగిన ప్రశ్నకు, ఇలా సమాధానం చెప్పారు. "గతంలో అవలంబించిన విధానాలు వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ సత్ఫలితాల్ని ఇస్తాయని ఆశించడం మొదటి రకం పొరపాటు. మీకో కథ చెబుతాను వినండి."

ఎంతో కాలం కిందటి మాట. భావనగర్‌లో సూరజ్ అనే దర్జీ వుండేవాడు. భావనగర్ మహారాజావారి ప్రాసాదానికి సమీపంలోని తన స్వంత ఇంట్లో నివసించేవాడు. ఆజీవికార్థం 'ఇక్ష్వాకుల నాటిదా' అన్నంత పాతదైన కుట్టుమిషన్ మీద, తెల్లని టోపీలు కుట్టేవాడు. సైకిల్‌కు అమర్చిన స్టాండ్‌కు వాటిని తగిలించి నగరంలోని వీధివీధికి వెళ్ళి అమ్మేవాడు. ఒకనాటి మిట్టమధ్యాహ్నం, బాగా అలసిపోయి రూవపరిమాతా

మందిర పరిసరాల్లోకి వచ్చాడు. అక్కడ శాఖోపశాఖలుగా విస్తరించి బాగా నీడను ఇచ్చే మఱ్ఱి వుంది. మఱ్ఱికింద పలకలా చదునుగా వున్న రాతిపై తన ఉత్తరీయాన్ని పరిచి, దానిపై తలపైని టోపీని తీయకుండానే మేనువాల్చి నిదురోయాడు.

ఆ న్యగ్రోధవృక్షశాఖోపశాఖల్ని ఓ వానరదళం పూర్తిగా ఆక్రమించుకొని, రోజులు గడుపుతుంది - అతడు నిదురోతున్న వేళ, ఓ కోతి కిందకు దిగి స్టాండ్‌కు తగిలించి వున్న ఓ టోపిని తన తలకు పెట్టుకొని స్వస్థానానికి తిరిగి వెళ్ళింది. మరో కోతి అలానే చేసింది. 'గతాను గతికో లోకః' అన్నారుకదా పెద్దలు! ఒకటి తరువాత మరొకటి వాటిని అనుకరించాయి. క్షణాల్లో స్టాండ్ టోపీలను కోల్పోయి, వెలవెలపోతున్నది. టోపీలన్నీ వానరాల శిరోలంకారాలయ్యాయి.


కాసేపటికి సూరజ్ మేలుకొన్నాడు. స్టాండ్ ఖాళీగా వుండడాన్ని చూసి కంగారు పడిపోయాడు. నలుదిక్కులు కలయ చూశాక, వాడి దృష్టి చెట్టుకొమ్మల పైని వానరాల మీద పడింది. పరిస్థితి పూర్తిగా అర్థమైంది.

ఓ వృద్ధ వానరం 'కిచ కిచ అంది'. 'టోపీలతో మేమెలా కనపడుతున్నాం' అని అడుగుతున్నట్లుగా ఆ కిచకిచను సూరజ్ అన్వయించుకొన్నాడు. సూరజ్ మెదడుకు పని కలిపించాడు. 'ఇపుడేమి చేయాలి చెప్మా! కోతులపాలయిన టోపీలను దక్కించుకోవడం ఎలా?' మర్కటమానసికతను కొద్దోగొప్పో తెలిసినవాడు గనుక చటక్కున తగిన ఉపాయాన్ని కనుగొన్నాడు. ఏ ఆందోళనను ముఖాన కనబరచకుండా మామూలుగా లేచి, అసాధారణ క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ నెత్తిమీది టోపీని తీసి నేలపై గిరాటు వేశాడు. అనుకరణప్రియత్వం వానరాల ప్రవృత్తిధర్మం. ఓ కోతి సూరజ్ లాగానే దర్జాగా నెత్తిపైని టోపి తీసి నేలకు విసిరేసింది. దాన్ని అనుకరించడంలో మిగతా కోతులు అహమహమికను ప్రదర్శించాయి. నేలపై చెల్లాచెదరుగా పడిన టోపీలను ఓపిగ్గా ఏరుకుని ఇంటిదారి పట్టాడు. వానర నైజాన్ని గ్రహించి తనకు ప్రయోజనాన్ని సిద్ధింప చేసే విధానానికి రూపకల్పన చేయకలిగానన్న తృప్తి సూరజ్‌కు కలిగింది.

కథ అయిపోయిందనుకునేరు! ఇది చిన్న విరామం మాత్రమే.

వార్ధక్యం పైబడ్డ సూరజ్ కుటుంబాన్ని, ఆప్తుల్ని క్షణంపాటు శోకానికి గురిచేసి, తన ఇహలోక యాత్రను ఓనాటి సాయంవేళ ముగించాడు. ప్రకృతి శూన్యాన్ని భరించలేదు. తండ్రి తాతల నుంచి వస్తూవున్న కులవృత్తిని కొడుకు చందర్ స్వీకరించాడు. - నీలంబాగ్‌లోని ఇంట్లోనే వుంటూ, టోపీలు కుట్టి, వీధి వీధికి తిరిగి అమ్ముకొని నాలుగు కాసులార్జించి కుటుంబ పోషణ చేసుకుంటున్నాడు.

ఓ మిట్టమధ్యాహ్నం అలసిసొలసి రూపపరిమాతాలయసమీపంలోని మర్రిని చేరుకున్నాడు. రాతిపలకపై ఉత్తరీయాన్ని పరిచి తలపైని టోపీని తీయకుండానే దానిపై మేను వాల్చి నిదురోయాడు. శాఖాచంక్రమణం చేస్తున్న కోతిమూక తండ్రి నాటివో లేక వాటికి కల్గిన సంతానమో తెలియదు కాని జాతి సహజమైన చేష్టలు చేస్తూ ఏవో కొన్ని శాఖోపశాఖలపై వున్నవి.






కొంతసేపటికి నిదురోతున్న చందర్ మేలుకొన్నాడు. కనులు తెరచి కలయచూశాడు. ఒక్క టోపి కనిపిస్తే ఒట్టు! తండ్రి చెప్పినది గుర్తుకు వచ్చింది. ఇతిహాసం పునరావృత్తమైంది.

టోపీలు తలపై ధరించి ముద్దులు మూటగడుతూ వానరయూథం అదే పనిగా చందర్ కేసి చూడసాగింది. భీమకాయం గల కోతి 'కిచ కిచ' అంది. అదేమంటున్నదో చందర్‌కు అర్థం కాలేదు. 'వొట్టి అర్థం లేని వాగుడు' అనుకున్నాడు. నిజానికి ఆ కిచకిచకు అర్థముంది. అందమైన వాలంగల ఆ కోతి అంటున్నదేమిటంటే "నీవు ఇప్పుడు ఏం చేస్తావు?"

ఇది చందర్ ఎదుర్కొంటున్న పెద్ద ప్రశ్న. దేవుడి దయవల్ల తండ్రి అవలంబించిన చిట్కా చప్పున గుర్తుకొచ్చింది. గతంలోని విధానాలు ప్రయోజనం సిద్ధింప చేస్తాయనే అతని నమ్మకం. ఆ నమ్మకంతోనే నెత్తి మీది టోపీని చందర్ హుందాగా నేలపై విసిరివేశాడు. ఏ వానరం చందర్‌ను అనుకరించలేదు. చందర్ ఆశ్చర్యం నుండి తేరుకొనకముందే ఓ కోతి ధైర్యంగా కిందికి దిగి గిరాటేసిన టోపీని తీసికొని ఒక్క దూకుడుతో కొమ్మను చేరుకుంది. చందర్ ఏదీ కొత్తగా నేర్వలేదు. కోతులు నేర్చుకొన్నాయి.

కథ ముగియలేదు. ఇది రెండవ విరామం మాత్రమే!

కొన్ని క్షణాలపాటు ఆగి, డా॥ విక్రమ్ తన ప్రసంగాన్ని కొనసాగించాడు.

కష్టపడి కుట్టిన టోపీలన్ని మర్కటాలపాలు కాగా, హృదయభారంతో చందర్ ఇంటిని చేరుకున్నాడు.

పదునెనిమిదేళ్ళు మించని కొడుకు తారక్ అడిగాడు. "పితాజీ! టోపీలన్నీ అమ్ముడు పోయాయా!"

బాధను దిగమింగలేకపోతున్న చందర్ జరిగినదంతా కుర్రాడికి పూసగుచ్చినట్లు వివరించాడు. ఇదంతా కొత్తేమీ కాదని తన, తండ్రి ఇలాటి చేదు అనుభవాన్నే చవిచూశాడని తన గోడును చెప్పుకున్నాడు.

ఇది విన్న తారక్‌కు చటక్కున ఓ ఆలోచన తట్టింది. 'మర్రి దగ్గరకు వెళ్ళి వాటి సంగతేమిటో చూస్తాను పితాజీ!' అంటూ రెండు టోపీలను తీసికొని, ఒకటి నెత్తికి పెట్టుకొన్నాడు. దగ్గరే వున్న నాటువైద్యుని వద్దకు వెళ్ళి కండూతి రేపే చూర్ణాన్ని తెచ్చి, ఘాటైన ఎర్రని కారంతో మిశ్రితం చేసి మరో టోపీకి లోపలా బయటా పట్టించాడు. టోపీని సైకిలుకమర్చిన క్యర్రఫ్రేమ్‌కు తగిలించుకొని రూపపరిమాత ఆలయం దగ్గరి మర్రి వృక్షాన్ని నిమిషాల్లో చేరుకొన్నాడు.

మర్కటాలు న్యగ్రోధవృక్ష శాఖోపశాఖలపై యథాప్రకారం స్థానాపన్నమై, చందర్‌ను గురించి మాటాడుకొంటున్నాయి. టోపీలు లబ్ధంకానివి కొన్ని బోడి తలలతో వున్నాయి. తారక్ రాకను గమనించిన వానరవృద్ధం ఇలా అంది. "దర్జీ ఇంట కులదీపకుడు బహుశః వీడై ఉంటాడు."

తారక్ క్యర్రఫ్రేమ్‌గల సైకిలును చెట్టుక్రింద నిలిపి పెద్దరాయిపై నిదురోతున్నవాడిలా నటించాడు. కోతులు ఒకదాని మొహాన్ని ఒకటి చూసుకొన్నాయి. ముఠాకు నాయత్వం వహిస్తున్న వానరం ఇలా అంది. "వీడికి గట్టిగా బుద్ధి చెప్పాలి".

ఇది విని, సొగసైన తోక కలిగి కండపుష్టితో నిగనిగలాడుతున్న వానరం తనకు శిరోభూషణమైన టోపీని బోడితలతో వున్న నేస్తాని కందించి నేలకు దూకింది. క్యర్రఫ్రేముకు తగిలించిన టోపిని శిరస్సున ధరించి రాచఠీవితో వృక్షాన్ని అధిరోహించింది.

వానరసందోహం ప్రదర్శితసాహసాన్ని అభినందిస్తూ కరతాళధ్వనులు చేసింది.

తారక్ లేచి నిల్చుని కోతుల వైపు తదేక దృష్టితో చూశాడు. 'ఇక వెళ్ళిరా బాబు' అనే అర్థం ధ్వనించేట్టుగా కిచకిచలాడాయి. వాటి ఆనందం నీటి మీది బుడగ అయ్యింది.

సొగసైన వాలంతో, కండపుష్టితో నిగనిగలాడుతున్న వానరం 'అయ్య బాబోయి.... మంట.... మంట అంటూ చంక్రమణం చేయసాగింది. నోరు తెరచి తెల్లని దంత పంక్తిని బయట పెడుతూ, పెద్దగా అరవసాగింది'. "ప్రాణాలు తీసే టోపీరోయి - నేలకి విసరకొట్టండి". ఇలా అంటూ తన టోపీని నేలకు విసిరివేసింది. ఇది గమనించిన కోతిమూక పెడబొబ్బలు పెడుతూ, అరుణారుణకిసలయపర్ణపుష్పఫలోపేతమైన శాఖోపశాఖల్లో సంక్షోభం సృష్టిస్తూ, టోపీలను సామూహిక ప్రక్షేపణం చేశాయి.

ప్రోజ్ఝితమైన టోపీలను తారక్ తాపీగా చయవం చేసి అపజయసంజాత వ్యథాగ్రస్తవానరాలపై క్షణం పాటు చూపు నిల్పి ఇంటి దారి పట్టాడు.

భయంతో వణికిపోతున్న అనుచరగణాన్ని నేతృత్వం వహించే వానరం ఇలా సంబోధించింది. "ఈ దెయ్యానికి, వాని టోపీలకు దూరంగా వుండండి. సమస్తవానరజాతికి శిరత్రాణధారణ నేటి నుండి నిషిద్ధమైనదిగా ప్రకటించుచున్నాను".

తారక్ ఇంటికి వెళ్ళి పునః సంప్రాప్తమైన టోపీలను తండ్రికి అప్పగించి జరిగినదాన్ని, ఆద్యంతం వివరించాడు. విక్రయించే సమయంలో టోపీలను సైకిల్ మీద వదలి మర్రిక్రింది వితర్ది సదృశమైన శిలాఖండంపై క్షణమేని నిద్రాధీనులు కారాదని సమయం కావించుకొన్నారు.

అతీతంలోని విధానాలు వర్తమానంలో అనుసరణీయం కావన్న కఠోరవాస్తవత మానవులు గ్రహించారు. మర్కటాలు గ్రహించినవి.

గతంలోని విధానాలూ వర్తమానంలోనూ భవిష్యత్తులోనూ ఉపయోగపడనివి.
సమ్యసంధానుసరణం సర్వదా అభిలషణీయం.

# 15. నేడు వీచే గాలి

( మూడు చేపల కథ )

ప్రశిక్షణార్థుల వైపు చూస్తూ డా॥ ప్రీతమ్‌సేన్ ప్రశ్నలను ఆహ్వానించాడు.

భల్లా లేచి ఇలా అడిగాడు "సంచాలకులు చేసే రెండో రకం పొరపాటు ఎలాటిది? సర్! అది చేయకుండా ఉండడానికి మీరు ఉపదేశించే మంత్రం ఏమిటి?"

డా॥ సింగ్ చిరునవ్వుతో ఇలా జవాబిచ్చాడు. "మిస్టర్ భల్లా! మంచి ప్రశ్నే అడిగారు. వర్తమానధోరణులు కలకాలం కొనసాగుతాయని, ఏనాడూ కాలబాహ్యం కావని విశ్వసించడం సంచాలకులు చేసే రెండోరకం పొరపాటు. ఇది అల్పసంతుష్టుల్లో కనిపించే ఉదాసీనత. ఏ ఏర్పాటు ఎంత సువ్యవస్థిమైనా కాలదోషం పట్టకుండా ఉండదు. ఎల్లకాలం జీవిస్తామనే భావన ఎంత నిర్హేతుకమైనదో పరిస్థితులు సానుకూలంగా ఎప్పుడూ ఉంటాయన్న భావన అంత నిర్హేతుకమైనది.

"సాతత్యత ఒక భ్రాంతి. వాస్తవత కాదు. సాతత్యతను విశ్వసించేవారు ఒక రకమైన ఊరట పొందుతారు. ఆ ఊరట కొన్నాళ్ళపాటుదే. సాతత్యతతోపాటు పరివర్తన వాస్తవతకు గల రెండవ పార్శ్వమన్న విషయం విస్మరించగూడదు. ప్రతి వస్తువులో, వ్యవస్థలో మార్పు అనేది దాగి వుంటుంది. వస్తువు స్వరూపం మారుతుంది, ధోరణులు మారుతాయి. జీవన శైలి మారుతుంది. ఆద్యంతాలు మధ్య విభజనరేఖ బహుసన్ననిది. ఈ సందర్భంలో నాకు ఓ కథ గుర్తుకు వచ్చింది. చెబుతాను శ్రద్ధగా వినండి."

థానే పరిసరాల్లో ఓ అందమైన జలాశయం వుంది. అమృతోపమం దాని జలం. వానకాలంలో ఎక్కువైన నీరు నిర్గమించడానికి రాతితో పకడ్బందీగా కట్టబడిన మత్తడి వుంది. గ్రీష్మంలో నీటి మట్టం బాగా తగ్గేది. ఈ జలాశయంలో దీర్ఘదర్శి, సమయస్ఫూర్తి, మందబుద్ధి అనే మూడు చేపలుండేవి. దూరదృష్టి పేరుకు తగినట్లుగా మంచి ముందు చూపు కలది. సమయానుగుణంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోగల సామర్థ్యం సమయస్ఫూర్తి కుంది. ముందుచూపు వెనుకచూపు ఏమాత్రం లేనిది మందబుద్ధి. అది కాయికంగా మానసికంగా వొట్టి సోమరి.

---

మత్తడి : Weir wall తెలంగాణామాండలికం.

దీర్ఘదృష్టి మధ్యస్థాయి దేహయష్టి కలది. దాని ప్రతి కదలికలో ఆర్జవం సుస్పష్టంగా వ్యక్తమయ్యేది. చొరవ తీసుకొనడంలోనేమీ, చేపట్టిన పనిని సకాలంలో పూర్తిచేయడంలోనేమీ దానిని మించినది జలాశయంలో లేదనడంలో ఏమాత్రం అత్యుక్తి లేదు.

సమయస్ఫూర్తి రూపంలో అపరంజి సలాక. ఎల్లవేళలూ అప్రమత్తంగా వుంటూ, ఎదురైన పరిస్థితికి అనుగుణంగా స్పదించడం దాని ప్రత్యేకత.

ఇక మందబుద్ధి పరిచయం పేరులోనే ఇమిడి వుంది. పేరు వలన స్పష్టం కానిది దాని స్థూలత్వం మాత్రమే.

ఇలా విభిన్న స్వభావ వ్యక్తిత్వాలు కలవియే యైనా పూవు నంటిపెట్టుకొన్న తావిలా ఒకదానితో ఒకటి కలసి మెలసి యుండేవి. ఎప్పుడో ఒకప్పుడు తప్ప.

అది వర్షర్తువు. ఆ సంవత్సరం బాగా వానలు పడ్డాయి. నీళ్ళు మత్తడి మీదుగా పారుతున్నాయి. ఒకనాడు దీర్ఘర్శి వినోదప్లవనార్థం వెళ్ళి గట్టు చేరువలో పైపైన ఈదుతున్నది. ఓ ఆర్గురు మహాకాయులు గట్టుపైన కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకొంటున్నారు. 'వరుపు' 'వల' 'పడవ' లాటి అలతి అలతి పదాలు దాని చెవిని పడినవి. వేళ్ళేదో వ్యూహం పన్నుతున్నారని పసిగట్టి, గట్టుకు మరీ దగ్గరగా ఈదుకొంటూ పోయి వాళ్ళు అనుకొంటున్నది చెవి యొగ్గి వినసాగింది.

ధీవరనేత ఇలా అన్నాడు: "....నాకు సమ్మతమే. వేలంలో నెగ్గి వేసవిలో మనమే వద్దాం. వేసవిలో ఇప్పుడున్నన్ని నీళ్ళు ఉండవు. నైలాన్ వలలూ, పడవలూ సిద్ధం చేసుకొందాం. అందరం కలిసి చేపలు పడదాం. బోలెడంత అనుభవం కలవాళ్ళం కనుక, మనను భాగ్యదేవత వరిస్తుంది. మన బ్రతుకుల్లో బంగారువాన కురుస్తుంది. మంచి నీటి చేపలకు గిరాకి వుంది మార్కెటులో"


'సరే' అని అందరు సంతోషంగా తలలూపారు.

దీర్ఘదర్శి ఈదుతూ వెళ్ళి నేస్తాలను పేరుపేరున పిలిచింది. వాళ్ళు సమీపించాక ఇలా అంది. "ప్రియమైన మిత్రులారా! గట్టుమీద కొందరు బేస్తలు మనల్ని వచ్చే వేసవిలో పట్టాలని అనుకొంటున్న మాటల్ని విన్నాను."

"అయితే!" అంటూ దీర్ఘాలు తీసింది మందబుద్ధి. సమయస్ఫూర్తి వెంటనే ఆలోచనలో పడింది.

దీర్ఘదర్శి అంది "ఇప్పుడు నీరు మత్తడి పొరలి పారుతున్నది. ఈ కొలనును వదిలేద్దాం. మత్తడి నుండి నూత్నావకాశప్రదాయిని అయిన ఆ నదిని తత్క్షణమే ఆశ్రయిద్దాం.

దీర్ఘదర్శి వెలిబుచ్చిన అభిప్రాయానికి వెంటనే స్పందిస్తూ సమయస్ఫూర్తి అంది". "మిత్రమా! తొందర దేనికి? వేసవి బహుదూరంలో వుంది".



మందబుద్ధి చికాకును, కోపాన్ని కనబరుస్తూ ఇలా అంది. "దీర్ఘదర్శీ! నీవు బలేవాడివి. లేని పోనివి ఊహించుకొని నిత్యం ఓ సమస్యను సృష్టించి, మమ్మల్ని భయపెడతావు. అలా జరగడానికి వీలు లేదు. ఏ చీకూచింతా లేకుండా ఇక్కడ హాయిగా వుంటున్నాం. మనకు ఏమి కొదువ ఇక్కడ? ఈ కొలనుని వదలి ఎక్కడికీ వెళ్ళవలసిన పనిలేదు".

దీర్ఘదర్శిని చివాట్లు పెట్టాక, మందబుద్ధి తామరషండం మధ్య నున్న తన నివాసానికి వెళ్ళిపోయింది. సమయస్ఫూర్తి దీర్ఘదర్శి మాటల్ని తేలికగా తీసుకొని ఇతర చేపలతో కలసి ఈదుకొంటూ వెళ్ళిపోయింది. చేసేదిలేక దీర్ఘదర్శి నిష్క్రమణ బిందువు వైపు ఈదుకుంటూ పోయింది. మత్తిడి మీదుగా పారే ప్రవాహంగుండా నదిని చేరుకుంది.

నదిగట్టు చేరువలో ఎవరూ కనివిని యెరుగని మడుగులో కొత్త నేస్తాలతో కొన్నాళ్లపాటు విహరించి, అక్కడి నుండి చేపలు పట్టడం నిషిద్ధమైన మానవనిర్మిత జలాశయాన్ని ఆశ్రయించింది.

వేసవి రానేవచ్చింది. థానే కొలను నీటి మట్టం సంకేతానికి చాలా దిగువలో ఉంది. ఆర్గురు సభ్యులుగల మత్స్యజీవనుల దళం పడవల్లో వచ్చి, నైలానువలల్ని నీటిలోకి విసిరివేశారు. సమయస్ఫూర్తి మందబుద్ధి ఒకే వలలో చిక్కుకొన్నాయి. సమయానుకూలంగా స్పందించే సమయస్ఫూర్తి కళ్ళుతేలేసి శవాసనం వేసింది మందబుద్ధికోవకు చెందిన ధీవరయువకుడు దాన్ని నిష్ప్రాణిగా ఎంచి ఏరిపారేశాడు. చావును తప్పించుకొని, ఈదుకుంటూ పోయి తామరషండం మధ్య తలదాచుకొంది. వర్షర్తు ఆగమించాక మొదట కాలువను, కాలువ ద్వారా నదిని, నది నుండి దీర్ఘదర్శి ఉంటున్న జలాశయానికి చేరుకుంది. బహునాళ్ళకు పాతమిత్రుణ్ణి కలిసికొని శేషజీవనం నిరామయంగా గడిపింది.

ఇక మందబుద్ధి సంగతి ధీవరులలో ధీశాలియైన ఒక యువకుడు మందబుద్ధిని విలవిల లాడుతున్న ఇతర చేపల నుంచి వేరుచేస్తూ ఇలా అన్నాడు. "ఇది బాగా లావాటి చేప; దీన్ని గోల్డన్‌స్వాన్ క్లబ్‌కు పంపిద్దాం".

మందబుద్ధి హిమకరండికలో ఉపాహారగృహపాకకక్ష్యకు అంతిమప్రయాణం చేసింది. ఆనాటి సాయంకాలం విందును భోజనప్రియులు సంతృప్తిగా ఆరగించారు.

డా॥ సేర్ శిక్షర్థాలవైపు చూశాడు. వాళ్ళు కథను విని ఎంతగానో ఆనందించారు. సింగ్ ఇలా అన్నాడు: “వర్తమాణ ధోరణులకు కాలదోషం పడుతుంది. అపజయం చవిచూడడానికైనా సర్వసన్నద్ధులై అహోరాత్రాలు ఉత్కృష్టతను సాధించే దిశలో పరిశ్రమించండి. మీ ఎదుట నిలిచేది ఉజ్జ్వల భవిష్యత్తే అయితీరుతుంది.”

పరిస్థితిని అంచనావేసి కార్యోన్ముఖులు కండి.
విపత్తులో చిక్కుకున్న వేళ సమయస్ఫూర్తిని ఉపయోగించి బయట పడండి.
ఏ నిర్ణయాన్ని వాయిదా వేయకండి.

# 16. రేపటి గాలి ఏదిశలో

( మంత్రకూట భూతం కథ )

డా॥ ప్రీతమ్‌సేత్ మొదటి రెండు ప్రశ్నలకు సమాధానాలిచ్చాక ప్రశిక్షణార్థులవైపు ప్రశ్న నాహ్వానిస్తున్న రీతిలో చూశాడు.

విశ్వనాథన్ లేచి అడిగాడు. "సర్! సంచాలకులవల్ల అయ్యే మూడవ రకం పొరపాటు ఎలాటిది?"

అందుకు డా॥ సేత్ మందహాసం చేస్తూ ఇలా బదులు చెప్పాడు. "భవిష్యత్తును గురించి నిష్కారణంగా భయాందోళనలకు గురవడం మనం చేసే మూడవ రకం పొరపాటు. మన భవిష్యత్తు మనకు అగోచరం. భవిష్యత్తు సృష్టించే సమస్యల్ని ఎదురుకోగలుగుతామనే ధీమా మనలో చాలా మందికి ఉండదు".

ఇక సేత్ చెప్పబోయే కథకోసం ప్రశిక్షణార్థులు ఎదురుచూస్తున్నారు. వారి ఆసక్తిని అర్థం చేసుకొన్న డా॥ సేత్ కథ చెప్పటం మొదలెట్టారు.

మంత్రకూటం పల్లె కాదు. అలా అని పట్టణమూ కాదు. జనవాడుకలో అది మహాగ్రామం. అది 1955లోని మాట. పదునాలుగు సంవత్సరాల గట్టు ఎనిమిదవ తరగతి విద్యార్థి. గణితంలో అపర రామానుజం. హిందిలో 'అటో' 'ఇటో' అనే పరిస్థితి.

ఆనాడు శనివారం. వార్షిక పరీక్ష దాదాపు ముగింపుకు వచ్చింది. గణితం, హిందీ లో పరీక్ష జరుగవలసి వుంది. ఆదివారం సెలవు కనుక సోమ మంగళవారాలు వాటికోసం నిర్ధారించారు. పరీక్ష అయిన తరువాత ఇంటికి వెళ్ళాక గట్టు తండ్రితో ఇలా అన్నాడు.

"అన్నా! ఇవాల్టి పేపరు బాగా రాశాను. రేపు ఆదివారం. సినీమాకు వెళ్ళాలనుకొంటున్నాను. వెళ్ళమంటావా?"

రామన్నగారికి కొడుకు అన్నది ఏమాత్రం రుచించలేదు.

"ఏమిటీ? సినీమాకా! నడి పరీక్షల్లోనే! నీ వ్యవహారం నాకేమీ అంతుపట్టడం లేదు".

గట్టు అన్నాడు : "కోపగించకండి. రేపు ఆదివారం. సోమవారంనాడు లెక్కల పేపరు. నూటికి నూరు మార్కులు రాకపోతే అప్పుడనండి. మీరే చూస్తున్నారుగా ఎంత కష్టపడుతున్నానో! సినిమా చూసిన ఉల్లాసంతో మిగతా రెండు పరీక్షలు బాగా రాయగలుగుతాను."

"ఇంతకూ ఏ సినిమా!"

ఇలా అడగటంలో అంతరార్థమేమిటో గట్టుకు అర్థమైంది. నేరాలూ, హత్యలూ, ఫైటింగ్ గల పిక్చరైతే 'వీల్లేదు' అనడానికి వీలుంటుంది. గట్టు నవ్వుతూ ఇలా అన్నాడు. "అన్నా! ఆ ఈ సినీమా కాదు. 'వేంకటేశ్వర మహాత్మ్యం'. దేనికైనా దేవుడి ఆశీర్వాదం ఉండాలి కదా!"

కొడుకు కోరికను కాదనడానికి రామన్నగారికి ఏ పర్యాయం మిగులలేదు. చిట్టచివరి ప్రయత్నంగా అన్నాడు. "హిందీ సంగతి ఏమిటి?"

అందుకు గట్టు ఇలా అన్నాడు: "హిందీని గురించి బెంగెట్టుకోకండి - రేపటి ఆదివారం హిందీకే. గణితంలో నూటికి నూరు. హిందీలో నలభయి మార్కులు ఖాయం".

"కేవలం నలుభయి మార్కులా? అరువది శాతం తెచ్చుకోవాలి" రామన్నగారు అసాధ్యమైన లక్ష్యాన్ని నిర్ధారించారు.

"మీరంతగా అంటున్నారు కాబట్టి యాభైశాతం. సరేనా!" అనునయించే ధోరణిలో గట్టు అన్నాడు.

"ఒక్క మార్కు తక్కువ వచ్చినా ఊరుకోను".

"అలాగే"

తండ్రీ కొడకుల మధ్య ఒప్పందం కుదిరింది.

గట్టు శనివారం రాత్రి 9-00 లకు మొదలయ్యే రెండవ ఆటకు వెళ్ళాడు. తెలుగు సినిమా అంటే మాటలా! వ్యవహారం ఓ కొలిక్కి రావడానికి కనీసం మూడున్నర గంటలు పడుతుంది.

గట్టు సినిమా హాలు నుంచి ఉదయం 1-30 లకు బయటపడి, ఇంటి దారి పట్టాడు. పిక్చరు బ్రహ్మాండంగా వుంది. వేంకటేశ్వర మహాత్మ్యం అన్నాక బాగుండకుండా ఎలా వుంటుంది! ఆనాడు అమావాస్య. అప్పటికి బాగా రాత్రి అయ్యింది. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి. ఊరి చివర 'మందాట'లో ఇల్లు. 'పారవైచితె మిన్నులు వడ్డ చోట' - ప్రవరాఖ్యునిలా వాపోయాడు గట్టు.

పంథొమ్మిదివందల యాభై యైదు నాటికి మంథినిలో విద్యుద్దీపాలు లేవు. ఊరి పొలిమేరలోని బస్‌స్టాండ్ సమీపంలో సినీమా హాలు. ఇల్లు చేరడానికి రెండు మార్గాలున్నాయి. ఒకటి నాల్గు వీధిలాంతర్లు గల రహదారి. లక్ష్యనిర్ధారితభవిష్యత్తులా స్పష్టత కలది. శీఘ్రంగా ఇల్లు చేరడానికి అనువైంది మాత్రం కాదు. చీకటి మాట ఎలా వున్నా ఆలస్యమైతే తండ్రి సహించడన్న భయం పట్టుకుంది.

రెండవది దగ్గరి దారి. సందులు గొందులూ దాటేస్తూ వెళ్ళాలి. ఏ సొంపులు లేకున్నా పలు వంపులు కలది - ఆ వంపుల్లో ముఖ్యమైన దానికి చేరువలో ఓ పాడువడిన బావి. బావి అంచునే ఏపుగా పెరిగి విస్తరించిన రావి. రావి కొమ్మలు బేతాళుని కోవకు చెందిన భూతానికి ఆవాసంగా జనాలు చెప్పుకుంటారు. భూతాన్ని గురించిన కథలు కొల్లలు. రాత్రి తొమ్మిది గంటల తరువాత, రావి దరిదాపులకు ఎవ్వరూ వెళ్ళరు. అగమ్యమైన భవిష్యత్తు వంటిది. గట్టు ద్విధలో పడ్డాడు. 'ఏ దారి నాశ్రయించాలి? దూరపుదైనా సురక్షితమై సామాన్యులకు అనువైన మొదటి దారినా? లేక దగ్గరిదైనా, విక్రమార్కుడు సాహసించే రెండవ దారినా?

ఇలా ఆలోచిస్తూ గట్టు వడివడిగా నడక సాగించాడు. 'దగ్గరి తోవ ఎందుకు కూడదు? ఈ దారిన వెడితే ఏమౌతుంది? భూతం అమాంతం మీదపడుతుందా? నిదురోతూ వుంటుంది! భూతాలు రాత్రివేళ మేల్కొని వుంటాయని పెద్దవాళ్ళు చెబుతారే? అయినా ఏమిటి! వంపును చేరుకొనగానే పరుగుపందెగాడిలా పిక్కబలం చూపిస్తాను. భూతానికి కనువిప్పు అయ్యేలోగా, ఇంట్లో పడతాను. అప్పుడు భూతమైనా, దాని జేజెమ్మయినా ఏం చేస్తుంది? పరుగుకు రామనామస్మరణను జతపరిచి నా తడాఖా చూపిస్తాను.'

గట్టు తోవ రెండుగా చీలే చోటు వరకు, వడివడిగా నడచాడు. గుండెను రాయి చేసికొని బావి, రావి, భూతం వున్న సందుల గొందుల దారినే ఎన్నిక చేసుకొన్నాడు. ముందుకు వెడుతున్నకొద్దీ చీకటి దట్టం కాసాగింది. ఒంటరితనం ఇనుమడించింది. నడక మందగించింది. భయసందేహాలు మనస్సును ఆవహించాయి. ముందుకు పోయేకంటే దారి చీలే చోటికి తిరోగమించడమే మేలని అనుకుంటున్న వేళ, తీవ్రమైన మరో భయం గట్టును దిగ్భ్రాంతుణ్ణి చేసింది - 'వెనుక నుంచి వచ్చి భూతం మీద పడితే ఏం చేయడం?'

ఈ పరిస్థితిలో వెనక్కివెళ్ళడం శ్రేయస్కరం కాదు. ముందుకు వెళ్ళడమూ పెద్ద సమస్యే! ముందంజ వెనకంజల్లో ఏదీ సాధ్యం కానప్పుడు మనిషి అయోమయంలో పడతాడు.



భవిష్యత్తు పెనుభూతంలాగా

ఉద్విగ్నతలో ఉన్న గట్టు బావి, రావి, భూతం గల వంపును సమీపించాడు. కారు చీకటయినా బావి రావి మసకమసకగా కనపడుతున్నాయి. బావి దగ్గర గాని చెట్టుమీద గాని భూతం వున్న చిన్నెలేవీ అగుపడలేదు. ఎక్కడ దాగివుందో! ఇలా ఆలోచిస్తూ మరో అడుగు ముందుకు వేసి హఠాత్తుగా కొయ్యబారి నిలబడి పోయాడు. మిట్టకు కుడివైపున ఏదో తెల్లటి ఆకారం నిల్చొని వుంది. గగుర్పాటుతో పాటు ఒంటికి ముచ్చెమటలు పుట్టాయి. కళ్ళు తేలేశాడు. నాలుక పొడివోవ సాగింది. రాముణ్ణి స్మరించాలన్న మాటే మరచిపోయాడు. భూతం కాళ్ళవేపు దృష్టిని పోనిచ్చాడు వంకరటింకరగా వున్నాయా? ఇరువది వేళ్ళున్నాయా? భూతం నిశ్చలంగా నిలిచి వుంది. భూతంలాగానే గట్టు నిశ్చలంగా నిలిచి వున్నాడు.

అయిదు నిముషాలు గడచాయి. ఈ అయిదు నిముషాల్లో చెప్పుకోదగ్గదేమీ జరుగలేదు. గట్టు ఊహించినట్లు భూతం అమాంతం మీదపడలేదు. కాస్త ధైర్యాన్ని కూడగట్టుకొని బిగ్గరగా "ఎవరు?" అని అరచాడు. "నీవెవరు" అంటూ భూతం ఎదరుప్రశ్న వేసింది. గట్టుకు చిరపరిచితమైన స్వరమే. సాహసించి మూడడగులు ముందుకు వేశాడు. భూతం అలాగే చేసింది. ఒకరికొకరు మరికాస్త చేరువయ్యాక 'తెల్లటి ఆకారం' భూతం కాదని, తనకు చిరపరిచితుడైన కిరాణాకొట్టు యజమాని కొంతం బాపు అని గ్రహించడానికి ఎంతో సేపు పట్టలేదు. రహదారిపై తనకు పరమశత్రువైన శునకమున్న కారణాన ఇంటికి వెళ్ళడానికి గట్టు సందుగొందులు గల దారిని ఎంపిక చేసుకొన్నాడు. గట్టును బాపుగారు భూతంగా, బాపుగారిని గట్టు భూతంగా ఊహించుకొన్నారు. భ్రాంతి పటాపంచలవడంతో ఇరువురికి జ్ఞానోదయమైంది.

నలభయి ఒకట్లో పడిన బాపు, పదునాలుగేళ్ళు మించని గట్టు మంచి నేస్తాలయ్యారు. గట్టుకు బాపుగారు అప్పుడప్పుడు తాయిలాలు, దీపావళి రోజుల్లో టపాకాయలు ఉపాయనంగా ఇచ్చేవాడు. గట్టు బాగా చదివి, పెద్దవాడయి, ఓ పేరు మోసిన కంపనీకి మేనేజరయ్యాక, బాపు గారి కుమారుడు ఉద్యోగం సంపాదించడంలో సహాయపడ్డాడు.

అజ్ఞాతమైన ప్రతీదీ అపాయాల పుట్ట కాదని, అవకాశాలు గల తేనె పెరగా అందిరావచ్చని ఇరువురూ గ్రహించారు.

కథ ముగించాక డా॥ సేల్ ఇలా అన్నాడు.

"భవిష్యత్తు మానవునకు పరమవరదాయిని. ప్రళయంలో 'లయ' వుంది. శ్రమలో రమ ఉంది. ఆర్జవంలో జవం ఉంది. సమయగర్భంలో న్యస్తమైన అవకాశాల్ని గవేషించడం ప్రాజ్ఞుడైనవాని ధ్యేయమై యుండాలి."

డా॥ సేర్ మళ్ళీ అన్నాడు : 'మనం వేసే అంచనాల్లో దొరలే పొరపాట్లు మూడు రకాలు.

1. గతంలోని విధానాలు వర్తమానంలో, భావిలో అనుసరణీయాలు.
2. వర్తమాన ధోరణులు ముందూ కొనసాగుతాయి.
3. భవిష్యత్తు అనిశ్చితితో పాటు అపాయాలతో కూడుకున్నది.

నేను మీ కుపదేశించే మూడు మంత్రాలివి.

1. సరికొత్త విధానాలు, కార్యశైలిలో కాలానుగుణమైన మార్పు, జనాల్ని ఆకట్టుకోగలిగే ఉత్పత్తుల నిర్మితి, ఇవి ఇతోధిక ప్రగతికి అవలంబనీయాలు.
2. నేటి ధోరణులు ఎప్పుడో ఒకప్పుడు కాల బాహ్య మౌతాయన్న ముందు చూపు. కీడెంచి మేలెంచుతూ నాణ్యత సాధించేందుకు నిరంతరం పరిశ్రమించాలి.
3. అపాయాలతో కూడినదని భావిని గురించి భయపడకూడదు. మనం ఏనాడూ ఊహించని సత్ఫలితాలను ఇచ్చేది భవిష్యత్తు - ఈ ఆశావాదంతో అతర్నిహతమైన అవకాశాల్ని ఆకలనం చేసుకోవాలి. వాటిని ఉపయోగించుకొంటూ బంగారు భవిష్యత్తుకు బాటను ఏర్పర్చుకోవాలి.

భావిని గూర్చి భయమొద్దు.
భావి శుభోదర్కం అనే భావనతో ముందుకు సాగాలి.

# 17. జాగృతి

ఏకశిలపురాధీశుడైన జయవర్మ మహారాజు కొన్నాళ్ళుగా బహుచింతాక్రాంతులై వుంటున్నారు. ఎప్పుడూ ఏదో దీర్ఘాలోచనలో ఉండేవాడు. ఆయనలో హఠాత్తుగా కలిగిన ఈ మార్పు సచివులకూ, సమీపవర్తులకూ, సామాన్యులకూ ఎంతో ఆందోళన కలిగించింది.

మహారాజా వారి ఏకైక పుత్రుడైన వీరవర్మ దీన్ని గమనిస్తూనే వున్నాడు. అయినా, తండ్రిని అడగడానికి మనసొప్పలేదు. ఒకనాడు ధైర్యాన్ని కూడగట్టుకొని తండ్రి దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు. "పితృదేవులు ఎందుకని చింతాగ్రస్తులైనారు?" దానికి మహారాజా వారు ఇలా సమాధానం చెప్పారు. "లేదు. మేము చింతనలో ఉన్నాము."

"దేన్ని గురించి మహారాజా!" అడిగాడు యువరాజు.

"నేను ఇహలోక యాత్ర చాలించాక - అది ఎంతో దూరం లేదు - ఈ రాజ్యం భవిష్యత్తేమిటి? సాంప్రతం, మా ఆలోచనలకు ఇదే కేంద్రం".

మహారాజా వారి మాట, ఇన్నాళ్ళు ఏ చీకూచింతా ఎరుగని యువరాజును ఎంతో కలవరపరచింది. అయినా ఏ భావాన్ని ముఖంలో వ్యక్తం కానీయకుండా ఇలా అన్నాడు. "మహారాజా వారు శతవసంతాలు జీవించాలి! మన రాజ్యం పరిపంథులకు అభేద్యమై శాంతి భద్రతలకు ఆలవాలమై, జనజీవనం నిత్యకల్యాణం, పచ్చతోరణమైన వేళ దేన్ని గురించి దిగులు పడుతున్నారు? మహారాజా వారిలో ఇటీవల కలిగిన మార్పు మాకు దురూహ్యంగా వుంది".

"కుమారా! మా అనంతరం ఈ రాజ్యభారాన్ని మోయగల సమర్థుడు ఎవడన్నదే మా ఆలోచన".

తండ్రి మాటకు కొడుకు నివ్వెరపోయాడు.

"మహారాజా! నేనుండగా మీ కెందుకని ఈ చింత? మీనుండి ఎంతో నేర్చుకొన్నాను. దక్షిణాంచలానికి నన్ను ప్రతినిధిగా నొనర్చి పరిపాలనానుభవం గడించే మహదవకాశాన్ని అనుగ్రహించారు. సలహాలిచ్చేందుకు కుశాగ్రబుద్ధులైన అమాత్యులున్నారు. 'జనవాక్యంతుకర్తవ్యమ్' కనుక ప్రజామనోభిష్టాన్ని పరిగణనలోకి తీసికొని విధానాల్ని నిర్ణయిస్తాను. సమర్ధవంతమైన నేతృత్వం ఎలా ఉండాలో, రాజధర్మ నిర్వహణలో విధినిషేధా లేమిటో సూచించే ఆచారసంహితను మహారాజ వారు లిఖితరూపంలో అనుగ్రహిస్తే దాన్ని శిరోధార్యంగా భావించి పాటిస్తాను".

అనురాగం వ్యంజితమయ్యే స్వరంతో మహారాజు ఇలా అన్నారు. "నాయనా! వీరవర్మా! నీవు విద్యావినయసంపన్నుడవని మేము ఎరుగుదుము. అయినా, ప్రశాసన నిర్వహణకు వలసినది జాగృతి నీలో ఎంతమేరకున్నదన్నదే మా చింతనకు కేంద్ర స్థానీయము".

"మహారాజా! మీరు సెలవిచ్చిన జాగృతిని అలవర్చుకొనేందుకు ఏ విద్యాపీఠాన్ని ఆశ్రయించాలి? తక్షశిలలో, కాంచీపురంలో, ఉజ్జయినిలో, వారణాసిలో లేక మరే విద్యాకేంద్రంలో చేరాలని మీరు భావిస్తున్నారు?"

"నీవంటున్న విద్యాకేంద్రాలేవీ మా దృష్టిలో లేవు. మా గురుదేవులు భరద్వాజుల వారి ఆశ్రమమే, అన్ని వాధాలా అనువైనదని మా అభిమతం. వారి ఆశ్రమం గహనారణ్యాన్ని ఛేదిస్తూ ప్రవహించే గోదావరి తీరస్థ మంత్రపురి పరిసరాల్లో వుంది".

"మహారాజా వారు ఆజ్ఞాపించిన తత్‌క్షణం నేను వెళ్ళడానికి సిద్ధంగా వున్నాను".

"కుమారా! అది నీవే నిర్ణయించుకోవాలి".

"అలాగే".

రథసారథి సింహద్వారం ముంగిట రథాన్ని తెలతెలవారు వేళ నిలిపాడు. వస్త్రభూషణాదులచే స్వలంకృతుడై యువరాజు స్వీయరక్షణార్థం ధనుర్బాణఖడ్గదారియై మెట్లు దిగుతున్నాడు. వీడ్కోలిచ్చే నిమిత్తం తలిదండ్రులు ముందుగానే వచ్చి నిలుచున్నారు. మాతాపితలకు పాదాభివందనం కావించాడు కుమారుడు. కుమారుని లేవనెత్తి శిరమును మూర్కొని ఆశీర్వదించారు. 'జాగ్రత్త నాయనా!' అంటూ తల్లి కంట నీరెట్టింది. 'విజయీభవ' అని తండ్రి వీపు తట్టాడు. భావనావశుడై వాళ్ళకు

ఊరట కలిగేలా 'దిగులుపడవద్దని వెంటనే తిరిగి వస్తానని' అన్నాడు. 'అంతా దైవేచ్ఛ' అంటూ మహారాజా వారు ఆలోచనలో పడిపోయారు. రాకుమారుడు ఠీవిగా నాలుగడుగులు నడచి రథారూఢుడైనాడు. రథం కొంతవడి మెల్లిగా ముందుకు కదలి, పిదప వేగంగా క్షితిజంవైపు - అనాగతం వైపు సాగిపోయింది. మహారాజా వారు చాలాసేపు మౌనంగా నిలబడిపోయారు. మహారాణి మనసులోని ఆవేదనను అర్థంచేసుకొన్న మహారాజు 'అన్నిటికీ గురుదేవులే వున్నారని, కొడుకు జ్ఞానసంపన్నుడై క్షేమంగా త్వరలోనే తిరిగి వస్తాడ'ని ఊరడించాడు.

మూడు రోజుల ప్రయాణం తరువాత, రథం చుట్టూ కంక దడిగల ఆశ్రమం ముందు నిలిచింది. ఆశ్రమం ఆవరణలో కొన్ని చిన్నవీ కొన్ని పెద్దవీ అయిన పర్ణ కుటీరాలున్నాయి. ఆశ్రమద్వారం మూసి వుంది. ద్వారానికి చేరువలో 'ఆకాశగంగ-జాగృతీ కేంద్రమ్' అనే అక్షరాల ఫలకముంది. రాకుమారుడు తట్టే లోపే తలుపులు తెరుచుకొన్నాయి. పలితశ్మశ్రుడూ, మధ్యమదేహయష్టి గల వృద్ధుడు దృగ్గోచరమైనాడు. చక్కని ముఖవర్చస్సు; అనాగతాన్ని దర్శించగల నయనద్వయం. అనిర్వేదం ధ్వనించే స్వరంతో రాకుమారునకు స్వాగతవచనాలు పలికాడు.

బద్ధాంజలియై రాకుమారుడు అన్నాడు "భరద్వాజ గురుదేవుల దర్శనార్థిని. వారు అనుగ్రహించెదరా?"

"ఔను".

"వారు లోన ఉన్నారా?"

"కాదు, ఇక్కడే వున్నారు".

"ఎక్కడ?"

"నీముందే - నేనే. నన్నే భరద్వాజులంటారు."

క్షణం సేపు లజ్జావశుడై "నేను...." ఏదో అనబోయాడు రాకుమారుడు.

"జయవర్మ మహారాజు గారి కుమారుడవైన వీరవర్మవు అవునా!"

"నేను తమ వద్దకు....."

"స్వీయజాగృతీవికాసార్థం వచ్చావు".

"పరిపూర్ణత సాధించటానికి ఎంతకాలావధి అవసరమౌతుంది? నెలలా.... సంవత్సరాలా? సవినయంగా అడిగాడు రాకుమారుడు.

మందహాసం గావిస్తూ ఆచార్యుడిలా అన్నాడు: "గడియ పట్టవచ్చు. గోదోహనానికి వలసిన అవధిలో సాధించవచ్చు. అయనం లేదా సంవత్సరం. పది.... పాతిక సంవత్సరాలు, అర్థ శతాబ్దం, ఈప్సితార్థసిద్ధికి సరిపోవచ్చు. జన్మలో అసాధ్యమూ కావచ్చు. సాధకుని సంకల్పం, దీక్ష, అవిరామకృషిని పట్టి అంతా వుంటుంది."

"ఏ సుముహూర్తాన సత్రారంభమో ఆచార్యుల వారు సెలవియ్యాలి!"

"అది ఆరంభం కాలేదనా నీ సందేహం. ఆశ్రమం ముందు నిలిచిన మరుక్షణమే ఉపనీతుడవైనావు".

"ధన్యోస్మి - లోనికి రావచ్చునా?"

"నిస్సందేహంగా. ప్రవేశించాక ప్రశిక్షణ పూర్తి అయ్యే వరకు ఆశ్రమాన్ని వీడడానికి అనుమతి వుండదు".

"మీ ఆశ్రమ నియమాలకు సర్వదా నిబద్ధుడనై వుంటాను".

"అయితే, లోనికి ప్రవేశించవచ్చు".

ఆశ్రమ ద్వారాలు మూసికొనినవి.

ఆశ్రమం ఆవరణలో ఫలపుష్పాలతో శోభిల్లే తరుఖండం ఉంది. కృషీయోగ్యమైన క్షేత్రం వుంది. అధ్యాపన కక్ష్యలున్నవి. వాటికి అలతి దూరంలో ఛాత్రావాసాలు, పాకగృహం, గోశాలలూ వున్నాయి. ఛాత్రావాసాలకు కించిద్దూరంలో తరులతాగుల్మాల మధ్య ఆచార్యుల వారి నికేతనం ఉంది. శారీకాకీరాదిపక్షి సంతానాలు స్వేచ్ఛగా ఎగురుతున్నాయి లేదా తరుశాఖికలను ఆశ్రయించి కలరవాలు చేస్తున్నాయి. చిన్న కొలను ఉంది. దానిలో జలకుక్కుటాలు, కారండవాలు ముచ్చటగా ఈదుతున్నాయి.

మరునాటి ప్రభాతవిహార వేళ, భరద్వాజులు నవోపనీతుడైన వీరవర్మతో ఇలా అన్నాడు.

"వీరవర్మా! నీవు నీ నిత్యాహ్నికంలో ప్రాకృతగీర్వాణ భాషలతో పాటు గణిత, భౌతిక, ఖగోళ శాస్త్రాల్ని, వ్యాకరణాదిషడంగాల్ని, సాంఖ్యాది షడ్దర్శనాల్ని అధ్యయనం చేయవలసి వుంటుంది. ఉభయసంధ్యలూ ఓ గంటపాటు ధ్యాన మౌనస్థితిని పాటించాల్సి వుంటుంది. విరామసమయాల్లో పాకభాండమార్జనం, మహానసంలో సూపకారునికి సహాయపడటం, గోదోహనం వంటివి చేయాల్సి వుంటుంది. అధ్యయనం నిషిద్ధమైన దినాల్లో కృషికర్మ. విపణ వీధిలో ఆశ్రమోత్పత్తుల విక్రయించి, సేద్యానికి అవసరమైన వస్తువుల కొనగోలు నీ విధి నిర్వహణలో భాగం. ఇదంతా చేస్తూ, సమయమే సర్వార్థసాధకం కనుక సమయాన్ని పాటించు. ప్రేమయే పరమార్థం కనుక చిన్నాపెద్దా అనే వివక్షత లేకుండా అనురాగాన్ని పంచిపెట్టు. ఇహపరలోకాప్తికి సత్యమే ఆశ్రయణీయం కనుక సత్యరనిరతుడవు కావలె. దాయిత్వమే సర్వాభీష్టసాధనం కనుక విధినిర్వహణలో అలసత రానీకు".

ఆచార్యులు చెప్పినది వీరవర్మ శ్రద్ధగా ఆలకించి ఆచరణలో పెట్టాలని నిర్ణయించుకొన్నాడు.

ఆచార్యులు చెప్పటానికి మళ్ళీ ఉపక్రమించారు. "ఇంకో ముఖ్యమైన విషయం. నీవు అధ్యయనంలోనో అన్యకర్మాచరణలోనో నిమగ్నుడవైయున్న వేళ, అదాటున వచ్చి నీపై ఖడ్గప్రహారం కావిస్తాను".

ఇది విన్న వీరవర్మ భయకంపితుడైనాడు. 'ఈ వృద్ధునకు మతి చలించినదా ఏమిటి' అని ఆలోచిస్తున్న వేళ ఆచార్యుడు ఇలా అన్నాడు. "కత్తి వేటు నుండి నిన్ను నీవు రక్షించుకోవడం నీ ప్రధాన లక్ష్యమై యుండాలి".

వీరవర్మ ఖిన్నుడైనాడు.

"భయపడకు - ఇందుకు నేనుపయోగించేది దారు ఖడ్గమే!"

వీరవర్మ కొంత ఊరట చెందాడు. సందేహిస్తూనే "తథేఽతి ఆచార్యా!" అన్నాడు.

వీరవర్మ అవధానత వృద్ధింగతమైంది. పూర్వంకన్న ఎంతో అప్రమత్తుడైనాడు. యథారుచమైన ఆచరణ ఆశ్రమజీవనశైలిలో వీలుపడదన్న కటుసత్యాన్ని గ్రహించాడు. మొదటి రెండు రోజులు అసాధరణమైనదీ, అప్రియమైనదీ ఏదీ జరుగలేదు.

అకుతోభయుడై, స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటూ కాలం గడుపుతున్నవేళ వృద్ధుడు అకస్మాత్తుగా వెనుకనుండి వచ్చి కర్రకత్తితో మోదాడు. చర్మం గంట్లతో ఎర్రబారింది. ఎముకలు బావురుమన్నవి. దేహానికి వణుకు పుట్టింది. కళ్ళలో నీరు తిరిగినవి. ఆచార్యుడు అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

ఏమరుపాటుకు తావులేదని గ్రహించాడు. అతని సంవేదనాక్షమత నిశితమైంది. ఎంత చిరుసవ్వడియైనా, ఎక్కడ ఏది కదలినా, వెంటనే స్పందించసాగాడు. పశువుల, పక్షుల, మనుష్యుల కళ్ళలో ముఖాల్లో వ్యక్తమయ్యే ఇంగితాన్ని పసిగట్టడం అలవరుచుకొన్నాడు. హఠాత్తుగా వచ్చి ఆచార్యుడు వెనుక నిలిచిన క్షణమే కనులు కదిలేవి. వెలుగునీడల వైవిధ్యం పూర్తిగా అవబోధమైంది. గాలి కదలికకు సైతం సావధానుడయ్యేవాడు. వారం రోజులలో ఒకటి రెండు మార్లు కత్తివేట్లు చవిచూశాక తాడితస్థితి నుండి బయటపడి నివారణాసామర్థ్యం గల క్రియాశీలి అయినాడు. ఆచార్యుడు ఖడ్గప్రహారానికి ఉద్యుక్తుడైన క్షణమే ముందుకురికి ప్రహర్తకభిముఖుడై చేయి పట్టుకొనేవాడు లేదా వేటును తప్పించుకొనేందుకు చాగిల్లేవాడు. ప్రహారాన్ని తప్పించుకొన్నాక, గురువుకేసి చిరునగవుతో చూసేవాడు.

ఇలా ప్రాణాలతో చెలగాటమైన క్రీడ మూడు నెలలు కొనసాగింది. స్వీయ రక్షణ విద్యలో వీరవర్మ ఉత్తీర్ణత సాధించాడు. నానాటికి నిశితమైన అతని పంచేద్రియాలు అనూహ్య ప్రహారాలనే కాదు, పరిసరాల్లోని స్థావరజంగమస్థిత్యంతరాన్ని రెప్పపాటున ఆకలనం చేసుకోగల పటిమను సంతరించుకొన్నవి. వీరవర్మ ఏకాగ్రతతో పాటు సూక్ష్మదృష్టిని పెంపొందించుకొన్నాడు. ఒక నెలపాటు అదాటుగా వచ్చే ప్రతి వేటును తెలివిగా తప్పించుకొన్నాడు. మూడు మాసాలు గడిచాక, సాధించిన ప్రగతికి సంతసిల్లి, ఆచార్యుడు శిష్యుని తన వద్దకు రావించుకొని ఇలా అన్నాడు. "నీవు సాధించిన ఉత్తీర్ణత నేత్రదీపకం. వీరవర్మా!"

"స్నాతకార్హతను సంపాదించినట్లేనా గురుదేవా?"

"లేదు. మొదటి సత్రం ముగిసింది. రెండవది త్వరలోనే మొదలవుతుంది. నీవింతవరకు ఆర్జించుకొన్న గుణాంకాలు నూటికి డెబ్బదినాలుగు".

వీరవర్మ లోలోపల అనుకున్నాడు 'మిగతా ఇరువదియారు మాటేమిటి?' ఈ మూడు నెలల్లో జ్ఞానపరిధిని విస్తరింపచేసుకొన్నాడు. నవీనతంత్రాన్ని వివిధ కళానైపుణ్యాన్ని కరతలామలకం చేసుకొన్నాడు. వ్యవస్థాపనాసామర్థ్యంతో పాటు, క్రయ విక్రయ వ్యవహారాల్లోని మెలకువలను ఆకలనం చేసుకొన్నాడు. 'ప్రశిక్షణలో మిగిలిన భాగమేమిటని' తన్నుతాను ప్రశ్నించుకొన్న క్షణమే 'ఉచ్చస్తరీయ జాగృతి' అని నుడివి ఆచార్యుడు శిష్యుని అశ్చర్యపడేలా చేశాడు.

'ఈ ముసలాయన ఆంతర్యాన్ని పసిగట్టగల సూక్ష్మగ్రాహి!'. వీరవర్మ స్వగతం ముగియకపూర్వమే ఆచార్యుడన్నాడు "ఇక ముందు దారుఖడ్గంతో కాక లోహఖడ్గంతో ప్రహారం చేస్తాను". "చిత్తం" అన్నాడు వీరవర్మ కాలికింది నేల కదిలినట్లయింది.

వీరవర్మ సంవేదనాక్షమత శతగుణితమయ్యింది. సావధానతతో పాటు సతర్కత గరిష్ఠస్థాయి నందుకొన్నది. పరిసరాల్లోని మార్పును, వస్తువులు లోనయిన మార్పును వీరవర్మ ఇట్టే గ్రహించేవాడు. ప్రవృత్తితో పాటు అభిజ్ఞానం అసిధారలా సునిశితమైంది. సత్రారంభమైన రోజునుంచే ప్రతి ప్రహారాన్ని సకాలంలో కాయికంగా, మానసికంగా ఆయత్తమై తప్పించుకోగలిగాడు. మొదట్లో ఏవో చిరుగాయాలయ్యేవి. సప్తాహం తరువాత అనాయాసంగా ప్రతి ప్రహారాన్ని నివారించగలిగాడు. ఆచార్యుని కళ్ళలోని వెలుగు, ఆయనకు కల్గిన ఆనందాన్ని, తృప్తిని, చెప్పక చెబుతున్నది. వీరవర్మని చేతన జాగరూకతాస్థాయి నందుకొన్నది. పరిసరాల్లోని ప్రతి మార్పుకు స్పందించడమే జాగరూకత. ఎక్కడ చిరు సవ్వడైనా, కదిలికయైనా, ధ్వని, వేగం, వర్తన ఏ మార్పుకు లోనైనా గ్రహించే సంవేదనాశీలత్వం పరిణతి నందుకుంది.

వీరవర్మ సూక్ష్మగ్రాహి కావడంతో పాటు పూర్తిగా అప్రమత్తుడైనాడు.

ఒక నెల తరువాత ఆచార్యుడు శిష్యుని చేరబిలుచుకొని ఇలా అన్నాడు. "నీ ద్వితీయసత్రం ముగిసింది. నీవు ఎనుబదియైదు గుణాంకములను ఆర్జించుకొన్నావు".

వీరవర్మ ఆచార్యునకు ధన్యవాదాలు తెలుపుకొన్నాడు. ప్రశిక్షణ పూర్తికాలేదన్న గురువు గారి మనోభావనను గ్రహించాడు. మిగతా పదిహేను గుణాంకాల గురించి ఎలాటి ప్రశ్న వేయలేదు. పరిపూర్ణత తనకు సిద్ధించలేదని వీరవర్మకు తెలుసు. మందస్మితం చేస్తూ ఆచార్యుడు అన్నాడు "మళ్ళీ దారుఖడ్గంతో వస్తాను. పగలయినా, లేక రేయయినా. నీవు మేల్కొని యున్న వేళనైనా నిదురోతున్న వేళయినా. నీవు అనుక్షణం అప్రమత్తుడవై యుండాలి."

'ఇదేమిటో చిత్రంగా వుందని' లోలోన అనుకుంటూ ఆచార్యుడు చెప్పిన దానికి తల ఊపాడు.

అచార్యుని వలన అనుజ్ఞాతుడై, తన కుటీరానికి తిరిగి వచ్చాడు. ద్వారానికున్న అర్గళం యథాస్థానంలో వుందో లేదో చూశాడు. ఊహించినంత అయ్యింది. అది తొలగించబడింది. తలుపులు బంధించడానికి వేరే మార్గం లేదు. ధ్యాననిమగ్నుడైనాడు. మొదటి రాత్రి పూర్తిగా మేల్కొనే వున్నాడు. ఆచార్యుడు తలుపులను నెట్టి, రాత్రి రెండో జాము చివర లోనికి ప్రవేశించాడు.

వీరవర్మ మేల్కొనియే వుంటాడని ఆచార్యునకు తెలుసు. శిష్యుడు గురువునకు ప్రణమిల్లాడు. ఆచార్యుడు మందస్మితం చేస్తూ కుటీరాభ్యంతరం నుంచి నిష్క్రమించారు. మరుసటి మూడు రాత్రులు నిదరోతూ, మేలుకొంటూ గడిపాడు. మూడవనాడు మధ్యరాత్రి ఆచార్యుడు కుటీరానికి వచ్చాడు. మూసివేసిన తలుపులకు దేహాన్ని ఆన్చి, పక్కవాటుగా వీరవర్మ నిదురపోతున్నాడు. తలుపులు నెట్టబడగానే, అప్రమత్తుడై కనురెప్ప పాటులో శయ్యనుండి నేలకు దొరలి, కత్తి వేటును తప్పించుకొన్నాడు.

వీరవర్మ చేతన జాగృతి స్థాయికి చేరుకుంది. అప్రమత్తంగా, సావధానంగా, నిత్యం జాగరూకునిగా మెదిలే స్థితప్రజ్ఞుడైనాడు. పరిస్థితిని పరిసరాల్ని, కారణకార్యాల్ని చిటికెలో గ్రహించడమే జాగృతి. రేఖలకు మధ్య, పూర్వాపరం, అధోర్ధ్వం నిక్షిప్తమైన అర్థాన్ని ఆకలనం చేసుకొనడమే జాగృతి. ఒకే ఒక దృష్టి నిక్షేపంలో అతీతవర్తమాన భవిష్యత్తుల్ని గ్రహించగలవాడిగా వీరవర్మ పరిణతి చెందాడు. ఆచార్యుని ప్రభావవలయాన్ని అధిగమించాడు. గురువొనర్చిన ప్రతి ప్రహారాన్ని అవలీలగా తప్పించుకొన్నాడు. పరమదయాన్వితుడైన ఆచార్యుడు మూడు వారాల తరువాత శిష్యుని చేరుబిలుచుకొన్నాడు.

ఓతః ప్రోతమైన ఆత్మవిశ్వాసంతో వీరవర్మ అన్నాడు. "గురుదేవా? ఈ మూడవ సత్రం కొన్నాళ్ళలో ముగియనుంది. నేను తొంబదియొక్క గుణాంకాలను ఆర్జించాను. పగటివేళనైనా రాత్రివేళనైనా లోహ ఖడ్గంతో ప్రహారానికి మిమ్ము ఆహ్వానిస్తున్నాను. విశిష్టశ్రేణిని సాధించానే కాని పారంగతుణ్ణి కాలేదు".

ఆచార్యుడు ఎంతగానో ఆనందించాడు.

వీరవర్మ ప్రవృత్త్యభిజ్ఞానదిషణలు అంతర్నిహితమైన అధిచేతనాస్థాయి నందుకొన్నవి. అంతర్దృష్టితో పాటు అంతఃప్రేరణను సొంతం చేసుకొన్నాడు.

ఆచార్యడు ఖడ్గ ప్రహారాని కుద్యుక్తుడయ్యే లోపునే సంపూర్ణాయత్తుడై ప్రహర్తను పరాస్తుణ్ణి చేయగల పటిమను అలవరుచుకొన్నాడు. నిద్రలో సైతం అప్రమత్తునిగా ఉండేవాడు. అతని నిద్ర 'ధ్యానస్థయోగనిద్ర'గా మారింది. లోకుల ఆచరణలో గర్భితమైన అర్థాన్నే కాక, మాటలలో వ్యక్తం కాని అభీప్సితాన్ని ఆకళింపు చేసుకోగల నేర్పుకలవాడైనాడు.

గురుపూర్ణిమ నాడు ఆచార్యుడూ శిష్యుడూ ఒక చోట సమావేశమైనారు. వీరవర్మ భరద్వాజుల వారికి ప్రణమిల్లాడు.

ఆచార్యుడన్నాడు ''రాకుమారా! నిన్ను మనసారా అభినందిస్తున్నాను. గురుకులంలో నీచే అధీతం కాదగిన అభ్యాసక్రమం ముగిసింది. సమ్యగ్ జాగృతిని సాధించిన ఆచార్యుడవు. నీవిక స్వతంత్రుడవు''.

వీరవర్మ బద్ధాంజలియై ఆచార్యుని కేసి సాశయంగా చూశాడు. అంతరార్థాన్ని గ్రహించి ఆయన ఇలా అన్నాడు.

''నీవు తొంబదినాలుగు గుణాంకములను ఆర్జించుకొన్నావు. ఏ ప్రశిక్షణార్థి ఇంతకు మించి సాధించలేదు. మిగతా ఆరు స్వప్రయత్నం వల్లనే సాధ్యం. అంతేవాసిగా నేను తొంబదిమూడు మాత్రమే సాధించుకొనగలిగాను. నీ గురుకులావాసం ఇంతటితో ముగిసింది. నీ పునరాగమనం కోసం నీ తలిదండ్రులు వేచి యుంటారు''.

వీరవర్మ సాశ్రునయనుడై ఇలా అన్నాడు. ''మీరు మహానుభావులు - పరమదయాళువులు - జన్మాంతం మీకు ఋణపడి యుంటాను. నా బరువుబాధ్యతలను పూర్తిగా గుర్తెరిగినాను. ఓ వారం పాటు ఇక్కడ ఆనందంగా, కత్తి బెడద లేకుండా, మీ సేవలో ఉంటూ గడపటానికి అనుమతిస్తారా?''

''నీకు గల వ్యవధి స్వల్పం'' అని ఆచార్యుడు తూష్ణీంభావం వహించాడు. గురువు మళ్ళీ ఏమీ అనలేదు. శిష్యుడు ఏ స్పష్టీకరణాన్ని కోరలేదు.

ఆశ్రమంలో వీరవర్మ ఆనందంగా ప్రతిక్షణం గడపసాగాడు. తనకూ ఆశ్రమ పరిసరాలకూ మధ్య ఏనాడో దివ్యానుబంధ మేర్పడింది. ఆనందం చిందించే ముఖంతో ఆచార్యునికి ప్రతిరూపమా అన్నట్లు కన్పట్టసాగాడు. వ్యక్తిత్వం వికసితస్థాయి నందుకొంది.



అదే రోజు సాయంత్రం ఓ అశ్వత్థవృక్షం కింద వీరవర్మ నిల్చొని వున్నాడు - కొలది దూరంలో ఆచార్యుడు 'సురభి' దోహనంలో మగ్నుడై వున్నాడు. వృక్షశాఖకు కట్టబడిన వేత్రాన్ని చూశాడు. మెరపువంటి ఆలోచన కలిగింది. వేత్రాన్ని చేతగొని ఇలా ఆలోచించాడు. "నేడు గురుపూర్ణిమ. గురుదక్షిణ ఈయాల్సిన దినం. బహుయోగ్యమైన ఉపాయనాన్ని ఈయనకిస్తాను. ఈయన నేర్పిన పాఠాన్ని ఈయనకే అప్పగిస్తాను. అయన్ని కర్రతో మోది, 'శిష్యుడు దెబ్బతినే స్థాయి నుండి దెబ్బతీసే" స్థాయికి ఎదిగాడని' గ్రహించేలా చేస్తాను.

వేత్రాన్ని పైకి ఎత్తాడో లేదో ఆచార్యుడు వెనుదిరిగి చూసి ఇలా అన్నాడు. "నాలాటి వృద్ధుణ్ణి ఇలా సన్మానించాలన్న ఆలోచన నీకు ఎందుకు కలిగింది?"

యావత్ప్రపంచం తన చుట్టు పరిక్రమించిన అనుభూతి వీరవర్మకు కలిగింది. దివ్యచేతనాస్థితి అనేదేమిటో అర్థమైంది. హార్దిక, మానసిక, వైచారిక మరియు ఆత్మిక స్థాయిలో సమస్త మానవతతో భావబంధాన్ని కలిగియుండుటే ఆ స్థితి స్వరూపము. ఆచార్యుని క్షమాభిక్ష కోరుతూ, ప్రణమిల్లి ఇలా అన్నాడు.

"మిగిలిన ఆరు శాతం ఎలా ఆర్జించుకోవాలో ఇప్పుడు అర్థమైంది. మీ ఈ అమూల్యమైన ఉపదేశంతోనే రాజధానికి ప్రయుణమై వెడతాను. నా తండ్రి ఇహలోకయాత్ర చాలించి పరబ్రహ్మంలో విలీనం కాకముందే ఇంటికి చేరుకోవాలి. నన్ను ఆశీర్వదించండి".

ఆచార్యుడు నూత్నాచార్యుణ్ణి గాఢంగా కౌగలించుకొన్నాడు. ఆచార్యద్వయం ద్వైతాన్ని అధిగమించింది - ఉభయులూ కలిసి సాధించిన ప్రభుతయే చివరకు మిగిలింది.

మానవాళితో నిరంతారానుబంధం కలిగియుండటమే అధిచేతన.
జాగరూకుడవై విహితకర్మాచరణకు పూనుకో.

# 18. నీటిలో నీడలు

( మేక పులిపిల్ల కథ )

ఆ సేతుహిమాచలవ్యాప్తి గల ఈ పుణ్యభూమిలో, ఎక్కడైతే నేమి ఒక కొండ వుంది. ఆ కొండ వంపుపై, ఒకానొక వ్యాఘ్రి, వేల్పుల చలువవల్ల, చంద్రశకలాలవంటి నాలుగు కూనల్ని ప్రసవించింది. రెండు రోజులు గడచాక, మాతృస్తన్యాన్ని పానం చేస్తున్న ఓ కూన, విధివైపరీత్యం వల్ల, పట్టుదప్పి వంపు నుండి దొరలుతూ, చరియగుండా మేకల మందతో వెడుతున్న ఓ గొల్లడి ముందు పడింది. దొరలడంలో ఒంటికి కలిగిన చిరుగాయాల వల్ల విలవిలలాడుతూ కనులు తెరువని పులికూనను చూసి అతడు నిలువునా చలించిపోయాడు. జాలిగుండెలు గల ఆ గొల్లడు దానిని ఎత్తి ఎడమ భుజంమీద వేసుకొన్నాడు - అక్కడే కూర్చుని వేదన ఉపశమించే విధంగా దాని లేత మేనిని నిమిరాడు. ఆ తరువాత పసుపును అద్ది, కొన్ని నీటి చుక్కలు తాగించాడు.

రెండు రోజుల క్రితం, అతని మందలోని శరీరపుష్టి గల ఓ మేక పట్టు ఉండల్లాంటి రెండు పాపలకు తల్లి అయ్యింది. అది బహుక్షీరవతి. దానికి తన యజమాని అంటే వల్లమాలిన అభిమానం. మాతృహీనయైన నవజాతకు దాది కావడానికి సంతోషంగా అంగీకరించింది.

చలీ చీమల బారులా రోజులు దొరలి పోతున్నాయి. ఛాగికి పుట్టుగుడ్డు అయిన పులిపిల్లపై కొండంత మమకారం ఏర్పడింది. దాది తల్లిని మించిన తల్లిగా మారిపోయింది. కన్నదాని ప్రేమకన్న పెంచినదాని ప్రేమ మిన్నగదా!

కూన తల్లిని అస్తమానం అంటిపెట్టుకొనే వుండేది. పొడుగాటి నాలుక స్పర్శకు దాని మేను పులకరించి పోయేది. కడుపునిండా క్షీరం అందుతుండడంవల్ల శైశవాన్ని అనాయాసంగా అధిగమించింది.

కిశోరావస్థలో అడుగుపెట్టాక కూడా, జాతికి సహజమైన చిన్నెలేవీ కనబర్చకుండా మామూలు మేకపిల్లలా సాటి మేక పిల్లలతో గెంతుతూ, పరుగులు తీస్తూ, వెంటబడుతూ, హళుక్కి పోరుకు దిగుతూ, తన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ పెంపుడు తల్లిని ముప్పొద్దులూ మురిపింపసాగింది. సంస్కారం జన్మతః కాక, పోషణతో అలవడుతుందన్న సత్యం జగమెరిగనదే కదా!

మేకపిల్లల 'మే మే' విని అదికూడా అతి కష్టం మీద 'మే మే' అని అరవడం అలవరుచుకొంది. అనతికాలంలో, ఛాగీయభాషలో ప్రవేశం కాకపోయినా, నిత్యవ్యవహారానికి అవసరమైన పదావళిపై ప్రభుత సాధించింది. ఛాగీయ శివుమందిరంలో చేర్పించబడి, అజాన్వయభూషణుడైన అయ్యవారు చెప్పే పాఠాలను వల్లెవేస్తూ, విరామసమయాల్లో ఆడించే ఆటల్లో ఉత్సాహంగా పాల్గొనేది.

ఒకనాడు పాఠాలు జరుగుతున్న వేళ, కక్ష్యలో ప్రవేశించి ప్రధానాచార్యులు ఇలా సంబోధించాడు.

"ప్రియఛాత్రులారా! మనమందరం ఛాగజాతీయులం. అంటే మేకలనబడే ప్రాణులమన్నమాట. ఈ సృష్టిలో శాకాహారమాంసాహారప్రాణులు మనకంటే ఎంతో కండపుష్టి కల్గినవి. మనకు మాంసాహారజీవాలవల్ల అడుగడుగునా గండాలే. అదాటున మీదపడి మనను పొట్టనబెట్టుకుంటాయి కనుక మనం జాగరూకతతో వ్యవహరించడం ఎంతైనా అవసరం. జన్మతః మనం స్వాదిష్ఠపర్ణభోజులం. అయితే మనం మనసుపడే రకరకాల పర్ణాలు కంటకోపేతమైన తరులతా గుల్మాలకు చెందినవి. నాలికతో ఆకులను లాగుతున్నవేళ ముళ్ళనుండి ముఖాన్ని కాపాడుకోవాలి."

"ఆకులే మనకు మనదైవతమైన అజుడు విధించిన ప్రధానాహారం - మన జీవనాధారం. హింస్ర పశువుల బారి పడేవాళ్ళం కాబట్టి అధికాధిక సంతానోత్పత్తి మన ఏకైక లక్ష్యమై యుండాలి. మనల్ని ప్రాణసమానంగా చూచుకొనే యాదవ యజమానికి లాభసాటి అయ్యేవిధంగా క్షీరోత్పాదన చేయాలి. అడవిలోని ఆకులతో పాటు పౌష్టికాహారాన్ని సమకూర్చేది ఆయనే కదా!"

ఛాగీయపాఠశాలల్లో వృక్షశాస్త్రం అనివార్యమైన విషయం. ఏవి భుజించాలో, ఏవి పరిహరించాలో అయ్యవార్లు శ్రద్ధగా బోధించేవారు. ముంగాళ్ళ మీద నిలిచి ఎత్తైన కొమ్మల్ని ఎలా అందుకోవాలో నేర్పేవారు. ఏ ఋతువులో, ఏ తరువులు పల్లవించి పుష్పిస్తాయో వివరంగా చెప్పేవారు.

ఉపాధ్యాయులు అధ్యాపనంతో పాటు ఆటపాటలకు సమాన ప్రాధాన్యతను ఇచ్చేవారు. విరామసమయాల్లో ఉత్ప్లవన ప్రతిప్లవనాలు, అభిధావనం, లుఠన విన్యాసం లలాటపట్టప్రహరణం, శిథిలాలయదుర్గారోహణం వీటికి వెన్నతో బెట్టిన విద్యలా అని చూపరులు భ్రమించేంత స్థాయికి ఎదిగేలా పంతులయ్యలు శ్రమించేవారు.

సాయంకాలాలు ఛాగవంశ పితామహుడైన గళస్తనాచార్యుని చుట్టు మూగేవారు. ఆయన వయోవృద్ధుడే కాక జ్ఞానవృద్ధుడు కూడా. ఛాగేతిహాసం ఆద్యంతం తెలిసినవాడు. వృక్షవిజ్ఞానంలో ఆయనను మించిన వారు బహు అరుదు. వివిధ పర్ణాల పోషకతత్వాన్ని లోతుగా పరిశోధన చేశాడు.

క్షీరస్తంభనతంత్రం క్షుణ్ణంగా తెలిసిన ఆయన ప్రసూతలకు తగు సలహాలిచ్చేవాడు. ఛాగపరిషత్తులో నేత మరియు ఉపనేత విధులేమిటో చెప్పేవాడు. దాంపత్యజీవనంలో భార్యాభర్తలు ఎలా మసలుకోవాలో చెబుతూ, మగమేకలు ఆడమేకలకు, పిల్లమేకలకు రక్షణ కల్పించాలని, ఆడమేకలు మగమేకలకు కలిమిలో, లేమిలో తోడై నిలువాలని హితవు పలికేవాడు.

ఒకనాటి సమావేశంలో, పశుపక్షిసరీసృపాల గురించి, నదీనదాల గురించి సరోవరాల గురించి, అనావృష్టి అతివృష్టి గురించి, చెప్పాక ప్రవచనాన్ని ముగించే ముందు ఇలా అన్నారు.

"అన్నిటిని మించి మన మందలపై మెరుపుదాడులు సల్పుతూ, చిన్నాపెద్దా, ఆడామగా, చిన్నాచితుకూ అన్న వివక్షణ లేకుండా చేతి కందిన జీవాలను పొట్టన బెట్టుకొనే రాక్షసరూపాలు కొన్ని వున్నాయి. ఏదో ఒకదానిమీద పడి, చంపి, ఈడ్చుకొంటూ వెళ్ళి తమ పిల్లల కడుపు నింపుతాయి - ఆ కోవకు చెందిన పెద్దపులి అనే మహాక్రూరమైన, దయాదాక్షిణ్యరహితమైన ప్రాణి వుంది - గతంలో ఆడాళ్ళని, పిల్లల్ని పట్టుకోవాలని చూస్తున్న వేళ, మేక మగరాయుళ్ళు ఎన్నోమార్లు పులులను కేవలం కొమ్ములతో ఎదిరించి, బెదిరించారు. అయితే పారద్రోలిన సంఘటనలు లేకపోయినా, మిగతావాటికి పలాయనావకాశాల్ని కల్పించి, అసువులుబాసిన వీరుల గాథలు మీరు వినేవుంటారు. ఎన్ని రకాల వ్యాయామాల్ని చేసినా, ఎంత శారీరికశక్తిని పెంచుకొన్నా పులులను, సింహాల్ని చివరకు నక్కల్ని సైతం ఓడించలేమన్న సంగతి మరువకూడదు. అవి ఎదురైనవేళ చిటికెలో నాల్గుదిశల్లో దూసుకొనిపోయే పలాయన పాటవాన్ని మనం పెంపొందించుకోవాలి. పలాయనవాదమే మన జాతికి శ్రీరామరక్ష!"

అజార్భకులు, వారిలో ఒకడైపోయిన వ్యాఘ్రకిశోరుడు పితామహుని మాటలు విని భయంతో వణికిపోయారు. పులిపిల్లగా జన్మించి, అన్యజాత్యాశ్రయం వల్ల మానసికంగా మేకపిల్లగా మారిన వింతప్రాణికి పులి పేరెత్తితే ముచ్చెమటలు పుట్టేవి. ఒకనాడు తమ అన్నలతో ఇంటికి చేరుకొన్నాక పెంపుడుతల్లి ఒంటికి ఒళ్ళు చేర్చి వ్యాఘ్రశాబకుడు ఇలా అన్నాడు. "అవ్వా! మనల్ని భయకంపితుల్ని చేసే దుష్టజీవిని - పులిని ఎపుడైనా చూశావా?"



మాయి కళ్ళు విప్పారినవి. యావద్గాత్రం రోమాంచితమైంది. గద్గదస్వరంతో ఇలా అంది.

"నాయనా అజీ! పులి రాక్షసుల తలదన్నే క్రూరప్రాణి. ఓ పులి నీ పిన్నిని కొన్ని రోజుల క్రితం పొట్టనబెట్టుకుంది. నీవు జాగ్రత్తగా ఉండాలి. ఆ మచ్చల దెయ్యాన్ని నీ ఆలోచనకు దూరంగా వుంచు. ఛాగీయులకు ఇలదైవమైన అజుణ్ణి నిత్యం స్మరించుకో. ఆ దెయ్యాన్నే కాదు, దాని నీడను నీవెపుడైనా చూడటం తటస్థిస్తే 'పులి-పులి' అని బిగ్గరగా అరుస్తూ నీ పిక్క బలాన్ని చూపించు. నీ సాటివారు అప్రమత్తులై శరవేగంతో పరుగులు తీస్తారు. వారి ప్రాణాలు రక్షించిన ఘనత నీకు దక్కుతుంది. నామీద లేక నీ అన్నలమీద దాడికి దిగిన వేళలో సైతం, మావేపు పరుగెత్తుకుంటూ రాకు. దాని పంజాకు నిష్కారణంగా బలి అయిపోతావు. నిన్ను నీవు కాపాడుకో! చిట్టి తండ్రీ! అజుణ్ణి స్మరించి నిదురపో. కళ్ళుమూస్తే ఏ కలతలూ వుండవు."

మాయి మేకతల్లులు పాడే లాలిపాట పాడుతుంటే 'అజ్జి' నిదుర ఒడిలో ఒదిగిపోయాడు.

చూస్తూ చూస్తూ, ఛాగజీవనంలో ఓ సంవత్సరం గడచిపోయింది. అజీత్ అందంగా బొద్దుగా ఎదిగాడు. ఒకనాడు సూరీడు కొండవెనక్కి వేళ్ళే వేళ, పక్కనే ఉన్న గహనారణ్యం నుండి జవసత్వాలు గల ఓ వ్యాఘ్రం ఘోషారామానికి, అడుగుల సవ్వడి ఎవరి చెవిని పడకుండా, చేరుకొంది. ఓ పొదిలో కొన్ని క్షణాలపాటు పొంచి వుండి, భూమి అదిరేలా గ్రాండిస్తూ మందపై మెరుపుదాడి సల్పింది. 'పులి పులి' అని కేకలు వేస్తూ, దెయ్యంవున్న దిశను వదిలి, మిగతా మూడు దిశలవేపు మేకలు పరుగులు పెట్టాయి. - పరుగెత్తే ప్రయత్నంలో, కొన్ని జారిపడి, తమాయించుకొని, రెప్పపాటులో లేచి, దూసుకొని పోయాయి. కొన్ని ఒకదానినొకటి ఒరసికొని మరుక్షణమే మామూలు స్థితికి వచ్చి కాలికి బుద్ధిచెప్పాయి. అజీత్ తోటి మూగజీవాలను అనుసరిస్తూనే, గాలిలో కుప్పించి ఎగిసి, అంగకు ఐదుగజాల నేలను కొలుస్తున్న దెయ్యంపై చూపు నిలిపాడు. కన్నతల్లీ, అన్నలూ, నేస్తాలైన 'గోమూ' 'గీమూ' ఏమైపోతారో అన్న భయం మనస్సును పీడిస్తూవుంది.

---

(అజీత్ ముద్దుపేరు)

పులిరాయుని దృష్టి నిండైన ఒళ్ళుగల మాయి మీద పడింది. ఇది గ్రహించిన మాయి కాళ్ళనూ మెడనూ సాచి గమన వేగాన్నిపెంచింది. మిత్తి కోరలు తల్లికి వెంట్రుకవాసిలో ఉండటాన్ని గమనించిన మాతృభక్తుడు అజీత్, పూర్వం మాయి ఇచ్చిన సలహాను గాలికి వదిలి, పరుగు చాలించి, మచ్చల దెయ్యంవైపు దృష్టి సారించాడు. తనయుని మేనిలోని అణువణువూ మాతృస్నేహాసిక్తమైంది. ఇన్నాళ్ళుగా ఎదలో ఘనీభవించిన భయం క్షణార్ధంలో కర్పూరంలా గాలిలో కలిసిపోయింది. కట్టలు తెంచుకొన్న రోషం భీషణాగ్నికీల అయింది. ఇన్నాళ్ళు సుప్తంగా వున్న అభిజాత్య గుణం ఓ అజ్ఞాతప్రేరణనంది మేలుకొన్నది. ఉద్యతశిరస్కుడై, దంష్ట్రలను జీవభీకరలీల బహిర్గతం కావిస్తూ, రాక్షసరూపాన్ని చీల్చి పోగులు పెట్టాలన్న మనో నిశ్చయంతో తల్లిని ఛాగీయభాషలో అకుతోభయను కావించబోయి తడబడినాడు. 'మే' 'మే' అని దీనంగా అరవడానికి బదులు దిక్కులను కకావికలు గావిస్తూ మొదటిసారిగా గాండ్రించాడు. మాయిని వెంబడిస్తున్న పులిరాయుడు తన గమనవేగాన్ని తగ్గించి, కఠోరరవం వస్తున్న వైపు దృష్టి మరల్చాడు. దూరంలో క్రోధోద్దీపితుడై, చూపులతో నిప్పులు కురిపిస్తున్న స్ఫురద్రూపుడు దృగ్గోచరడైనాడు. పులిరాయుడికి ఆశ్చర్యం వేసి ఆలోచనలో పడిపోయాడు. 'ఎవడీ అపరిచితుడు! ఎవ్వడీ అందాలకూన?'

పులిరాయుడు మాయి మాటే మరచిపోయాడు. అప్పటికే మాయి అందరాని దూరాలకు పరుగెత్తింది. ఇక భయం లేదనుకొని వెనుదిరిగి, అపరమృత్యువు వైపు మాయి దృష్టి మరల్చింది. దెయ్యంతో పోరుకు సర్వసన్నద్ధుడైన కొడుకును చూచి ఆవిడ హృదయం ద్రవించి పోయింది.

పులిరాయుడు స్వజాతీయుడైన అజీత్ వైపు అడుగులు వేయసాగాడు. ఇది గమనించిన అజీత్ ఛాగస్థితికి దిగజారి 'మే' 'మే' అంటూ పలాయన ధర్మాన్ని ఆశ్రయించాడు. పులిరాయుడికి బలే ఆశ్చర్యం వేసింది. 'ఈ కుర్రకుంక తనను చూసి ఇలా పరుగెత్తుతున్నాడెందుకని? ఇదో ప్రహేళికలా వుంది. వ్యాఘ్రం అనే ప్రాణి భయగ్రస్తమై ఇలా పరుగెత్తుతుందా? అసంభవం. ఈ కుర్రాడికి మతి చలించినట్లుంది. ఈ రహస్యాన్ని ఛేదించాలి!'

ఇలా ఆలోచిస్తూ, దౌడు నారంభించి అజీత్‌ను వెంబడించసాగాడు. అజీత్ తన బలమైన కాళ్ళను సాచి గమనవేగాన్ని ఎన్నో రెట్లు పెంచాడు.

వ్యాఘ్రుం వ్యాఘ్రాన్ని తరుముతుంది. పరుగు గరిష్ఠస్థాయి నందుకొంది. లాభం లేదనుకొని పరుగు వేగాన్ని మరికొంత పెంచి, అయ్యవారి చెరువు గట్టు వంపులోని పొదల్లో దూరి పొదగా కనుమరుగయ్యాడు అజీత్.

పులిరాయుడు తెలివితో పాటు దీర్ఘానుభవమున్నవాడు. తేలికగా ఓటమిని అంగీకరిస్తాడా? గట్టుమీదుగా వెంబడించే బదులు, కింది తోవగుండా పరుగెత్తి దట్టమైన పొదలుగల పై భాగాన్ని అధిరోహించి పది అడుగుల దూరంలో అజీత్‌కు అభిముఖంగా నిలిచాడు. పులిరాయుడి ప్రమాణాన్ని, పటిమను, భీకరాకారాన్ని, కన్నుల్లోని లేజర్ వెలుగులను చూసి అజీత్ భయకంపితుడైనాడు. కుడివైపున ముళ్ళ పొదలున్నందున దెయ్యాన్ని తప్పించుకొని 'తుర్రు' మనడం అసాధ్యమై కూర్చుంది. వేపనగతగాత్రుడైన అజీత్‌ను చూసి పులిరాయుడు నివ్వెరపోయాడు. ఇలా లోలోపల అనుకున్నాడు.

'పులి అరుపు వింటేనే పశువే కాదు మానవుడు కూడా ఆమెడదూరం పరుగెత్తుతాడు' జాత్యభిమానం మెండైన పులిరాయునికి అజీత్ వొణికి పోవడం విచిత్రంగా తోచింది. 'నూటికి నూరు పాళ్ళు పులియైన ప్రాణి మరో పులిని చూచి బెదరుతుందా?' పడుచుదైనా ముసలిదైనా పులి పులే?

అజీత్‌కు కాస్త ఊరట కలిగించే ధోరణిలో పులిరాయుడిలా అన్నాడు "అలా వొణికి పోతున్నావేవిట్రా అబ్బీ!"

అజీత్ నోరు విప్పలేదు. పులిరాయుడు మళ్ళీ అడిగాడు. అజీత్ ఏమీ అనలేదు. అజీత్ మౌనానికి మండిపడుతూ మూడోసారి ప్రశ్నించాడు.

అజీత్ అస్పష్టంగా గొణిగాడు. "నా....కు....బ....యం"

"ఎందుకా భయం?"

"మీరు నన్ను చంపేస్తారు!"

"నిన్నెందుకు చంపుతాను?"

"మీరు పులి; నేను మేకని".

ఈ మాట విన్నాక పులిరాయుడు నిలువునా కొయ్యబారిపోయాడు. 'వీడికేమయినా రోగమా? లేక దెయ్యం సోకిందా? దేముడా! వీడి మనస్సు, ఆలోచన, కల్పన - ఇవన్నీ వ్యాధిగ్రస్తమై పోయినవేమి? ఆత్మావలోకనంతో పాటు వీడి *విశ్వదృష్టి దూషితమై పోయింది. ఆకు సవ్వడికి ఉలికిపడే మేకలాగా అరుస్తాడేమిటి? తనను తాను మేకగా ఊహించుకోవడం వీడికి ఎవరు నేర్పారు?'

ఈ ఆలోచన, అనుకంపతో పాటు ఉదాత్తవిచారపరంపర గల మహానేతయైన పులిరాయుణ్ణి ఉక్కిరిబిక్కిరి గావించింది. స్ఫురద్రూపుడైన వ్యాఘ్రకిశోరుని సహజస్థితికి తేవాలని నిర్ణయించుకొన్నాడు.

పులిరాయుడు ఛాగమానసికత గల అజీత్‌ను ఆపాదమస్తకం పరిశీలించాడు. 'కిశోరుని శారీరిక సంరచన నా దానికి ప్రతిరూపంలా వుంది! వీడి మొహం మా ఆవిడ మొహంలా అందంగా వుంది! వీడి నొసటి మీది నిలువు గీత లాటిదే పులిసాని నొసలుమీద ఉంది. వీడి కోరల తీరు చూస్తే నా కోరలతో పోటీ పడేట్టు ఉన్నాయి.'

ఆలోచనాసరణి ముగిసిన మరుక్షణం యథార్థత కట్టెదుట సాక్షాత్కరించింది. ఎదుట నున్న వ్యాఘ్రకిశోరుడు తాను కోలుపోయిన కన్నకొడుకేనని పులిరాయుడు గ్రహించాడు. కొండ వంపుపై పులిసాని ప్రసవించిన మరునాడే కనులు తెరువని పసికూన పాలుతాగుతూ పట్టుదప్పి చరియలో పడిపోయిన విషాద ఘటన గుర్తుకు వచ్చింది.

పులిరాయుడు ప్రశ్నించాడు "నీవెవడివి?"

"చెప్పాను కదండి! నేను మేకని. నా పేరు అజీత్. మాయి మా అమ్మ పేరు" అజీత్ బదులు చెప్పాడు.

"హరి నీ కడుపు బంగారం గాను! అలా వొణకడం దేనికి? పది నిమిషాలపాటు నిన్ను ప్రాణాలతో ఉంచుతాను. ఇహ నెమ్మదించు". అన్నాడు పులిరాయుడు.

అజీత్‌కు ఆశ్చర్యం వేసింది. 'చూడగానే చంపేసే కోవకు వీడు చెందడు'. లోలోపల అనుకున్నాడు.

---

*World View

అజీత్ మామూలు స్థితికి వచ్చాడు. అయినా బాగా అలసిపోయాడు. ఒళ్ళు చెమర్చడం మొదలెట్టింది. నేతగా, ఆచార్యునిగా వ్యవహరించాలని నిర్ణయించుకొన్న పులిరాయుడు ఇలా అన్నాడు.

"కాసిన్ని నీళ్ళతో గొంతు తడుపుకొని వెంటనే రా".

అజీత్‌కు ఇది పన్నాగ మనిపించి లోలోపల ఇలా అనుకున్నాడు. 'నీళ్ళు తాగుతున్నప్పుడు అమాంతం మీదపడి చంపేయాలని వీడి ఆలోచన కాబోలు. ఇలా చెలగాటం ఆడేకంటే ఆ పనేదో ఇక్కడే చెయ్యొచ్చుగదా!'

కుర్రాడి మనోభావాల్ని పులిరాయుడు వెంటనే పసిగట్టాడు. "నేనే వెళ్ళి మొదట నీళ్ళు తాగుతాను" అంటూ చెరువుగట్టు దిగి, మోరను వంచి నీటిని నాలికతో అద్దుకుంటూ పిపాసను తీర్చుకుంటున్నాడు.

అజీత్ మనఃపటలంపై ఇలా ఆలోచనలు కదిలాయి. 'క్షణంలో మటుమాయం కావడానికి ఇదే చక్కటి అవకాశం. వాడు తిరిగివచ్చే లోపే అపాయక్షేత్రాన్ని దాటేస్తాను'.

అజీత్ నీరు తాగుతున్న దెయ్యం వేపు దృష్టి మరల్చాడు. మొదట వాడి భీమాకృతి గల అననాన్ని, నీటిలో దాని ప్రతిఫలనాన్ని చూశాడు. ఒకడికి బదులు ఇద్దరిని చూస్తున్న అనుభూతి కల్గింది. రౌద్రతాభవ్యతలు మేళవించిన ప్రతిఫలనం సైతం ఎంతో భయావహంగా వుంది. నీరు తాగడంలో నిమగ్నుడైన రాక్షసుడు తన వైపు చూడకపోవడాన్ని అజీత్ గమనించాడు.

'వీడు పూర్తిగా నన్ను నమ్మాడు; నీరు తాగుతున్నాడు' ఇలా ఆలోచిస్తున్న అజీత్‌కు భరింపరాని దాహం వేసింది. గట్టువంపుగుండా దిగి, రాక్షసుడికి పది అడుగుల దూరాన నిలిచి, నీళ్ళ వైపు మోరను వంచాడు. నీటిలో అందానికీ శక్తికీ ఆలవాలమైన ముగ్ధమోహన యువరూప ప్రతిబింబాన్ని చూచాడు. ఆ ప్రతిబింబం తన వేపే దృష్టి నిల్పినట్లు భావించి, ఓ క్షణం పాటు భయవిస్మయాలకు అధీనుడైనాడు. దూరం నుండి ఆచార్యుడైన పులిరాయుడు నీరు తాగడం మాని తదేక దృష్టితో శిష్యుని ప్రతి కదలికను గమనిస్తున్నాడు. ఉన్నట్టుండి అజీత్‌కు జ్ఞానోదయమైంది. నీటిలో తాను చూస్తున్నది తన నీడేనని, పది అడుగుల దూరంలో కన్పించేది తద్భిన్నమైన పెద్దాడిదని నిమేష మాత్రంలో గ్రహించాడు. మరో నిమిషంలో మనోగగనంపై రెండు మెరుపులు మెరిశాయి. ఒక్క మెరపుతో ఛాగత్వ భ్రాంతి పటాపంచలైంది. రెండవదానితో స్వీయవ్యాఘ్రత్వ వాస్తవత కట్టెదుట నిలిచింది.

గాత్రం ప్రకంపనాపన్నమైంది. భావాలు వర్షర్తులోని నదిలా బంధాలు త్రెంచుకొన్నాయి. స్పష్టత వెన్నల్లో పాలరాయిలా ప్రకాశించింది. పడుచు బెబ్బులి మొదట పెడబొబ్బలు పెట్టి, 'తదహమస్మి' అంటూ తన వాస్తవతను సమస్తజీవజగత్తుకు బాహాటంగా ప్రకటించుకొంది.

ఆచార్యుడు 'తత్త్వమసి' 'త్వమేవాహం' అంటూ మోదంతో అనుమోదించాడు. పులిరాయుడు యువవ్యాఘ్రాన్ని సమీపించి, శిరాన్ని మూర్కొని, ఆననానికి లేహనసుఖద స్పర్శ కలిగించి, వాత్సల్యాతిశయిత వలన గద్గద వోయిన స్వరంతో ఇలా అన్నాడు.

"నీవు పులివి. 'వాఘోబా' చలువ వల్ల తిరిగి సంప్రాప్తించిన కుమార రత్నానివి. ఈ సువిశాల గహనార్ణ్యానికి నేటి నుండి మూర్ధాభిషిక్తుడవైన యువరాజువు. నీ తల్లియైన పులిసానికి పులిరాయులమైన మాకు నోముల పంటవు. చిన పులిరాయుడుగా నిన్ను జీవలోక మెరుంగుగాక! కుమారా! ఆయుష్మాన్భవ".

ఉభయులకు అణువులో బ్రహ్మాండసందర్శన మైంది. రెండు నిమిషాల తరువాత గట్టు మీదికి ఎక్కారు. పులిరాయుడు పరుగు ప్రారంభిచగా, తనయుడు అనుసరించాడు. వేగంగా పరిగెత్తుతూ అడవి పొలిమేరల్ని చేరుకొన్నారు. చిన పులిరాయుడు ఎందుకో పరుగెత్తడం మాని ఒక చోట నిలబడిపోయాడు. ఏమీ అర్థంకాని తండ్రి పరుగును ఆపివేసి, కుమారుని సమీపించి ఎదురుగా నిలుచున్నాడు.

తండ్రితో చినపులిరాయుడిలా అన్నాడు. "నన్ను భ్రాంతి నుండి విముక్తుణ్ణి కావించినందుకు మీకు ఋణపడి వున్నాను. నాకు 'తండ్రి నౌతానని' చెప్పారు. మీరు నాకు జన్మదాతలేకారు; ఆచార్యులుకూడా! మీరు ఈవేళ నాకో వరం అనుగ్రహించాలి!"

"సంతోషంగా. ఒకటేమిటి! ఎన్నైనా ఇస్తాను".

చినపులిరాయుడు తండ్రికి తన మనోగతాన్ని ఇలా విన్నవించుకొన్నాడు.

---

వాఘోబా : మరాఠీపదం. పులులకు ఇలవేల్పు.

"అయ్యా! విహారార్థం, అధ్యయనార్థం ఈ అడవిలోనే వుంటూ, ప్రతిరోజు మీ ముందు హాజరవుతాను. వ్యాఘ్రోచితసకలవిద్యలూ మీ నుండి నేరుస్తాను. పులిలా ప్రవర్తిస్తాను. మీకు అంతేవాసిని అని అనిపించుకునే అన్ని అర్హతలు సంపాదిస్తాను. మాత్రం, నేను జీవించి ఉన్నంత కాలం మేకలను చంపకుండా వుండే స్వేచ్ఛను నాకు వరంగా అనుగ్రహించాలి. అజజాతీయుల యెడ నాకు ద్రోహబుద్ధి కలలోనైనా కలుగజాలదు. మనసా, వాచా, కర్మణా ఏ అపకారాన్ని తలపెట్టను. ఆ జాతి నన్ను రక్షించింది. అల్లారుముద్దుగా పోషించి, విద్యాబుద్ధులు నేర్పింది. అవ్యాజ ప్రేమానురాగాలను నా యెడ ప్రదర్శించింది. అణుమాత్రం జాతివివక్షత చూపకుండా తమలోని వానిగా నన్ను చూసింది. ఇక నా తల్లి మాయి! నేనంటే ఆవిడకు పంచప్రాణాలు. మొదట నా ముద్దుముచ్చట్లు తీర్చాకే, తన స్వంత బిడ్డల సంగతి పట్టించుకొంది".

చినపులిరాయుని నయనాలు శ్రావణమేఘాలైనవి. చెక్కిళ్ళు బాష్పసిక్తమైనవి. మొదటిసారిగా పులిరాయుడి కళ్ళలో నీరు తిరిగినది.

పుత్రుని ప్రగాఢనిర్వేదం అనుభూతమైన పులిరాయుడు ఇలా అన్నాడు.

"యువరాజా! నాయనా! ఈ అడవి సాక్షిగా, వ్యాఘ్రసంతతికి వేలుపు అయిన 'వాఘోబా' సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్నాను. ఛాగమేషజాతిహత్యకు ఈనాటి నుండి పాలుపడను. అంతేకాదు! గహనారణ్యవైభవోపేతమైన నా రాజ్యంలో, దాని పొలిమేరల్లో మైళ్ళుగా విస్తరించిన శాద్వలాలలో, సమస్త ఘోషారామాలలో మేకను గాని, గొర్రెను గాని, చిన్నదయినా, పెద్దదయినా, ఆడదైనా మగదైనా బెదరించడం గాని, గాయపరచడం గాని, హత్యచేయడం గాని వీనిలో ఏ ఒకటి చేసినా మృత్యుదండనకు అర్హమైన నేరంగా ప్రకటిస్తున్నాను."

"ఈ క్షణమే, ఈనాటి నుండే, మా ఈ శాసనం అమలులో పెట్టడానికి తగు చర్యలు తీసికొనవలసినదని అమాత్యమండలిని ఆదేశిస్తున్నాను."

ప్రకటనను విన్నాక, హర్షంతో ఉబ్బి తబ్బిబ్బవుతూ చినపులిరాయుడు తండ్రి మెడకు తన మెడను చేర్చాడు. వారి హృదయాలకు ఆనందపు అవలి అంచును అంటిన అనుభూతి కలిగింది.

అజీతుని దీర్ఘవియోగం సహించని మాయి అన్నపానాలు మానివేసింది. జలబుతో, జబ్బుతో అస్తమానం నేలమీద పడి వుండేది. ఏ పొద్దైనా వస్తాడేమోనని గంపెడాశతో ఎదిరిచూచేది. ఆరు నెలల గడిచాక 'ఇక రాడన్న' నిర్ణయానికి వచ్చింది. ముప్పొద్దులూ కన్నీరుమున్నీరుగా ఏడ్చే ఆవిడను ఊరడించడానికి, బంధువులు వచ్చిపోతుండేవారు 'పోయినవారు తిరిగిరారని, చావుపుటుకలు అజుని అధీనమని, మనసును రాయి చేసికొని, ఉన్నవారికోసం జీవించడం సాంప్రతం కర్తవ్యమని' ఉద్బోధించారు. ఇద్దరు కొడుకులు అహోరాత్రాలు చేసిన సేవల మూలంగా కొంచెం కోలుకుంది. పుత్ర శోకాన్ని చాల వరకు దిగమింగింది. కాలాన్ని మించిన భేషజం లేదుకదా!

మరో రెండు సంవత్సరాలు కాలచక్రం క్రింద నలిగి నుగ్గయిపోయాయి. ఛాగవంశపితామహుడైన గళస్తనాచార్యులు జాతికి తీపి గుర్తుగా మిగిలిపోయారు. అజుని దయవల్ల దివంగతాచార్యుల ఆశీర్వాద ప్రభావం వల్ల అజసంతతి తామరతంపరగా, ఎన్నడూ లేని విధంగా విస్తరించింది.

ఘోషారామవృద్ధులు మాయితో సహా సమావేశాన్ని ఏర్పాటుచేశారు. సామూహిక ప్రార్థనానంతరం ఉపప్రముఖుడు తన దీర్ఘప్రాస్తావికానంతరం సభను ఉద్దేశిస్తూ ప్రశ్నవేసాడు. "ఇంతటి నిరామయ జీవనం, ఎన్నడూ మనము చూడని జనాభా పెరుగుదల వెనుక గల కారణాలను ఎవరైనా వివరించి చెప్పగలరా?"

అవగాహన వున్నా, పెద్దలే మాట్లాడడం అనాదిగా వస్తూవున్న ఆచారం కనుక యువతీయువకుల నుండి ఎవరూ లేచి నిలబడలేదు. ఉపప్రముఖుడు మహామాత్యులవైపు చూశారు. ఈ సంకేతం కోసం ఎదిరిచూస్తున్న ఆయన లేచి, సభకు ఆభివాదం గావించి, తమ అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చారు.

"మన జనాభా పెరగడానికి ప్రధానకారణం - పోయిన రెండు సంవత్సరాల్లో మన ఆవాసాలపై గాని, మైదానాల్లో మనం తిరుగుతున్నప్పుడు గాని, పొలాల్లో మందగా వున్నప్పుడు గాని, అపరమృత్యువైన ఏ వ్యాఘ్రం దాడిచేయలేదు. తటస్థపడినప్పుడు చూసీచూడనట్లు తమదారిని పోయినవే తప్ప, ఎలాటి హాని మనలో ఎవరికీ కల్గించలేదు.

ఓ యువ భాగుడు లేచి ఇలా అన్నాడు. "ఔను! మీరన్నది నిజం. మొన్ననే ఓ పులి అతి దగ్గరలో ఉన్న నన్ను వదిలి, దూరాన గరిక మేస్తున్న అడవిదున్న వైపు పరుగులు తీసింది."

సభావేదికపై వున్న మాయికి ఆశ్చర్యం వేసింది. మేక మాంసం అంటే మొరపుట్టి, పులులు ఇతరు జంతువుల మాంసానికి మరిగాయన్న నిష్కర్షకు మేకలు వచ్చాయి.

ఒకనాడు మాయి రెండు చెట్ల మధ్య నీడగల పొదిలో కూర్చుంది. 'తన శేషజీవితం ఎలా గడువనుందో' అని ఆలోచిస్తూ కళ్ళు మూసుకుంది. బృహదాకారం గల ప్రాణి దాని ముందు నుంచి వెళ్ళింది. కదలిక వలన కలిగిన సవ్వడికి మాయి ఉలికిపడి, కళ్ళు తెరిచిచూసింది. అది ఒక ఆడపులి. క్షణం సేపటిలో మరోపెద్ద తలగల పులి దాన్ని అనుసరించడాన్ని గమనించింది. ఆకారంలో మొదటిదానికన్న రెండవది పెద్దది. అది వెనుతిరిగి మాయిని చూసింది. మాయి వున్న చోటికి వచ్చి ఎదురుగా నిలిచింది. రెప్ప వాల్చకుండా చూస్తూ, మాయి వైపు తలను నాలికను సాచింది. తనకు ఆయువు మూడినట్లుగా మాయి భావించింది. అభిముఖంగా నిలిచిన రాక్షసాకృతి బారి పడకుండా పారిపోవడం అసాధ్యమని తలచి మృత్యువు ఒడిలో ఒదగడానికి సిద్ధమై కళ్ళు మూసుకుంది. ఊహకు విరుద్ధంగా చెక్కిలికీ, మెడకూ లేహనస్పర్ష కలిగింది. పులకించిపోయి కళ్ళు తెరచింది. చూపుల్లో అనురాగాన్ని ఒలికిస్తూ 'మాయి' అని పిలుస్తూ తనవైపు చూస్తున్న ప్రాణి 'అజీత్' అని గ్రహించింది. 'మానాయనే' అంటూ కొడుకు దగ్గరకు వెళ్ళి ముద్దాడసాగింది. మాతాపుత్రుల ఆనందాశ్రువులు గోదావరీప్రాణహిత జలాలవలె సంగమించినవి.

పరిసరసమయబంధాలకు అతీతులై తల్లి కొడుకులు ఏకమై పోయారు. భాష, ధర్మం, వంశం, వయస్సు - ఇవేవీ ప్రేమకు అవరోధాలు కాజాలవు. ప్రేమ ఒక్కటే త్రికాలాబాధిత సత్యం.

మనము ఏమి కామో, ఏమి అవుతామో తెలిసికోవడమే ఆత్మావబోధం.

# 19. ప్రస్థానం : దైవత్వం వైపు

( పులి, కోతి, ఎలుగుబంటి కథ )

అచలాపురంలోని కేదారేశ్వరాలయసమీపంలో వున్న దేశాయి గారి గద్దెకు రోజటిలా కుబుర్లు చెప్పుకొనేందుకు, సాయంత్రం నాల్గు గంటలకు ఊరిలోని పెద్దమనుష్యులు చేరుకున్నారు. వారిలో కాసుల రాజయ్యపంతులు గారు ఒకరు. ఆయన చిన్నతరహా వడ్డీ వ్యాపారి. పొడగరి అవడంతోపాటు, ధృడకాయుడుకూడా. ఆయనకు స్వంత ఊరిలోనేకాక చుట్టుపట్ల గ్రామాల్లో మంచి పలుకుబడి వుంది. ఆయనంటే హడలు కూడా! కబుర్లు మంచి ఊపు నందుకొన్నవేళ హరిదాసు గారు వచ్చి పంతులు గారి చెవిలో ఏదో ఊదారు. ఆయన వెంటనేలేచి ఎవరికీ ఏమీ చెప్పకుండా ఇంటికి వెళ్ళాడు. దసలి చొక్కా వేసుకొని, తాను బెల్లంపల్లికి వెళ్ళుతున్నానని తెల్లవార తిరిగివస్తానని ఇల్లాలితో ముక్తసరిగా చెప్పాడు. ఏదైనా పనిమీద వెడుతున్నప్పుడు ప్రశ్నలు వేస్తే చికాకుపడేవాడు కనుక, ఆవిడ ముఖం మీద బాధ కనబరిచిందే తప్ప, పెదవి విప్పలేదు.

రాజయ్యపంతులు గారు సరిగా 6 గంటలకు ఇంటి నుండి బయలుదేరాడు. బెల్లంపల్లికి వెళ్ళాలంటే రాళ్ళపేట మీదుగా వెళ్ళాలి. అచలాపురం రాళ్ళపేట మధ్య యాభై ఏండ్ల క్రితం దట్టమైన అడవి ఉండేది. పంతులుగారు మొదట సందేహించినా, బెల్లంపల్లికి ఎనిమిది గంటలకు చేరుకొనక తప్పని పరిస్థితి ఏర్పడింది. నూటికి ఐదు శాతం వడ్డీని ఆశించి వేయి రూపాయలను ఓ ఆషాఢభూతికి రెండు సంవత్సరాల క్రితం అప్పుగా ఇచ్చాడు. వాడు నాగుపూర్‌లో ఓ శ్రీమంతుల ఇంట్లో వంటమనిషి. వాడికి బెల్లంపల్లిలో ఓ చిన్నపాటి పెంకుటిల్లు ఉంది. సొంత ఊరికి ఎప్పుడోగాని వచ్చేవాడు. వేంకటరామయ్యపంతులు గారింట్లో వాడు ఆరోజు పొద్దటిపూట హరిదాసుకు తటస్థపడ్డాడు. ఆరాత్రే పదిగంటల ప్యాంసింజరులో నాగపూర్‌కు తిరిగి వెళ్ళనున్నాడన్న వార్త హరిదాసుగారు రచ్చలో వున్న పంతులు గారికి చేరవేశారు. పొద్దు వాలేవేళ అడవిగుండా వెళ్ళడం ప్రమాదంతో కూడినదే అయినా, అవసరం, ధనదాహం కాసుల రాజయ్యపంతులు గారి వివేకాన్ని హరించివేశాయి.

ఆదిలాబాదు జిల్లాలో అడవిభాగం ఎక్కువ. జనావాసాలు తక్కువ. ఆ రోజుల్లో అచలాపురం రాళ్ళపేట మధ్య ఉన్నది కాకులు దూరని కారడవి. ఒక పులులేమిటి - చిరుతపులులూ, ఎలుగులూ, వేగోలాలూ, కొండ్రోసిగాళ్ళు మొదలుగా గల శ్వాపదాలు విచ్చలవిడిగా తిరిగేవి. ఏడాది క్రితం, అదే అడవిలో పాడుబడిన సన్యాసుల మఠం దగ్గర రాళ్ళపేటకు చెందిన బొగ్గుల అంకయ్య అనే పసుల కాపరిని పులి పొట్టన బెట్టుకుంది.

కాసుల రాజయ్య గారు అచలాపురం ఊరి శివారులో వున్న 'వాఘోబా' గుడి నుండి దూలం సీతారామయ్య గారి బుడుగువమామిళ్ళు చేరుకొనేసరికి ఏడుగంటలయ్యింది. ఆ మామిళ్ళు అచలాపురం రాళ్ళపేట సీమను నిర్ధారించే వాగు ఒడ్డున ఉన్నాయి. ఊటలున్నందున ఎండకాలంలో కూడా బుడుగులో పుష్కలంగా నీరు ఉంటుంది. అది వన్యజీవాల కనువైన స్థలం. 'కిర్రు' 'కిర్రు' అనే కీచురాళ్ళ ధ్వని తప్ప అంతా శాంతంగా వుంది. లేవెన్నెల వెలుగులో గుట్టలూ చెట్లూ మసకమసకగా దెయ్యాల్లా కనుపడుతున్నాయి. అరమైలు వెడితే రాళ్ళపేట వచ్చేస్తుంది. అక్కడి నుండి బెల్లంపల్లికి వెళ్ళే తోవ గనికార్మికుల రహదారి కనుక, ఎంత రాత్రి అయినా ఏ భయంలేదు. లావాటివాడైనా పంతులు గారు వడివడిగా నడక సాగిస్తున్నారు.

దాహార్తియై బుడుగును చేరుకున్న ఓ పులి పంతులు గారు వెళ్ళుతుండడాన్ని గమనించింది. అది వయసు మీదబడినది. పోయిన రెండు రోజుల్లో ఏదీ నోటికందకపోవడం వల్ల పూర్తిగా నీరసించిపోయింది. మహాకాయుడైన పంతులు గారు కంటబడడంతో పోయిన ప్రాణం తిరిగివచ్చింది. మనసులో భీమనదేవరకు కృతజ్ఞతలు చెప్పుకుంది. ముంగాళ్ళను నేలకానించి గాలిలోకి ఒక్కపెట్టున ఎగిసింది. ఎండుటాకులు కాళ్ళకింద నలిగిన చప్పుడు పంతులు గారి చెవినిబడింది. వెనుదిరిగి చూసి, ప్రమాదపుటంచున తాను ఉన్నానన్న సంగతి గ్రహించి, ఆయన పరుగు ప్రారంభించాడు. వేగాన్ని పెంచుతూ, పెడబొబ్బలు పెడుతూ, పులి ఆయనను వెంబడించింది. పైబడనున్న మృత్యుదేవతను తప్పించుకొనడానికి పంతులు గారు వేగాన్ని మరింత పెంచాడు. పొడగరి అవడంతోపాటు బలవంతుడు కనుక ఏపుగా పెరిగి విస్తరించిన మామిడి దిగువ కొమ్మనందుకుని పైకెగసి అక్కడి నుండి లావాటి రెండవ కొమ్మకు ఎగబ్రాకి కూర్చున్నాడు.

పరుగు చాలించి, నోటికి దాదాపు అందినదాన్ని జారవిడుచుకొన్న బాధతో మూల్గుతూ పులి చెట్టుకొందకు చేరుకుంది. చివర ప్రయత్నంగా వేలాడుతున్న పంతులు గారి కాలిని ఎగసి పట్టుకోవడానికి ప్రయత్నించింది.

ఏ అజ్ఞాతప్రేరణ వల్లనో, ఇది జరిగే లోపే పంతులు గారు కొమ్మపై లేచి నిలుచున్నారు. పైన వున్న మూడవకొమ్మకు చేరబోతూ, నాల్గవ కొమ్మమీద కూర్చుని కిందికి చూస్తున్న ఎలుగుబంటిని చూశాడు. తెరచిన నోటిలోని దాని తెల్లని వాడి కోరల్ని, సాచిన ఎర్రని నాలికను చూసి భయకంపితుడయ్యాడు.

పంతులు ఎగాదిగా చూశాడు. పైన ఎలుగు; కింద పులి. ముందు నుయ్యి వెనుక గొయ్యి పరిస్థితితో చిక్కుకొన్నాడు. 'కింకరోమి' అనుకుంటూ కళ్ళు మూసుకుని ఇలదైవాన్ని క్షణంపాటు స్మరించుకొన్నాడు. నాల్గవ కొమ్మమీద స్థానాపన్నమైన స్థవిరవానరం 'కిచకచ' అని ఏదో గొణుగసాగింది. 'అడవిలో స్వేచ్ఛగా తిరిగే మనల్ని మానవుడు పట్టుకొని సర్కస్‌వాళ్ళ కమ్ముకొంటున్నాడు. వీడికి ఇదే తగినశాస్తి' మర్కటీయం అర్థంగాని మనిషి ఇది విని మరీ బెదిరిపోయాడు. క్రింద ఉన్న పులి వదిలిపెట్టేట్టుగా లేదు. శరీరంలోని యావచ్ఛక్తిని ఉపయోగించి పైకెగసి పట్టుకోవాలనే ఆలోచనలో ఉండి, వాటంకోసం ఎదిరిచూస్తున్నది. పైకి వెళ్ళడం తప్ప వేరే గత్యంతరం లేదు.

చేతులు జోడించి ఎలుగు కేసి చూస్తూ మొరపెట్టుకొన్నాడు : "భల్లూకరాజా! నీవే శరణం. నన్ను వ్యాఘ్రం నుండి రక్షించాలి".

ఏమి చేయనున్నదన్న కుతూహలంతో కోతి ఎలుగువేపు చూచింది. క్రింద నున్న పులి ఎలుగుపై దృష్టి నిల్పింది.

ఎలుగుబంటి ఇలా అంది "మానవుడా! నీవు నా శరణుగోరి వచ్చినావు. నాకు అతిథివి. ఈ అడవిలోని మీ నల్ల ఎలుగులకు అతిథి దేవునితో సమానం - ఐదవ కొమ్మకు ఎగబాకు; నేను ఏడవదాన్ని ఆశ్రయిస్తాను. అపాయానికి ఈ పులి ప్రతిరూపం. వీడి సంగతి నేను బాగా ఎరుగుదును".

---

రాళ్ళపేట భీమనదేవర అనుమతి లేకుండా, ఏ పులి దేనిని వేటాడదని ఆప్రాంతవాసుల నమ్మకం.
-అనువాదకుడు.

ఈ మాటలు మనిషికి ఎంతో ఊరట కలిగించాయి. ఎలుగు చూపిన ఔదార్యానికి కోతి సంతోషించింది. మానవజాతి యెడ నిరసనభావం లవలేశమైనా తగ్గనందున ఇలా ఆలోచించింది. 'మానవుడు ధూర్తుడు. అవిశ్వసనీయుడు. వీడికి స్వాగతవచనాలు పలకడం దేనికి?' అయినా ఏడవ కొమ్మను ఆశ్రయించిన భల్లూకరాయుడు చూపిన ఔదార్యానికి లోలోన మురిసిపోయింది. మనిషి ఐదవకొమ్మను చేరుకున్నాడు. నాలుగవ కొమ్మ నుండి, కోతి ఆరవ కొమ్మకు రివ్వున దూకింది.

చెట్టుకింద నున్న పులి ఆశలు అడియాసలైనవి. ఎలుగుబంటి ప్రవర్తనతో విసుగెత్తిపోయింది. దాన్ని సంబోధిస్తూ ఇలా అంది. "భల్లూకా! నీవు బుద్ధిహీనుడవు. మనము చతుష్పాదులము. ద్విపాదుడైన వీడు నీకు ప్రీతిపాత్రుడెందుకయినట్లు! వీడు వన్యగ్రామ్యజీవాలకు ఆగర్భవైరి. ఉరులతో, వలలతో వేటాడుతాడు. మనం కంటబడితే చాలు, వీడి వెర్రి వేయితలలు వేస్తుంది".

మానవవానరభల్లూకత్రయం, వ్యాఘ్ర ప్రవచనాన్ని చెవులప్పగించి విన్నది.

'వానరజాతి ద్విపాదుడైన మానవునకు దగ్గరిదా, లేక చతుష్పాదులకు దగ్గరిదా' అన్న ఆలోచనలో ముదుసలి కోతి పడింది.

పులి పెట్టిన చివాట్లకు ఎలుగు నుండి వచ్చే స్పందనకై ఎదిరిచూసింది.

పులి తన సొదను మళ్ళీ మొదలెట్టింది.

"మిత్రమా! మానవుడు మన ఉభయజాతులకు శత్రువే. వాడిని వెంటనే క్రిందికి తోసెయ్యి. క్షణంలో వాడి పనిపెడతాను. నీవు ఆకలితో అల్లాడిపోతున్నావు. పోయిన రెండు రోజుల్లో ఏమీ తినక నేను నీరసించిపోయాను. మనమధ్య భాగస్వామ్యం కుదుర్చుకొందాం. నలుబది తొమ్మిది శాతం నీవాటా; యాభై ఒక్క శాతం నా వాటా. ఎలా వుంది?"

ఇది విన్న మానవుడు విశ్చేష్టుడైనాడు.

కథ ఎలా ముగుస్తుందో తెలియని వానరం సంభ్రమంలో పడిపోయింది. 'మాంసాహారి కాని తనకు భాగస్వామ్యంతో ఏ ప్రమేయం లేదు!' ఇలా ఆలోచిస్తున్న కోతికి ఆకలేసింది. ఓ మామిడికాయను తెంపి, ఓ కొరుకు కొరికి ఎలుగు వైపు చూపు మరల్చింది.

ఎలుగుబంటి ఇలా అంది "మానవుణ్ణి, వాడు వేసే వేషాల్ని తెలియని అమాయకుణ్ణి కాను. మేము ఋక్షజాతీయులం. ప్రాణం పోయినా సరే, ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాము. మాకు అతిథి దేవునితో సమానం. పులులలాగా, మానవులలాగా, రెండు నాలికలు కలవాళ్ళం కాము. చెప్పిందే చేస్తాము; చేసినదే చెబుతాము.

"వానరాలు అంతే"; సగం తినేసిన పండు చేతిలో ఉండగా అంది. "వానరజాతి మిథ్యావచన మెరుగదు. మా హనుమానుడు...."

ఈ కిచకిచను ఎవరూ పట్టించుకొనలేదు.



మానవ మాంసానికి తపించిపోతూ, ఎలుగుపై ద్వేషాన్ని క్షణక్షణం పెంచుకొంటూ పులి కోతి మాటలను ఖాతరు చేయలేదు.

ఎలుగు పులితో ఇలా అంది "వారం క్రితం నా కన్న కొడుకును నిష్కారణంగా చంపి, నాకు తీరని పుత్రశోకాన్ని కలిగించావు. ఇది జన్మలో మరువను".

మనిషి వైపు చూస్తూ భల్లూకం ఇలా అన్నది. "మానవుడా! భయపడకు. ఐదవ కొమ్మమీద బోదేను వాటేసుకుని నిర్భయంగా కూర్చో. తినడానికి తేనెను ఇస్తాను".

ఓ పొడుగాటి ఆకులో తేనె నుంచి మానవునకు ఇచ్చింది. కోతి బాగా పండిన మామిడి పండును తినడానికిచ్చి, తాను కూర్చున్న చోటికి తిరిగి వెళ్ళింది. ఈ వృద్ధవానరమంటే ఎలుగుబంటికి ప్రాణం. మనిషికన్న, పులికన్న, వానరమే నయమని దాని భావన.

పులి మోరను పైకెత్తి చూపుల్లో నిప్పులు కురిపిస్తూ, ఎలుగుకేసి చూసింది. ఆకలితో వున్న పంతులు తేనెతో నంజుకుంటూ పండును తినివేశాడు. ఎలుగు తేనెను జుర్రుతూ హాయిని అనుభవిస్తుంటే, కోతి కళ్ళను మూస్తూ తెరుస్తూ మిగిలిన పండు సగభాగాన్ని ఆనందంగా ఆరగించింది.

ఇది చూస్తున్న పులికి అగ్నిలో ఆజ్యమైంది. కడుపులో పేగులు కూకలేస్తున్నాయి. 'వెళ్ళిరా!' అంటూ కోతి పులిని వెక్కిరించింది. పులి పేట్రేగిపోయి ఇలా అంది "ససేమిరా వెళ్ళను. నీ బాబుదా ఈ అడవి? మీ చుట్టాన్ని మట్టుపెట్టాక నీ సంగతి చూస్తాను. కోతిమాంసం తినక ఎన్నాళయిందో!"

కోపంతో నిలువెల్లా దహిస్తూ కోతి ఇలా అంది "నీవు చెట్టుకింద ఉన్నంత వరకు ఈ మనిషిగాని, ఎలుగుగాని ఇక్కడి నుంచి కదులరు. ఇక నేనా? ఈ చెట్టుకొమ్మ నుండి ఆ చెట్టుకొమ్మకు రెప్పపాటులో లంఘిస్తాను. నన్ను పట్టుకోవడం నీ సంగతి అలా వుంచి నీ జేజె తరం కాదు. పాపం! ఆకలితో నకనకలాడుతున్నావు. ఇంద".

ఓ మామిడిపండును తెంపి, పులివైపు విసిరేసింది. చిందులుత్రొక్కే స్థితిలోలేదు గనుక కోపంతో ఊగిపోతూ పులి ఇలా అన్నది "నీవు వట్టి వెర్రివెంగళప్పవి. మీలాగా గడ్డీగాదం తిని బ్రతికే అంబాబతు వట్రా పులులూ?"

పంతులు భోజనం ముగించుకొని, బోదెను గట్టిగా వాటేసుకుని, ఐదవ కొమ్మపై విశ్రాంతి తీసుకొంటున్నాడు. అలసట వల్ల పిట్టకూర్కులు కూర్కుతున్నాడు.

ఏడవ కొమ్మమీద తేనే తాగిన కైపులో బోదెను వాటేసుకొని, ఎలుగు కదలకుండా పడివుంది. తోకను చిన్నపాటి రెమ్మకు చుట్టేసి కోతి అప్రమత్తంగా ఉంది.

చెట్టుకింద పులి మాటిమాటికి ఆవలిస్తూ కోరల్ని బయటపెట్టి, నాలికను సాచి మనిషిని ఓ కంట కనిపెడుతూ పడివుంది.

ఆకలివల్ల పులి కళ్ళలో చీకట్లు కమ్ముతున్నాయి. ఎలుగుబంటి ఆదమరచి నిదురోతున్నది. పంతులు కలత నిదురలో ఉన్నాడు. కోతి కిమ్మనకుండా మేలుకొనియే వుంది. మనిషిపై చూపునిలిపి పులి అప్రమత్తంగా ఉంది. కొమ్మమీద కూర్చొని పంతులు ఒళ్ళు మరచి నిదురించలేకపోతున్నాడు. తొడలు నెప్పెడుతున్నాయి. చేయి పట్టు తప్పుతున్నది. పట్టుపరుపు మీద రోజూ నిదురోయే పంతులుకు ఇబ్బందిగానే వుంది.

పులి మొదట పైన ఉన్న ఎలుగు వైపు, ఆ తరువాత కింద వున్న మనిషి వైపు దృష్టి పోనిచ్చింది.

మనిషిని సంబోధిస్తూ ఇలా అంది : "మనిషీ! లే. ఎంతకాలం అలా పడివుంటావు? కొన్ని క్షణాల్లో నీవు జారడమో లేక రాలడమో ఖాయం. నేలపై రాలిన క్షణం, ఒక చరుపుతో నిన్ను నీ పెద్దలను చేరేలా చేస్తాను. ఆకలితో అంగలారుస్తున్న నేను నీవు నోటబడే వరకు యుగాలైనా ఇక్కడి నుండి కదలను."

పంతులు భయంతో కళ్ళు తేలేశాడు.

కోతి చెవి యొగ్గి వింటున్నది.

చెవిలో గోప్యం చెబుతున్న మందస్వరంతో పులి ఇలా అంది. "వురేయి! ఓ పనిచెయ్యి. పైకెళ్ళి మత్తుగా నిదురోతున్న నల్ల ఎలుగును క్రిందికి తోసెయ్యి. దాన్ని చంపి నా ఆకలి తీర్చుకుంటాను. దాని మాంసంతో వారం రోజులు సరిపెట్టుకుంటాను. ఇక నీ అవసరం నాకు ఉండదు. హాయిగా నిదురోయి, పెండలాడే నీవు నీ ఇష్టమైన చోటికి వెళ్ళు".

మానవుడు విని ఆలోచనలోపడ్డాడు. పులి ఇచ్చిన సలహా వాడికి నచ్చింది. మెల్లిగా లేచి నిదురోతున్న ఎలుగు వైపు చూశాడు.

మానవుని కృతఘ్నతకు వానరం వాపోయింది. పులి మనస్సులో నవ్యాశ చిగురించింది. మానవుడు పైపైకి వెడుతున్నాడు. కోతి ఆరవ కొమ్మ వెనుక వేపుకు వెళ్ళింది. మానవుడు ఏడవ కొమ్మను సమీపించాడో లేదో 'భల్లూకరాజా! లే!' అంటూ పెద్దపెట్టున అరచింది. కోతి అరపులు విని, ఎలుగు మేలుకొంది. అప్పటికే సమయం మించిపోయింది. పట్టుదప్పి కొమ్మ నుండి కొమ్మకు దొర్లుతూపోతుంటే వానరం గొంతు చించుకుంది. అడివిలోని పశువులు పక్షులు మేల్కొన్నాయి. ఈ అసాధారణ దృశ్యాన్ని తిలకిస్తున్నాయి. క్షణాల్లో నేలరాలనున్న ఎలుగుకోసం, పులి నోరుతెరచి అన్ని విధాలా ఆయత్తమై వుంది.

భల్లూకం పూర్వజన్మలో ఇంద్రియ గ్రామాన్ని అధీనంలో ఉంచుకొని అప్రమత్తుడై జీవించిన మహాయోగి. దొర్లుతూనే, దేహాన్ని సంతులితం చేసికొని, చేతులు సాచి మూడవ కొమ్మను అందుకుంది. అక్కడ స్థిరపడి రెప్పపాటున ఏడవ కొమ్మకు ఎగబాకింది.

'భేష్' 'భేష్' అంటూ మర్కటం ఎలుగును అభినందించింది. పశుపక్షిసందోహం హర్షధ్వానాలు చేసింది.

పులి ఒక్కపెట్టున కుప్పగూలిపోయింది. మనిషి అవాక్కయినాడు. ఎలుగుకేసి చూస్తూ తెగ వొణికిపోతున్నాడు. తన్నుతాను తమాయించుకొని, లేచి నిలబడి పులి ఎలుగును ఇలా సంబోధించింది. "భల్లూకరాజా! చెబితే విన్నావుకాదు. మనిషి పరమద్రోహి. మేలుకు బదులు కీడు చేసే నీచప్రాణి. మేలు చేసిన నీకు కీడెంచిన వీణ్ణి శిక్షించడంలో జాప్యం చేయకు. అపకారికి అపకారమే చేయాలి. వీణ్ణి తోసెయ్యి. పంచుకొని ఆరగిద్దాం".

"యావద్దత్తం తావద్భుక్తం ప్రాతిపదికగా విభజన జరగాలి." వానరం అంది.

"కాదు! ఇచ్చిపుచ్చుకొనే ధోరణి అవలంబించాలి" పులి అంది.

పులి మాటను కొట్టిపారేస్తూ, ఎలుగు అంది.

"నీతో భాగస్వామ్యం అంటే సర్వం నీకు వదలుకోవడమే. మనిషిని నేలకు తోసిన క్షణం అమాంతం తినేసి, నన్ను పొట్టన బెట్టుకోవడానికి కుతంత్రాలకు పూనుకుంటావు. సమస్తమానవజాతికి చెడు పేరు తెచ్చేలా ఈయన ప్రవర్తించాడు. కాదనను. మానవుడు కాబట్టి మనవస్వభావాన్ని కనబర్చాడు. అంతమాత్రాన నా సిద్ధాంతానికి తిలోదకాలిచ్చుకోలేను. ఈయన అతిథి. శరణాగతుడు కూడా! నేను ఈయనకు అభయమిచ్చాను. ఇచ్చిన మాటకు కట్టుబడే వుంటాను. ఎదుటివాడి ప్రవర్తనను పట్టి నా ప్రవర్తన మారదు. ఎవరి స్వభావధర్మం వారిదే. ఈషణ్మాత్ర మైనా నా భూమిక మారదు".

ఎలుగు చెప్పేది ఆదరభావంతో కోతి వింటున్నది. వన్యప్రాణులు చిత్తరువులై ఆలకిస్తున్నవి. వ్యాఘ్రానికి మానవునికి ఇదంతా 'కలయో వైష్ణవ మాయయో' అన్నట్లుగా వుంది. సిగ్గుతో మనిషి తల వాల్చాడు. యథార్థం అవబోధమైన వ్యాఘ్రానికి దవడలు దగ్గరపడినవి.

ఎలుగుబంటి చెప్పడానికి ఉపక్రమించింది. "సహాయం చేసే వారికి సహాయం అందించడం అసామాన్య విషయమేమీ కాదు. నీకు హాని కల్గించినవాడికి మేలు చెయ్యాలి."

"ఈ లోకంలో నాల్గు రకాల ప్రాణులున్నాయి. నిష్కారణంగా ఇతరులకు నీలా హాని కలిగించేవి మొదటి రకం. తనను కాపాడుకొనేందుకు ఇతరులకు హాని కలిగించేవి రెండవరకం - ఉదాహరణకు, ఈ పెద్దమనిషి. తమను కాపాడుకొంటూనే ఇతరులను కాపాడేవి మూడవరకం - ఈ వృద్ధ వానరమే చక్కని నిదర్శనం. ఆకొన్న నీకు ఈ పెద్దమనిషికి పండునిచ్చి ప్రాణబిక్ష పెట్టాడు. పొంచి వున్న ప్రమాదాన్ని గురించి సకాలంలో హెచ్చరించి, నాకు ప్రాణదానం కావించాడు.

వానరవృద్ధుని గురించి ఎలుగు పలికిన ప్రశంసావాక్యాలు విని, వన్యప్రాణులు మిన్నుముట్టే హర్షధ్వానాలు చేశాయి.

సద్దుమణిగాక ఎలుగు చెప్పసాగింది.

"హానికి ప్రత్యుత్తరంగా మేలొనరించే ప్రాణులు నాల్గవరకం - నాకు హాని కలిగించిన ఈయనను ఆదుకునే చిన్న ప్రయత్నం చేశాను. ఈ కోవకు చెందడానికి వలసిన యోగ్యత నేను సంపాదించవలసియుంది. ప్రతీకారబుద్ధితో ఈయన్ని చంపేస్తే కథ ఇక్కడ ముగుస్తుంది. క్రౌర్యానికి కారుణ్యమే భేషజం. ఇతడు మారుతాడన్న నమ్మకముంది. ప్రాణులను వేటాడేబదులు, ప్రాణిరక్షణకు మానవత శ్రీకారం చుట్టే రోజు ఎంతో దూరంలో లేదు.

ఆకు రాలితే వినపడేంత నిశ్శబ్దతో, ఎలుగు చెప్పినదాన్ని విని వనంలోని పశుపక్ష్యాదులు హర్షించాయి. పశ్చాత్తప్తుడై రాజయ్యాపంతులు ఇలా అన్నారు! "ఋక్షాచార్యా! కళ్ళు తెరిపించారు. ఈనాటి నుండి ఎవరికీ హాని కలిగించను. చేస్తున్న వృత్తిలో మోసానికి పాలుపడను".

మనిషి అంతటివాడు మారాక, పులి మారకుండా వుంటుందా! పులి ఇలా అంది. "మహర్షి పదవాచ్యతకు మీరు అన్ని విధాలా అర్హులు. ముందే క్షమించారు కనకు మిమ్మల్ని క్షమాభిక్ష వేడను. ఇకముందు విచ్చలవిడిగా ప్రవర్తించనని హామీ ఇస్తున్నాను".

నిష్కారణ హత్యలతో జీవజగత్తులో తనకు వచ్చిన మచ్చలను మాపుకుంటానన్న పులి మాటకు, దాని స్వభావములో కలిగిన మార్పుకు హర్షిస్తూ, వన్యజీవాలు జయజయకారాలు గావించాయి.

వానరం ఏడవ కొమ్మకు ఎగబాకి, భల్లూకాన్ని గాఢంగా కౌగిలించుకొంది. సాశ్రునయనాలతో ఇలా అంది. "నీవు సామాన్యుడవు కావు. సాక్షాద్ బోధిసత్త్వుడవు" వైరవిద్వేషతిమిరం సమసిపోయి, అనురాగ సౌహార్దపూర్ణజీవనమహోదయం కోసం అడవి ఎదురుచూస్తుంది."

ఓ చిరుతపులి ఆకలితో నకనకలాడుతున్న పులికి చనిపోయిన మృగమాంసాన్ని తెచ్చి ముందు ఉంచింది. అయినా పులి అవసరం మేరకే తిన్నది. తినడానికే జీవించటం మాని జీవించడానికి తినాలనే గట్టి సంకల్పం చేసుకొంది.

ఆశ్రమవృక్షం నుంచి మానవునితో పాటు ఎలుగూ వానరం నేలకు దిగివచ్చాయి. వ్యాఘ్రంతో కరచాలనం చేశాయి. మనిషితో సహా వలయాకారంలో నిలుచున్నాయి. వాటి ననుకరిస్తూ పశువులూ పక్షులూ సరీసృపాలు వలయాకారంలో శ్రేణులు శ్రేణులుగా నిల్చున్నాయి. లయబద్ధంగా కదులుతూ ఇలా బృందగానం ఆలపించాయి.

అంతా ఒకటే మనమంతా ఒకటే,

ఎవరు పెద్ద? ఎవరు చిన్న
ఎవడు రాజు? ఎవడు పేద?
భాషవేషమేదైనా,
అందరం సమానమే....

ఒకరినొకరు ఆదుకుంటే,
ఉన్నదాన్ని పంచుకుంటె,
పడిపోయే ప్రాణి ఎవడు?
విడదీసే దొర ఎవడోయ్?

పొట్టి యెవడు? పొడుగెవ్వడు?
అవకాశం కలిపిస్తే!
మన నేతలు మేధావులు
బ్రతుకుబాట చూపితే!

'కొక్కరకో' 'కుహుకుహూ'
'కిచకిచ' 'బెకబెక' 'మేమే'
నలపిటనా - రచపిటరా
యరలవతధ్గిణతోం

హింసించటం దానవత్వం; ఆదుకోవడం దైవత్వం.
కీడు చేసిన వారికి మేలు చేయాలి. క్రౌర్యానికి కారుణ్యమే భేషజం.
ఉపకారిని మరువకు. కాని సహాయార్థం సర్వదా సన్నద్ధుడవైయుండు.
నీ సహాయం పొందినవారి నుండి ఏమీ అపేక్షించకు.
ప్రేమస్వరూపుడవై దాయిత్వ బుద్ధితో ప్రవర్తించు.

# 20. రావే ఈశ్వర!

( అనంతశయన దీక్షితుల కథ )

ఆదిలాబాదు జిల్లా దక్షిణ సీమను నిర్ధారిస్తూ, ప్రవహించే పవిత్ర గోదావరీనదీ తీరాన పంగునూరు అనే గ్రామం ఉంది. ఆ గ్రామపు పొలిమేరల్లో, ఎత్తైన మట్టిదిబ్బ మీద వేణుగోపాలస్వామివారి మందిరం వుంది. అనంతశయనదీక్షితులు ఆ ఆలయంలో అర్చకులు. వారు పరమభక్తులు. సాయంవేళ, బమ్మెర పోతనామాత్య ప్రణీతభాగవతపురాణం చెబుతుండేవారు. ఆయన గాత్రమాధుర్యం ఎలాటిదంటే, జగన్నాథపండితులవారు తన జనకుని గురించి చెప్పినది 'యస్యలీలయా పాషాణాదపి పీయూషం స్యందతే' గుర్తుకు తెచ్చుకోవాల్సి వుంటుంది. పురాణశ్రవణానికి శ్రోతలు వందల సంఖ్యలో వచ్చేవారు.

శ్రోతలను మంత్రముగ్ధులను కావిస్తూ, దీక్షితులవారు భాగవతంలోని తొమ్మిది సర్కధాలనూ, దశమ స్కంధంలోని 'ఇంద్రయాగంబు చేయదలంచిన గోపవృద్ధులను పురుహూతుడైన ఇంద్రుని వలన భూతంబులకు భీతి యేటికి అని నివారించిన పిదప, మహేంద్రుడు మహాకోపంబున ప్రళయ ప్రవర్తకంబులగు సంవర్తకాది మేఘంబులను కుంభవృష్టి కావించినపుడని ఆనతిచ్చే' ఘట్టాన్ని ఇదివరలో ముగించారు.

ఒకనాటి సాయంత్రం 'శిలావర్షహతులైన ఘోషజనుల రక్షించుటకు శ్రీకృష్ణుడు గోవర్ధనగిరి నెత్తిన అధ్యాయాన్ని కిరియైధర యెత్తిన హరి' అనే అందమైన కందం వద్ద ప్రారంభించారు. దీక్షితులవారు పద్యం తరువాత పద్యం చదువుతూ, వాఖ్యానిస్తూపోతుంటే శ్రోతలు చెవులప్పగించి వింటున్నారు.

అకస్మాత్తుగా వారి తన్మయతను భంగపరుస్తూ, దిక్కులను కకావికలు కావిస్తున్న భీషణధ్వని వినిపించింది. ఆలయమంటపంలోని దాదాపు రెండువందల మంది శ్రోతలు భయభ్రాంతులై లేచి పారిపోజూస్తున్నవేళ, వాళ్ళను వారిస్తూ దీక్షితులు ఇలా అన్నారు. "భయపడి పరుగెత్తకండి. ఆపద్బాంధవుడైన ఆయనే స్వయంగా వచ్చి మనల కాపాడుతాడు".

దీక్షితులు చెబుతున్నది వినిపించుకోకుండా, ఓ నలుబది మంది తతః పలాయనమయ్యారు. మిగతా నూట అరువది మంది భగవంతుని మీద భారంవేసి స్థానాపన్నులైనారు.

'రాజీవాక్షునిచే నొక రాజీవము భంగి' అనే మరో చక్కని కందంతో దీక్షితులవారు పురాణపఠనం కొనసాగించారు.

గ్రామంలో వారు మిన్నుముట్టేట్టు చేస్తున్న హాహాకారాలు; 'గ్రామాన్ని ఖాళీ చేయండి ఆనకట్ట తెగింది' అంటూ లౌడుస్పీకరు మీద వస్తున్న హెచ్చరికలు వారి చెవిని పడినవి. ఓ యాభై మంది లేచి పరుగెత్తాలని చూస్తున్నవేళ, వారికి అడ్డుపడుతూ "అన్నిటికీ దేవుడే వున్నాడు. వచ్చి ఆదుకుంటాడు" అని పూర్వం లాగానే శాంతపరిచేందుకు దీక్షితులవారు ప్రయత్నించారు. అయినా ముప్పది మంది రెప్పపాటులో మటుమాయమయ్యారు. మిగతా ఇరువది మంది పారిపోవాలన్న ప్రయత్నాన్ని విరమించుకుని తిరిగి కూర్చున్నారు. పురాణం వినడానికి నూటముప్పది మంది శ్రోతలు మిగిలారు.

దీక్షితులవారు 'హరి యేడు రాత్రంబులు గిరి ధరించిన' అనే వచనంతో మొదలెట్టారు. గోదమ్మ ఒడ్లొరుసుక పారటాన్ని, క్షణక్షణానికి పెరుగుతున్న నీటిమట్టాన్ని గమనిస్తూ శ్రోతలు విచలితులవుతున్న వేళ, పోలీసు సబ్ ఇన్స్పెక్టరు వచ్చి దీక్షితులకు నమస్కరించి సవినయంగా ఇలా అన్నాడు.

"అయ్యా! ఆనకట్ట తెగింది. గ్రామీణులు సురక్షిత స్థలానికి చేర్చబడ్డారు. మీరంతా ఇక్కడ నుండి పరుగెత్తాలి".

అందరూ లేచి నిల్చున్నారు.

లవలేశం చలించని దీక్షితులు చేతులెత్తి "పారిపోకండి. దేవుడే వచ్చి మనల కాపాడుతాడు" అంటు బిగ్గరగా ప్రాధేయపడ్డారు. అయినా, మరో నలుబదియైదు మంది 'బతుకు జీవుడా' అంటూ పరుగులు ప్రారంభించారు. మంటపంలో మిగిలిన ఎనుభయైదుగురు పోయిన ధైర్యాన్ని తిరిగి తెచ్చుకొని శ్రవణార్థం కూర్చున్నారు.

భగవంతునియందు స్థిరమతిగల పరమభాగవతుడైన దీక్షితుడు పఠనానికి ఉపక్రమించాడు.

"ఉడిగెను వానయు, వడి
చెడె నదులెల్ల, బొలప వరదలిగిరె, గొం
డడుగున నుండక వెడలుడు
కొడుకులు కోడండ్లు సతులు గోపులు మీరున్"

బయటి పరిస్థితి కథలో చెప్పే, 'వడిచెడె నదులెల్ల' అను దానికి పూర్తిగా భిన్నంగా ఉండటంతో, ఆలయ కాపలాదారుడు వచ్చి "నీళ్ళు తంతె లెక్కినయి. గుడిమునుగుద్ది. నేను పోతాన్న. మీ ఇట్టం" అంటూ బిగ్గరగా అరచి హెచ్చరించి అదృశ్యుడైనాడు. శ్రోతల్లో గందరగోళం మొదలయింది. ఇక లాభం లేదని నిర్ణయించుకొని పారిపోవ ప్రయత్నిస్తుంటే దీక్షితులు వలదని బతిమిలాడారు. ఇదేమీ వినకుండా డబ్బయారు మంది 'తుర్రు'మనగా, అమితశ్రద్ధాళువులైన తొమ్మిది మంది మాత్రమే మంటపంలో మిగిలిపోయారు.

దీక్షితులు పురాణం చెబుతూనే పోతున్నారు. నీళ్ళు మెట్లను ముంచేసి ఆలయంలో ప్రవేశించాయి. పడవల్లో వచ్చిన రక్షకదళం 'పదండి'.... 'పదండి' అంటూ తొందరపెడుతుంటే, దీక్షితుల వారు 'పోకండి. దేవుడు వచ్చి మనను కాపాడుతాడు' అంటూ నివారింపబోయాడు. 'దేవుడు మిమ్మల్ని కాపాడుతాడు - మమ్మల్ని మేము కాపాడుకుంటా'మంటూ ఆరుగురు వెళ్ళి పడవల్లో కూర్చున్నారు.

చివరకు ముగ్గురు శ్రోతలు మాత్రమే మిగిలిపోయారు. ఆలయంలో నీటిమట్టం ఆరు ఇంచులకు పెరిగింది. ఒంటికాలు గల ఓ శ్రోత 'అయ్యగారు! ఇక లాభంలేదు' అంటూ ప్రాధేయపడ్డారు. ఇద్దరు ప్రవాహం లోని ఓ దుంగను చేజిక్కించుకొని, దానిమీద సవారయ్యి, వేణుగోపాలస్వామివారిపై భారంవైచి ప్రయాణం సాగించారు.


దీక్షితులు లేని నిల్చుని 'అని విని సకల గోపజనులు' అనే వచనం వద్ద ఎత్తుకున్నారు. జలాలు వేదికను ముంచివేశాయి.

చివర శ్రోత అన్నాడు. "అయ్యగారు! దేవుడు మరేదో పనిమీద వున్నాడు. పిలిచి లాభం లేదు పదండి".

దీక్షితుడు 'వీల్లేదు' అన్నాడు. ఆ చిట్టచివరివాడు దేవుణ్ణి, భక్తుణ్ణి కాదని సొంత ప్రాణాలమీది తీపితో ఓ దుంగను దొరకించుకున్నాడు.

నీళ్ళు స్వామివారి పాదాల వరకు పెరగాయి. వేణుగోపాలస్వామివారు, పాలకడలి అంచుపై నిల్చున్న శ్రీమహావిష్ణువులా దేదీప్యమానుడైనాడు. నీటిమట్టం క్షణం క్షణం పెరుగుతూనే వుంది. అనంతశయనదీక్షితులు కోవెల పైకప్పుకు చేరుకొని, అక్కడి నుండి శిఖరాన్ని అధిరోహించి, దీనావనుడైన శ్రీనివాసుని శరణువేడుతున్నాడు. ప్రళయవేళకు ప్రతిరూపంలా అంతా జలమయమైంది. ఇంతలో ఓ హెలికాప్టర్ శబ్దం చేస్తూ వచ్చి పైన స్థిరపడింది. తలుపులు తెరుకొన్నాయి. నిచ్చెన వేలాడుతుంది. ఉపచాలకుడు 'ఆలస్యం చేయకండి'. అంటూ అరుస్తున్నాడు.

- "దేవుడే కాపాడుతాడు"



' "మూర్ఖపు పట్టు వదలండి"

- "ఊహుం"

- "మూడు వెంచేలోగా తాడును పట్టుకొండి. వేరేవాళ్ళ సంగతి చూడాలి".

- "వెళ్ళండి"

ఉపచాలకుడు 'ఒకటి' - 'రెండు' - 'మూడు' అన్నాడు. దీక్షితుడు నోరు మెదపలేదు. హెలికాప్టర్ ముందుకు వెళ్ళిపోయింది. నీళ్ళు స్వామివారిని యజ్ఞవరాహమూర్తిని గావించి, కలశాన్ని సైతం ముంచివేసినవి. భక్తుడు లోకాలేలేవాణ్ణి స్మరించుకున్నాడు. పరిదేవన స్వామి చెవుల బడలేదు. దేవుడికి 'నామీద దయలేదని విలపిస్తూ', ఈదడం తెలియని దీక్షితులు ఏటిపాలైనారు.

పరమభాగవతోత్తముడూ, వేణుగోపాలస్వామినిరంతరచింతనామృత పానలోలుడూ అయిన అనంతశయనదీక్షితుల కథ ఇలా ముగుస్తుందా?

విష్ణుదూతలు విమానారూఢులై వచ్చి, దీక్షితుల వారి ఆత్మను వైకుంఠవాసుడైన శ్రీనివాసుని సన్నిధికి చేర్చారు. నవోదితభానుబింబసదృశమైన కిరీటము కలవాడూ చతుర్భుజుడూ, శ్రీవత్సాంకితవక్షుడూ, నయనమనోహర రూపుడూ అయిన శ్రీనివాసుడు ఆదిమధ్యాంతరహితమైన కాలానికి ప్రతీకయైన అనంతునిపై ఆసీనుడై భక్తునకు దర్శమనుగ్రహించాడు.

తన ఆరాధ్యదైవాన్ని గుర్తించిన దీక్షితుల వారి ఆత్మ ఆయనను సమీపించి, కోపంతో ఇలా అన్నది. "కూయిడి నంతనే భక్తులకై పరుగుదీసే దొరవని నిను నమ్మియుంటిని. పాయని భక్తితో జీవించియున్నంత కాలము సేవలర్పించుకుంటిని. వరద నను ముంచేవేళ, వరదు డవని నిన్ను స్మరించితిని. నీవు వంచించినావు. ఇది భావ్యమా?"

స్మితపూర్వభాషియైన నారాయణుడు కరుణార్ద్రీభూతచేతస్కుడై ఇలా సెలవిచ్చాడు. "వత్సా! అనంతశయనా! నేను నీకై పరిగెత్తుకొని రాలేదని ఎట్లనగలవు? ఒకమారు కాదు; పదకొండు మార్లు నీ ఎదుట నిలిచి నాతోపాటు రమ్మని బుజ్జగించినా, విన్నావు కాదు".

పదకొండు మార్లు అనేక రూపాల్లో వచ్చి తనను హెచ్చరించినది స్వామి యేనని గ్రహించి, దీక్షితులవారి ఆత్మ ఇలా ఆలోచించింది.

"మన వద్దకు వచ్చే ఏ వ్యక్తియైనా సాక్షాద్భగవానుడే. అంధత్వంలో ఇది గుర్తించలేము. అన్నిటిలో అతడు, అతనిలో అన్ని వున్నవి. స్రష్ట-సృష్టి మధ్య ఏ ద్వైతం లేదు. నావల్ల అపచారం జరిగింది."

అజ్ఞానతిమిరవిముక్తమై, అనంతశయనదీక్షితుని ఆత్మ జ్యోతిరూపాన్ని సంతరించుకొని పరంజ్యోతిలో విలీనమైంది.

చేరువలోకి వచ్చే ఏ వ్యక్తి అయినా దేవతా స్వరూపుడే -
ఆహ్వానించి ధన్యజీవులం కావాలి.

# 21. ముక్తిపథం

( భగవద్గీత )

అయిదుగురు అన్నదమ్ములలో నడిపివాడు అర్జునరెడ్డి. పెద్దాయన ధర్మారెడ్డి. తరువాతివాడు భీమారెడ్డి. నకులరెడ్డి, సహదేవరెడ్డి కవలలైన కడగొట్టు పిల్లలు.

కంపనీవాటాల విషయంలో వీరికి, వీరి పితృవ్యులైన సుయోధనరెడ్డి మొదలుగాగల సోదరులకు మధ్య వివాదం తలెత్తింది. సుయోధనరెడ్డీ, ఆయన సోదరులూ ఈ అయిదుగురిని 'భారత్ ఇన్డస్ట్రీజ్ లిమిటెడ్' నుండి నిష్కాసితుల్ని చేశారు.

సుయోధనరెడ్డి నాన్నగారైన ధృతరాష్ట్రరెడ్డి తన తమ్ముని కుమారులకు కొంత మొత్తాన్ని ఇచ్చారు. దాన్ని పెట్టుబడిగా పెట్టి ధర్మారెడ్డి సోదరులు 'ఇంద్రప్రస్థ ఇన్డస్ట్రీజ్ లిమిటెడ్' అనే మరో కంపెనీని స్థాపించారు. కృష్ణారావు అనే ఆయన వీరికి దగ్గరి బంధువు. అర్జునరెడ్డికి సన్నిహితుడు. నైగమవ్యవహారాల్లో హితవరి కూడా.

వీరి ఉన్నతని సహించలేని ఈర్ష్యాళువైన సుయోధనరెడ్డి 'ఇం.ఇం.లి.'ను స్వాధీనపరచుకొనడానికి తమ్ముడైన దుశ్శాసనరెడ్డితో, క్రయవిక్రయవ్యవహార సంచాలకుడైన కరణ్‌రాజుతో, మేనమామయ్యైన మాయావి శకునితో ఒక వ్యూహాన్ని పన్నాడు. వాణిజ్యక్రీడల్లో శకునిని మించిన ఘనుడు లేడు. మోసగించడం వానికి ఉగ్గుపాలతో రంగరించిపెట్టిన విద్య.

యాజమాన్యసంబంధితసంగ్రామం తీవ్రస్థాయికి చేరుకొన్నవేళ, అర్జునరెడ్డి కృష్ణారావులు న్యాయవిషయకసలహాసంస్థ వైపు కారులో వెడుతున్నారు. చాలకుని ఆసనంలో ఎప్పటిలా కృష్ణారావు ఉన్నారు. పార్కింగ్ స్థలంలో కారును నిలిపి, కాలినడక వెడుతున్నారు. అన్నదమ్ముల మధ్య పోరంటే గిట్టని అర్జునరెడ్డి లోలోన క్రుంగిపోతున్నాడు. ముఖాన్ని విషాదచ్ఛాయలావహించాయి. మనస్సు డోలాందోలితమైంది. స్పృహ తప్పి నేలపై కుప్పగూలిపోయాడు.

కృష్ణారావు ఆయన్ని వెంటనే లేవనెత్తి, ఓ బెంచీమీద కూర్చోపెట్టి, వీపుతట్టి, కంగారుపడొద్దని బుజ్జగించి ఫ్లాస్కులోని నీరు తాగడానికి ఇచ్చాడు. ఆ తరువాత దగ్గిరే వున్న పార్కుకు తీసుకొని వెళ్ళి, ఓ వితర్దిపై స్థానాపన్నుణ్ణి చేశాడు. కొంతసేపు ఏమీ మాటలాడకుండా వుండి, అర్జునరెడ్డి భుజంమీద చేయిని ఆన్చి కృష్ణారావు ఇలా అన్నాడు. "ఏమిటి నీవు చేస్తున్నది! విషమస్థితిలో ధైర్యాన్ని కోల్పోవడమా!"

అర్జున్ తన వ్యథను ఇలా వెళ్ళబోసుకున్నాడు. "రావుగారు! అన్నదమ్ములు పోరుకు దిగడం అంటే నాకు పరమ అసహ్యం. ఈ యుద్ధాన్ని ఎంతకాలం కొనసాగిద్దాం? కంపెనీని వాళ్ళకు స్వాధీనం చేయడమే పరిష్కారం. పట్టెడన్నం కోసం ఎక్కడికైనా వలస వెళ్ళవచ్చు".

మందహాసం చేస్తూ కృష్ణారావు ఇలా అన్నాడు. "సంఘర్షణ అనేది తలెత్తి కర్తవ్యాకర్తవ్యాలు నిర్ణయించాల్సిన వేళ మనిషి విచలితుడవడం సహజమే. శోకవిహ్వాలుడవడంలోనూ ఆశ్చర్యం లేదు. నిర్వేదం నుంచి బయటపడి, ధైర్యాన్ని కూడగట్టుకో. పనికిమాలిన ఆలోచనల్ని దూరంగా వుంచు. నీవిలా కంగారుపడుతుంటే నాకు ఆశ్చర్యంగా వుంది. అన్ని సామర్థ్యాలు ఆత్మలో నిహితమై యున్నాయి. ఆత్మయే స్రోతస్సు; శక్తికూడా. ఆత్మయే పథప్రదర్శిని. లే! ఆత్మవికాసానికి ఉద్యుక్తుడవు కావాలి. మానసికస్థైర్యంతో, సామర్థ్యంతో ముందంజ వేసేవాడే ఔన్నత్యశిఖరాలను అధిరోహించగలుగుతాడు. సంకల్పం స్థైర్యాన్ని, కౌశల్యం సామర్థ్యాన్ని ప్రసాదిస్తుంది. ఇవన్నీ కలవాడివి కావాలి".

ఈ ప్రబోధం దివ్యౌషధంలా పనిచేసింది. కోల్పోయిన మనోబలాన్ని అర్జున్ తిరిగి పొందాడు. ముఖం తేజోవంతమైంది. "ఆ తరువాత ఏం చెయ్యాలి?" రావు కేసి చూస్తూ అర్జున్ ప్రశ్నించాడు.

కృష్ణారావు అన్నాడు. "శోకవిముక్తుడవై స్థితప్రజ్ఞుడవయ్యాక కర్మాచరణకు పూనుకోవాలి. కర్మయే మార్గం; భేషజం కూడా. అన్ని ప్రశ్నలకు సమాధానం కర్మయే. కర్మయే పరిష్కారం. కర్మ వల్లనే మూల్యసిద్ధి. భవసాగరతరణానికి కర్మయే నావ. వింటున్నావా? నైపుణ్యాన్ని వెచ్చించి ఆచరించిన కర్మయే యోగం. అహోరాత్రాలు శ్రమించు. సమిష్టి ఉన్నతికి నీవంతు బాధ్యతను నిర్వహించు. ఉత్కృష్టతను సాధించు."

అర్జునుడన్నాడు. "రావు గారూ! బాగా చెప్పారు. 'కర్మ' అనే పదాన్ని పలుమార్లు వల్లించారు. మనిషి అనేవాడు 'చాకిరీ గుఱ్ఱం' కావాలనేగా మీరనేది!"

"అర్జున్! కర్మ జీవనపరమావధి అని నేనడంలేదు. జ్ఞానసముపార్జన కూడా అవసరమే. జ్ఞానం ఖడ్గం; బుద్ధి దాని అంచు. దృష్టికి స్పష్టత చేకూర్చునది జ్ఞానమే! దృష్టిని అమలినం చేసేది జ్ఞానమే! సృజనకు జ్ఞానమే మూలం. ఇది గ్రహించిన నీవు విలువల్లో పెరుగుతావు. పెరిగిన నీవు ప్రవాహధర్మం గల నదిలా పారుతావు. పారగలిగే మనిషియే ప్రకాశిస్తాడు. 'స్వః'లో నిక్షిప్తమైన అంతులేని సామర్థ్యాన్ని ఎరుగడమే జ్ఞానం. కర్మను తపస్సు స్థాయికి పెంచితే, అది సమిష్టికి అమూల్యమైన యోగదానమవుతుంది. కర్మజ్ఞానమేళన నుండే ఉత్కృష్టత సిద్ధిస్తుంది. కృతి నుండే అనుభూతి. అనుభూతం కానిదేదీ అభివ్యక్తం కాజాలదు."

ఇది విన్న అర్జున్‌కు 'జ్ఞానస్వరూప మేమిటో' గ్రాహ్యమైంది. కృష్ణారావును ఇలా ప్రశ్నించాడు. "కృష్ణా! జ్ఞాన కర్మల్లో ఏది దేన్ని మించుతుంది".

కృష్ణారావు ఇలా బదులు చెప్పాడు. "మానవాభ్యుదయానికి రెండూ దోహదపడేవే. బుద్ధిజీవులు ఆకలనపరిధి విస్తృతికోసం జ్ఞానమార్గాన్ని ఆశ్రయిస్తే, శ్రమజీవులు ఉత్కృష్టతను సాధించే లక్ష్యంతో కర్మమార్గాన్ని ఎన్నుకొంటారు."

"బుద్ధిజీవులు ఒళ్ళువంచి పనిచేయడం అలవరచుకొని, శ్రమజీవుల నుంచి నేర్చుకొన్ననాడు - అదే విధంగా శ్రమజీవులు ఆలోచించగలిగి బుద్ధిజీవుల నుండి నేర్చుకొన్ననాడు సమ్యగ్‌జ్ఞానావాప్తి సాధ్యమౌతుంది. కర్మస్వరూపలక్షణం బుద్ధిజీవులకు, జ్ఞానస్వరూపలక్షణం శ్రమజీవులకు అవబోధం కావాలి. కర్మను జ్ఞానంతో, జ్ఞానంతో కర్మను సంయోగించినప్పుడే సమాజశ్రేయస్సు సంప్రాప్తమౌతుంది. కర్మస్వరూపాన్ని, దాని నంటియున్న సమయస్థలవిధానహేతువులను ఏనాడు గుర్తెరుగగల్గుతావో, ఆనాడు స్వలాభపరాయణతకు అతీతుడవౌతావు. స్వలాభాపేక్ష లేని కర్మయే సర్వశ్రేష్ఠమైన కర్మ. అది నీవు సమిష్టికి సమర్పించుకొనే అమూల్యమైన ఉపాయనం. జీవనం ఒక సమర్పణ. సమర్పణస్ఫూర్తితో ఆచరితమైన కర్మను మించిన కర్మ లేదు. నిరీహబుద్ధితో కర్మాచరణకు ఉద్యమించాలి."

ఇది ఆకలనం చేసుకోవడానికి అర్జున్‌కు సమయమిస్తూ, కృష్ణారావు కొన్ని క్షణాలపాటు మౌనంగా ఉన్నాడు.

అర్జున్ అన్నాడు: "స్వార్థరహిత కర్మాచరణ వల్లనే ఏకాగ్రతను సాధించగల్గుతాం".

అర్జునన్నదానికి హర్షిస్తూ కృష్ణారావు ఇలా అన్నాడు:

"మానసిక ఏకాగ్రతయే సర్వార్థమూలం. స్వనిగ్రహమే మనోనిగ్రహం. ఆత్మయే ఆత్మకు సమీపబంధువు; ఆత్మకు ఆత్మయే శత్రువు కూడా. మనస్సు నీ వశంలో ఉన్నవేళ అభ్యుదయం సాధ్యం; నీవు మనస్సుకు అధీనుడవైనవేళ అవనతి అనివార్యం. నిరంతరం వికారానికి లోనయ్యే, శాఖాచంక్రమణం చేసే మనస్సును స్థిరీకరించడానికి ఏకాగ్రత అవసరం. ఏకాగ్రతయే ధ్యానం. ధ్యానస్థితిలో నీ దేహమనోబుద్ధులు సంయుత మౌతాయి. ఆలోచనాజన్యభావనాప్రేరితకర్మయే ధ్యానసమాధి యౌతుంది. సమదృష్టియే యోగం."

కృష్ణారావు చెప్పేది అర్జున్ సావధానచిత్తుడై వింటున్నాడు.

"అర్జున్! ఇక వివేకమంటే ఏమిటో తెలుసుకుందాం. జ్ఞానాన్ని మించినది వివేకం. వస్తుపరిజ్ఞానంతో పాటు, వస్తుసారాన్ని తెలుసుకోవడమే వివేకం. మాలికాంతర్నిహిత సూత్రమే సారం. మనం మాలలోని పూవులను, పూవుల రంగుల్ని చూస్తామేకాని వాటిని కూర్చే దారాన్ని చూడము. విడివిడిగా వున్న పూలను సూత్రబద్ధం చేస్తే మాల అవుతుంది. సమర్ధవంతమైన నేతృత్వంలో విడిగా వున్న వ్యక్తులు నిర్ధారితలక్ష్యసాధనకై దళంగా ఏర్పడి కర్మ కుద్యమించినప్పుడే మూల్యనిర్మితి సాధ్యమౌతుంది."

"అంతర్నిహితమై యుండి, క్రమంలో కూర్చి, ఆధారంగా నిలిచే దారమే పూలశోభను పెంచుతుంది. అహంకారరహితనేతృత్వంలో వ్యక్తులు వాసికెక్కుతారు. సారాన్ని గుర్తెరుగాలి. శైలిలో నిక్షిప్తమైన పరివర్తనను ఆకలనం చేసుకోవాలి. అణువులో బ్రహ్మాండాన్ని దర్శించడమే వివేకం."

అర్జునరెడ్డి కృష్ణారావు వివేకసంపన్నతను కొనియాడుతూ, తన కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు.

కృష్ణారావు ఉపక్రమించాడు. "సంయోజన యే సర్వశ్రేష్ఠమైన సాధనం. పరిపూర్ణతను సాధించే నిమిత్తం వైశ్వికచేతన ఘటకాలను సంయోజిస్తుంది. లేదా విడిగా వున్న ఘటకాలు పరిపూర్ణతను సాధించే లక్ష్యంతో, సంయోజింపబడినప్పుడు చేతన ప్రాదుర్భవిస్తుంది. ఇష్టికావిశిష్ట సంరచనయే ఆవాసయోగ్యమైన గేహమనిపించుకొంటుంది. సహవాసభావనాప్రేరిత వ్యక్తులవల్లనే సమిష్టి ఏర్పడుతుంది. దళస్ఫూర్తియే వ్యక్తులను కర్మాభిముఖులను చేస్తుంది. ఈ దళస్ఫూర్తియే వైశ్వికచేతన.

అర్జున్‌రెడ్డి అడిగాడు "ఈ పాంచభౌతిక జడజగత్తులో వైశ్వికచేతనకు స్థానముందా?"

కృష్ణారావు అన్నాడు. "నేను చెప్పే వైశ్వికచేతన నీలోవుంది. వ్యక్తిచేతన సృష్టిని బాహ్యాభ్యతరం వ్యాపించిన మహచ్చేతనలోని భాగమే. ఇదే రాజగుహ్యము. దాయిత్వభావనయే చేతన."

"నీవు నీ కుటుంబం యెడ, నీ సమూహం యెడ, నీ దేశం యెడ బాధ్యతను గుర్తెరుగుటే చేతన. నీ దేశబాంధవుల ఉన్నతికి పాటుపడుతూనే, విశ్వకళ్యాణానికి పాటుపడాలి. ప్రాదేశికముద్రను చెరిపివేసుకొని ప్రపంచపౌరుడిగా ఎదగాలి. మాతాపితలయెడ, ఆచార్యులయెడ, వృద్ధులయెడ, నీ ఉత్తరదాయిత్వాన్ని గుర్తించాలి. బీజంలో వృక్షం, వృక్షంలో బీజం వలె నీలో అన్ని, అన్నిటిలో నీవు ఉన్నావు. నేను వర్ణించే వైశ్వికచేతన వస్తువుసముచ్చయంలోని ఉత్కృష్టతలో నిక్షిప్తమై వుంది. వ్యక్తుల ఉద్యమం, విజేతవ్యూహం, శ్యేనోడ్డయనం, అశ్వప్రధావనం, రాచ ఏనుగుశక్తి, నదీప్రవాహం, పవన సంచారం, సుముద్రపులోతు, వ్యక్తుల యోగదానం, నాయకుని ధురంధరత్వం, సమూహవిజయం - ఉత్కృష్టతాప్రతీకలైన ఇవన్నీ దైవవిభూతులే. అర్జున్! ఎందుకోమరి! నకారాత్మకతవైపే మానవులు మొగ్గు చూపిస్తారు. అడుగడుగున శల్యచికిత్సాప్రవీణులే తటస్థపడుతారు. అప్రియఘటనలకే వార్తాపత్రికలు పెద్దపీట వేస్తాయి. ఈ ప్రపంచంలో మనకు తెలియని మంచి ఎంతో వుంది. దాన్ని తెలిసికొనే ప్రయత్నం చెయ్యి. ఉత్కృష్ట అనేది అన్వేషించిన మీదనే దృగ్గోచరమవుతుంది. సకారాత్మాక దృక్పథం కలవాడవై యుండాలి."

అర్జున్‌రెడ్డి సంభ్రమావిష్టుడైనాడు. "నీవూ, నీవు చెబుతున్న విశ్వచేతన అనేవి వేరు వేరు కావు. నీ విశ్వరూపసందర్శనం నాకు కలిగించాలి!"

కృష్ణారావు అర్జునుడు ఇలా కోరిన మీద లేచి నిలుచుని, దక్షిణ హస్తాన్ని పైకెత్తి విశ్వసమ్మోహక వేణునాదానుభూతిని కలిగించే స్వరంతో ఇలా అన్నాడు. "అర్జున్! నావంక చూడు. నేనేమిటని నీ భావన? నేను దేహమనోబుద్ధి సంఘాతమైన 'స్వ'ను. విశ్వాత్మకుడెవడు? ఈ చరాచర సృష్టి, ప్రకృతి, తేజం వాని ప్రతిఫలనాలే! విశ్వాత్మకుణ్ణే మనం ఈశ్వరుడంటాము. పంచేంద్రియసంఘాతం దేహం; పాంచభౌతికమైనది ప్రపంచం. మానవుని మనస్సే ప్రకృతి; మానవుని ధిషణయే ఎల్లెడల వ్యాపించిన తేజం. మనలోని 'స్వ' యే సృష్టిని వ్యాపించిన విభుడు. దేహమే జగత్తు; మనస్సే ప్రకృతి; ధిషణయే తేజము; 'స్వ' యే సర్వేశ్వరుడు - ఇది ఆరోహణక్రమం. జగత్తే దేహము; ప్రకృతియే మనస్సు; తేజమే ధిషణ; సర్వేశ్వరుడే స్వ. ఇది అవరోహణ క్రమం. ఇలా మానవుడే విశ్వం; విశ్వమే మానవుడు. నేనే విశ్వాన్ని. ఇదే విశ్వరూప సందర్శనం."

అర్జునరెడ్డికి జ్ఞానోదయమైంది. శరీరంలోని ప్రత్యణువు విద్యుత్ప్రేరితమైంది.

"కృష్ణా! నీ ప్రవచనవేగాన్ని తట్టుకోలేకపోతున్నాను. నీ వెలుగు మిరుమిట్లుగొల్పుతున్నది. నీ స్వరంలో గభీరసాగరఘోష ఉంది. కాస్త నెమ్మదించు. ఎప్పటిలా చిరునవ్వుతో నా కర్థమయ్యే భాషలో చెప్పు."

అర్జునరెడ్డి అభ్యర్థించిన మీద కృష్ణారావు నెమ్మదించాడు. జనసమ్మోహకమైన మందస్మితం కావిస్తూ ఇలా అన్నాడు.

"నీకు విరాడ్రూపం గోచరమూ, అనుభూతమూ అయింది. నిజానికి ప్రతి వ్యక్తిలో ఓ విశ్వం ఉంది. నీవు ఈ సత్యాన్ని గుర్తెరిగినాడే విశ్వతోముఖుడవుతాడు. నీకు నాయెడ గల భక్తి వలననే ఈ దివ్యానుభూతిని పొందగలిగావు. భక్తియే భక్తుణ్ణి భగవంతునకు సమీపవర్తిని కావిస్తుంది. భక్తుడే భగవంతునకు ప్రియతముడు, ప్రేమ నొసంగి భక్తిని ఆర్జించు లేదా భక్తినొసంగి ప్రేమను సంపాదించుకో!"

భక్తికి గల మహత్తు అర్జునరెడ్డికి అవగతమైంది.

ఆయిస్‌క్రీమ్ వాడు ముందు నుంచి వెళ్ళడాన్ని కృష్ణారావు గమనించారు. రెండు 'వనీలా' కప్పుల్ని కొని, ఒకటి రెడ్డికి ఇచ్చాడు. ఇద్దరూ మౌనంగా ఆరగించారు. అర్జునరెడ్డిని రెండు రకాల అనుభూతులు సంప్రీతుణ్ణి చేశాయి.

కృష్ణారావు అన్నాడు : "వ్యక్తికి దివ్యదృష్టి కలిగినప్పుడు, ఆ దివ్యదృష్టి కనుగుణంగా కర్మాచరణకు ఉద్యుక్తుడైనప్పుడు వాడు కారణజన్ముడౌతాడు. దైవీప్రేరితుడైన వ్యక్తి తన చుట్టు ప్రభావక్షేత్రం నిర్మించుకుంటాడు - దాని కేంద్రం తనల్లో ఉందని గ్రహించి క్షేత్రజ్ఞుడవుతాడు. ఆ క్షేత్రం స్థలాకాలాదులచే పరిమితం కాదు."

"వ్యక్తి ప్రభావక్షేత్రం వైశ్వికక్షేత్రంలోని అంతర్భాగామే. అందుకే ఆ క్షేత్రం బాహ్యాంభ్యంతరంలో, దూరాంతికంలో, స్థిర, గతిమానస్థితుల్లో వుంటుంది. విభిన్న వ్యక్తి క్షేత్రాలను విశ్వం శృంఖలాబద్ధం చేస్తుంది. అందుకే పురుషుడు సహస్రశీర్షునిగా, సహస్రనేత్రునిగా, సహస్రపాదునిగా వర్ణింపబడ్డాడు. ఏతత్ప్రభావక్షేత్రంలో, అతీతవర్తమానాల, ఋతానృతాల స్త్రీపురుషుల మధ్య గల ద్వైతం అస్తిత్వరహితమవుతుంది. ఏకత్వస్థితి ఏర్పడుతుంది."

అర్జునుడు అడిగాడు. "దేశ కాలపరిమితభౌతికవ్యక్తిత్వం విశ్వతోముఖ వ్యక్తిత్వంగా పరిణమించేందుకు ఏ దిశలో ప్రస్థానం చేయాలి?"

కృష్ణారావు ఇలా బదులు చెప్పాడు. "త్రిగుణాత్మక స్థితి నుండి త్రిగుణాతీత స్థితికి ఎదిగే ప్రయత్నం మానవుడు చేయాలి. గుణకర్మలను బట్టి మానవులు మూడు కోవలకు చెందుతారు. సత్త్వగుణయుక్తులు సాత్త్వికులు. రజోగుణయుక్తులు రాజసులు. తమోగుణయుక్తులు తామసులు. సత్వగుణసంపన్నుడు నాణ్యతాప్రమాణాలలో సంతులనం సాధిస్తాడు. పూర్వగ్రహదూషితుడైన రాజసుడు నాణ్యతకన్న ప్రమాణానికే పెద్దపీట వేస్తాడు. నాణ్యతాప్రమాణాలను తామసి అసలే పట్టించుకోడు; వాస్తవతను చూడలేని అంధుడు. సాత్వికుడు ఇతరులనూ గౌరవిస్తూ ఇతరుల గౌరవానికి పాత్రుడౌతాడు. రాజసుడు కొందరికి నిందార్హుడు; మరికొందరికి పూజార్హుడు."

"తామసుడు ఎవరినీ చేరదీయడు; ఎవరిచే చేరదీయబడడు. సాత్త్వికుడు శుచితాజ్ఞానయుతుడై కర్మాభిముఖుడౌతాడు. భావనాధీనుడై అహంకారపూరితుడై, రాజసుడు కర్మను ఆచరిస్తాడు. తామసుడు బలదర్పాలను ఆశ్రయించి కార్యరంగప్రవేశం చేస్తాడు. త్రిగుణాతీతుడు దాయిత్వభావనతో ప్రవర్తిస్తాడు. అతడు అందరియెడ సమదృష్టికలవాడు. ఇష్టానిష్టాలనేవి అతనికి లేవు. అతడు స్వాధీనుడు; స్వజేత. తనను జయించినవాడు కనుక అందరిని జయిస్తాడు. అర్జున్! ఆలోచనలో ఆచరణలో ఎలాటి విసంగతి రానీయకుండా కర్తవ్యాకర్తవ్యాలను ఎరిగి కర్మాచరణకు ఉద్యుక్తుడవు కావాలి!"

అర్జున్ అడిగాడు "త్రిగుణాతీతుడైన వ్యక్తిలక్షణమేమిటి?

కృష్ణారావ్ నవ్వుతూ అన్నాడు. "నేను చెప్పిన మూడు ప్రవృత్తులను అధిగమించినవాడు త్రిగుణాతీతుడు. అతనిని మహామానవునిగా లేక పురుషోత్తమునిగా చెప్పుకోవచ్చు. ప్రకృతి పురుషులకు రెండు పార్శ్వములున్నవి. ఒకటి స్వనిహిత దృష్టి అయితే రెండవది వస్తునిహిత దృష్టి. ఒకటి దేహం; రెండవది మనస్సు. అలాగే ఒకటి పదార్థం; రెండవది చేతన - మహామానవుడనేవాడు అధిచేతన గలవాడు. సమ్యగ్దృష్టి కలవాడు. పూర్ణజ్ఞాని. దైవీసంపద్యుయుడు."



"పురుషోత్తమ స్థాయికి చేరుకొన్నాక, దైవత్వదానవత్వస్వరూపలక్షణాలు జ్ఞాతమై, పృథక్కరించబడుతాయి. - దానవత్వం క్రమంగా క్షీణిస్తూపోయి, సమూలం పెరికివేయబడుతుంది. దైవత్వం ప్రవర్ధమానమౌతూ వ్యక్తిని దేదీప్యమానం చేస్తుంది. పరోపకారితయే దైవత్వానికి సంపూర్ణ నిర్వచనం. పరపీడనయే అసురీప్రవృత్తి. నకారాత్మక దృక్పథం కలవాడు లోకకంటకుడు. అర్జునా! పరోపకారిత, సకారాత్మకత నీలో ఉంది కనుక నీవు దైవీసంపద్యుతుడవు."

అర్జునుడు కృష్ణునిలాగే భాస్వంతుడైనాడు.

కృష్ణారావు అన్నాడు: "ఎవడు తిగుణాత్మకప్రవృత్తుల్ని అధిగమించి పూర్ణపురుషునిగా పరిణతి నొందుతాడో, వాడు దైవవిభూతి కలవాడై జగన్మాన్యుడౌతాడు. శ్రద్ధాస్థానీయుడవుతాడు. శ్రద్ధ అంటే సంపూర్ణ నిబద్ధత. ఓ లక్ష్యానికి నిబద్ధుడైనవాడే, నిజమైన శ్రద్ధాళువు. సాత్త్వికుని నిబద్ధత నిరపేక్షమైనది. స్వార్థప్రేరితమైనదీ, ఆక్రాకమైనదీ పూర్వగ్రహదూషితమైనదీ రాజసుని నిబద్ధత. తామసి శ్రద్ధ దిశాహీనమైనది. ఇతరులపై ప్రభుత సాధించే ఏకైక లక్ష్యం కలది."

"సమాజసేవకు, విశేషంగా ఆచార్యవయోవృద్ధ సేవకు, మనసా, వాచా, కర్మణా అంకితమై నిరంతరం కార్యాచరణకు పూనుకొనుటయే, దేహానికి సరియైన ప్రాయశ్చిత్తము. ఋతార్జవనిబద్ధం చేయడమే వాక్కునకు సరియైన ప్రాయశ్చిత్తము. సకారాత్మకతమైన ఆలోచనను, ఉదాత్తమైన ఆశయాన్ని, సమన్వయం సాధించే భావనను, ప్రయోజనాన్ని చేకూర్చే సృజనాత్మక ధ్యానగరిమను కలవిగా చేయుటయే మనోబుద్ధులకు సరియైన ప్రాయశ్చిత్తము. ఈ ప్రాయశ్చిత్తాలే శ్రద్ధకు దిశనూ, లక్ష్యాన్ని చేకూర్చుతవి. సకలజీవజగత్తుకు అభ్యుదయప్రదమైన కార్యాచరణయే ఆత్మసమర్పణ."

అర్జున్‌రెడ్డి ★అంతర్బహిఃసుసూత్రతను సాధించుకొన్నాడు.

కృష్ణారావు అన్నాడు: "నీవు జీవన్ముక్తుడవు కావాలి. స్వార్థాన్ని, ప్రేయాన్ని త్యజించడమంటేనే జీవన్ముక్తి. ఇష్టానిష్టాలు లేనివాడు, నిందాస్తుతులకు విచలితుడు కానివాడు జీవన్ముక్తుడు. ఎదురయ్యే ప్రతి సమస్యకు అత్యంత తృప్తికరమైన పరిష్కారాన్ని కనుగొనేవాడు జీవన్ముక్తుడు."

---

★Internal & external harmony

“సమస్యకు పరిష్కారమార్గాలు రెండున్నవి. నిన్ను నీవు అధిచేతనకు సంపూర్ణంగా సమర్పించుకొనడం మొదటిమార్గం. అప్పుడు నీవు పరిష్కారాలను వెదుకనక్కరలేదు. దైవీకృపాపాత్రుడవైన నిన్ను పరిష్కారాలు వెదుక్కొంటూ వస్తాయి. - అంతరంగపు లోతుల్లోకి తొంగిచూడడం రెండవమార్గం. అంతరంగమే ప్రేరణాస్రోతస్సు. అన్ని సామర్థ్యాలు అందులో నిక్షిప్తమై వున్నవి. దైవత్వమనేది నీలో, నాలో, అందరిలో వుంది. సమయం, ప్రేమ, సత్యం ఉత్తరదాయిత్వం ఇవన్నీ ఉపకరణాలు. నీ అంతరంగంలో నిక్షిప్తమైన దైవత్వం నుండి వీటితో పరిష్కారాన్ని వెలికిదీయవచ్చు. సమయపాలన వలన భౌతిక పరిసరాలపై ప్రభుత సాధించగలుగుతావు. అనురాగంతో జనమనోధినేతృత్వం సంపాదించగలుగుతావు. సత్యనిరతితో వైచారికజగత్తుకు ఏలికవుతావు. ఉత్తరదాయిత్వ బుద్ధితో దివ్యచేతనావైభవోపేతుడవవుతావు. ఇన్ని సాధించిన నీవే త్రిలోకాధిపతివి. నీవు నీ కర్తవ్యాన్ని, త్రిలోకాధిపతిగా నెరవేర్చాలి!

అర్జునరెడ్డి కృష్ణారావుకు అనన్యభక్తిభావంతో ప్రణమిల్లాడు. తన కృతజ్ఞతను తెలుపుకొన్న మీదట ఇలా అన్నాడు. “నీవు నిర్దేశించిన మార్గంలో పయనించి లక్ష్యాన్ని సాధిస్తాను.”

ఇద్దరు లేచి చేయీచేయీ కలిపి నడక సాగించారు. ఒకడు పథప్రదర్శకునిగా రెండవవాడు మార్గగామిగా ముందుకు సాగారు.

దిశాగతిశీలతలు, ప్రేరణాసత్వాలు కృష్ణార్జునులుగా మూర్తీభవించినవి.

దిశాగతిశీలతల సమ్మేళణంతో యశస్సు, ఐశ్వర్యప్రాప్తి, వృద్ధి, ఋజునీతి.... ఏదైనా సాధ్యమే.

నిర్వేద తిమిరం నుండి, ఆత్మావలోకన ప్రకాశంలోకి
జ్ఞానం నుండి నిరీహతకు, నిరీహత నుండి ఆత్మ సంయమనానికి
వివేకం నుండి అంతిమరహస్య భేదనకు, దైవవిభూతి నుండి సమ్యగ్దృష్టికి
శ్రద్ధతో కార్యదక్షతకు, క్షేత్రజ్ఞత నుండి త్రిగుణాతీతపురుషోత్తమ స్థాయికి
ఆత్మసమర్పణ భావంతో జీవన్ముక్తులమై దివ్యచేతనను సిద్ధింపజేసుకోవాలి.



**G. NARAYANA,** Chairman of Companies, Company Director, Corporate and Business Contributor, Management Author and Trainer has an experience of more than 35 years in the Engineering, Operations, General Management, Corporate Management and Management of synergy of Group Companies.

At present he is the Executive Chairman of Excel Industries Limited, Chairman of Yash Papers Limited, and Newton Engineering and Construction Company Limited, Chairman of Punjab Chemicals and Pharmaceuticals Limited, Director of Ashok Organic Industries Limited, Aryan Paper Mills Private Limited, Laopala Limited, Silverlight Nirlepware Industries Private Limited, Duraware Private Limited, and a mentor to Mahavir Group of Enterprises. He is also an honorary guide to several Medium and Small Scale Industries and voluntary organizations.

He is a Graduate in Electrical and Electronics Engineering and Post-Graduate in Management Studies. His learning includes a deep study of Gita, the Upanishads, the Dhammapada and Indian Philosophy, Indian Ethos, Meditation, TAQ and Zen.

He has blended modern scientific approach of management with holistic Indian philosophy and culture and contributed for Progress, Development, Growth and Enrichment of several outstanding Leaders, Teachers and Organizations. He is the author of several publications and has written many articles on Management, Leadership Education and Life.

Printed@Satyanarayana Printers ✆ 9866395537